
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+4 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 123
24-7-2024
బుధవారం
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



నిరుద్యోగంపై చిరుద్యోగ బాణం






పసిడి, వెండి ఊరట

భారీగా కస్టమ్స్ సుంకం తగ్గింపు

12 లో



ఉపాధి కల్పనకు అగ్రతాంబూలం

వ్యవసాయ రంగంపై భారం తగ్గింపు


- 2024-25 కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మల
- యువత నైపుణ్యాభివృద్ధి, ఉపాధికి రూ.2 లక్షల కోట్లు
- నిర్మాణ, ఉత్పత్తి రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలు
- పని ప్రాంతంలోనే చిరుద్యోగుల నివాసానికి డార్మిటరీలు
- కొలువులో చేరేవారికి, ఇచ్చే సంస్థలకు ప్రోత్సాహకాలు
- సర్కారు నుంచే తొలి వేతనం.. గరిష్ఠంగా రూ.15 వేలు
- రూ.3 వేల చొప్పున రెండేళ్లు పీఎఫ్ చందాల చెల్లింపు
- వేతన జీవికి కొత్త పన్ను విధానంలో కాస్త ఐటీ ఊరట
- దీర్ఘకాలిక మౌలిక ప్రాజెక్టులకు రూ.11 లక్షల కోట్లు
- స్వల్ప, దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను పెంపు
- అసెంబ్లీ ఎన్నికలున్న బిహార్‌కు రూ.60 వేల కోట్ల వరాలు
- అమరావతికి రూ.15 వేల కోట్ల ప్రపంచ బ్యాంకు రుణం

ఎప్పట్లాగే పేదలు, మహిళలు, యువత, రైతు జపం

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీపై అసంతృప్తిని గట్టిగానే వెళ్లగక్కిన వర్గాలపై ప్రత్యేక దృష్టి

కొలువులకు పెద్దపీట.. వ్యవసాయ రంగంపై భారం తగ్గింపు... వేతన జీవికి కాస్త ఊరట

దేశ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా స్థూలంగా 9 ప్రాథమ్యాంశాలు



కొత్త పన్నుల విధానంలో ఆదాయ పన్నుల శ్లాబులు (2024-25)

నిరుద్యోగ సమస్యకు ముకుతాడు వేసేందుకు బడ్జెట్లో కేంద్రం కీలక చర్యలు చేపట్టింది. ఉత్పత్తి, నిర్మాణ రంగాల్లో యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టింది. వారికి అదనపు ఉపాధి కల్పించే సంస్థలకు ప్రోత్సాహకాలు ప్రకటించారు. నెలకు రూ.3 వేల చొప్పున రెండేళ్ల పాటు యజమాని వాటా పీఎఫ్ చందాను రీయింబర్స్ చేయనున్నారు. పని ప్రాంతంలోనే ఉండేందుకు వీలుగా చిరుద్యోగులకు డార్మిటరీల ఏర్పాటునూ ప్రతిపాదించారు. సంఘటిత రంగంలో ఉద్యోగంలో చేరేవారికి తొలి వేతనాన్ని ప్రభుత్వమే ఇస్తుందని ప్రకటించారు. వీటన్నింటికి వచ్చే ఐదేళ్లలో ఏకంగా రూ.2 లక్షల కోట్లు వెచ్చించనున్నారు. తద్వారా 4 కోట్ల మంది పై చిలుకు యువతకు ప్రయోజనం చేకూర్చడం, ఆ మేరకు వ్యవసాయ రంగంపై భారం తగ్గించడం ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. దేశీయంగా ఉన్నత విద్యకూ రుణ భరోసా ఇచ్చారు. వేతన జీవులకు నామమాత్రపు ఆదాయ పన్ను ఊరట కల్పించారు. దాన్ని కూడా కొత్త పన్ను విధానానికే పరిమితం చేశారు. అదే సమయంలో మోదీ సర్కారు ప్రాథమ్యాలను దృష్టిలో పెట్టుకుంటూ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.11.11 లక్షల కోట్లు కేటాయించారు! మోదీ సర్కారు మనుగడకు కీలకమైన నితీశ్ సారథ్యంలోని బిహార్‌కు రూ.60 వేల కోట్ల మేరకు వరాలు గుప్పించగా ఏపీకి రూ.15 వేల కోట్ల 'ప్రపంచ బ్యాంకు' రుణంతో సరిపెట్టారు.

- వివరాలు 2,4,6,7,8,9,10,12,13 పేజీల్లో...

ఇవి ప్రియం

- అమ్మోనియం నైట్రేట్, పీవీసీ ఫ్లెక్స్ బ్యానర్లు/ పీవీసీ ఫ్లెక్స్ షీట్లు
- గార్డెన్‌లో వినియోగించే గొడుగులు
- సోలార్ గ్లాస్
- దిగుమతి చేసుకునే టెలికం పరికరాలు
- ల్యాబొరేటరీ కెమికల్స్, బయోడీగ్రేడబుల్ ప్లాస్టిక్

ఇవి చౌక

- బంగారం, వెండి, ప్లాటినం, పల్లాడియం, ఓస్మియం, రుతీనియం, ఇరీడియం కాయిన్లు, కాపర్.
- క్వార్ట్జ్, లిథియం కార్బోనేట్, లిథియం ఆక్సైడ్, లిథియం హైడ్రాక్సైడ్, నైట్రేట్స్ పొటాషియం, ఫెర్రో నికెల్, బ్లిస్టర్ కాపర్
- కేన్సర్ ఔషధాలు (ట్రస్టుజుమాబ్ డెరుక్స్‌టెకాన్, ఓసిమెర్టినిబ్, డుర్వాలుమాబ్)
- మెడికల్ ఎక్స్‌రే మెషిన్లలో వినియోగించే ట్యూబ్‌లు, ఫ్లాట్ ప్యానెల్ డిటెక్టర్లు
- మొబైల్ ఫోన్లు, చార్జర్లు, మొబైల్ ఫోన్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ అసెంబ్లీ (పీసీబీఏ)
- సోలార్ సెల్స్, ప్యానెల్స్ ఎక్విప్‌మెంట్
- చేపలు, రొయ్యల మేత
- టెక్స్‌టైల్స్
- తోలు ఉత్పత్తులు, పాదరక్షలు

దార్శనిక బడ్జెట్: మోదీ



కేంద్ర బడ్జెట్ మరింత వృద్ధికి, మెరుగైన భవిష్యత్తుకు బాటలు పరిచేలా ఉంది. భారత్‌ను ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో ఈ బడ్జెట్ కీలకపాత్ర పోషించనుంది. వికసిత భారత్‌కు గట్టి పునాదులు వేయనుంది. యువత, వెనకబడ్డ వర్గాలు, మహిళలు, ముఖ్యంగా మధ్యతరగతి సంక్షేమంపై బడ్జెట్ ప్రధానంగా దృష్టిపెట్టింది. యువతకైతే ఆకాశమే హద్దుగా అవకాశాలు కల్పించనున్నాం. ఉన్నతవిద్యకు రుణసాయం అందనుంది. కోటిమంది రైతులను సహజ సాగుకు మళ్లించడం తదితర లక్ష్యాలతో రైతు సంక్షేమానికి పెద్దపీట వేశాం.

2 లో

అది అప్పే.. అయినా ఉపయోగమే



- అమరావతికి రూ.15 వేల కోట్లపై సీఎం చంద్రబాబు.. 30 ఏళ్ల తర్వాత తీర్చేది కాబట్టి ఇబ్బంది ఉండదు
- కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి అన్ని విధాలా తోడ్పాటు
- మా ప్రతిపాదనల్లో చాలా వరకు ఆమోదం.. నిధుల ప్రస్తావన లేనప్పటికీ పోలవరం పూర్తి చేస్తామన్నారు.. అది చాలు

11 లో



నీట్ రీ టెస్టుకు సుప్రీం 'నో'


- పరీక్ష పవిత్రత దెబ్బతినలేదన్న అత్యున్నత న్యాయస్థానం
- వ్యవస్థాగత లీక్‌కు ఎలాంటి ఆధారాలు లేవు
- పరీక్ష రద్దు చేయడం సాధ్యం కాదని స్పష్టీకరణ
- సహేతుక తీర్పు వెలువరిస్తామన్న సీజేఐ

16 లో

బిహార్‌కు కేటాయింపులు..

ఏపీకి అప్పులు

- రాజధానికి వివిధ డెవలప్‌మెంట్ ఏజెన్సీల ద్వారా ప్రత్యేక మద్దతు
- ఈ ఆర్థిక సంవత్సరంలో ఏజెన్సీల ద్వారా రూ.15 వేలకోట్లు ఏర్పాటు
- ఈ రూ.15 వేలకోట్లతో పాటు భవిష్యత్‌లో ఇప్పించేదీ అప్పుగానే
- బడ్జెట్‌లో రాజధాని పేరుతో పైసా కేటాయించలేదు
- వెనుకబడిన జిల్లాలకు సాయం మాట మాత్రమే.. కేటాయింపుల్లేవు
- గిరిజన, సెంట్రల్ వర్సిటీలకు శూన్యం.. పెట్రోలియం వర్సిటీకి రూ.168 కోట్లు
- రాష్ట్ర పునర్విభజన చట్టంలోని అంశాలకు కట్టుబడి ఉన్నామంటూ ముక్తాయింపు



అంతా ప్రచార హడావిడి

రాష్ట్రానికి ఒనగూరే ప్రయోజనమేమీ లేదు: వైఎస్సార్‌సీపీ

జీవనాడికి జీరో

రైల్వే జోన్‌కు మళ్లీ మొండిచెయ్యే!

భూముల రీసర్వేకు కేంద్రం జై

- వివరాలు 11,14లో

• దేశం దృష్టికి ఆటవిక పాలన

నేడు ఢిల్లీలో ధర్నా

రాష్ట్రంలో అరాచక, విధ్వంసకాండపై వైఎస్సార్‌సీపీ సమరశంఖం

టీడీపీ కూటమి దాడులను కళ్లకు కట్టినట్లు వివరించేలా ఫొటో ఎగ్జిబిషన్

రాష్ట్రపతి పాలన విధించేందుకు అవసరమైన సహేతుక కారణాలున్నాయని చాటి చెప్పనున్న జగన్

వినుకొండలో నడిరోడ్డుపై హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ కుటుంబానికి పరామర్శ

టీడీపీ దాడులపై ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ.. అపాయింట్‌మెంట్ ఇవ్వాలని విజ్ఞప్తి

కేంద్రం తక్షణమే జోక్యం చేసుకుని విచారణ జరపాలని డిమాండ్

రాష్ట్రంలో అథఃపాతాళానికి దిగజారిన శాంతిభద్రతలపై గవర్నర్‌కూ ఫిర్యాదు.. చట్ట సభల్లో నల్ల కండువాలతో నిరసన.. ఇప్పుడు కలిసి వచ్చే పార్టీలను కలుపుకుని జాతీయ స్థాయిలో పోరాటం

3 లో


ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ నేతలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి





- అమిత్‌షా
కేంద్ర హోంమంత్రి

ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో కొత్త శకం

భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడానికి మరింత ఊతం ఇచ్చే బడ్జెట్ ఇది. అలాగే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనలో కొత్త శకానికి బాటలు వేస్తుంది. వాణిజ్య, పారిశ్రామిక రంగాల ప్రగతికి బాటలు వేస్తూ, దేశ ఆర్థిక రంగాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లడానికి ప్రధాని నరేంద్ర మోదీ ఎంతగా కట్టుబడి ఉన్నారో అర్థమ వుతోంది. పన్ను మదింపు నిబంధనలను సరళీకరించడం వల్ల పన్నుల చెల్లింపుదారులకు ఊరట లభిస్తుంది. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అద్దం పట్టే బడ్జెట్ ఇది.





బడ్జెట్ కుర్సీకా!



కుర్చీని కాపాడుకునే బడ్జెట్ ఇది

న్యూఢిల్లీ: మిత్ర పక్షాల సంతోషం కోసం మిగతా రాష్ట్రాల ప్రయోజనాలను పణంగా పెట్టారు. ఇది కుర్చీని కాపాడుకునే బడ్జెట్. కాంగ్రెస్ పార్టీ 2024 లోక్‌సభ ఎన్నికల కోసం ప్రకటించిన మేనిఫెస్టోలోంచి, అలాగే గత బడ్జెట్‌లనుంచి పలు అంశాలను కేంద్ర ప్రభుత్వం కాపీ కొట్టింది. ఈ బడ్జెట్‌తో సామాన్యులకు ఎలాంటి ప్రయోజనం లేదు. ఆర్భాటం తప్ప కార్యాచరణ కనిపించడంలేదు. దేశవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ సమస్య తీవ్రతను కేంద్రం డొంకతిరుగుడుగా ఒప్పుకుంది.

– కేంద్ర బడ్జెట్‌పై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ధ్వజం



పేదలకు వ్యతిరేకం..

పేదల సంక్షేమం, బడుగుల అభ్యున్నతికన్నా ఎన్డీయే మిత్ర పక్షాల ప్రయోజనాలకే పెద్ద పీట వేశారు. పశ్చిమ బెంగాల్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కేంద్రం ఇదే వైఖరి అనుసరిస్తే బెంగాల్ ప్రజలు పోరుబాట పడతారు. ఆంధ్రప్రదేశ్, బిహార్‌లకు ఆర్థిక ప్యాకేజీలు ఇస్తే మాకేమీ అభ్యంతరం లేదు. కానీ ఇతర రాష్ట్రాల విషయంలో వివక్ష సరికాదు. పశ్చిమ బెంగాల్‌కు ఎప్పుడూ అన్యాయమే జరుగుతోంది. మా రాష్ట్రాన్ని ఎందుకు చిన్నచూపు చూస్తున్నారో చెప్పాలి.

– మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి



దళితులు, గ్రామీణ పేదలను పట్టించుకోలేదు

దేశాభివృద్ధికి ఏమాత్రం పనికిరాని బడ్జెట్ ఇది. మోదీ ప్రభుత్వం తన అధికారాన్ని కాపాడుకోవడం కోసమే తాపత్రయ పడుతోంది. ఎన్డీయే మిత్ర పక్షాలను సంతృప్తి పరచడానికి బూటకపు హామీలి చ్చింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకోసం ఎదురు చూస్తున్న యువతకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. రైతుల విషయంలో కూడా నిర్దిష్టమైన ప్రయోజనాలు లేవు. అలాగే దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలు, గ్రామీణ పేదల సంక్షేమం కోసం చెప్పుకోదగ్గ పథకాలు లేవు. మహిళల ఆర్థిక పురోభివృద్ధికోసం కూడా బడ్జెట్‌లోఏమీలేదు. మొత్తంగాఇది 'సేవ్ మోదీ సర్కార్'బడ్జెట్.

– మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ అధ్యక్షుడు



యువత, రైతులను విస్మరించారు

యువత, రైతుల ప్రయోజనాలను ఈ బడ్జెట్‌లో పూర్తిగా విస్మరించారు. బీజేపీ తన ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గింది. అందులో భాగంగానే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు వివిధ అభివృద్ధి పథకాలను ప్రకటించారు. దేశంలో అత్యధిక జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్‌కు మాత్రం ఉత్తిచేయి చూపించారు. ఏపీలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ, బిహార్ సీఎం నితిశ్‌కుమార్ నాయకత్వంలోని జేడీ(యూ) పార్టీలు కేంద్ర ప్రభుత్వంలో కీలకమైన మిత్ర పక్షాలు కావడంతో తమ రాష్ట్రాలకు నిధులకోసం ఒత్తిడి తీసుకువస్తున్నారు.

– అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు

'ప్రత్యేక సాయం'తో రాష్ట్రాభివృద్ధికి ఊతం

కేంద్ర బడ్జెట్‌లో బిహార్‌కు ప్రకటించిన 'ప్రత్యేక సాయం'వల్ల రాష్ట్రాభివృద్ధికి ఊతం లభిస్తుంది. గతంలో రాష్ట్రం తీవ్ర నిర్లక్ష్యానికి గురవడంతో 'ప్రత్యేకహోదా'డిమాండ్ వచ్చింది. సాంకేతిక కారణాలవల్ల బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడానికి వీలుకాని పక్షంలో ఏదోరకంగా ప్రత్యేకంగా సాయం ప్రకటించాలని కేంద్రాన్ని కోరాం. గతంలో కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్షాలు కేంద్రంలో అధికారాన్ని పంచుకున్న సమయంలో బిహార్‌కు తగిన నిధులు ఇవ్వలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. మేము అధికారంలోకి వచ్చాకే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోంది.

– నితీశ్‌కుమార్, బిహార్ ముఖ్యమంత్రి



సబ్సిడీతో రూ.10 లక్షల వరకు విద్యా రుణాలు

ఐఐఎంలు, ఐఐటీలకు కోత.. సెంట్రల్ వర్సిటీలకు పీట

దేశవ్యాప్తంగా వెయ్యి ఐటీఐల ఆధునికీకరణ

విద్యకు బడ్జెట్‌లో రూ.1.25 లక్షల కోట్లు

చదువులు 'ఉన్నతం'



..: న్యూఢిల్లీ :..

దేశీయ విద్యాసంస్థల్లో ఉన్నత చదువులు అభ్యసించే విద్యార్థులకు రూ.10 లక్షల వరకు విద్యా రుణాలు అందించనున్నట్లు బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. విద్యా రుణాలకు సంబంధించి ఏటా లక్ష మంది విద్యార్థులకు రుణాలపై మూడు శాతం సబ్సిడీతో ఈ–వోచర్లు నేరుగా అందించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. విద్యార్థులు, విద్యారంగానికి ఇది మేలు చేస్తుందని విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ పేర్కొన్నారు. యువత ఆకాంక్షలను నెరవేర్చడం, నాణ్యమైన విద్య, మెరుగైన నైపుణ్యాలు అందుబాటులోకి రావడం తోపాటు వచ్చే ఐదేళ్లలో 4.1 కోట్ల ఉద్యోగాలను కొత్తగా సృష్టించవచ్చన్నారు.

మేనేజ్‌మెంట్ విద్య బోధించే ప్రతిష్టాత్మక బిజినెస్ స్కూళ్లు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లకు వరుసగా రెండో ఏడాదీ కేంద్రం కేటాయింపులు కుదించింది. గత ఆర్థిక ఏడాది సవరించిన అంచనాలతో పోలిస్తే పాఠశాల విద్యకు కేటాయింపులు రూ.535 కోట్లకుపైగా పెంచగా ఉన్నత విద్య గ్రాంట్‌ను రూ.9,600 కోట్లకుపైగా కుదించింది. మొత్తమ్మీద విద్యారంగానికి కేటాయింపులు రూ.9,000 కోట్లకుపైగా తగ్గాయి. విద్యాశాఖకు 2024–25 బడ్జెట్‌లో రూ.1.25 లక్షల కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది.

ఆవిష్కరణలు, సృజనాత్మకతకు ప్రోత్సాహం

విద్యాసంస్థలలో ఆవిష్కరణలు, సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు బడ్జెట్‌లో మరో రూ.161 కోట్లు అదనంగా కేటాయించారు. ప్రపంచ స్థాయి విద్యాసంస్థలకు కేటాయింపులు రూ.1,300 కోట్ల (సవరించిన అంచనాలు) నుంచి రూ.1,800 కోట్లకు పెరిగాయి. యూజీసీకి నిధుల కేటాయింపులు గతేడాది సవరించిన అంచనాలు రూ.6,409 కోట్లతో పోలిస్తే ఈసారి 60.99 శాతం తగ్గించి రూ.2,500 కోట్లకు కుదించారు. ఐఐఎంలకు బడ్జెట్‌లో కోతలు తప్పలేదు. గతేడాది బడ్జెట్‌లో ఐఐఎంలకు కేటాయింపులు సవరించిన అంచనాలు రూ.608.23 కోట్లతో పోలిస్తే రూ.300 కోట్లకు కుదించగా ఈసారి మరింత కోత పడింది. ఈ ఏడాది సవరించిన అంచనాలు రూ.331 కోట్లతో పోలిస్తే కేటాయింపులు రూ.212 కోట్లకు కుదించారు.

సెంట్రల్ వర్సిటీలకు మరికొంత..

దేశంలో అత్యున్నత సాంకేతిక విద్యకు నిలయాలైన ఐఐటీలకు కూడా బడ్జెట్ కేటాయింపులు గతేడాది సవరించిన అంచనాలతో పోలిస్తే స్వల్పంగా తగ్గాయి. సవరించిన అంచనాలు రూ.10,384.21 కోట్లతో పోలిస్తే కేటాయింపులు రూ.10,324.50 కోట్లకు తగ్గాయి. కేంద్రీయ విశ్వవిద్యాలయాల (సెంట్రల్ వర్సిటీలు) కేటాయింపులు మాత్రం 28 శాతం పెరిగాయి. సెంట్రల్ వర్సిటీలకు సవరించిన అంచనాలు రూ.12,000.08 కోట్లతో పోలిస్తే కేటాయింపులు రూ.15,472 కోట్లకు పెరిగాయి. పాఠశాల విద్యకు సంబంధించి కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, ఎన్సీఈఆర్టీ, పీఎంశ్రీ స్కూళ్లు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహించే గ్రాంట్ ఇన్ ఎయిడ్ స్కూళ్లకు బడ్జెట్‌లో కేటాయింపులు పెరిగాయి.



దార్శనిక బడ్జెట్

మరింత వృద్ధికి, మెరుగైన భవితకు బాటలు: మోదీ

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ మరింత వృద్ధికి, మెరుగైన భవిష్యత్తుకు బాటలు పరిచేలా ఉందంటూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. సమాజంలోని ప్రతి వర్గం సంక్షేమాన్నీ దృష్టిలో పెట్టుకుని రూపొందిన దార్శనిక బడ్జెట్‌గా అభివర్ణించారు. ''భారత్‌ను ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో ఈ బడ్జెట్ కీలకపాత్ర పోషించనుంది. వికసిత భారత్‌కు గట్టి పునాదులు వేయనుంది'' అని అభిప్రాయపడ్డారు. ''యువత, వెనకబడ్డ వర్గాలు, మహిళలు, ముఖ్యంగా మధ్యతరగతి సంక్షేమంపై బడ్జెట్ ప్రధానంగా దృష్టి పెట్టింది. ఉత్పత్తి, మౌలిక తదితర కీలక రంగాల వృద్ధికి ఊపునిచ్చేలా పలు చర్యలున్నాయి. సమాజంలోని ప్రతి రంగానికీ సాధికారత కల్పించే బడ్జెట్ ఇది. యువతకైతే ఆకాశమే హద్దుగా అవకాశాలు కల్పించనున్నాం. వారికి ఇతోధికంగా ఉపాధి కల్పించడంతో పాటు భారీగా స్వయం ఉపాధి అవకాశాలు అందించాలన్న ఎన్డీఏ ప్రభుత్వ ఆశయాలకు బడ్జెట్ సాకార రూపమిచ్చింది. కోటిమంది యువతకు అత్యున్నత సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేసే సువర్ణావకాశం దక్కనుంది. ఉన్నత విద్యకు రుణసాయం అందనుంది. ఉపాధి ఆధారిత ప్రోత్సహకాల పథకం కోట్లాది ఉద్యోగాలను సృష్టించనుంది. వ్యవసాయ రంగంలో సంపూర్ణ స్వావలంబన దిశగా, మధ్యతరగతిని మరింత బలోపేతం చేసేందుకు బడ్జెట్లో పలు చర్యలున్నాయి. కోటిమంది రైతులను సహజ సాగుకు మళ్లించడం తదితర లక్ష్యాలతో రైతు సంక్షేమానికి పెద్దపీట వేశాం. మా గత పదేళ్ల పాలనలో 25 కోట్ల మంది భారతీయులను పేదరిక కోరల నుంచి విముక్తం చేశాం. నయా మధ్యతరగతి ఆకాంక్షలకు రెక్కలు తొడిగేలా బడ్జెట్లో పలు చర్యలున్నాయి. గిరిజనులకు మరింత సాధికారత దక్కనుంది'' అని ప్రధాని వివరించారు.

కేంద్ర పన్నుల్లో పెరిగిన తెలంగాణ వాటా

ఈ ఏడాది రూ. 26,216.38 కోట్లు కేటాయింపు

గతేడాదికన్నా రూ. 3,150.18 కోట్లు అధికం

తెలంగాణ గిరిజన విశ్వవిద్యాలయానికి ప్రత్యేక కేటాయింపులు శూన్యం

సింగరేణికి రూ.1600 కోట్లు, ఐఐటీ హైదరాబాద్‌కు నిధుల్లో కోత

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర పన్నుల్లో తెలంగాణకు రూ. 26,216.38 (2.102 శాతం) కోట్ల వాటా లభించనుంది. అందులో ఆదాయ పన్ను రూ. 9,066.56 కోట్లు, కార్పొరేషన్ పన్ను రూ. 7,872.25 కోట్లు, కేంద్ర జీఎస్టీ రూ. 7,832.19 కోట్లు, కస్టమ్స్ రూ. 1,157.45 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ రూ. 243.98 కోట్లు, సర్వీస్ టాక్స్ రూ. 0.86 కోట్లు, ఇతర పన్నులు రూ. 43.09 కోట్లు ఉన్నాయి. ఈ మేరకు 2024–25 బడ్జెట్ ప్రతిపాదనల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. గతేడాది బడ్జెట్‌లో కేంద్ర పన్నుల రూపంలో తెలంగాణకు రూ. 23,066.20 కోట్లు కేటాయించగా దానితో పోలిస్తే ఈసారి బడ్జెట్‌లో పన్నుల వాటా రూ. 3,150.18 కోట్లు అధికం కావడం విశేషం.

రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ సంస్థలకు బడ్జెట్ కేటాయింపులు ఇవీ..

- ఈ ఏడాది బడ్జెట్‌లో హైదరాబాద్ ఐఐటీ (ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులు)కి నిధుల కేటాయింపులో కోత విధించారు. గతేడాది రూ. 300 కోట్లు బడ్జెట్‌లో కేటాయించి మొత్తం రూ. 522.71 కోట్లు ఖర్చు చేయగా ఈ ఏడాది ఐఐటీ హైదరాబాద్ (ఈఏపీ)లకు రూ. 122 కోట్లు మాత్రమే కేటాయించారు.
- తెలంగాణలోని గిరిజన యూనివర్సిటీ కోసం ప్రత్యేకంగా కేటాయింపులేవీ చేయలేదు. దేశంలోని అన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు కలిపి కేటాయింపులు చేశారు. అయితే గతేడాది తెలంగాణ, ఏపీలోని గిరిజన విశ్వవిద్యాలయాలకు కలిపి రూ. 37.67 కోట్లు కేంద్రంకేటాయించింది.
- హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్‌కు కేటాయింపుల్లో కోత విధించారు. గతేడాది రూ.115 కోట్లు కేటాయించగా తాజా బడ్జెట్‌లో కేవలం రూ.10.84 కోట్లే కేటాయించారు.
- సింగరేణి కాలరీస్‌కు రూ. 1,600 కోట్లు, హైదరాబాద్‌లోని అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ రీసెర్చ్‌కు రూ. 352.81 కోట్లు, హైదరాబాద్ సహా దేశంలోని 7 నైపర్ సంస్థలకు కలిపి రూ. 242 కోట్ల మేర కేంద్రం కేటాయించింది.
- హైదరాబాద్‌లోని ఇన్‌కాయిస్‌కు రూ. 28 కోట్లు, హైదరాబాద్ సహా మరో మూడు ప్రాంతాల్లో ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ హిందీ సంస్థకు రూ. 16.54 కోట్ల మేర కేటాయింపులు చేసింది.
- హైదరాబాద్ సహా 12 నగరాల్లో ఉన్న సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ–డాక్)కు రూ. 270 కోట్లు, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డుకు రూ. 16.78 కోట్లు, స్వాతంత్ర్య సమర యోధులకు (పెన్షన్లు) రూ. 603.33 కోట్లు, హైదరాబాద్ జాతీయ పోలీసు అకాడమీ సహా పోలీసు విద్య, శిక్షణ, పరిశోధనకు మొత్తం రూ. 1,348.35 కోట్లు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించారు.
- హైదరాబాద్‌లోని సీడీఎఫ్‌డీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ సహా దేశంలోని ఇతర స్వయం ప్రతిపత్తి సంస్థలకు కలిపి రూ. 940.66 కోట్లు, మణుగూరు సహా కోటా (రాజస్తాన్)లోని భార జల ప్లాంట్లకు రూ. 1,485.21 కోట్ల మేర కేటాయించారు.



బడ్జెట్ ముఖ్యాంశాలు..

విద్య, ఉద్యోగ కల్పన రంగాలు

- పీఎం స్కీం ప్యాకేజీలు: ఉద్యోగ కల్పన, నైపుణ్య శిక్షణ కోసం వచ్చే ఐదేళ్లలో రెండు లక్షల కోట్లతో 5 పథకాల అమలు.
- బడ్జెట్ కేటాయింపులు: విద్య, ఉద్యోగ, నైపుణ్య శిక్షణ కోసం రూ.1.48 లక్షల కోట్లు కేటాయింపు.
- తొలిసారి ఉద్యోగం చేరినవారికి ప్రోత్సాహకం: ఒక నెల వేతనం చెల్లింపు. మూడు వాయిదాల్లో కలిపి గరిష్ఠంగా రూ.15 వేల వరకు ప్రయోజనం. 2.1 కోట్ల మంది యువతకు ప్రయోజనం
- ఉన్నత విద్యకు సహకారం: పైచదువుల కోసం రూ.10 లక్షల వరకు రుణం సదుపాయం.
- యువతకు పెయిడ్ ఇంటర్న్‌షిప్: వచ్చే ఐదేళ్లలో 500కుపైగా కంపెనీల్లో కోటి మంది యువతకు పెయిడ్ ఇంటర్న్‌షిప్. చేరినప్పుడు రూ.6 వేలు ఆర్థిక సాయం. తర్వాత ప్రతినెలా రూ.5వేలు ఇంటర్న్‌షిప్ అలవెన్స్.

తయారీ రంగంలో ఉద్యోగాలకు ప్రోత్సాహం

- తొలిసారి ఉద్యోగంలో చేరినవారికి నాలుగేళ్ల పాటు ఈపీఎఫ్ఓ చందా చెల్లింపులో ప్రోత్సాహకాలు. 30 లక్షల మంది యువతకు ప్రయోజనం.
- కొత్తగా/అదనంగా ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు రెండేళ్లపాటు ప్రోత్సాహకాలు. కంపెనీలు ప్రతి కొత్త ఉద్యోగికి సంబంధించి ఈపీఎఫ్ఓకు చెల్లించే యాజమాన్య వాటాలో గరిష్ఠంగా నెలకు రూ.3వేల వరకు రీయింబర్స్‌మెంట్. దీనితో 50 లక్షల కొత్త ఉద్యోగాలు వస్తాయని అంచనా.

వ్యవసాయ రంగం..

- 32 అగ్రి/హార్టికల్చర్ పంటల్లో వాతావరణ మార్పులను తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే 109 రకాలకు ప్రోత్సాహం
- వేగంగా జాతీయ అభివృద్ధి కోసం 'నేషనల్ కో–ఆపరేషన్ పాలసీ' అమలు
- కొత్తగా 5 రాష్ట్రాల్లో రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు
- రొయ్యల పెంపకానికి ప్రోత్సాహం
- భారీ స్థాయిలో కూరగాయల సాగుపై ప్రత్యేకంగా ఫోకస్
- పప్పు ధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే దిశగా.. దిగుబడి పెంపు, నిల్వ, మార్కెటింగ్‌కు ఏర్పాట్లు
- దేశవ్యాప్తంగా కోటి మంది రైతులు సేంద్రియ సాగువైపు మళ్లేలా చర్యలు. సేంద్రియ పంటలకు బ్రాండింగ్, సర్టిఫికేషన్. 10వేల బయో ఇన్‌పుట్ రీసోర్స్ సెంటర్ల ఏర్పాటు.

రాష్ట్రాలకు కేంద్ర ప్రత్యేక సాయం..

బిహార్:

- రూ.26 వేల కోట్లతో భారీ స్థాయిలో రహదారుల అభివృద్ధి
- 2,400 మెగావాట్ల కొత్త విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు
- కొత్తగా ఎయిర్‌పోర్టులు, మెడికల్ కాలేజీలు, క్రీడా సదుపాయాలు

ఆంధ్రప్రదేశ్:

- అమరావతి కోసం రుణ మార్గాల్లో రూ.15 వేల కోట్ల నిధులు.
- పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు.

ఒడిశా:

- రాష్ట్రంలో పర్యాటకాన్ని విస్తృత స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా సాయం.

చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు..

- ముద్రా రుణాల్లో తరుణ్ కేటగిరీ కింద గతంలో రుణం తీసుకుని చెల్లించిన వారికి పరిమితి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంపు.
- పరిశ్రమలు భారీ యంత్రాలు, పరికరాలను కొనుగోలు చేసుకోవడానికి రూ.100 కోట్ల వరకు పూచీకత్తు లేని రుణాలు.

పట్టణ, గ్రామీణాభివృద్ధికి తోడ్పాటుగా..

- పట్టణాల్లో వచ్చే ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్లతో పేద, మధ్యతరగతి వర్గాలకు కోటి ఇళ్ల నిర్మాణం.
- దేశవ్యాప్తంగా పలు పట్టణాల్లో 100 స్ట్రీట్ ఫుడ్ హబ్‌ల అభివృద్ధి.
- 30 లక్షలకుపైగా జనాభా ఉన్న 14 నగరాల్లో 'ట్రాన్సిట్ ఓరియంటెడ్ డెవలప్‌మెంట్' పథకం అమలు
- దేశంలోని 100 పెద్ద పట్టణాల్లో భారీ ఎత్తున నీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, చెత్త తొలగింపు ప్రాజెక్టులు
- గ్రామీణ ప్రాంతాల్లో మూడు కోట్ల ఇళ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు రూ.2.66 లక్షల కోట్లు.

మహిళా సంక్షేమం..

- మహిళల కోసం ప్రత్యేకించిన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు. ఉద్యోగం చేసేవారి కోసం వర్కింగ్ విమెన్ హాస్టళ్లు
- పదేళ్ల కిందటితో పోలిస్తే మహిళా సంక్షేమం, సాధికారత కోసం 218.8 శాతం నిధులు పెంపు
- మహిళలు కొనే ఆస్తులకు రిజిస్ట్రేషన్/స్టాంపు చార్జీలు తగ్గింపు

మరిన్ని 'ప్రత్యేక' అంశాలు..

- విష్ణుపాద్, మహాబోధి ఆలయాల వద్ద టూరిజం కారిడార్లు.. టూరిజం కేంద్రంగా నలంద విశ్వవిద్యాలయం.
- 3 కేన్సర్ మందుల దిగుమతిపై కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు.

ద్రవ్యలోటు కట్టడిలో విజయం

జీడీపీలో 4.9 శాతానికి డౌన్

ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం–ద్రవ్యలోటు కట్టడికి కేంద్రం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో లోటు 4.9 శాతానికి పరిమితం చేయాలని పూర్తిస్థాయి బడ్జెట్ నిర్దేశించుకుంది. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ అంచనాలు 5.1 శాతం కన్నా తాజా లెక్కలు తక్కువగా ఉండడం గమనార్హం. రెవెన్యూ వసూళ్లు బాగుండడం దీనికి ప్రధాన కారణం. 2025–26 ఆర్థిక సంవత్సరం నాటికి ద్రవ్య లోటును 4.5 శాతానికి కట్టడి చేయాలన్న లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్లు ఫిబ్రవరి మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థికమంత్రి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

ఆదాయాలు రూ.32.07 లక్షల కోట్లు

వ్యయాలు రూ.48.21 లక్షల కోట్లు

లోటు రూ.16.14 లక్షల కోట్లు

రుణాలు మినహా రిసిట్స్ రూ.32.07 లక్షల కోట్లుగా ఉంటుందని తాజా బడ్జెట్ అంచనావేసింది. వ్యయాలు రూ.48.21 లక్షల కోట్లుగా పేర్కొంది. రిసిట్స్ విషయంలో నికర పన్ను వసూళ్ల లక్ష్యం రూ.25.83 లక్షల కోట్లుగా బడ్జెట్ అంచనా. వెరసి ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం రూ.16.14 లక్షల కోట్లుగా ఉంటుందని బడ్జెట్ అంచనా వేసింది. అంటే జీడీపీ అంచనాల్లో ఇది 4.9 శాతమన్నమాట. తొలి అంచనా రూ.16.85 లక్షల కోట్లకన్నా ఇది తక్కువ. ''2021లో నేను ప్రకటించిన ఆర్థిక స్థిరత్వ బాట మన ఆర్థిక వ్యవస్థకు బాగా ఉపయోగపడింది. వచ్చే ఏడాది లోటును 4.5 శాతం కంటే తక్కువకు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రభుత్వం లక్ష్యాన్ని సాధించడానికి కట్టుబడి ఉంది. 2026–27 నుండి ప్రతి సంవత్సరం ద్రవ్య లోటును పూర్తి కట్టడిలో ఉంచడానికి మా ప్రయత్నం ఉంటుంది. తద్వారా కేంద్ర ప్రభుత్వ అప్పులు జీడీపీతో పోల్చితే క్షీణరేటు మార్గంలో కొనసాగుతాయి'' అని ఆర్థికమంత్రి అన్నారు.

తగ్గిన మార్కెట్ రుణ లక్ష్యం...

ద్రవ్యలోటు కట్టడి లక్ష్య సాధనకు స్థూల మార్కెట్ రుణ పరిమాణాన్ని కూడా రూ.12,000 కోట్లు తగ్గించడం కీలకాంశం. ఫిబ్రవరినాటి రూ.14.13 లక్షల కోట్ల అంచనాను తాజాగా రూ.14.01 లక్షల కోట్లకు బడ్జెట్ తగ్గించింది. డేటెడ్ సెక్యూరిటీల ద్వారా సమీకరించే స్థూల, నికర మార్కెట్ రుణాలు వరుసగా రూ. 14.01 లక్షల కోట్లు, రూ.11.63 లక్షల కోట్లకు చేరుతాయి. ఈ రెండు సంఖ్యలూ 2024 ఫిబ్రవరి మధ్యంతర బడ్జెట్ అంచనాకన్నా తక్కువ కావడం గమనార్హం. 2023–24లో స్థూల మార్కెట్ రుణ పరిమాణం రూ.15.43 లక్షల కోట్లు.

ఇదీ బడ్జెట్ సమగ్ర స్వరూపం (అంకెలు రూ.కోట్లలో)

అంశం	2022-23 వాస్తవ గణాంకాలు	2023-24 బడ్జెట్ అంచనాలు	2023-24 వాస్తవ (ప్రాథమిక) గణాంకాలు	2024-25 బడ్జెట్ అంచనాలు
1. రెవెన్యూ వసూళ్లు	23,83,206	26,32,281	27,28,412	31,29,200
పన్ను ఆదాయం	20,97,786	23,30,631	23,26,524	25,83,499
పన్నేతర ఆదాయం	2,85,421	3,01,650	4,01,888	5,45,701
2. మూలధన వసూళ్లు	18,09,951	18,70,816	17,14,130	16,91,312
రుణాల రికవరీ	26,161	23,000	27,338	28,000
ఇతర వసూళ్లు	46,035	61,000	33,122	50,000
అప్పులు, ఇతర వసూళ్లు	17,37,755	17,86,816	16,53,670	16,13,312
మొత్తం ఆదాయం(1+2)	41,93,157	45,03,097	44,42,542	48,20,512
మొత్తం వ్యయం(3+6)	41,93,157	45,03,097	44,42,542	48,20,512
3. రెవెన్యూఖాతా	3,4,53,132	35,02,136	34,94,036	37,09,401
4. వడ్డీ చెల్లింపులు	9,28,517	10,79,971	10,63,871	11,62,940
5. మూలధన ఆస్తులకోసం కేటాయించిన గ్రాంట్లు	3,06,264	3,69,988	3,03,787	3,90,778
6. మూలధన ఖాతా	7,40,025	10,00,961	9,48,506	11,11,111
వాస్తవ మూలధన వ్యయం(5+6)	10,46,289	13,70,949	12,52,293	15,01,889
7. రెవెన్యూ లోటు(3-1)	10,69,926	8,69,855	7,65,624	5,80,201
8. నికర రెవెన్యూ లోటు(7-5)	7,63,662	4,99,867	4,61,837	1,89,423
9. ద్రవ్య లోటు	17,37,755	17,86,816	16,53,670	16,13,312
10. ప్రాథమిక లోటు	8,09,238	7,06,845	5,89,799	4,50,372

క్లుప్తంగా...

డిజిటల్ కామర్స్ ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్: చంద్రబాబు



ఓఎన్‌డీసీ ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎం

సాక్షి, అమరావతి: డిజిటల్ కామర్స్ ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. డిజిటల్ కామర్స్ మార్కెట్ ద్వారా రాష్ట్ర ప్రజలకు వేగవంతమైన వృద్ధిని సాధించే అంశంపై చర్చించారు. ఆయా ఉత్పత్తులను డిజిటల్ కామర్స్, మార్కెట్ అవకాశాలు కల్పించడంపై ప్రధానంగా చర్చించారు. రైతులు, నేత కార్మికులు, కళాకారులు, డ్రైవర్లు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, చిన్న దుకాణదారులతో సహా వివిధ వర్గాల ప్రజల జీవితాలను మార్చడానికి ఓఎన్‌డీసీ ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగించుకోవడంపై చర్చించారు. ఓఎన్‌డీసీ ప్లాట్‌ఫారమ్ ఈ-కామర్స్ ద్వారా కొనుగోలుదారులు, విక్రేతలు సులభంగా అనుసంధానం అయ్యేలా చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. దీనిలో భాగంగా హార్టికల్చర్, ఆక్వా తదితర రంగాల ఉత్పత్తులను ఈ-కామర్స్ ద్వారా అమ్మకాలు సాగించే అంశంపై చర్చించారు.

'పోలవరం' సేఫ్టీ డిజైన్లకు అనుమతులు ఇప్పించండి

సీడబ్ల్యూసీ చైర్మన్‌ను కోరిన మంత్రి రామానాయుడు

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు సేఫ్టీకి సంబంధించిన డిజైన్‌లకు త్వరితగతిన అనుమతులివ్వాలని సీడబ్ల్యూసీ చైర్మన్ కుష్వేందర్ ఓహ్రను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కుష్వేందర్ ఓహ్రా ఎన్డీఏ ప్రభుత్వ తొలి ప్రాధాన్యత పోలవరం అంటూ బదులిస్తూ, డిజైన్‌లు త్వరితగతిన వచ్చేలా సహకరిస్తామని తెలిపారు. మంగళవారం కుష్వేందర్ ఓహ్రాతో నిమ్మల ఢిల్లీలో భేటీ అయ్యారు. పోలవరం నిర్మాణం ఆలస్యంతో ప్రతి ఏడాది పంట ఆయకట్టు నష్టం, జల విద్యుత్తు అందుబాటులోకి రాకపోవడం, వరద సమయంలో గోదావరి జిల్లాల పంట నష్టం జరుగుతున్నట్లు తెలిపారు. ఇలా ఏటా నష్టం జరగడం వలన ఈ ఐదేళ్ల కాలంలో రూ.50 వేల కోట్లు నష్టం వాటిల్లినట్లు సీడబ్ల్యూసీ చైర్మన్ దృష్టికి మంత్రి నిమ్మల తీసుకువెళ్లారు.

'టెట్'లో తప్పులు దిద్దుకోండి

పాఠశాల విద్యాశాఖ

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రాయాల్సిన పేపర్ ఎంపికలో తప్పులను సరి చేసుకునే అవకాశం కల్పించినట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ టెట్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి 'అప్లికేషన్ డిలీట్' ఆప్షన్ ద్వారా ఓటీపీని నమోదు చేసి అప్లికేషన్ డిలీట్ చేసుకోవచ్చన్నారు. అనంతరం 'పేపర్ చేంజ్' ఆప్షన్ ద్వారా అభ్యర్థి మార్చుకోదలచిన పేపర్/సబ్జెక్టును ఎంపిక చేసుకోవాలన్నారు. సంబంధిత విద్యార్హతలు, మీడియం ఇతర వివరాలు అన్నిటినీ నింపి మరోసారి దరఖాస్తును సమర్పించాలని సూచించారు. పేపర్-2ఏ ఇంగ్లిష్ పరీక్ష రాసే అభ్యర్థులకు ఫస్ట్ లాంగ్వేజ్ ఆప్షన్ పరీక్షా సమయంలో అందుబాటులో ఉంటుందని, కంప్యూటర్ స్క్రీన్ మీద కనిపించే 8 భాషల్లో అభ్యర్థి తన ఫస్ట్ లాంగ్వేజ్‌ని ఎంపిక చేసుకుని ఆ విభాగంలో వచ్చే 30 ప్రశ్నలకు సమాధానం రాయవచ్చని పేర్కొన్నారు.

25న మంత్రివర్గ సమావేశం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 25వ తేదీ మంత్రివర్గ సమావేశం జరగనుంది. రాష్ట్ర సచివాలయంలో మధ్యాహ్నం రెండుగంటలకు ఈ సమావేశం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ తెలిపారు.

మంత్రి కొండపల్లితో కొరియన్ బృందం భేటీ

సాక్షి, అమరావతి: దక్షిణ కొరియా వ్యాపారవేత్తల బృందం మంగళవారం రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో భేటీ అయింది. అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, అక్వా, బయోటెక్, ఫార్మా, ఎలక్ట్రానిక్ రంగాల్లో చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టే విషయాన్ని ఈ సమావేశంలో చర్చించారు.

ఎస్టీపీల భూసేకరణకు అనుమతి

రూ.267.40 కోట్లు మంజూరు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లో మురుగు శుద్ధి ప్లాంట్ల (ఎస్టీపీ)కు అవసరమైన భూసేకరణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు గత ప్రభుత్వంలో 54 యూఎల్బీల్లో 72 ఎస్టీపీలు నిర్మించేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. అయితే, కొన్నిచోట్ల ప్రభుత్వ భూమి లేకపోవడంతో పనులు పూర్తికాలేదు. దీంతో రూ.267.40 కోట్లతో సుమారు 134 ఎకరాల ప్రైవేటు భూమిని సమీకరించేందుకు పరిపాలనా అనుమతి ఇస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దేశం దృష్టికి ఆటవిక పాలన

నేడు ఢిల్లీలో ధర్నా

రాష్ట్రంలో అరాచక, విధ్వంసకాండపై వైఎస్సార్‌సీపీ సమరశంఖం



గన్నవరం విమానాశ్రయంలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఢిల్లీలో స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గత 50 రోజులుగా రాజకీయ ప్రత్యర్థులను వర్గ శత్రువులుగా పరిగణించి.. వెంటాడి, వేటాడి హతమారుస్తూ.. ఇష్టారాజ్యంగా దాడులు చేస్తూ.. ఆస్తులను ధ్వంసం చేస్తూ చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం సాగిస్తోన్న మారణహోమం, అరాచక, ఆటవిక పాలనపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమర శంఖం పూరించారు. కేవలం 50 రోజుల్లోనే రాష్ట్రంలో 36 హత్యలు.. నలుగురిపై అత్యాచారాలు, ఆపై హత్యలు.. 16 హత్యాచారాలు.. వెయ్యికి పైగా దాడులతో రాష్ట్రంలో అధఃపాతాళానికి దిగజారిన శాంతిభద్రతలను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులతో కలిసి భారీ ఎత్తున ధర్నా నిర్వహించనున్నారు. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న హత్యలు, హత్యాచారాలు, దాడులు, ఆస్తుల విధ్వంసాన్ని కళ్లకు కట్టినట్లు చూపించేలా అక్కడే ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వ దారుణకాండపై కలిసి వచ్చే పార్టీలన్నింటినీ కలుపుకుని పోరాటం చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఎన్నికల ప్రచారంలోనూ, అంతకు ముందు.. 11 కేసులు ఉంటే నన్ను కలవడానికి అనర్హులు.. 12 కంటే ఎక్కువ కేసులు ఉంటేనే తనను కలవడానికి అర్హులు అంటూ టీడీపీ నేత నారా లోకేశ్ ఆ పార్టీ శ్రేణులను రెచ్చగొట్టారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను తరిమి తరిమి కొట్టండి అంటూ ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు మరింత రెచ్చగొట్టారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను చెప్పుతో కొట్టండి.. హాకీ స్టిక్‌లతో కొట్టండి.. అధఃపాతాళానికి తొక్కేయండి అంటూ కూటమి నేతలు పేట్రేగిపోయారు. వారి పిలుపునందుకున్న టీడీపీ శ్రేణులు.. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన జూన్ 4 నుంచే అరాచకాలకు తెరతీశారు.

బ్లడ్ బుక్‌గా రెడ్ బుక్ రూపాంతరం

టీడీపీకి వ్యతిరేకంగా ఉన్న వారి పేర్లను రెడ్ బుక్‌లో నమోదు చేసుకున్నానని.. అధికారంలోకి వచ్చాక వారి అంతు చూస్తానని పాదయాత్రలో లోకేశ్ పదే పదే టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు నుంచే రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమల్లోకి తెచ్చారు. పర్యవసానంగా వందల సంఖ్యలో దాడులు.. విధ్వంసాలతో టీడీపీ శ్రేణులు రాష్ట్రాన్ని హడలెత్తిస్తున్నాయి. వినుకొండలో నడిరోడ్డుపై ప్రజలందరూ చూస్తుండగానే వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను టీడీపీ కార్యకర్త జిలానీ కత్తితో నరికి చంపేయడం కూటమి ప్రభుత్వం మోగిస్తున్న మరణ మృదంగానికి పరాకాష్ట. లోకేష్ రెడ్ బుక్ బ్లడ్ బుక్‌గా రూపాంతరం చెందిందనడానికి ఇదే నిదర్శనం. టీడీపీ శ్రేణుల చర్యలతో సామాన్యులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు బాధ్యతాయుతంగా స్పందించకపోవడం విభ్రాంతి కలిగిస్తోంది. శాంతి భద్రతలను గాడిలో పెట్టేందుకు ప్రయత్నించకపోగా, టీడీపీ మూకల విధ్వంసకాండను వెనుకేసుకొచ్చే రీతిలో మంత్రివర్గ సమావేశంలో మాట్లాడారు. అసలు 36 హత్యలు ఎక్కడ జరిగాయని ఎందుకు ప్రశ్నించలేదని మంత్రులను తప్పుపట్టారు.

దారుణకాండపై పోరాటం

టీడీపీ కూటమి ప్రభుత్వం సాగిస్తోన్న దారుణాలపై మాజీ సీఎం వైఎస్ జగన్ ఇప్పటికే పోరాటం ప్రారంభించారు. రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోందని.. హత్యలు, హత్యాచారాలు, దాడులతో టీడీపీ నేతలు పేట్రేగిపోతున్నారని.. తక్షణమే జోక్యం చేసుకుని శాంతిభద్రతలను పరిరక్షించాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. అంతకు ముందు వినుకొండలో నడిరోడ్డుపై హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ కుటుంబాన్ని పరామర్శించారు. ఇలాంటి దారుణాలన్నింటి గురించి వివరించడానికి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని రాష్ట్రపతి, ప్రధాని, హోం మంత్రికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఏజెన్సీలతో విచారణ చేయించాలని కోరారు. గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కూడా కలిసి రాష్ట్రంలో విధ్వంసకాండపై ఫిర్యాదు చేశారు. టీడీపీ నేతలు సాగిస్తోన్న మారణకాండకు సంబంధించి ఫొటోలు, వీడియోలు వంటి సాక్ష్యాధారాలున్నప్పటికీ పోలీసు యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడాన్ని ఎత్తిచూపారు. టీడీపీ గూండాలపై కఠిన చర్యలు తీసుకుని, శాంతిభద్రతలను పరిరక్షించాలని కోరారు. చట్టసభల్లో నల్ల కండువాలతో నిరసన గళం వినిపించారు. కలిసి వచ్చే పార్టీలన్నింటినీ కలుపుకుని ఇప్పుడు జాతీయ స్థాయిలో పోరాటం చేసేందుకు పార్టీ శ్రేణులతో కలిసి ఢిల్లీ వెళ్లారు.

ఢిల్లీ చేరుకొన్న వైఎస్ జగన్

రాష్ట్రంలో జరుగుతున్న హింసపై 24న నిరసన, ఫొటోగ్యాలరీ ఏర్పాటు

సాక్షి, అమరావతి/విమానాశ్రయం(గన్నవరం)/సాక్షి, న్యూఢిల్లీ: మూడు రోజుల పర్యటన నిమిత్తం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీ చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో హింస, క్షీణిస్తోన్న శాంతి భద్రతలపై బుధవారం (24న) నిరసన కార్యక్రమంతో పాటు ఫోటో గ్యాలరీ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రదర్శన ద్వారా ఏపీలో జరుగుతోన్న అకృత్యాలను దేశ ప్రజలందరి దృష్టికి వైఎస్సార్‌సీపీ తీసుకువెళ్లనుంది. వైఎస్ జగన్ వెంట ఢిల్లీకి వెళ్లిన వారిలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ ముఖ్యులు ఉన్నారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చి వైఎస్ జగన్‌కు ఘనంగా వీడ్కోలు పలికాయి.

కారు అడ్డుపెట్టి.. హత్యాయత్నానికి తెగబడి

సినీ ఫక్కీలో వైఎస్సార్‌సీపీ నేత ఈదా సాంబిరెడ్డిపై దాడి, కాళ్లకు తీవ్రగాయాలు

- గాయపడ్డ ఇద్దరు అనుచరులు, డ్రైవర్
- పల్నాడు జిల్లాలో దారుణం

పెదకూరపాడు/నగరంపాలెం: పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి (70)పై మంగళవారం సినీ ఫక్కీలో హత్యాయత్నం జరిగింది. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆయనను గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఘటన జరిగిన సమయంలో పల్నాడు జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు క్రోసూరులోనే ఉండటం గమనార్హం. సాంబిరెడ్డికి వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా, మార్కెట్ యార్డు చైర్మన్‌గా, ఎంపీపీగా, సర్పంచ్‌గా ప్రజల్లో మంచి పేరు ఉంది. ఎన్నికలు ముగిసిన నాటి నుంచి ఆయన తన స్వగ్రామం పెదకూరపాడు మండలం 75 త్యాళ్ళూరులో ఉంటున్నారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పెదకూరపాడు ఇన్‌చార్జి నంబూరు శంకరరావు మంగళవారం గుంటూరులోని తన కార్యాలయానికి వచ్చినట్లు తెలియడంతో సాంబిరెడ్డి.. తన ఇద్దరు అనుచరులు కీసర గంగాధరరెడ్డి, కల్లి శ్రీనివాసరెడ్డి, కారు డ్రైవర్ దామోదరరెడ్డితో వెళ్లి ఆయనను కలిశారు. తిరిగి వస్తుండగా అమరావతి మండలం ఉంగుటూరు, పెదకూరపాడు మండలం కంభంపాడు మధ్య సాంబిరెడ్డి ప్రయాణిస్తున్న కారుపై కొందరు దుండగులు మాటు వేసి మూకుమ్మడిగా దాడి చేశారు. ఆంజనేయ స్వామి దేవాలయం రోడ్డులో రెండు కారుల్లో మాటు వేసిన దుండగులు సాంబిరెడ్డి ప్రయాణిస్తున్న కారుకు ఇంకో కారును అడ్డుపెట్టి ఆయన కారు అద్దాలు పగలగొట్టారు. ఈ క్రమంలో శ్రీనివాసరెడ్డి, దామోదర్‌రెడ్డి, గంగాధరరెడ్డికి గాయాలయ్యాయి. సాంబిరెడ్డిని బయటకు లాగి పక్కకు తీసుకెళ్లి చేతులు మెలవేసి.. కాళ్లను లక్ష్యంగా చేసుకుని విచక్షణారహితంగా పది మంది దాడి చేశారు. ఈ దాడిలో ఆయన కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం మృతి చెందారని భావించి వదిలివెళ్లిపోయారు. ఎన్నికల సమయంలో మా అక్క (టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ భార్య లావణ్య) కారునే అడ్డుకుంటారా అంటూ దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. కాగా, ఘటనాస్థలిని ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి వివరాలు సేకరిస్తామన్నారు. నిందితులను పట్టుకోవడానికి ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.



తీవ్రంగా గాయపడిన ఈదా సాంబిరెడ్డి



దుండగుల దాడిలో విరిగిన కాలు

దారుణం



బుడమేరు వంతెన వద్ద కూల్చివేసిన దుకాణాలు

తెల్లారక ముందే.. దుకాణాలు కూల్చేశారు!

విజయవాడ బుడమేరు వంతెన సెంటర్‌లో ఘటన.. లబోదిబోమంటున్న బాధితులు

మధురానగర్ (విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి పేదోడికి కష్టాలు ప్రారంభమయ్యాయి. విజయవాడ నడిబొడ్డునున్న బుడమేరు సెంటర్‌లోని చిరువ్యాపారుల దుకాణాలను మంగళవారం తెల్లవారుజామున కూల్చివేయడంతో వారంతా నడిరోడ్డున పడ్డారు. ఎటువంటి సమాచారం లేకుండా తమ బతుకుపై దెబ్బకొట్టారని వారు లబోదిబోమంటూ రోడ్డెక్కి నిరసనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని బుడమేరు వంతెన సెంటర్‌లో పలువురు చిరువ్యాపారాలు సాగిస్తూ 40 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు కావడంతో పది రోజుల క్రితం దుకాణాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమను కలిసి గోడు విన్నవించుకోగా.. తాను అధికారులతో మాట్లాడతానని చెప్పి పంపించివేశారు. దీంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే మంగళవారం తెల్లవారుజాము రెండు గంటల సమయంలో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు, పోలీసుల సహకారంతో దుకాణాలను కూల్చివేశారు. సమాచారం తెలుసుకున్న దుకాణదారులు లబోదిబోమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ 40 ఏళ్లుగా దుకాణాలను పెట్టుకుని జీవనం సాగిస్తున్నామని ఇప్పుడు అర్ధాంతరంగా దుకాణాలు తొలగిస్తే.. ఎక్కడకు వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. కనీసం తమకు సమాచారం ఇవ్వకుండా తాళాలు వేసి ఉన్న దుకాణాలు కూల్చివేశారని, తమకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

దుర్మార్గం



సచివాలయం శిలాఫలకంపై జగన్, ప్రతాప్ ఫొటోలను చెక్కేసిన పచ్చ మూకలు

శిలాఫలకంలోని చిత్రాలను పగులకొట్టారు

- ఏలూరు జిల్లా నూజివీడు మండలంలోని బోర్వంచలోని గ్రామ సచివాలయ భవనం శిలాఫలకాన్ని పచ్చ మూకలు సోమవారం రాత్రి ధ్వంసం చేశాయి. సచివాలయం గోడకు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి దానిపై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఎంపీ కోటగిరి శ్రీధర్‌ల ఫొటోలను ఏర్పాటు చేశారు. పచ్చమూకలు శిలాఫలకంపై ఉన్న వైఎస్ జగన్, మేకా ప్రతాప్ ఫొటోలను పలుగులతో పగులగొట్టారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇదే సచివాలయం కిటికీ అద్దాలను పగులకొట్టారని, దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఇంతవరకు కేసు కూడా నమోదు చేయలేదని మండిపడ్డారు.

\- నూజివీడు

దాష్టీకం

అభాగ్యురాలి జీవితం చిదిమేశారు

విశాఖలో యువతిపై అత్యాచారం

- కేజీహెచ్‌కు బాధితురాలు తరలింపు
- గోప్యంగా ఉంచుతున్న పోలీసులు
- కొద్ది రోజుల క్రితమే ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడి
- ఆ ఘటన మరువకముందే మరో దారుణం

మధురవాడ (విశాఖపట్నం): విశాఖపట్నంలోని మధురవాడలో కొద్ది రోజుల కిందట ముక్కుపచ్చలారని ఐదేళ్ల చిన్నారిపై అత్యాచార ఘటన మరువక ముందే సోమవారం రాత్రి మరో దారుణం చోటు చేసుకుంది. గంజాయి మూకలు 19 ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాయి. ఈ ఘటన విశాఖ నార్త్ సబ్ డివిజన్ పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధి కొమ్మాది జంక్షన్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. యువతి చోడవరం ప్రాంతం నుంచి వచ్చి కొమ్మాది జంక్షన్ వద్ద ఉన్న ఒక బేకరీలో పనిచేస్తోంది. ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటోంది. సోమవారం రాత్రి ఆమె విధులు నిర్వహిస్తున్న క్రమంలో కాలకృత్యాల కోసం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమెపై బేకరీ-హాస్టల్‌కి మధ్య ఉన్న నిర్మానుష్య ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న కొందరు యువకులు దాడి చేసి అత్యాచారానికి పాల్పడ్డట్టు సమాచారం. రాత్రి ఒంటి గంట సమయంలో బాధితురాలు హాస్టల్‌కి వెళ్లింది. కాసేపటికే వాంతి చేసుకుంది. హాస్టల్ వార్డెన్ పరిశీలించగా యువతి చెంపపై గాయం కూడా కనిపించింది. దీంతో అనుమానం వచ్చిన వార్డెన్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కి సమాచారం ఇచ్చారు. వెంటనే పీఎం పాలెం పోలీసులు హాస్టల్‌కి చేరుకుని పక్కనే ఉన్న గాయత్రి ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనలతో విశాఖ కేజీహెచ్‌కి తీసుకెళ్లారు. అయితే బాధితురాలితో మాట్లాడేందుకు ఎవరినీ అనుమతించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ దారుణ ఘటనపై విశాఖ పోలీస్ కమిషనర్ సీరియస్ అయినట్టు తెలిసింది. ఈ వ్యవహారాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. ఈ విషయమై నార్త్ జోన్ ఏసీపీ సునీల్‌ను వివరణ కోరగా అత్యాచారం లాంటిది ఏమీ లేదన్నారు. యువతికి చిన్న దెబ్బలు తగిలాయని.. విచారణ చేస్తున్నామని తెలిపారు.

'టిండాల్ కం డ్రైవర్' కోర్సు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏపీ, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల అభ్యర్థులు అర్హులు

సాక్షి, అమరావతి: 'టిండాల్ కం డ్రైవర్' కోర్సు 73వ బ్యాచ్‌లో శిక్షణ పొందేందుకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని మత్స్యశాఖ అదనపు సంచాలకులు టి.సుమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఏడాది పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పద్ధతులతో యంత్రపు నావ/బోటులో చేపల వేటలో శిక్షణ ఇస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తుకు సంబంధిత సర్టిఫికెట్ల నకళ్లను జత చేసి ఆగస్టు 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఆయా జిల్లాల మత్స్యశాఖాధికారి కార్యాలయంలో నేరుగా అందజేయడం లేదా పోస్టల్ ద్వారా పంపించవచ్చునన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన అభ్యర్థులకు ఆగస్టు 23వతేదీ ఉదయం 10 గంటలకు కాకినాడలోని రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉంటుందని వివరించారు. దరఖాస్తు నమూనా www.fisheries.ap.gov.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని సూచించారు.

న్యాయవాదుల సంక్షేమ నిధికి సభ్యత్వాల నమోదు

ఆగస్టు 16 నుంచి ప్రారంభం

సాక్షి, అమరావతి: న్యాయవాదుల సంక్షేమం కోసం రాష్ట్ర బార్ కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. న్యాయవాదుల సంక్షేమ నిధిలో సభ్యత్వం లేని వారు సభ్యులుగా చేరేందుకు బార్ కౌన్సిల్ అవకాశం కల్పించింది. ఈనెల 21న బార్ కౌన్సిల్ చైర్మన్ ఎన్.ద్వారకనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. న్యాయవాదులు, న్యాయవాద సంఘాలు, న్యాయవాద ఫెడరేషన్ల నుంచి వచ్చిన వినతి మేరకు బార్ కౌన్సిల్ ఈమేరకు నిర్ణయం తీసుకుంది. 35 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న న్యాయవాదులు సంక్షేమ నిధిలో సభ్యులుగా చేరవచ్చునని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. అయితే గతంలో సభ్యులుగా లేని వారికి ఈ ఒక్కసారికే అవకాశం కల్పిస్తున్నామని బార్ కౌన్సిల్ తెలిపింది. న్యాయవాదుల వయసు ఆధారంగా జీవిత కాల సభ్యత్వ రుసుమును నిర్ణయిస్తామని బార్ కౌన్సిల్ స్పష్టం చేసింది. సభ్యత్వం కోసం ఆగస్టు 16 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చునని, నవంబర్ 1 నుంచి సభ్యత్వం అమల్లోకి వస్తుందని తేల్చి చెప్పింది. దరఖాస్తుతో పాటు ఫీజు పూర్తి వివరాలను బార్ కౌన్సిల్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొంది. ఈ మేరకు చైర్మన్ ద్వారకనాథరెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సభ్యత్వం లేని న్యాయవాదులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగుల జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఈనెల 31వ తేదీ వరకు గడువు

సాక్షి, అమరావతి: దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేస్తున్న వారికి జాతీయ పురస్కారాలు-2024 అందించనున్నట్టు రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును ప్రదానం చేస్తారు. దివ్యాంగుల సాధికారత కోసం కృషి చేస్తున్న దివ్యాంగులు, వ్యక్తులు, సంస్థలు ఈ పురస్కారానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 31వ తేదీలోగా www.depwd.gov.in వెబ్‌సైట్ ద్వారా, www.awards.gov.in అవార్డు పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

2024 బడ్జెట్



అశ్నీర్ గ్రోవర్
వ్యాపారవేత్త

కేంద్ర బడ్జెట్-2024 ఆసాంతం బోరు, నిర్జీవం, అర్థరాహిత్యం. ఈ బడ్జెట్ ఇవ్వడానికి బదులుగా వాళ్లు ‘ఈసారి మనసు రావడం లేదు, ఏదైనా చేయడం గురించి వచ్చేసారి చూసుకుందాంలే’ అని చెబితే పోయేది. దీన్ని చూడటం కన్నా, అంబానీ వివాహ వేడుక చూడటం మరింత బాగుండేది, సరైన కాలక్షేపం అయ్యేది.



భారీ రాయితీ



ఈ బడ్జెట్‌లో అతి భారీ రాయితీ ఏమంటే, ‘ఏంజెల్ ట్యాక్స్’ (షేర్ల జారీ ద్వారా వచ్చే నిధులపై అన్‌లిస్టెడ్ కంపెనీలు చెల్లించే పన్ను) తొలగించడం. ఇది చాలాకాలంగా స్టార్టప్‌లు, వాటి ఇన్వెస్టర్ల నుంచి ఉన్న డిమాండ్.

– పల్లవీ ఘోష్, సీనియర్ జర్నలిస్ట్

వెళ్లిపోతారంతే!



ఇండియాలో పన్నులు చెల్లించడం గురించి ఉన్న బాధాకరమైన విషయం ఏమిటంటే – పాడైపోయిన అదే రోడ్ల మీద వాహనాలు నడపాలి, నీటి సమస్యలనూ, నీటి నిల్వ సమస్యలనూ ఎదుర్కోవాలి. నాసిరకం చదువులే దిక్కు. అగ్రశ్రేణిలోని 1 శాతం ధనికులు ఇక్కడ ఎందుకు ఉండాలనుకుంటారు?

– ఖుష్బూ వర్మ, ఇంటర్‌నెట్ పర్సనాలిటీ

ఏముందని!



బడ్జెట్ గురించి ఎంతగా తెలుసుకుంటుంటే, అంతగా ఇది మధ్యతరగతికి ఎలా మేలు చేస్తుందో అర్థం చేసుకోవడం కష్టమవుతోంది.

– ఐశ్వర్య, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్

అందరికీనా?



ఇది మధ్యతరగతి అనుకూల బడ్జెట్. అలాగే పేదల అనుకూల బడ్జెట్. అలాగే ధనికుల అనుకూల బడ్జెట్ కూడా! మొత్తంగా మాస్టర్‌క్లాస్ బడ్జెట్! (వ్యంగ్యంగా)

– మహమ్మద్ జుబేర్, ఫ్యాక్ట్‌చెకర్

ఇదీ పరిస్థితి!



వేతనం పొందుతున్న వ్యక్తి గనక 30 లక్షలు సంపాదిస్తుంటే, అతడు పన్ను 8 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఒక వ్యాపారి 30 లక్షలు సంపాదిస్తుంటే, అతడు 1.5 లక్షలు పన్నుగా చెల్లించాల్సి ఉంటుంది.

– నళినీ ఉనాగర్, కంటెంట్ క్రియేటర్

అదే మేలు



ఇవ్వాళ్టి బడ్జెట్ చూసిన తర్వాత, ఇండియాలో మంచి కెరీర్ మార్గం: ‘ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్’ ట్రేడర్‌గా ఉండటం కన్నా, బిహార్‌లో వంతెనలు, రోడ్ల కాంట్రాక్టర్‌గా ఉండటం మేలు.

– అక్షత్ శ్రీవాత్సవ, ఆర్థికాంశాల సలహాదారు

తీసుకుంటూనే ఉంటారు!



నేను గనక డబ్బులు సంపాదిస్తే నిర్మల పన్ను తీసుకుంటారు. నేను ఖర్చు చేస్తే అప్పుడు కూడా పన్ను తీసుకుంటారు. నేను సంపాదించకపోయినా, ఖర్చు చేయకపోయినా, ఊరికే పెట్టుబడిగా అది ఉండిపోయినా నిర్మల దానికి కూడా పన్ను తీసుకుంటారు. ఇంకో మంచి విషయం ఏమిటంటే, ఒకవేళ నేను పన్ను చెల్లిస్తుంటే... దానిమీద మరో అదనపు సెస్ ఉంది. అందులో కూడా నిర్మల పన్ను తీసుకుంటారు.

– అభిజిత్ గంగూలీ, కమెడియన్

తేడా!



మొదటి ప్రపంచ దేశాల మాదిరిగా ఇండియాలో పన్నులు వసూలు చేస్తారు. జీవన నాణ్యతలు మాత్రం మూడో ప్రపంచ దేశాల మాదిరిగా ఉంటాయి.

– ఆశీశ్ కె. మిశ్రా, జర్నలిస్ట్

చదివి చేయండి!



బడ్జెట్‌ను చదవండి. సమగ్రంగా విశ్లేషించండి. తర్వాత విమర్శించండి. అంతేగానీ ఫ్యాషన్ కాబట్టి విమర్శించొద్దు.

– సేవియో రోడ్రిగ్స్, మీడియా పర్సనాలిటీ

రైతులకు ‘అమృతం’ ఇవ్వడం మరిచిన కేంద్రం



డా॥ దొంతి నరసింహారెడ్డి

రైతుల ఆదాయం రెట్టింపు చేసే లక్ష్యం గురించి కేంద్ర ‘అమృత్ కాల్’ బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావనా లేదు. వాతావరణ ప్రతికూల ప్రభావాల సవాళ్ల నేపథ్యంలో వ్యవసాయ రంగానికి ‘ఒక కొత్త దారి’ అవసరమని తెలిసినప్పటికీ, ఆ దిశగా అడుగులు పడలేదు. ప్రకృతి వ్యవసాయం వైపు కోటి మంది రైతులను మళ్ళిస్తామని ఆర్థిక మంత్రి చెప్పినా దానికి జరిపిన కేటాయింపులు ఏ మూలకూ రావు.

వ్యవసాయ అభివృద్ధి బాగా ఉన్నది, ఆహార ఉత్పత్తి పెరుగుతున్నది అని కేంద్రప్రభుత్వం ప్రకటన చేసింది. కానీ రైతుల ఆదాయం గురించీ, దానిని రెట్టింపు చేసే లక్ష్యం గురించీ, ఈ మధ్య కాలంలో రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాల గురించీ అటు ఆర్థిక సర్వేలోగానీ, ఇటు కేంద్ర బడ్జెట్లోగానీ ఎటువంటి ప్రస్తావనా చేయకపోగా, వారి సమస్య పరిష్కారానికి తగిన స్పందన కనబరచలేదు.

భారత వ్యవసాయం మంచి పనితీరును కనబరిచిందనీ, అయితే భూతాపం పెరుగుతున్న నేపథ్యంలో ప్రకృతిలో సంభవిస్తున్న వాతావరణ ప్రతికూల ప్రభావాలు, పెరుగుతున్న పంట ఖర్చులు వంటి కొన్ని సవాళ్ల నేపథ్యంలో ఈ రంగానికి ‘ఒక కొత్త దారి’ అవసరమని జనవరి 31న పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2022–23 ఆర్థిక సర్వే తెలిపింది. 2023–24 ఆర్థిక సర్వే కూడా ఇంచుమించు ఇదే మాట చెప్పింది. అయినా 2024–25 సంవత్సరం బడ్జెట్లో కేటాయింపులు పాత బాటనే పట్టినాయి. ఎన్నికల నుంచి అధికార భారతీయ జనతా పార్టీ పాఠాలు నేర్చుకోలేదు. ప్రైవేటీకరణ, దిగుమతులు, విదేశీ విధానాల విషయాల్లో పాతబాటనే సాగుతోంది.

మారుతున్న వాతావరణం వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని చెప్పిన నివేదిక, ఆహార ఉత్పత్తి పెరిగింది అని చెబుతున్నది. ఈ వైరుధ్యం మీద ఉన్న శంక తీర్చే ప్రయత్నం ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం చేయలేదు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వరదలు, అకాల వర్షాలు ఒక వైపు నష్టపరుస్తుంటే పంటల దిగుబడి ఎట్లా పెరుగుతున్నది? ప్రధానంగా, రైతుల ఆర్థిక పరిస్థితి మీద అంచనా మాత్రం చేయలేదు.

బడ్జెట్ కేటాయింపులలో గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి కొత్త ఆలోచన విధానం ఏదీ కనపడటం లేదు. కేంద్ర ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో 9 ప్రాధాన్యాలను ప్రస్తావించారు. అందులో మొట్టమొదటిది, వ్యవసాయంలో దిగుబడి పెంచడం, వ్యవసాయాన్ని దృఢంగా సవాళ్ళను ఎదుర్కొనే విధంగా తయారు చేయటం. అయితే, ఎట్లా సాధిస్తారు? బడ్జెట్లో కేటాయింపులతో ఇది సాధ్యమయ్యే పని కాదు. ప్రకృతి వ్యవసాయానికి కోటి మంది రైతులను మారుస్తామని తన ప్రసంగంలో ఆర్థిక మంత్రి చెప్పినా వాస్తవానికి ఇది కొత్త పథకం కాదు. 2023–24లో దానికి ఇచ్చింది రూ.459 కోట్లు మాత్రమే. ఈసారి అది కూడా తగ్గించి రూ.365.64 కోట్లు ఇచ్చారు. 2023–24లో ప్రకృతి వ్యవసాయానికి సవరించిన బడ్జెట్ రూ.100 కోట్లు మాత్రమే. ప్రకృతి వ్యవసాయం కాకుండా పంటల దిగుబడిని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం దగ్గర ఉన్న ఉపాయం ఏది?



వ్యవసాయానికి ఒక కొత్త దారి అవసరమని పదే పదే ఆర్థిక సర్వేలు చెప్పినా, వ్యవసాయ బడ్జెట్లో ఆ దిశగా ఆలోచన చేయలేదు. వ్యవసాయానికి కేటాయింపులు తగ్గించారు. 2022–23లో రూ.1,24,000 కోట్లుగా ఉన్న వ్యవసాయ కేటాయింపులు 2023–24లో రూ.1,15,531.79 కోట్లకు తగ్గాయి. ఇది 7 శాతం తగ్గింపు. 2024–25లో వ్యవసాయ పరిశోధనలకు పెద్ద పీట వేస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించినా పరిశోధనలకు ఇచ్చినవి మొత్తం రూ.9,941 కోట్లు మాత్రమే. ప్రకటించిన స్థాయిలో కేటాయింపులు లేవు. 2022–23లో ఇదే పద్దుకు ఇచ్చినవి రూ. 8,513.62 కోట్లు. 2023–24లో ఇచ్చినవి రూ.9,504 కోట్లు.

పశుగణ అభివృద్ధికి, మత్స్య రంగానికి కలిపి రూ.7,137 కోట్లు ఈసారి ఇచ్చారు. అంతకుముందు సంవత్సరాలలో వరుసగా కేటాయించింది రూ.6576.62 కోట్లు, రూ.5,956.70 కోట్లు. నిధులు పెరిగినట్లు కనిపిస్తున్నప్పటికీ ఈ రంగాల అభివృద్ధిని నిలువరిస్తున్న మౌలిక అంశాల మీద దృష్టి పెట్టలేదు. వ్యవసాయ శాఖ ఆఫీసు ఖర్చులు 167 శాతం పెంచిన ప్రభుత్వం, ప్రధాన మంత్రి పంటల బీమా పథకానికి 13 శాతం కోత విధించింది. ఈసారి ఇచ్చింది కేవలం రూ.13,625 కోట్లు మాత్రమే. ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో, నకిలీ విత్తనాల బారినపడి, రైతులకు పంట నష్టం పెరుగుతుంటే ఆదుకునే ఒకే ఒక్క బీమా పథకాన్ని ఇంకా విస్తృతం చేయాల్సి ఉండగా తగ్గించడం శోచనీయం.

కొత్త ఉపాధి కల్పన పథకం ప్రవేశపెట్టి రూ.10 వేల కోట్లు బడ్జెట్ కేటాయించింది కేంద్ర ప్రభుత్వం. నెలవారీ జీతం తీసుకునే యువతకు (సంవత్సరానికి రూ.లక్ష వరకు) కొంత భృతి చెల్లించే ఈ పథకం లక్ష్యం అంతుబట్టకుండా ఉన్నది. గ్రామీణ భారతంలో ఉన్న ఉపాధికి, దాని రక్షణకు కేటాయింపులు చేయడం లేదు. ఈ పథకం కేవలం పారిశ్రామిక ఉత్పత్తి రంగాలకు రాయితీగా ఇస్తున్నట్టు కనబడుతున్నది. శ్రామిక శక్తికి అవసరమైన వసతుల కల్పనకు, సంక్షేమానికి, ఉద్యోగ రక్షణకు కాకుండా ఫ్యాక్టరీలలో ఉపాధికి ఈ రాయితీ ఇవ్వడం అంటే ఆ యా కంపెనీలకు ఇవ్వడమే! పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల శ్రామికుల ఉత్పాదకత శక్తి పడిపోతున్నది. ఆహార ద్రవ్యోల్బణం వల్ల సరి అయిన పరిమాణంలో పౌష్టిక ఆహారం శ్రామిక కుటుంబాలకు అందడం లేదు. ఈ సమస్యలను కేంద్ర ప్రభుత్వం గుర్తించకపోవటం దురదృష్టకరం. పర్యావరణానికి దోహదపడే చేతివృత్తుల ఉపాధికి ఈ పథకం ఇచ్చివుంటే బాగుండేది.

వివిధ మార్గాల ద్వారా 2024–25లో కేంద్రం ఆశిస్తున్న ఆదాయం రూ. 46,80,115 కోట్లు. పోయిన సంవత్సరం మీద రాబోయే సంవత్సరంలో పెరిగిన కేంద్ర ప్రభుత్వ ఆదాయం రూ.2,50,000 కోట్లు. కానీ పెరిగిన ఈ ఆదాయాన్ని గ్రామీణ ప్రాంతాల మీద పెట్టడం లేదు. కరోనా లాంటి కష్టకాలంలో ఉపాధి ఇచ్చి ఆదుకున్న వ్యవసాయానికి కాకుండా ఇతర రంగాలకు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం సంసిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వం మీద అప్పుల భారం పెరుగుతున్నది. 2022–23 నాటికే ఇది రూ.1,54,78,987 కోట్లకు చేరింది. మౌలిక సదుపాయాల మీద పెట్టుబడులకు రూ. 11 లక్షల కోట్లు ప్రకటించింది ప్రభుత్వం. ఇది ఆశ్చర్యం కలిగించకమానదు. అభివృద్ధి అందరికీ కాకుండా కొందరికే పోతున్నది అని నివేదికలు చెబుతున్నప్పటికీ, అభివృద్ధి తీరులో మార్పులకు కేంద్ర ప్రభుత్వ సిద్ధంగా లేదు. వేల కోట్ల పెట్టుబడులతో నిర్మించే రోడ్లు, వంతెనలు వగైరా మౌలిక వసతులు నాసిరకం నిర్మాణం వల్ల, లేదా ప్రకృతి వైపరీత్యాల వల్ల కూలిపోతుంటే పరిస్థితిని సమీక్షించకుండా, సమస్య లోతులను గుర్తించకుండా పదే పదే ఈ రకమైన పెట్టుబడుల మీద ప్రజా ధనం వెచ్చించడం వృథా ప్రయాసే అవుతుంది.

వ్యాసకర్త వ్యవసాయ రంగ నిపుణులు

కార్యాచరణ ముఖ్యం!



ప్రొ॥ ఇ. రేవతి

మారుతున్న రాజకీయాల కారణాలే ఈసారి బడ్జెట్‌ను ప్రభావితం చేసినట్టున్నాయి. ఉపాధి లేని యువతకు పరిష్కారం దిశగా అడుగులేసింది బడ్జెట్. విద్య, పారిశ్రామిక అవసరాలకు మధ్య పెరిగిన నైపుణ్య అంతరాన్ని తగ్గించే ప్రయత్నం కనిపిస్తోంది. జాతీయ ఆదాయంలో కీలకభూమిక పోషించే మహిళను వెన్నుతట్టి ప్రోత్సహించే కేటాయింపులు అనివార్యమయ్యాయి. ప్రైవేటు పెట్టుబడులకు ఊతకర్ర ఇచ్చినా ఫలితాలు అంతంత మాత్రమేనని సర్కార్ గుర్తించింది. ప్రభుత్వ పెట్టుబడి వ్యయం పెంచడమే పరిష్కారమని గుర్తించింది. సహజ వ్యవసాయ పద్ధతుల మేలుకొలుపునకు బడ్జెట్ పెద్దపీట వేసింది. ఆశయాలు గొప్పవే. ఆశించిన పురోగతికి కేటాయింపులే గీటురాయి కావు. సరైన వ్యూహ రచన చేస్తేనే లక్ష్యాలను చేరుకోవడం సాధ్యం. దేశ తక్షణ అవసరాలను బడ్జెట్ గమనించింది. అయితే దీన్ని కార్యాచరణలోకి తెచ్చే ముందు సవాళ్ళనూ గుర్తించాలి!

స్థూల జాతీయోత్పత్తి లక్ష్యాలు తగ్గాయి. 2023–24లో జీడీపీ 8.2గా ఉంది. 2024–25లో ఇది 6.5–7.0గా ఉంటుందని అంచనా వేశారు. ద్రవ్యలోటును 5.6 శాతానికి తగ్గించేందుకే ఇలా చేసినట్టు కనిపిస్తోంది. ఇదే క్రమంలో రెవెన్యూ లోటును తగ్గించాలని భావించారు. కోవిడ్ తర్వాత ప్రైవేటు పెట్టుబడులకు అత్యధిక ప్రాధాన్యమిచ్చారు. దీనివల్ల పెద్దగా పెట్టుబడులు వచ్చిందేమీ లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పెట్టుబడి వ్యయాన్ని పెంచారు. స్థూల ఆర్థిక విధానాన్ని సుస్థిర పర్చేందుకు బడ్జెట్ ప్రయత్నించింది.

సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నది కేంద్రం లక్ష్యం. బడ్జెట్ కేటాయింపులూ ఈ విధంగానే ఉన్నాయి. అయితే, ఏక కాలంలో ఈ విధానం అమలు చేయడం సరికాదు. దీనివల్ల ఆహార ఉత్పత్తి తగ్గుతుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రస్తుత విధానాలు కొనసాగిస్తూనే మార్పు దిశగా అడుగులేయాలి. సహజ వ్యవసాయానికి ఊతమిచ్చే కొత్త వంగడాల అభివృద్ధి అత్యంత కీలకం. దేశవ్యాప్తంగా 10 వేల బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్స్ ప్రారంభిస్తామన్నారు. ఇది మంచి పరిణామమే. ఇందులో శ్రమ సాంద్రత భాగస్వామ్యమవుతుంది. ఇందులో మహిళా శక్తి కీలకం. వారిని ప్రోత్సహించేలా ఉండాలి. దీనివల్ల గ్రీన్ జాబ్స్‌ను సృష్టించవచ్చు.

దేశ ఆర్థికాభివృద్ధిలో మహిళా భాగస్వామ్యం కీలకం. పలు సర్వేలు ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. ఇది నిధుల కేటాయింపుతోనే సాధ్యం కాదు. వారిని ఉపాధి వైపు నడిపించేందుకు అవసరమైన ప్రణాళికలు అవసరం. ‘కౌశల్ యోజన’ వంటి పథకాలను కేంద్రం బడ్జెట్‌లో ప్రస్తావించింది. నైపుణ్యం పెంచుతామని చెప్పింది. నిజానికి దేశంలో మహిళలు ఎంతమంది ఉపాధి పొందుతున్నారు? ఇందులో నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలు ఎన్ని? బడ్జెట్‌లో మరో ముఖ్యాంశం కేర్‌ఎకానమీ. వృద్ధులు, పిల్లల సంరక్షణ ఇందులో భాగం. ఈ దిశగా ఉపాధి అవకాశాలూ పెరుగుతున్నాయి. ఈ విభాగాల్లో 70 శాతం మహిళలే ఉంటారు. కాబట్టి కచ్చితమైన ప్రణాళికలు ఉండాలి. భారత్ పురోభివృద్ధిలో ఉందని ప్రపంచ బ్యాంకు చెబుతోంది. అయితే, భద్రతతో కూడిన ఉపాధి అవకాశాలుండాలని సూచిస్తోంది. ఇప్పటికీ భారత్‌లో 90 శాతం మహిళలు ఇన్‌ఫార్మల్ ఉపాధిలోనే ఉన్నారు. ఈపీ ఎఫ్, సెలవులు వంటివి అందు కోవడం లేదు.



పట్టాలున్న యువతలో సరిపోయే పరిజ్ఞానం లేనందువల్ల పరిశ్రమలు వారిని ఉద్యోగంలోకి తీసుకోవడం లేదు. దీంతో దేశవ్యాప్తంగా నిరుద్యోగం పెరిగిపోతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని యువతను సంతృప్తిపర్చాల్సిన అవసరం ఏర్పడింది. ఉపాధి అవకాశాలు, విద్యకు మధ్య నైపుణ్యం అంతరంగా ఉంది. చదువుతో పాటు నైపుణ్యం పెంచితే తప్ప సమస్య పరిష్కారం కాదు. ప్రైవేటు పెట్టుబడులు పెరిగితే, పరిశ్రమలు పెరుగుతాయని ఇంత కాలం ప్రభుత్వం భావించింది.

కానీ ఎన్ని రాయితీలు ఇచ్చినా వచ్చిన పెట్టుబడులు తక్కువ. పెరిగిన ఉపాధి తక్కువే. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పెట్టుబడి వ్యయం పెంచింది. ముఖ్యంగా నైపుణ్యం పెంచడంపై దృష్టి పెట్టింది. అయితే, దీనికి కేటాయించిన నిధులు తక్కువే. ఇక్కడో ముఖ్యమైన విషయాన్ని గుర్తించాలి. నైపుణ్యం పెంపునకు కచ్చితమైన అధ్యయనం చేయాలి. అవసరమైన ప్రణాళికలు రూపొందించాలి. అప్పుడే యువతను నాణ్యమైన ఉద్యోగాల వైపు తీసుకెళ్ళడం సాధ్యం. ఏ సెక్టార్ నుంచి ఎలాంటి నైపుణ్యం కావాలనే విషయాన్ని గుర్తించాలి. దీంతో పాటు నాణ్యమైన విద్యా విధానాలను ముందుకు తేవాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త ‘సెస్’ డైరెక్టర్, హైదరాబాద్

ఏపీకి ఇచ్చింది రుణమే! గ్రాంట్ కాదు!



ప్రొ॥ డి. నర్సింహారెడ్డి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన బడ్జెట్ విద్యారంగాన్నీ, వ్యవసాయాన్నీ పెద్దగా పట్టించుకోలేదు. నిరుద్యోగులకూ ఒరగబెట్టింది ఏమీ లేదు. అలాగే కేటాయింపుల్లో బిహార్, ఆంధ్రప్రదేశ్‌లకు దక్కిందీ అంతంతే! ఏపీ కొత్త రాజధానికి 15 వేల కోట్లు ఇస్తామంటున్నది ఋణమే తప్ప గ్రాంట్ కాదు. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద మొత్తంలో కేటాయించినా ఉద్యోగాల కల్పనకు అది దోహదపడడం లేదన్నది ఇప్పటికే నిరూపితమయ్యింది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌కు ఒకరోజు ముందు ప్రకటించిన ఎకనమిక్ సర్వేతో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన వార్షిక బడ్జెట్‌కు చాలా అంశాల పరంగా ఎలాంటి లింక్ కనిపించడం లేదు. 2047 కల్లా ‘వికసిత్ భారత్’ను సాకారం చేయాలని ప్రతిపాదించినా... దాన్ని ఎలా సాక్షాత్కరింప చేస్తారనే విషయంలో కచ్చితమైన కార్యాచరణ, చర్యలు ప్రకటించలేదు. గతం నుంచి చూస్తే ఎకనమిక్ సర్వే ఆర్థిక రంగ పరిస్థితులు, ప్రస్తుత స్థితిగా ఎత్తిచూపేదిగా ఉంటూ వస్తోంది. సాధారణంగా దీనికి అనుగుణంగా బడ్జెట్‌లో ఆ యా రంగాలకు చేసే కేటాయింపులు, ఇతర అంశాలు ఆధారపడి ఉంటాయి.

ప్రతిపాదిత బడ్జెట్‌లోని కీలకరంగాలు, ముఖ్యమైన అంశాలను పరిశీలించినా స్పష్టత కనిపించలేదు. ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఎమ్మెస్‌ఎంఈలు, మధ్యతరగతి అనే వాటి గురించి ప్రధానంగా పేర్కొన్నారు. వీటిలో మొదటి మూడు అంశాలు ఒకదానికి ఒకటి లంకె కలిగినవి. ఐతే ఈ అంశాలను గురించి చెప్పాక కూడా ప్రభుత్వ ప్రాధాన్యాలు మారే అవకాశాలున్నాయి. అన్నింటికంటే కూడా అత్యధికంగా ఆందోళన కలిగించే అంశం ద్రవ్యోల్బణం. దాని గురించి బడ్జెట్‌లో ప్రస్తావనే లేదు.

వ్యవసాయ రంగానికి పెద్దగా నిధులు పెంచింది ఏమీ లేదు. పాత విధానానికి కొనసాగింపును ఈ బడ్జెట్ కేటాయింపులు ప్రతిబింబిస్తున్నాయి. ఆర్థిక సర్వే వ్యవసాయేతర రంగంలో కనీసం 75 లక్షల ఉద్యోగాలను కల్పించాలని చెప్పినా ఆ మేరకు బడ్జెట్‌లో ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఎమ్మెస్‌ఎంఈల కంటే దిగువ స్థాయిలో ఉండే అసంఘటిత రంగంలో 2016 నుంచి 2022–23 వరకు 54 లక్షల ఉద్యోగాలు పోయాయి. ప్రధానంగా... పెద్దనోట్ల రద్దు, జీఎస్టీని ఒత్తిడితో అమలుచేయడం, కోవిడ్ పరిస్థితుల ప్రభావం దీనికి కారణాలు. దాదాపు 18 లక్షల యూనిట్లు మూతపడ్డాయి. దీనిని సరిచేసే చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టలేదు. రెగ్యులేటరీ మెకానిజాన్ని రిలాక్స్ చేసి రుణాల కల్పన (క్రెడిట్ ఫెసిలిటీ) చేస్తామని చెబుతున్నారు. ఇది వాంఛనీయమే. నైపుణ్యాల అభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్)తోనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పడం తప్పుదారి పట్టించడమే అవుతుంది. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో నైపుణ్యాలకు మెరుగులు దిద్దడం అనేది విద్యారంగంతో లింకు కలదిగా గుర్తించాలి. పన్నెండో తరగతి దాకా నాణ్యతతో కూడిన విద్యాభ్యాసాన్ని అందించడంలో భాగంగా నైపుణ్యాల శిక్షణను కూడా అందజేయాలి.

బడ్జెట్‌లో కొత్తగా తూర్పు (ఈస్టర్న్ స్టేట్స్) రాష్ట్రాలు అని పేర్కొన్నారు. ఇది కొత్త ఆవిష్కరణగా భావించాలా? ఈ రాష్ట్రాల కింద పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, బిహార్, ఒరిస్సాల గురించి చెప్పారు. అయినా వీటిలో కేవలం ఆంధ్రప్రదేశ్, బిహార్‌ల గురించి ప్రస్తావించారు. దేశంలో ప్రస్తుతం ఏర్పడిన రాజకీయ పరిస్థితులతో ఈ రెండు రాష్ట్రాలకు రాజకీయంగా ప్రాధాన్యం పెరిగిన విషయం తెలిసిందే. ఈ రెండు రాష్ట్రాలు పెద్ద ఆర్థిక ప్యాకేజీని, ప్రత్యేక హోదా వంటివి కోరుకుంటుండగా వాటికి కంటితుడుపుగానే కేటాయింపులు చేశారు. ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే... కొత్త రాజధాని కోసం రూ. 15 వేల కోట్లు రుణం (ప్రపంచబ్యాంక్, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌ల ద్వారా ఇచ్చే అవకాశాలు) ఇప్పిస్తామన్నారు. రాజధానికి కేంద్రం బడ్జెట్ ద్వారా గ్రాంట్ రూపంలో కాకుండా రుణకల్పన వెసులుబాటు కల్పిస్తామనడం సరికాదు. ఈ రాష్ట్రాలకు పరిశ్రమల కల్పన, మరింత మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ఉద్యోగాలు, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాల్సి ఉండగా అది జరగడం లేదు.

ప్రభుత్వ పరంగా మౌలిక సదుపాయాల వృద్ధికి రోడ్లు, బ్రిడ్జీలు వంటివి నిర్మిస్తున్నారు. అవి ఉద్యోగాలు, ఉపాధి కల్పనకు ఉపయోగపడలేక పోతున్నాయి. ప్రైవేట్ కన్జమ్షన్ డిమాండ్‌ను పెంచలేకపోతే ప్రైవేట్ పెట్టుబడులు రావనేది లాజిక్. ప్రస్తుతమున్న పరిస్థితులు చూస్తే మాత్రం ఉపాధి కల్పన సరిగా లేక ఛిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. మొత్తం మీద బడ్జెట్ చెప్పుకోదగినంత గొప్పగా లేదనేది సత్యం.

వ్యాసకర్త పూర్వ డీన్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

వికసిత భారత్ లక్ష్యం నెరవేరేనా?



డా॥ తిరునహరి శేషు

మోదీ ప్రభుత్వం కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత విత్త మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మొదటి పూర్తిస్థాయి బడ్జెట్‌లో అద్భుతాలు ఏమీ లేవనే చెప్పాలి. అయితే ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభిస్తూ ఉద్యోగాల కల్పన, నైపుణ్యాల అభివృద్ధి, మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎమ్ఎస్ఎమ్ఈలు); అలాగే మధ్యతరగతిని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ ఉత్పాదకతలో పెరుగుదల; ఉద్యోగాలు, నైపుణ్యాలకు ప్రాధాన్యం; సమ్మిళిత మానవ వనరుల అభివృద్ధి, సామాజిక న్యాయం, తయారీ సేవలు, పట్టణాభివృద్ధి, ఇంధన రంగం, మౌలిక వసతుల కల్పనలో మెరుగుదల, ఆవిష్కరణలు– పరిశోధనల అభివృద్ధికి ప్రోత్సాహకాలు, భవిష్యత్ సంస్కరణలు లాంటి అంశాలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. తద్వారా ‘వికసిత్ భారత్’ లక్ష్యానికి చేరుకునే రోడ్డు మ్యాప్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు. 48 లక్షల 20 వేల 512 కోట్ల రూపాయల బడ్జెట్‌లో... కేటాయింపులు, నిర్దేశిత లక్ష్యాలు గత బడ్జెట్‌కి కొన సాగింపుగానే కనిపిస్తున్నాయి.

బడ్జెట్‌కు ఒకరోజు ముందుగా ప్రకటించిన ఆర్థిక సర్వేలో చెప్పినట్లుగా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి 2030 నాటికి ప్రతి ఏటా 78.5 లక్షల ఉద్యోగాల సృష్టి జరగాల్సిన అవసరం ఉంది. కాబట్టి ఈ లక్ష్యాన్ని చేరుకోవటానికి బడ్జెట్‌లో ఉద్యోగాల కల్పనకూ, ఉన్నత విద్యా ప్రమాణాల పెంపునకూ, నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చినట్లు కనిపిస్తోంది. విద్య, నైపుణ్యాల అభివృద్ధికే 1.48 లక్షల కోట్ల రూపాయలను కేటాయించారు. రాబోయే ఐదు సంవత్సరాలలో ఐదు ఉద్యోగ పథకాల ద్వారా 4.1 కోట్ల యువతకి ఉద్యోగాల కల్పన కోసం రెండు లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. నైపుణ్య అభివృద్ధిలో భాగంగా 20 లక్షల మంది యువతకు శిక్షణ ఇవ్వటం ద్వారా, ఐదేళ్లలో కోటి మంది యువతకి ప్రయోజనం చేకూర్చే ఇంటర్న్‌షిప్ పథకాన్ని ప్రకటించారు. మూడు ఉద్యోగ అనుసంధాన ప్రోత్సాహకాల ద్వారా లక్ష మంది విద్యార్థులకు 10 లక్షల రూపాయల విద్యా రుణాలు ఇవ్వటం ద్వారా, క్రెడిట్ గ్యారంటీ పథకంతో ఎంఎస్‌ఎమ్‌ఈలకు 100 కోట్ల రుణాలను ఇవ్వడం ద్వారా, 11 లక్షల కోట్ల రూపాయలను మౌలిక వసతుల కల్పనపై ఖర్చు చేయడం ద్వారా, ముద్ర యోజన రుణాలను 10 లక్షల నుంచి 20 లక్షలకు పెంచటం ద్వారా ఉపాధి ఉద్యోగ అవకాశాలను పెంచి నిరుద్యోగ సమస్యకి కళ్ళెం వేయవచ్చని ప్రభుత్వం భావించినట్లు ఉంది. అయితే కొంత కాలంగా నిరుద్యోగ సమస్యను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్ కేటాయింపుల ద్వారా ఇదే వ్యూహాన్ని అనుసరిస్తున్నప్పటికీ నిరుద్యోగాన్ని అదుపు చేయడంలో సఫలం కాకపోవడం గమనార్హం.

25 వేల గ్రామాలకు కొత్తగా రోడ్లు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా పట్టణాలలో కోటి ఇళ్ళ నిర్మాణం, రాబోయే ఐదు సంవత్సరాలలో గృహ నిర్మాణంపై 10 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేయాలనే నిర్ణయం, ఉపాధి హామీ పథకానికి ప్రాధాన్యం ఇవ్వటం కొంతమేరకు ఆహ్వానించదగిన పరిణామమే. కానీ, వ్యవసాయ అనుబంధ రంగాలకు కేటాయించిన 1.52 లక్షల కోట్ల రూపాయలు, గ్రామీణాభివృద్ధికి కేటాయించిన 2.66 లక్షల కోట్ల రూపాయలు ఆ యా రంగాలను బలోపేతం చేయడానికి సరిపోవు. ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు అదుపులోనే ఉన్నాయని ఆర్థిక మంత్రి చెబుతున్నా నమ్మశక్యంగా లేదు.

ఈ బడ్జెట్‌లో కొన్ని కేటాయింపులు ఘనంగా కనిపించినా అవి మొత్తం ఖర్చు చేస్తారా అనేది అనుమానమే. ఎందుకంటే... గత బడ్జెట్‌లో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఇంధనం లాంటి ఏడు కీలక రంగాలకు కేటాయించిన కేటాయింపులలో దాదాపు 1.21 లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేయలేక పోయినారనే విషయాన్ని గమనించాలి.

ఆర్థిక సర్వేలో చెప్పినట్లు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై దృష్టి పెట్టకుండా, విద్య – ఉపాధి రంగాల మధ్య అంతరాన్ని పూడకుండా, వ్యవసాయ వృద్ధిని చోదకంగా మార్చకుండా... అంచనా వేస్తున్న ఏడు శాతం వృద్ధిరేటుతో భవిష్యత్తు లక్ష్యాలను అందుకోలేమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వ్యాసకర్త అర్థశాస్త్ర ఉపన్యాసకులు, కాకతీయ విశ్వవిద్యాలయం । 98854 65877

ఉద్యోగులను నిరాశపరిచింది



అలుగుబెల్లి నర్సిరెడ్డి

ఆదాయపన్ను శ్లాబ్‌లలో పెద్ద మార్పులు లేవు. నేషనల్ పెన్షన్ స్కీమును యథావిధిగా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ రెండు అంశాలలోనే ఉద్యోగులు, ఉపాధ్యాయులు వెసులుబాటు ఉండాలని కోరుకుంటున్నారు. ఐదు లక్షల ఆదాయానికి పన్ను నుండి మినహాయింపు కావాలని కోరుకుంటున్నారు. కానీ మూడు లక్షల దగ్గరనే ఆగిపోయింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమును రద్దు చేసి, పాత పెన్షన్ స్కీమును పునరుద్ధరించాలని కోరుకుంటున్నారు. కానీ ఎటువంటి మార్పులూ లేవు. నిత్యావసర సరుకుల ధరలు వేగంగా పెరుగుతున్న క్రమంలో అందుకనుగుణంగా ఆదాయపు పన్ను శ్లాబ్‌లలో కూడా మార్పులు చేయాలి.

బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, బడ్జెట్ తర్వాత మీడియాలో ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ... ఈ బడ్జెట్ మధ్యతరగతి వారికి చేయూతనిస్తుందన్నారు. కానీ బడ్జెట్‌లో మధ్యతరగతికి వెసులుబాటు కల్పించే ప్రతిపాదనలేమీ కనిపించలేదు. ఈ బడ్జెట్ కూడా మాటల బడ్జెట్‌గానే కనిపించింది. విద్యారంగానికీ, శిక్షణ–ఉపాధి రంగానికీ కలిపి లక్షా 48 వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారు. మొత్తం బడ్జెట్‌లో ఇది 3 శాతమేనన్న మాట! విద్యారంగం ఒక్కదానికి మాత్రమే కేటాయింపులు చూస్తే 2.5 శాతం లోపే ఉంటాయి. బడ్జెట్ ప్రసంగంలో ప్రాథమిక విద్య నుండి యూనివర్సిటీ విద్య వరకు ఒక్క మాట కూడా లేదు. దీన్ని బట్టి విద్య పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి ఆసక్తీ లేనట్లు కనిపిస్తోంది. విద్య ప్రైవేటీకరణ యథేచ్ఛగా జరిగిపోవడానికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు ఈ బడ్జెట్ ద్వారా తెలుస్తోంది.

వ్యాసకర్త తెలంగాణ శాసనమండలి సభ్యులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.తదియ ఉ.10.42 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** శతభిషం రా.10.19 వరకు, తదుపరి పూర్వాభాద్ర. **వర్జ్యం:** ఉ.6.32 నుండి 8.02 వరకు, తదుపరి తె.4.18 నుండి 5.47 వరకు (తెల్లవారితే గురువారం). **దుర్ముహూర్తం:** ఉ.11.39 నుండి 12.31 వరకు, **అమృతఘడియలు:** ప.3.32 నుండి 5.03 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.39, **సూర్యాస్తమయం:** 6.33.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

నృసింహ 'పీత'



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలంక గ్రామంలో నృసింహస్వామి స్వరూపం కలిగిన ఓ పీత అందర్నీ ఆకట్టుకుంటోంది. మంగళవారం గ్రామస్తుడు కాగితం కృష్ణ స్థానిక మార్కెట్‌లో కొన్ని పీతలు కొనుగోలు చేసి ఇంటికి తెచ్చారు. వాటిలో ఒక పీతపై నృసింహ స్వామి ముఖం మాదిరిగా జూలు వంటి ఆకృతి, కళ్లు, ముక్కు, కోరల వంటి గుర్తులను స్థానికులు నిర్ధారించారు. పీతపై నృసింహుని స్వరూపం ఉండటంతో అందరూ ఆసక్తిగా చూసేందుకు వస్తున్నారు. – సఖినేటిపల్లి

మైసూరు యువతి సుప్రీత ఘనత



రాచనగరి మైసూరులోని వల్లభాయినగర నివాసి సుప్రీత సియాచిన్‌లో విధి నిర్వహణకు ఎంపికైన దేశ మొదటి మహిళా యోధురాలిగా కీర్తి, ప్రశంసలు పొందుతున్నారు. భారతీయ వాయుసేనలో కెప్టెన్‌గా ప్రపంచంలోనే అతి ఎత్తయిన యుద్ధభూమి సియాచిన్‌లో విధి నిర్వహణకు ఆమె ఎంపికవడమే ఇందుకు కారణం. మైసూరు జిల్లా టీ.నరసీపుర తాలూకా తలకాడు పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్‌ఐ తిరుమలేష్, నిర్మల దంపతుల కుమార్తె సుప్రీత. మైసూరు జేఎస్‌ఎస్ కాలేజీ నుంచి ఎల్‌ఎల్‌బీ పట్టా, ఎన్‌సీసీ సర్టిఫికెట్ సాధించారు. 2021లో లెఫ్టినెంట్‌గా శిక్షణ పొంది భారతీయ వాయుసేనలో నియమితులయ్యారు. 2024లో అనంతనాగ్, జబల్‌పూర్, లేహ్‌లో విధులు నిర్వహించిన తర్వాత కఠిన శిక్షణలో ఉత్తీర్ణురాలై సియాచిన్ యుద్ధభూమిలో విధులు నిర్వహించేందుకు ఎంపికయ్యారు. – మైసూరు



ఏడడుగుల పుట్ట

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం రవ్వలగుడ గ్రామ సమీపంలోని టేకు తోటలో భారీ పుట్ట అందర్నీ ఆకర్షిస్తోంది. నిన్న మొన్నటి వరకు సాధారణ స్థితిలో ఉన్న పుట్ట భారీ వర్షాలతో ఒక్కసారిగా ఏడు అడుగులపైనే పెరిగింది. దీంతో అరకు–విశాఖ ప్రధాన రహదారిలో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు ఈ పుట్టను ఆసక్తిగా తిలకిస్తున్నారు. –అరకులోయ రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా)



జంబో ములక్కాడ భలే

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెంలో రైతు చెల్లుబోయిన సత్యనారాయణ పెరట్లోని మునగ చెట్టుకు కాసిన జంబో ములక్కాడ అబ్బురపరుస్తోంది. హైబ్రీడ్ మొక్కకు సుమారు నాలుగు అడుగుల వరకు ములక్కాడ పెరిగింది. సాధారణంగా మార్కెట్‌లో దొరికే చిన్న సైజు ములక్కాడలు చెట్టుకు గుత్తులుగా కాస్తాయి. కానీ ఈ హైబ్రీడ్ చెట్టు పరిమితంగానే కాస్తోందని ఈ సందర్భంగా సత్యనారాయణ చెప్పారు. – సఖినేటిపల్లి

'క్రికెట్'కూ పసుపు తెగులు



టీడీపీ నేతల, కార్యకర్తల 'పచ్చ' పిచ్చి హద్దులు దాటుతోంది. ప్రభుత్వ నిధులతో ఏర్పాటైన ప్రతి భవనానికి పచ్చ రంగు పులిమేస్తున్నారు. దీనిపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలకు ఆనుకొని ఏపీ క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) నిధులతో నిర్మించిన నరసన్నపేట క్రికెట్ సబ్ సెంటర్ ఉంది. తాజాగా ఈ భవనానికి టీడీపీ నేతలు, కార్యకర్తలు పసుపురంగు వేశారు. దీంతో స్థానికులు, క్రికెట్ అభిమానులు దీనిపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. 'ఈ భవనానికి పసుపురంగు ఎలా వేస్తారు.. ఇదేమైనా పార్టీ ఆఫీసా?' అంటూ నిలదీస్తున్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉన్న ఈ క్రికెట్ సబ్‌సెంటర్‌లో పలువురు విద్యార్థులు కోచ్‌ల ఆధ్వర్యంలో క్రికెట్ ప్రాక్టీసు చేస్తున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేసిన పనికి సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. – నరసన్నపేట

దివిసీమ బిడ్డకు 'జగనన్న దీవెన'

ఐక్యరాజ్య సమితిలో మెరిసిన తెలుగు తేజం కృష్ణకిషోర్

- సుస్థిర అభివృద్ధి అంశంపై ప్రసంగం
- జగనన్న విదేశీ విద్యా దీవెన కింద నాడు రూ.కోటి మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



మోపిదేవి(అవనిగడ్డ): పేదింటి బిడ్డలు ఉన్నతంగా జీవించాలనేదే వైఎస్ జగన్ తపన. అందులో భాగంగానే జగనన్న విదేశీ విద్యా దీవెన తెచ్చారు. ఎందరో భావి భారత పౌరులకు అందించారు. ఆ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నాడు కృష్ణాజిల్లా దివిసీమ బిడ్డ. ఐక్యరాజ్య సమితిలో ఉన్నత స్థాయి రాజకీయ సమూహం ముందు 'సుస్థిర అభివృద్ధి' అనే అంశంపై ప్రసంగించే అరుదైన అవకాశం దక్కించుకున్నాడు. అందరి చేత శెభాష్ అనిపించుకున్నాడు. వివరాల్లోకి వెళితే... కృష్ణాజిల్లా మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి శివారు అడపావారిపాలెం గ్రామానికి చెందిన పండలనేని శివప్రసాద్, అన్నపూర్ణ దంపతుల రెండో కుమారుడు కృష్ణకిషోర్ ఆగస్టు 2023 నుంచి యూఎస్‌ఏలోని కొలంబియా యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్ (సీపా–ఎస్‌ఐపీఏ)లో మాస్టర్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విద్య అభ్యసిస్తున్నాడు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృష్ణకిషోర్‌కు జగనన్న విదేశీ విద్యా దీవెన కింద రూ.కోటి మంజూరు చేసింది. నాటి ప్రభుత్వం అందించిన సాయానికి పూర్తి న్యాయం చేస్తూ కృష్ణకిషోర్ అమెరికాలో అదీ ఐక్యరాజ్య సమితి ఆహ్వానంతో ఉన్నత స్థాయి ప్రతినిధుల ముందు తన వాణి వినిపించే అద్భుత అవకాశాన్ని పొందాడు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో ఇటీవల జరిగిన సుస్థిర అభివృద్ధి (సస్టైనబుల్ డెవలప్‌మెంట్) అంశంపై అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఆహ్వానం అందుకున్నాడు. ఎస్‌ఐపీఏ స్టూడెంట్ అసోసియేషన్ అకడమిక్ చైర్మన్‌గా, సౌత్ ఏసియన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా వ్యవహరిస్తున్న కృష్ణకిషోర్ ప్రపంచ విశ్వవిద్యాలయాల అధ్యక్షులు, కార్పొరేట్ నాయకులు, సీనియర్ యునైటెడ్ నేషన్స్ అధికారులతో వేదికను పంచుకుని పది నిమిషాల పాటు ప్రసంగించి ఆకట్టుకున్నాడు.

జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం. ఆయన అందించిన జగనన్న విదేశీ విద్యా దీవెనతోనే మా బాబు కృష్ణకిషోర్ అమెరికా వెళ్లాడు. అటు ప్రభుత్వానికి, ఇటు మాకు పేరు ప్రతిష్టలు తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉంది. – తల్లిదండ్రులు పండలనేని శివప్రసాద్, అన్నపూర్ణ

ఎంపీడీవో అదృశ్యం విషాదాంతం

- విజయవాడలోని ఏలూరు కాలువలో వెంకటరమణారావు మృతదేహం లభ్యం
- ఒత్తిళ్ల వల్లే ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబ సభ్యుల వాంగ్మూలం
- సైబర్ నేరగాళ్లకు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపినట్లు గుర్తించిన పోలీసులు





కాలువలో ఎంపీడీవో మృతదేహం (ఇన్‌సెట్‌లో) మండవ వెంకటరమణారావు(ఫైల్)

పెనమలూరు/నరసాపురం/కోనేరుసెంటర్(మచిలీపట్నం)/సాక్షి, అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో ఎం.వెంకటరమణారావు అదృశ్యం ఘటన చివరికి విషాదాంతమైంది. ఆయన మృతదేహాన్ని విజయవాడలోని మధురానగర్ వద్ద ఏలూరు కాలువలో మంగళవారం ఎస్డీఆర్‌ఎఫ్, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు గుర్తించాయి. ఈ నెల 15వ తేదీన ఎంపీడీవో అదృశ్యం కాగా... ఆయన సెల్‌ఫోన్ చివరి లొకేషన్ సిగ్నల్ ఆధారంగా మధురానగర్ వంతెన వద్ద నుంచి ఏలూరు కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు అంచనా వేశారు. ఈ మేరకు గాలింపు చర్యలు చేపట్టగా, ఆ వంతెనకు 200 మీటర్ల దూరంలో పిచ్చిమొక్కల అడుగుభాగాన కుళ్లిపోయిన దశలో వెంకటరమణారావు మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆయన నివాసం ఉంటున్న కృష్ణా జిల్లా పెనమలూరులోని కానూరులో వెంకటరమణారావు అంత్యక్రియలు నిర్వహించారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. కాగా, ఒత్తిళ్ల వల్లే వెంకటరమణారావు ఆత్మహత్య చేసుకున్నారని ఆయన కుటుంబ సభ్యులు శవపంచనామా సందర్భంగా తెలిపారు. మాధవాయిపాలెం ఫెర్రీ సొమ్ము రూ.55లక్షల బకాయి కారణంగా మనస్తాపం చెందాడని పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నరసాపురం ఎంపీడీవో కుటుంబానికి న్యాయం చేస్తాం: పవన్

నరసాపురం ఎంపీడీవో ఎం.వెంకటరమణారావు మరణం దురదృష్టకరమని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన బలవన్మరణానికి పాల్పడే పరిస్థితి తీసుకువచ్చిన వారిపై కఠిన చర్యలకు ఉపక్రమించాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. వెంకట రమణారావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆ కుటుంబానికి ప్రభుత్వం తగిన న్యాయం చేస్తుందని తెలిపారు.

అన్‌నోన్ నంబర్ల నుంచి ఫోన్లు.. సంబంధం లేని ఖాతాలకు డబ్బులు బదిలీ!

కుటుంబసభ్యుల ఫిర్యాదు ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు... ఎంపీడీవో వెంకటరమణారావు ఆచూకీ తెలియకపోవడంతో ఆయన ఫోన్ కాల్‌డేటాను పరిశీలించారు. అన్‌నోన్ నంబర్ల నుంచి వెంకటరమణారావుకు ఫోన్‌లు వచ్చినట్లు గుర్తించారు. రాజస్థాన్‌కు చెందిన ఇద్దరికి, హైదరాబాద్‌కు చెందిన ఒకరికి, మరికొన్ని గుర్తుతెలియని ఖాతాలకు ఆన్‌లైన్‌లో ఎంపీడీవో డబ్బులు బదిలీ చేసినట్లు వెలుగు చూసింది. అయితే, మాధవాయిపాలెం ఫెర్రీ విషయంలో రూ.55 లక్షలు బకాయి ఉండగా, తీవ్ర ఒత్తిడికి గురైన ఆయన ఆత్మహత్య చేసుకున్నారని కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు తెలిపారు. అదేవిధంగా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడిన వెంకటరమణ కొంత నగదును సైబర్ నేరగాళ్ల అకౌంట్‌లలో జమ చేశారని చెప్పారు.

గత ప్రభుత్వం ప్రారంభించిన హార్బర్లను పూర్తి చేయండి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు మాధవరావు, రవీంద్ర విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రాభివృద్ధి కోసం గత ప్రభుత్వం షిప్పింగ్ హార్బర్స్‌కు రూపకల్పన చేసి, వాటి పనులు కూడా ప్రారంభించిందని, వాటిని త్వరితగతిన పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు మాధవరావు, రవీంద్ర విజ్ఞప్తి చేశారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఈ అంశంపై జరిగిన చర్చలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం మంచి ఉద్దేశంతో పెట్టిన షిప్పింగ్ హార్బర్లను కూటమి ప్రభుత్వం కేంద్రం నిధులు ఉపయోగించుకుని పూర్తి చేయాలని కోరారు. తమ ప్రాంతంలోని రామాయపట్నం పోర్టు, బియ్యపు తిప్ప హార్బర్ వేగంగా పూర్తి చేయడానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ షాక్‌తో ముగ్గురు స్నేహితులు సజీవ దహనం

- ఈదురుగాలులకు తెగిపడిన 11కేవీ విద్యుత్ తీగ
- స్కూటీపై వెళ్తూ ఆ తీగకు తగలడంతో షాక్
- మంటలు చెలరేగి అక్కడికక్కడే ముగ్గురూ మృతి
- ప్రకాశం జిల్లా కనిగిరి వద్ద ఘటన
- విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబసభ్యుల ఆగ్రహం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



నజీర్, బాలాజీ, గౌతమ్ కుమార్ (ఫైల్)

కనిగిరి రూరల్: కరెంట్ షాక్‌తో ముగ్గురు స్నేహితులు సజీవ దహనమయ్యారు. ఈ విషాద ఘటన మంగళవారం ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పునుగోడు వద్ద జరిగింది. వివరాలు.. కనిగిరిలోని దేవాంగనగర్‌కు చెందిన వీరమాస గౌతమ్‌కుమార్(16), ఇందిరాకాలనీకి చెందిన దేశబోయి నజీర్(16), కామినేని బాలాజీ (16) పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. గౌతమ్, నజీర్ పట్టణంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతుండగా.. బాలాజీ చదువు ఆపేశాడు. వీరు ముగ్గురూ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పునుగోడు చెరువులో సరదాగా ఈత కొట్టేందుకు స్కూటీపై బయల్దేరారు. పునుగోడులోని ఎస్టీ కాలనీ సమీపంలో విద్యుత్ తీగ(11 కేవీ) తెగి కిందకు వేలాడుతోంది. వీరు ముగ్గురూ స్కూటీపై వెళ్తూ ఆ విద్యుత్ తీగకు తగిలారు. దీంతో ఒక్కసారిగా షాక్ కొట్టి ముగ్గురూ కిందపడిపోగా.. స్కూటీ నుంచి మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే ఈ విషయాన్ని విద్యుత్, పోలీస్ అధికారులకు తెలియజేశారు. విద్యుత్ సరఫరా నిలిపివేసినప్పటికీ.. ముగ్గురూ కాలిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రత్నాకరం రామరాజు, సీఐ, ఎస్సై, విద్యుత్, రెవెన్యూ అధికారులు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. మృత్యువులోనూ వీరి స్నేహం విడిపోలేదంటూ కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యమే తమ బిడ్డల ప్రాణాలు తీసిందని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ఈ ప్రమాదంపై మంత్రి గొట్టిపాటి రవి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ నారాయణ యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందించి ఆదుకుంటామని మంత్రి చెప్పారు.

మా సిబ్బంది నిర్లక్ష్యం లేదు

ఈ ఘటనలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యమేమీ లేదని విద్యుత్ శాఖ డీఈఈ స్పష్టం చేశారు. ఈదురు గాలులకు విద్యుత్ తీగ తెగిందన్నారు. అయితే నేలపై పడకుండా చిల్లచెట్లపై ఉండటంతో పునుగోడు ఫీడర్ ట్రిప్ కాలేదని చెప్పారు. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోలేదన్నారు. అప్పుడే అటుగా వెళ్తున్న విద్యార్థులు విద్యుత్ తీగకు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందారని విద్యుత్ శాఖ డీఈఈ, ఏడీఈలు ఒక ప్రకటనలో వెల్లడించారు.

నెయ్యి కొనుగోలుపై నలుగురితో కమిటీ


- శ్రీవారి లడ్డూ ప్రసాదాల రుచి, నాణ్యత పెంపు
- టీటీడీ ఈవో శ్యామలరావు



తిరుమల: శ్రీవారి లడ్డూ తయారీకి ఉపయోగించే నాణ్యమైన నెయ్యి కొనుగోలుకు సంబంధించి నలుగురు ప్రముఖ డెయిరీ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు టీటీడీ ఈవో జే.శ్యామలరావు చెప్పారు. ఇందులో ఎన్‌డీఆర్‌ఐ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ సురేంద్రనాథ్, హైదరాబాద్‌కు చెందిన విజయభాస్కర్ రెడ్డి, ప్రొఫెసర్ స్వర్ణ లత, బెంగళూరుకు చెందిన డాక్టర్ మహదేవన్ ఉన్నట్లు వివరించారు. ఈ కమిటీ వారం రోజుల్లో నివేదిక అందిస్తుందని తెలిపారు. తిరుమల గోకులం విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నాణ్యమైన నెయ్యి కోసం టెండర్‌లో ఎలాంటి అంశాలు చేర్చాలనేది ఈ కమిటీ దిశా నిర్దేశం చేస్తుందన్నారు. ప్రస్తుత సరఫరాదారులను పిలిచి నాణ్యమైన నెయ్యి సరఫరా చేయాలని సూచించామని చెప్పారు. కొన్ని సంస్థలు అధిక నాణ్యమైన నెయ్యి పంపిస్తున్నాయనీ, మరికొన్ని సంస్థలు నాసిరకం నెయ్యి అందిస్తున్నాయని చెప్పారు. ఓ సంస్థ కల్తీ నెయ్యి ఇస్తున్నట్లు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కేలిబ్రేషన్ లాబొరేటరీస్ (ఎన్‌ఏబీఎల్) పరీక్షలో తేలిందన్నారు. టీటీడీకి సరఫరా చేస్తున్న నెయ్యి నమూనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు ఎన్‌ఏబీఎల్‌కు పంపినట్లు తెలిపారు. టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న ఐదుగురు సరఫరాదారుల్లో ఒకరు అందించిన నెయ్యి నాణ్యత ప్రమాణాలు సరిపోలడం లేదని, కల్తీ నెయ్యిని సరఫరా చేస్తున్నట్లు పరీక్షల్లో నిర్ధారణ అయ్యిందని చెప్పారు. టెండర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఒక కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టామని, మరో కంపెనీపై చర్యలు తీసుకుంటామన్నారు. రెండు కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాలు మరింత నాణ్యంగా, రుచికరంగా అందించాలనే లక్ష్యంతో, ఇప్పటికే తీసుకున్న చర్యల వల్ల లడ్డూ ప్రసాదాల రుచి, నాణ్యత పెరిగిందన్నారు. తక్కువ నాణ్యత గల నెయ్యిని సరఫరా చేస్తోన్న సరఫరాదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతానికి నెయ్యిలో కల్తీని గుర్తించే పరీక్ష చేసే పరికరం టీటీడీ వద్ద లేదని, త్వరలో దాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ముడిసరుకులు, నెయ్యి సేకరణ విధానంలో కొన్ని ఇబ్బందులు ఉన్నట్లు పేర్కొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.620 కోట్లు

- ఇది ప్లాంట్ చేసే ఖర్చుకు అనుమతి మాత్రమే!



ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.620 కోట్లు కేటాయించింది. ఈ మేరకు మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ఈ మేరకు ప్రకటన చేశారు. అయితే ఈ కేటాయింపులు కేవలం కాగితాలకే పరిమితం అవుతాయని కేంద్రం వైఖరి తెలియజేస్తోంది. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు స్టీల్ ప్లాంట్ ఖర్చు పెట్టడానికి ఇచ్చే అధికారిక అనుమతి మాత్రమేనని అధికార వర్గాల సమాచారం.

ఏటీఎం చోరీకి మైనర్ యత్నం

సింగరాయకొండ: ఓ మైనర్ ఎస్‌బీఐ ఏటీఎం చోరీకి యత్నించి కటకటాల పాలైన ఘటన ప్రకాశం జిల్లా, సింగరాయకొండలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ప్రకాశం జిల్లా, సింగరాయకొండ మండలం, హనుమాన్‌నగర్‌కు చెందిన 14 ఏళ్ల బాలుడు సుమారు రాత్రి 2.30 గంటల సమయంలో ఏటీఎం చోరీకి యత్నించాడు. నిందితుడు ఏటీఎంలోకి ప్రవేశించి పుల్లలతో తెరిచేందుకు యత్నించాడు. సీసీ కెమెరాను తొలగించేందుకు ప్రయత్నించాడు. వెంటనే బ్యాంకు మేనేజర్‌కు అలర్ట్ వెళ్లడంతో అతను వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి ఏటీఎం వద్ద ఉన్న మైనర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మీకు పిల్లలు లేరా?.. మీ ఇంట్లో ఇలా జరిగితే ఊరుకుంటారా?

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డిని నిలదీసిన ముచ్చుమర్రి మైనర్ బాలిక కుటుంబం



బైరెడ్డిని నిలదీస్తున్న బాధిత కుటుంబం

టాస్క్‌ఫోర్స్: 'మీకు పిల్లలు లేరా... మీ ఇళ్లల్లో ఇలాంటి ఘటన జరిగితే ఊరుకుంటారా..' అంటూ ముచ్చుమర్రిలో హత్యాచారానికి గురైన బాలిక తల్లిదండ్రులు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డిని నిలదీశారు. వివరాల్లోకి వెళితే... మంగళవారం బైరెడ్డి రాజశేఖరరెడ్డి నంద్యాల జిల్లా, పాత ముచ్చుమర్రికి చెందిన ఎస్సీ కాలనీ వాసులతో కలిసి ర్యాలీగా కొత్త ఎల్లాలలోని బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు బైరెడ్డితో ఆవేశంగా మాట్లాడారు. 'విషం తాగి చావమంటే చస్తాం.. కనీసం మా పాప ఎముకలైనా ఇప్పించండి. పూడ్చుకుంటాం. డబ్బులిచ్చి ప్రాణాలకు విలువ కట్టకండి. మరో కుటుంబానికి ఇలాంటి గతి పట్టకుండా నిందితులను నడిరోడ్డుపై కాల్చివేయాలి' అంటూ డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన బైరెడ్డి నిందితులను శిక్షించడానికి చట్టం ఉందని, నదిలో ఇంకా గాలింపు కొనసాగుతోందని మాట దాటేశారు.

బైరెడ్డి 'ధన'రాజకీయం

అంతకుముందు... మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన సామాజిక వర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సుమారు రూ.లక్ష రూపాయలు పోగు చేయించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందించేందుకు వెళ్లారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబం ఆ డబ్బు తీసుకునేందుకు నిరాకరించింది. తమ చిన్నారి ప్రాణానికి డబ్బుతో విలువ కట్టొద్దని తెగేసి చెప్పింది. ఈ పరిణామంతో దిక్కుతోచని బైరెడ్డి, ఈ డబ్బు వాళ్లది కాదని, తానే ఇస్తున్నానని బలవంతంగా బాధిత కుటుంబం చేతిలో పెట్టి అక్కడ నుంచి వెళ్లిపోవడం గమనార్హం.



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని తెలంగాణ, ఝార్ఖండ్ గవర్నర్ రాధాకృష్ణన్ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ స్వాగతం పలికారు. అమ్మవారి మూలమూర్తిని గవర్నర్ దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు ఆశీర్వచనం చేయగా, అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. - చంద్రగిరి (తిరుపతి జిల్లా)

తెలంగాణకు తరలిస్తున్న ఇసుక లారీల పట్టివేత



కుక్కునూరులో ఇసుక లారీలను పట్టుకున్న స్పెషల్ టీమ్

కుక్కునూరు: ఏలూరు జిల్లా, కుక్కునూరు మండలంలోని ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్ నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలను డీపీవో తూతిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మంగళవారం పట్టుకున్నారు. రెండు, మూడు రోజులుగా మండలంలోని స్టాక్ పాయింట్‌ల నుంచి జిల్లాకు చెందిన వ్యక్తుల చిరునామాలతో ఆధార్ కార్డులు చూపించి నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ఇసుకను లారీల్లో నింపుకొని తెలంగాణకు తరలిస్తున్నారు. ఈ విషయమై పలు ఆరోపణలొచ్చినా స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. దీంతో సోమవారం రాత్రి కూడా జిల్లాకు చెందిన కొందరి చిరునామాలతో ఇసుకను లారీల్లో లోడ్ చేసుకొని తెలంగాణకు తరలిస్తున్న విషయాన్ని గుర్తు తెలియని వ్యక్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, డీపీవో తూతిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని విచారణకు పంపారు. ఇసుక లారీలను పట్టుకొని తెలంగాణలోని ఆసుపాక వేబ్రిడ్జ్ వద్ద కాటా వేయించగా 12 టైర్లు ఉన్న రెండు లారీల్లో 40 టన్నులు, 16 టైర్ల లారీలో 50 టన్నులకు పైగా పరిమితికి మించి ఇసుకను నింపుకున్నట్టు తెలిసింది. వాటిని ఖమ్మం తరలిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో లారీలను సీజ్ చేసి వాటి యజమానులపై కేసు నమోదు చేశారు.

మహిళపై కత్తితో దాడి



నాయుడుపేట టౌన్ (తిరుపతి జిల్లా): నాయుడుపేట పట్టణ పరిధిలోని జాతీయ రహదారి కూడలి సమీపంలో ఓ దుకాణం వద్ద నిద్రిస్తున్న లక్ష్మి అనే మహిళపై ఓ వ్యక్తి కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలో పూడేరు గ్రామానికి చెందిన లక్ష్మి సోమవారం కూలి పనులు ముగించుకుని పట్టణ పరిధిలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ దుకాణంలో నిద్రించింది. మంగళవారం తెల్లవారుజామున ఆమెకు పరిచయమున్న శ్రీకాళహస్తి మండలం, తొండమనాయుడు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వెంకట రమణయ్య అక్కడికి వచ్చి ఆమెతో గొడవ పడ్డాడు. అనంతరం కత్తితో లక్ష్మిపై దాడిచేసి అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన లక్ష్మిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆపై మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లారు. లక్ష్మిపై జరిగిన దాడికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధురాలి దారుణ హత్య

బాపట్ల జిల్లా చీరాలలో ఘటన

చీరాల: గుర్తు తెలియని దుండగుల చేతిలో ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన బాపట్ల జిల్లా చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెం జెండా చెట్టు వద్ద జరిగింది. స్థానికుల సమాచారం మేరకు జెండా చెట్టు వీధిలో పిల్లి లలిత (74) ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి ఒంటరిగా నిద్రిస్తున్న లలిత ఇంట్లోకి గుర్తుతెలియని దుండగులు కత్తులతో వచ్చి హతమార్చి పరారయ్యారు. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ తుషార్‌డూడి ఘటనా స్థలికి చేరుకున్నారు. హత్య జరిగిన తీరును పరిశీలించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు: తిరుపతి, చీఫ్ ఇంజినీర్ ఆఫీస్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ADV No.10/D3/CE/TTD/2024-25 Dt:22/07/2024
TTD ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో తొంభై ఆరు(96) పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్లో ఇ-టెండర్లు కోరబడుచున్నవి. SE-II, NIT నం:72 నుండి 76/SE-II/2024-25 (5 పనులు). SE-III, NIT నం:14/SE-III/2024-25 (1 పని). EE-II, NIT నం:69 నుండి 75/EE-II/2024-25 (7 పనులు). EE-V, NIT నం:57 నుండి 59/EE-V/2024-25 (3 పనులు). EE-IX, NIT నం:43/EE-IX/2024-25 (1 పని). EE-XI, NIT నం:41 నుండి 44/EE-XI/2024-25 (4 పనులు). EE-XII, NIT నం:80 నుండి 85/EE-XII/2024-25 (6 పనులు). EE-XIV, NIT నం:94 నుండి 98/EE-XIV/2024-25 (5 పనులు). DE(Elec)-I, NIT నం: 96 నుండి 119/DE(Elec)-I/2024-25 (24 పనులు). DE(Elec)-II, NIT నం:150 నుండి 172/DE(Elec)-II/2024-25 (23 పనులు). DE(Elec)-TML, NIT నం:141 నుండి 157/DE(Elec)-TML/2024-25 (17 పనులు). వివరాల కోసం www.tirumala.org కి లాగిన్ చేయండి మరియు పని వివరాల కోసం https://tender.apeprocurement.gov.in కు లాగిన్ చేయండి.
TTD-40021(31)/1/2024-PRO SEC (Adv.No.83) Dt:23.07.2024 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

EXPERT COMMENT


ప్రొఫెసర్ ఆనంద్ ఆచారి
విద్యావేత్త



కోటి మంది యువతకు టాప్ 500 కంపెనీల్లో ఐదేళ్లపాటు ఇంటర్న్‌షిప్ చేసేందుకు అవకాశం కల్పించే పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో శ్రీకారం చుట్టడం హర్షణీయం. దీనివల్ల కార్పొరేట్ ప్రపంచం ఎదుర్కొంటున్న వాస్తవిక సవాళ్లకు పరిష్కారాలను సూచించడంలో విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం లభిస్తుంది. ఈ చర్య గ్రాడ్యుయేట్ల ఉద్యోగ సన్నద్ధతను మరింతగా పెంచే అవకాశం ఉంది.



20 24 బడ్జెట్



నైపుణ్య యువతరం.. ఉద్యోగ భారతం

దేశ యువతలో స్కిల్స్ పెంపు, ఉద్యోగ కల్పనపై కేంద్రం ఫోకస్

- బడ్జెట్‌లో ఐదు పథకాలను ప్రకటించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- వచ్చే ఐదేళ్లలో 2 లక్షల కోట్లతో.. 4.1 కోట్ల మంది యువతకు ప్రయోజనం కలిగేలా అమలు
- కొత్తగా ఉద్యోగంలో చేరేవారికి, కొత్త ఉద్యోగాలు ఇచ్చే సంస్థలకు ప్రోత్సాహకాలు
- కోటి మందికి 500 టాప్ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు



న్యూఢిల్లీ: దేశంలో భారీగా కొత్త ఉద్యోగాల కల్పన, అందుకు వీలు కల్పించేలా యువతకు నైపుణ్య శిక్షణ లక్ష్యంతో మోదీ 3.0 సర్కారు అడుగులు వేసింది. తమ ప్రభుత్వం నిర్దేశించుకున్న తొమ్మిది అత్యంత ప్రాధాన్య అంశాల్లో 'ఉద్యోగ కల్పన, నైపుణ్య శిక్షణ'ఒకటని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 4.1 కోట్ల మంది యువతకు ప్రయోజనం కలిగేలా, రూ.2 లక్షల కోట్లను ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. ఉద్యోగాల కల్పన కోసం మూడు, నైపుణ్యాల అభివృద్ధి కోసం రెండు ప్రోత్సాహక పథకాలను చేపడతామని ప్రకటించారు. కొత్తగా ఉద్యోగాలు ఇచ్చే సంస్థలకు, కొత్తగా ఉద్యోగంలో చేరేవారికి ప్రయోజనాలను కల్పిస్తామని ప్రకటించారు.

కొత్త ఉద్యోగాల కల్పన పథకాలను.. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ)లో నమోదయ్యే వివరాల ఆధారంగా అమలు చేస్తామని నిర్మల తెలిపారు. మొత్తంగా ప్రస్తుత 2024–25 కేంద్ర బడ్జెట్‌లో విద్య, ఉద్యోగ కల్పన, నైపుణ్య శిక్షణ కోసం రూ.1.48 లక్షల కోట్లను కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. ఇందులో ఎంప్లాయ్‌మెంట్ లింక్‌డ్ ఇన్సెంటివ్ స్కీమ్‌కు 23 వేల కోట్లు, జాబ్ క్రియేషన్ ఇన్ మాన్యుఫాక్చరింగ్ స్కీమ్‌కు రూ.52 వేల కోట్లు, సపోర్ట్ టు ఎంప్లాయర్స్ స్కీమ్‌కు రూ.32 వేల కోట్లు కలిపి రూ.1.07 లక్షల కోట్లను ఖర్చు చేయనున్నట్టు వివరించారు.

ఈపీఎఫ్ఓ డేటా ఆధారంగా..



కార్మికుల నైపుణ్యాలకు తగిన ఉద్యోగాలు లభించేలా చర్యలు చేపడతామని నిర్మలా సీతారామన్ చెప్పారు. అందుబాటులో ఉన్న ఉద్యోగాలు, వాటికి అవసరమైన నైపుణ్యాలు, తగిన నైపుణ్యమున్న కార్మికులతో కూడిన డేటాబేస్‌ను సిద్ధం చేస్తామని వెల్లడించారు. ఇందుకోసం ఈ–శ్రమ్, శ్రమ్ సువిధ, సమాధాన్ వంటి పోర్టల్స్‌ను అనుసంధానం చేస్తామని తెలిపారు. దీనితో స్కిల్ ప్రొవైడర్స్, ఎంప్లాయర్స్‌కు.. ఉద్యోగాలు కోరుకునే యువతకు మధ్య అనుసంధానం కుదురుతుందని వెల్లడించారు.



నైపుణ్యాలకు తగిన ఉద్యోగాలు..

ఐదేళ్లలో కోటి మందికి ఇంటర్న్‌షిప్

దేశంలో యువత సులభంగా ఉద్యోగాలు పొందేందుకు వీలు కల్పించేలా, ఉద్యోగంలో చేరే ముందే తగిన అనుభవం సాధించేలా.. విస్తృతస్థాయిలో ఇంటర్న్‌షిప్ పథకాన్ని అమలు చేస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వచ్చే ఐదేళ్లలో 500 టాప్ కంపెనీల్లో మొత్తంగా కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఇంటర్న్‌షిప్‌లో చేరేప్పుడు ఒకసారి రూ.6 వేలు అందిస్తామని, తర్వాత ప్రతినెలా రూ.5 వేలు ఇంటర్న్‌సిప్ అలవెన్స్ అందుతుందని వెల్లడించారు. ఏడాదిపాటు కొనసాగే ఈ ఇంటర్న్‌షిప్ సమయంలో సంబంధిత ఉద్యోగం, పని వాతావరణంపై యువతకు అవగాహన ఏర్పడుతుందని.. దీనితో మంచి ఉద్యోగం పొందేందుకు అవకాశం వస్తుందని వివరించారు. ఈ ఇంటర్న్‌షిప్ పథకానికి ఎంపికయ్యే యువతకు శిక్షణ ఇచ్చేందుకయ్యే వ్యయాన్ని, ఇంటర్న్‌షిప్ అలవెన్స్‌లో పది శాతాన్ని కంపెనీలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల నుంచి భరిస్తాయని తెలిపారు.

..: ఉద్యోగాల కల్పన కోసం :..

1 ఎంప్లాయ్‌మెంట్ లింక్‌డ్ ఇన్సెంటివ్ స్కీమ్
వ్యవస్థీకృత రంగాల్లో కొత్తగా ఉద్యోగంలో చేరేవారికి ప్రోత్సాహకంగా ఒక నెల వేతనం చెల్లింపు. మూడు వాయిదాల్లో.. గరిష్టంగా రూ.15 వేల వరకు అందిస్తారు. దీనితో వచ్చే ఐదేళ్లలో 2.1 కోట్ల మందికి లబ్ధి కలుగుతుందని అంచనా.

2 జాబ్ క్రియేషన్ ఇన్ మాన్యుఫాక్చరింగ్ స్కీమ్:
కొత్తగా ఉద్యోగంలో చేరేవారు, కొత్తగా ఉద్యోగాలిచ్చే సంస్థలు చెల్లించే ఈపీఎఫ్ఓ చందాలపై తొలి నాలుగేళ్లపాటు ప్రోత్సాహకాలు. సుమారు 30 లక్షల మంది యువతకు ప్రయోజనం కలుగుతుందని అంచనా.

3 సపోర్ట్ టు ఎంప్లాయర్స్ స్కీమ్:
కంపెనీలు కొత్తగా/అదనంగా ఇచ్చే ఉద్యోగాలకు సంబంధించి యాజమాన్య వాటాగా చెల్లించే ఈపీఎఫ్ చందాల రీయింబర్స్‌మెంట్. ఒక్కో ఉద్యోగికి నెలకు గరిష్టంగా రూ.3 వేల చొప్పున రెండేళ్లపాటు చెల్లిస్తారు. దీనితో కొత్తగా 50 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా.

(ఈ మూడు స్కీమ్‌లను గరిష్టంగా నెలకు రూ.లక్ష వేతనం ఇచ్చే ఉద్యోగాలు/ఉద్యోగులకు మాత్రమే వర్తింపజేస్తారు.)

..: నైపుణ్యాల శిక్షణ కోసం :..

1 వచ్చే ఐదేళ్లలో 20 లక్షల మంది యువతలో నైపుణ్యాల అభివృద్ధి కోసం ప్రత్యేక పథకం. రాష్ట్రాలు, పరిశ్రమలు, కంపెనీలతో కలసి దీనిని అమలు చేస్తారు. ఇందుకోసం దేశ వ్యాప్తంగా కేంద్రీకృత విధానంలో 1,000 పారిశ్రామిక శిక్షణ ఇన్‌స్టిట్యూట్ల (ఐటీఐ) అప్‌గ్రెడేషన్.

2 వచ్చే ఐదేళ్లలో కోటి మందికి 500 టాప్ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అందించే మరో పథకం అమలు.

3 పరిశ్రమలు, కంపెనీల అవసరాలకు తగినట్టుగా ఉండేలా కోర్సులు, పాఠ్యాంశాల రూపకల్పన.

4 నైపుణ్య శిక్షణ కోసం 'మోడల్ స్కిల్ లోన్ స్కీమ్'కింద ఏటా 25 వేల మంది యువతకు రూ.7.5 లక్షల వరకు రుణాలు.

5 మహిళలకే ప్రత్యేకించిన నైపుణ్యాల శిక్షణ కార్యక్రమాలు. ఉద్యోగాల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం కోసం.. పరిశ్రమలు, కంపెనీల సహకారంతో వర్కింగ్ విమెన్ హాస్టళ్లు, చిన్న పిల్లల సంరక్షణను చూసుకునే క్రెచ్‌ల ఏర్పాటుకు నిర్ణయం.

ప్రభుత్వ ఉద్యోగుల శిక్షణకు రూ.309.74 కోట్లు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు బడ్జెట్‌లో రూ.309.74 కోట్లను కేటాయించారు. ఇందులో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియట్ ట్రైనింగ్ అండ్ మేనేజ్‌మెంట్, లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌కు రూ.103.05 కోట్లు. వివిధ శిక్షణ స్కీమ్‌లకు రూ.120.56 కోట్లు, మిషన్ కర్మయోగికి రూ.86.13 కోట్లు ఇచ్చారు. వీటితో ఉద్యోగులకు వివిధ నైపుణ్యాలపై రిఫ్రెషర్ కోర్సులు, మిడ్ కెరీర్ శిక్షణ ఇస్తారు.

స్కిల్స్ పెరిగితే.. ఉద్యోగాలూ పెరుగుతాయి!

బడ్జెట్‌లో దేశ యువతలో నైపుణ్యాల పెంపు, ఉద్యోగ కల్పనకు ప్రోత్సాహకాలు అందించే స్కీమ్‌లను ప్రకటించడంపై హ్యూమన్ రీసోర్స్, ఎడ్ టెక్ రంగాల నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధన దిశగా ప్రభుత్వం ముందుచూపుతో నిర్ణయం తీసుకుందని ప్రశంసిస్తున్నారు. యువతలో నైపుణ్యాలు పెరిగితే ఉద్యోగ అవకాశాలు విస్తృతం అవుతాయని అంటున్నారు. ''మాన్యుఫాక్చరింగ్ రంగంలో ఉద్యోగాల సృష్టికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు తోడ్పడతాయి. పరిశ్రమకు అవసరమైన మానవ వనరులు అందేందుకు నైపుణ్య శిక్షణ బాట వేస్తుంది. ఈ దిశగా ప్రభుత్వ నిర్ణయాలు బాగున్నాయి..''అని టీమ్‌లీజ్ డిగ్రీ అప్రెంటిస్‌షిప్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. ''నైపుణ్య శిక్షణ మాత్రమేగాకుండా.. ఉద్యోగులు, ఉద్యోగాలను కల్పించే కంపెనీలకూ ప్రోత్సాహకాలు ఇవ్వడం స్వాగతించదగిన విషయమని క్వెస్ కార్ప్ సీఈవో గురుప్రసాద్ శ్రీనివాసన్ చెప్పారు. ''20 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ, కోటి మందికి ఇంటర్న్‌షిప్ అవకాశాలు వంటివి రాబోయే తరం సాధికారతకు తోడ్పడతాయి. దేశంలోని యువతలో నైపుణ్యాల లోటును పూడ్చవచ్చు..''అని పియర్సన్ ఇండియా కంట్రీ హెడ్ వినయ్‌కుమార్ స్వామి పేర్కొన్నారు.



తదుపరి తరం సంస్కరణలతో ఉపాధి వెల్లువ

న్యూఢిల్లీ: ఉపాధి అవకాశాల కల్పన, అధిక వృద్ధి రేటు కొనసాగేందుకు తదుపరి తరం సంస్కరణలకు సంబంధించి ఆర్థిక విధాన ముసాయిదాను ప్రభుత్వం రూపొందిస్తుందని మంత్రి సీతారామన్ తెలిపారు. ప్రతిపాదిత 'ఆర్థిక విధాన ముసాయిదా'అందరికీ పుష్కలమైన అవకాశాలను కల్పించేందుకు బడ్జెట్‌లో ప్రతిపాదించబడిన తొమ్మిది ప్రాధాన్యతలలో ఒకటిగా పేర్కొన్నారు. ఉత్పాదకత పెంపునకు, మార్కెట్లు, వివిధ రంగాలు మరింత సమర్థవంతంగా మారేందుకు సంస్కరణలు చేపడతామన్నారు. ''ఈ సంస్కరణలు ఉత్పత్తి, భూమి, కార్మిక, క్యాపిటల్, పారిశ్రామిక, టెక్నాలజీ ఇలా అన్నింటినీ సమగ్రపరిచేలా ఉంటుంది. ఇది సమానత్వానికి సాయపడుతుంది''అని మంత్రి వివరించారు. ఈ సంస్కరణలను సమర్థవంతంగా అమలుకు కేంద్రం, రాష్ట్రాల మధ్య సహకారం అవసరమన్నారు. సంస్కరణలను వేగంగా అమలు చేసే దిశగా రాష్ట్రాలకు ప్రోత్సాహం ఇచ్చేందుకు 50 ఏళ్ల వడ్డీ రహిత రుణాల్లో గణనీయంగా ప్రతిపాదిస్తున్నట్టు ప్రకటించారు.



కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు

అణు విద్యుత్, పునరుత్పాదక ఇంధనాలు, అంతరిక్షం, రక్షణ, టెలీకమ్యూనికేషన్స్, కీలకమైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల్లో వినియోగించే 25 కీలకమైన ఖనిజాలపై దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తివేశారు. మొబైల్ ఫోన్లలో వినియోగించే కనెక్టర్లు, రెసిస్టర్ల తయారీలో వినియోగించే ఆక్సిజన్ రహిత కాపర్ కూడా బేసిక్ కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు జాబితాలోకి చేరాయి.



వినియోగదారుల ప్రయోజనం కోసమే..

మొబైల్ ఫోన్లపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ తగ్గించడానికి కారణాన్ని మంత్రి సీతారామన్ వివరించే ప్రయత్నం చేశారు. ''దేశీయంగా మొబైల్ ఫోన్ల తయారీ మూడు రెట్లు పెరిగింది. గత ఆరేళ్లలో మొబైల్ ఫోన్ల ఎగుమతులు 100 రెట్లు పెరిగాయి. దేశీ మొబైల్ ఫోన్ పరిశ్రమ పరిణతి దశకు చేరింది. దీంతో వినియోగదారుల ప్రయోజనాల దృష్ట్యా మొబైల్ ఫోన్లపై, మొబైల్ ఫోన్ల పీసీబీఏలు, చార్జర్లపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 15 శాతానికి (ప్రస్తుతం 20 శాతం) తగ్గిస్తున్నాం''అని మంత్రి సీతారామన్ తెలిపారు.



మైనార్టీ వ్యవహారాల శాఖకు రూ.3,183 కోట్లు

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో మైనార్టీ వ్యవహారాల శాఖకు రూ.3,183.24 కోట్లు కేటాయించారు. గతేడాది బడ్జెట్ కంటే ఈసారి కేటాయింపులు రూ.574.31 కోట్లు పెంచారు. కేటాయింపుల్లో రూ.1,575.72 కోట్లను మైనార్టీల విద్యా సాధికారతకు ఖర్చు చేయనున్నారు. ప్రి-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు రూ.326.16 కోట్లు, పోస్టు-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు రూ.1,145.38 కోట్లు వెచ్చిస్తారు. మైనార్టీ వ్యవహారాల శాఖలో పలు పథకాలు, ప్రాజెక్టుల అమలుకు 2,120.72 కోట్లు ప్రత్యేకించారు. ఇదే శాఖలో ప్రధానమంత్రి జన వికాస్ కార్యక్రమానికి రూ.910.90 కోట్లు ఖర్చు చేయనున్నారు. నేషనల్ మైనార్టీస్ డెవలప్‌మెంట్, ఫైనాన్స్ కార్పొరేషన్‌కు 800 కోట్లు కేటాయించారు.

బడ్జెట్ పేజీల్లో వాడిన ప్రతీకాత్మక చిత్రాలన్నీ AIతో రూపొందించినవి.

మహిళా శక్తికి

ఆర్థిక శక్తి

వివిధ మంత్రిత్వశాఖలు, పథకాల కింద బాలికలు, మహిళల కోసం రూ.3 లక్షల కోట్లు కేటాయింపు



న్యూఢిల్లీ: దేశంలో మహిళల అభివృద్ధిని ప్రోత్సహించేందుకు 2024–25 బడ్జెట్‌లో పెద్దపీట వేసినట్లు కేంద్రం తెలిపింది. వివిధ మంత్రిత్వశాఖలు, పథకాల కింద బాలికలు, మహిళల కోసం రూ. 3 లక్షల కోట్లకుపైగా కేటాయింపులు చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. దేశ ఆర్థికాభివృద్ధిలో మహిళలు పోషిస్తున్న పాత్రను మరింత పెంచాలన్న ప్రభుత్వ చిత్తశుద్ధికి ఈ కేటాయింపులే నిదర్శనమన్నారు. ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో ఉద్యోగాల్లో చేరేలా ప్రోత్సహించేందుకు దేశంలో మహిళా హాస్టళ్లను ఏర్పాటు చేస్తామని నిర్మలా సీతారామన్ తెలిపారు. పనిచేసే తల్లులకు ఆలంబనగా ఉండేందుకు పని ప్రదేశాల్లో శిశు సంరక్షణ కేంద్రాలను నిర్మిస్తామన్నారు. ఈ విషయంలో పరిశ్రమల సహకారం తీసుకుంటామని వివరించారు. మహిళలకు ప్రత్యేకంగా నైపుణ్య శిక్షణ, స్వయం సహాయక బృందాలకు మార్కెట్ అవకాశాలు లభించేలా చూస్తామని నిర్మలా సీతారామన్ చెప్పారు.

..: పెరిగిన మహిళా ఉద్యోగులు :..

దేశంలో మహిళా ఉద్యోగుల సంఖ్య పెరిగిందని కేంద్రం తెలిపింది. ఈ ఏడాది మే నాటికి కొత్తగా 2.4 లక్షల మంది మహిళలు ఉద్యోగాల్లో చేరారని చెప్పింది. ఇది గతేడాది గణాంకాలతో పోలిస్తే 12.1% అధికమని వివరించింది. అలాగే 2024 ఆర్థిక సంవత్సర రెండో త్రైమాసికంలో మహిళా కార్మికశక్తి 24 శాతానికి పెరిగినట్లు కేంద్రం వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే మొత్తంమీద 17.2% మహిళా ఉద్యోగులు పెరిగారని.. సమ్మిళిత కార్మికశక్తి దిశగా ఇది సానుకూల పరిణామమని పేర్కొంది.

స్త్రీ, శిశు సంక్షేమానికి కేటాయింపులు ఇలా..

స్త్రీ, శిశు సంక్షేమానికి రూ. 26,092 కోట్లు కేటాయించింది. ఇది గతేడాది సవరించిన అంచనాలు రూ. 25,448 కోట్ల కంటే 2.5 శాతం అధికం.

శిశు సంరక్షణ సేవలు, సంక్షేమానికి ఉద్దేశించిన మిషన్ వాత్సల్య కార్యక్రమానికి గతేడాది తరహాలోనే రూ. 1,472 కోట్లు.

చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ఉద్దేశించిన సాక్షం అంగన్‌వాడీ, పోషణ్ 2.0 పథకాలకు అత్యధికంగా రూ. 21,200 కోట్లు

సంబాల్, సామర్థ్య ఉప పథకాలతో కూడిన మిషన్ శక్తి పథకానికి రూ. 3,145 కోట్లు. ఇందులో బేటీ బచావో.. బేటీ పఢావో లాంటి పథకాలతో కూడిన సంబాల్ పథకానికి రూ. 629 కోట్లు.

పిల్లల అభివృద్ధి, శిక్షణ, పరిశోధనా సంస్థ ఎన్ఐపీసీసీడీకి రూ. 88.87 కోట్లు, చిన్నారుల దత్తతను పర్యవేక్షించే సీఏఆర్ఏ (కారా)కు రూ. 11.40 కోట్లు.

మహిళా భద్రతను పెంచేందుకు ఉద్దేశించిన నిర్భయా ఫండ్‌కు రూ. 500 కోట్లు.

ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ యూనిసెఫ్‌కు 5.60 కోట్లు.

కేటాయింపులు హర్షణీయం

'ఏ దేశానికైనా మహిళలే వెన్నెముక. దేశ సుస్థిరాభివృద్ధికి మహిళా సాధికారత, భాగస్వామ్యం కీలకం. కేంద్ర బడ్జెట్‌లో మహిళలకు రూ.3 లక్షల కోట్లకుపైగా కేటాయించడం ఈ వాస్తవాన్ని ప్రతిబింబిస్తోంది. మహిళా హాస్టళ్లు, శిశుసంరక్షణ కేంద్రాల ఏర్పాటు, అతివలకు నైపుణ్య శిక్షణ లాంటి ప్రతిపాదనలు హర్షణీయం.



రేఖా శర్మ
జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్



బిహార్‌కు నిధుల వరద

రహదారులకు రూ.26,000 కోట్లు
వరద విపత్తుల నివారణకు రూ.11,500 కోట్లు
విద్యుత్ ప్రాజెక్టులకు రూ.21,400 కోట్లు

కేంద్ర ప్రభుత్వం 2024–25 బడ్జెట్‌లో బిహార్‌కు పెద్దపీట వేసింది. రాష్ట్రానికి నిధుల కేటాయింపులో ఉదారంగా వ్యవహరించింది. రహదారులు, నూతన ఎయిర్‌పోర్టులు, క్రీడా సదుపాయాలు, విద్యుత్ ప్రాజెక్టులు, వరద విపత్తుల నివారణకు మల్టిలేటరల్ డెవలప్‌మెంట్ బ్యాంకుల ద్వారా రూ.వేల కోట్ల సాయం అందజేయనున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. పాట్నా–పూర్ణియా ఎక్స్‌ప్రెస్ రహదారి, బక్సర్–భాగల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రహదారితోపాటు బక్సర్‌లో రెండు వరుసల వారధి నిర్మాణానికి రూ.26,000 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రంలో కొత్తగా ఎయిర్‌పోర్టులు, మెడికల్ కాలేజీల నిర్మాణంతోపాటు క్రీడా సదుపాయాలు కల్పించబోతున్నట్లు పేర్కొన్నారు. బిహార్‌లో తరచుగా వరదలు సంభవిస్తుండడంతో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతోందని అన్నారు. వరద విపత్తులను ఎదుర్కోవడానికి రూ.11,500 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. బిహార్‌లో సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన ఎన్నో ప్రాచీన కట్టడాలు ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. గయలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు సహకరిస్తామని చెప్పారు. నలంద పట్టణాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి తమ సహకారం ఉంటుందని తెలిపారు. బిహార్‌లోని పిర్‌పైంతీలో 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌తోపాటు ఇతర విద్యుత్ ప్రాజెక్టులకు రూ.21,400 కోట్లు అందజేయనున్నట్లు నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.




ముద్ర రుణాల పరిమితి రెట్టింపు

దేశంలో చిన్న వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు కేంద్రం తాజా బడ్జెట్‌లో చర్యలు చేపట్టింది. వారికి అందిస్తున్న ముద్ర రుణాల పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచింది. తరుణ్ విభాగం కింద గతంలో రూ. 10 లక్షల దాకా ముద్ర రుణాలు పొంది సకాలంలో తిరిగి చెల్లించిన వ్యాపారవేత్తలకు వాటిని అందించనుంది. ఈ మేరకు బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ప్రధానమంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై)ను ప్రధాని మోదీ 2015 ఏప్రిల్ 8న ప్రారంభించారు. ఆదాయం పెంచే వ్యాపారాలు నిర్వహించే చిన్న వ్యాపారవేత్తలు ఎటువంటి పూచీకత్తు సమర్పించాల్సిన అవసరం లేకుండానే రూ. 10 లక్షల వరకు రుణాలు మంజూరు చేసేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఇందులో భాగంగా శిశు (రూ. 50 వేల దాకా), కిశోర్ (రూ. 50 వేల నుంచి రూ. 5 లక్షల దాకా), తరుణ్ (రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల దాకా) విభాగాల కింద బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు చిన్న వ్యాపారవేత్తలకు రుణాలు అందిస్తున్నాయి.



రాయితీలకు కోతలు

రాయితీల భారాన్ని తగ్గించుకొనే దిశగా కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఆహారం, ఎరువులు, ఇంధనంపై ఇస్తున్న రాయితీల్లో 7.8 శాతం కోత విధిస్తూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2024–25 బడ్జెట్ ప్రవేశపెట్టారు. రాయితీల కోసం గత ఆర్థిక సంవత్సరంలో రూ.4,13,466 కోట్లు కేటాయించగా, తాజా బడ్జెట్‌లో కేటాయింపులను రూ.3,81,175 కోట్లకు పరిమితం చేశారు. ఆహార రాయితీ కోసం రూ.2,05,250 కోట్లు కేటాయించారు. ప్రభుత్వం సేకరించే ఆహార ధాన్యాల వ్యయానికి, జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ప్రజలకు విక్రయించే ఆహార ధాన్యాలకు ఖర్చే చేసే నిధులకు మధ్య వ్యత్యాసాన్ని భర్తీ చేయడంతోపాటు ఇతర సంక్షేమ పథకాల కోసం ఈ నిధులు ఖర్చు చేస్తారు. ఆహార భద్రతా చట్టంతో దాదాపు 80 కోట్ల మందికి ప్రభుత్వం ఆహార ధాన్యాలు సరఫరా చేస్తోంది. ఎరువుల రాయితీకి గత బడ్జెట్‌లో 1,88,894 కోట్లు ఇవ్వగా, ఈసారి రూ.1,64,000 కోట్ల మాత్రమే విదిల్చారు. వంట గ్యాస్ రాయితీలోనూ కోత వేశారు. ఈ రాయితీకి బడ్జెట్‌లో నిధుల కేటాయింపును రూ.12,240 కోట్ల నుంచి రూ.11,925 కోట్లకు కుదించారు. సబ్సిడీల భారం ప్రభుత్వంపై తగ్గించుకుంటే అంతిమంగా ఆ భారాన్ని ప్రజలే భరించాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



జనగణనకు జనగణమన

ఎంతో కీలకమైన జనగణన కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో కేవలం రూ.1,309.46 కోట్లు మాత్రమే కేటాయించింది. 2021- సెన్సెస్ కార్యక్రమంకోసం రూ.8,754.23 కోట్లు, అలాగే జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్‌పీఆర్)ను అప్‌డేట్ చేయడానికి మరో రూ.3,941.35 కోట్ల నిధుల కేటాయింపుకోసం ప్రతిపాదనలను 2019 డిసెంబర్‌లో కేంద్ర కేబినెట్ ఆమోదించింది. 2020 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు జరగాల్సిన ఈ కార్యక్రమం కోవిడ్ కారణంగా వాయిదాపడింది. కాగా, 2021–22లో ఈ కార్యక్రమానికి రూ.3,768 కేటాయించగా, 2023–24 సంవత్సరం బడ్జెట్‌లో రూ.578.29 కోట్లే కేటాయించారు. ఇప్పుడు కూడా నామమాత్రంగా రూ.1,309.46 కోట్లు మాత్రమే కేటాయించడంతో ప్రస్తుతానికి దేశవ్యాప్తంగా జనగణన లేనట్టేనని తెలుస్తోంది. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరిగిన నేపథ్యంలో 2024 సంవత్సరంలో జనగణన కార్యక్రమాన్ని చేపట్టే అవకాశం లేదని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. జనగణన, ఎన్‌పీఆర్ కార్యక్రమాన్ని నిర్వహించాలంటే ప్రభుత్వానికి రూ.12వేల కోట్లకుపైగా ఖర్చవుతుందని ఆ వర్గాలు చెపుతున్నాయి. ఎప్పుడు నిర్వహించినా.. ఈ కార్యక్రమాన్ని తొలిసారిగా డిజిటల్ పద్ధతిలో చేపట్టనున్నారు. ఎన్యూమరేటర్లకు బదులుగా ప్రజలే తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

పి. చిదంబరం
కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి




దేశంలో రెండు ఆదాయ పన్ను విధానాలను అమలు చేయడం ఓ చెత్త ఆలోచన. ఇది ట్యాక్స్ ఆర్బిట్రేషన్‌కు దారితీస్తుంది. అలాగే ప్రజలు ఏ పన్ను విధానాన్ని ఎంపిక చేసుకోవాలో తేల్చుకోలేక గందరగోళప రుస్తుంది. కొత్త పన్ను విధానాన్ని ప్రవేశపెట్టాలనుకుంటే ఫలానా సంవత్సరం నుంచి దాన్ని ప్రవేశపెడతామని ముందుగానే ప్రకటించాలి. అంతేగానీ ఇలా రెండు విధానాలను అమలు చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు.



‘పన్ను’ రాల్చే దేశాలివే..


మన దేశంలో ఆదాయ పన్ను 42% వరకు, కార్పొరేట్ పన్ను 30% వరకు ఉంది. కానీ ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో పన్నులు అధిక స్థాయిలో ఉన్నాయి. ఆదాయ పన్ను నుంచి కార్పొరేట్ ట్యాక్స్, సేల్స్ ట్యాక్స్ వంటివి పెద్ద మొత్తంలో ఉన్న దేశాలేవో చూద్దామా..







కొత్తకు జైజై.. పాతకు బైబై..



కొత్త పన్నుల విధానం ఎంచుకుంటేనే ఊరట..

- స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంపు
- ఈ పెంపు కేవలం కొత్త పన్నుల విధానం ఎంచుకున్న వారికే అంటూ మెలిక
- ఇదే సమయంలో కొత్త పన్నుల విధానం శ్లాబుల్లో స్వల్ప మార్పులు
- 5 శాతం పన్ను పరిధిని ఆరు నుంచి ఏడు లక్షలకు పెంపు
- 10 శాతం పన్ను పరిధిని తొమ్మిది నుంచి పది లక్షలకు పెంపు
- ఫ్యామిలీ పెన్షన్‌దారుల స్టాండర్డ్ డిడక్షన్ రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంపు
- ఈ మార్పుల వల్ల ప్రతీ పన్ను చెల్లింపు దారునికి రూ.17,500 ప్రయోజనం అంటూ ఆర్థిక మంత్రి ప్రకటన
- పాత పన్నుల విధానం ఎంచుకున్న వారికి ఎటువంటి ప్రోత్సాహకాలు ఇవ్వని మంత్రి
- ఇంటి అమ్మకం విలువ రూ.50 లక్షలు దాటితే టీడీఎస్ కట్టాల్సిందే

స్థిరాస్తి విలువ రూ.50 లక్షలు దాటితే టీడీఎస్..

ఇక నుంచి రూ.50 లక్షలు దాటిన స్థిరాస్తి విలువను విక్రయిస్తే ఒక శాతం టీడీఎస్ చెల్లించాల్సి ఉంటుందని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. ఆదాయపన్ను చట్టం సెక్షన్ 194ఐఏ సెక్షన్ ప్రకారం స్థిరాస్తి విలువ రూ.50 లక్షలు దాటితే ఒక శాతం టీడీఎస్ వసూలు చేయాలి. స్థిరాస్తి విలువను ఒకరికంటే ఎక్కువ మందికి అమ్మినా మొత్తం విలువను పరిగణనలోకి తీసుకొని టీడీఎస్‌ను వసూలు చేస్తారని ఆమె స్పష్టం చేశారు. కానీ ఈ టీడీఎస్ నుంచి వ్యవసాయ భూములకు మినహాయింపు ఇచ్చారు.

సాక్షి, అమరావతి

- ఉద్యోగస్తులు పాత పన్నుల విధానం కాకుండా కొత్త పన్నుల విధానం ప్రోత్సహించే విధంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తుత బడ్జెట్‌లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆదాయపన్ను రిటర్నులు దాఖలును సులభతరం చేస్తున్నామన్న నెపంతో పొదుపుపై ఎటువంటి పన్ను ప్రయోజనాలు ఉండని కొత్త పన్నుల విధానం ఎంచుకునే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. పాత ఆదాయ పన్ను విధానంలో బీమా ప్రీమియం, గృహరుణం, పిల్లల చదువులు, పోస్టాఫీసు వంటి వివిధ సేవింగ్ పథకాలకు చేసే వ్యయాలను చూపించడం ద్వారా పన్ను భారం తగ్గించుకోవచ్చు. కానీ 2020లో తక్కువ పన్నురేట్లతో వివిధ శ్లాబులను కొత్త పన్నుల విధానం ప్రవేశపెట్టింది. కొత్త పన్నుల విధానం ఎంచుకున్న వారు పొదుపు, వ్యయాలపై ఎటువంటి మినహాయింపులు వర్తించవు. మొత్తం ఆదాయం ఎంత అయితే అంత పన్ను చెల్లించాల్సిందే. కొత్త పన్నుల విధానం సులభతరంగా ఉండటంతో పన్ను చెల్లింపుదారులు ఈ విధానంవైపే మొగ్గు చూపుతున్నారని, 2023–24లో ఆర్థిక సంవత్సరంలో మూడింట రెండొంతుల మంది కొత్త పన్నుల విధానంలో రిటర్నులు దాఖలు చేసినట్లు సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 8.61 కోట్ల మంది రిటర్నులు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని కొత్త పన్నుల విధానం ఎంచుకున్న వారికే ఈ మార్పులు వర్తిస్తాయని ఆమె స్పష్టం చేశారు. రానున్న కాలంలో అందరూ కొత్త పన్నుల విధానం ఎంచుకోవాలన్న ఉద్దేశ్యంతో పాత పన్నుల విధానంకు పన్ను మినహాయింపులను తగ్గిస్తూ కొత్త విధానానికి ప్రయోజనాలను పెంచుతున్నారని ట్యాక్స్ నిపుణులు పేర్కొంటున్నారు. కొత్తగా మార్పులు చేసిన తర్వాత పది లక్షల లోపు పన్ను ఆదాయం ఉన్న వారికి కొత్త పన్నుల విధానం ఎంచుకుంటేనే ప్రయోజనంగా ఉంటుందంటున్నారు.

స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలకు పెంపు

- కొత్త పన్ను విధానంలో ఉద్యోగులకు ఊరటనిస్తూ స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని 50% పెంచుతూ సీతారామన్ ప్రకటించారు. రూ.50 వేలుగా ఉన్న స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75వేలకు పెంచారు. ఫ్యామిలీ పెన్షన్‌దారుల స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ. 15వేల నుంచి రూ.25 వేలకు పెంచారు. కొత్త పన్నుల విధానంలో 10% పన్నులోపు శ్లాబుల్లో స్వల్ప మార్పుల ను ప్రతిపాదించింది. కొత్త పన్నుల విధానంలో 3 లక్షల ఆదాయం వరకు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. గతంలో 5% పన్ను శ్లాబు పరిధి రూ.3- 6 లక్షలుగా ఉంటే ఇప్పుడు దాన్ని రూ.3-7 లక్షలకు, గతంలో రూ.6-9 లక్షలుగా 10% పన్ను పరిధిని రూ.7-10 లక్షలకు పెంచారు. ఈ మార్పుల వల్ల ప్రతీ పన్ను చెల్లింపుదారునికి రూ.17,500 ప్రయోజనం లభిస్తుంది.

2024-25 సంవత్సరానికి ఆదాయ పన్ను శ్లాబులు..

కొత్త పన్నుల విధానంలో 2023-24 ఆదాయ పన్ను శ్లాబులు

ఆదాయ పరిమితి	పన్నురేటు
0-3 లక్షలు	లేదు
3-6 లక్షలు	5%
6-9 లక్షలు	10%
9-12 లక్షలు	15%
12-15 లక్షలు	20%
15 లక్షలుపైన	30%

కొత్త పన్నుల విధానంలో 2024-25 ఆదాయ పన్ను శ్లాబులు

ఆదాయ పరిమితి	పన్నురేటు
0-3 లక్షలు	లేదు
3-7 లక్షలు	5%
7-10 లక్షలు	10%
10-12 లక్షలు	15%
12-15 లక్షలు	20%
15 లక్షలుపైన	30%

పాత పన్నుల విధానంలో ట్యాక్స్ శ్లాబులు

60 ఏళ్ల లోపు వయస్సు ఉంటే..

ఆదాయ పరిమితి	పన్ను రేటు
0-2.5 లక్షలు	లేదు
2.5 - 5 లక్షలు	5%
5-10 లక్షలు	20%
10 లక్షలు దాటితే	30%

60 నుంచి 80 ఏళ్లు..

ఆదాయ పరిమితి	పన్ను రేటు
0-3 లక్షలు	లేదు
3 - 5 లక్షలు	5%
5-10 లక్షలు	20%
10 లక్షలు దాటితే	30%


80 ఏళ్లు దాటితే..

ఆదాయ పరిమితి	పన్ను రేటు
0-5 లక్షలు	లేదు
5-10 లక్షలు	20%
10 లక్షలు పైన	30%



యూపీఎస్సీకి రూ. 425.71 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)కు కేంద్రం 2024–25 బడ్జెట్‌లో రూ. 425.71 కోట్ల మేర కేటాయింపులు చేసింది. అందులో రూ. 216.72 కోట్లను వివిధ పరీక్షల నిర్వహణకు కేటాయించగా రూ. 208.99 కోట్లను యూపీఎస్సీ సిబ్బంది జీతాలు, పరిపాలనా ఖర్చులు, చైర్మన్ సహా ఇతర సభ్యుల అలవెన్సులు తదితరాల కోసం కేటాయించింది. 2023–24 బడ్జెట్‌లో కేంద్రం యూపీఎస్సీకి రూ. 426 కోట్ల మేర నిధులు కేటాయించింది. మరోవైపు అవినీతి వ్యతిరేక అంబుడ్స్‌మన్ లోక్‌పాల్‌కు ఈ బడ్జెట్‌లో రూ. 33.32 కోట్లు, కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ)కు రూ. 51.31 కోట్ల మేర కేటాయింపులు చేసింది.



గిరిజనుల కోసం కొత్త పథకం..

జన్‌జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ పేరుతో ప్రకటించిన కేంద్రం

గిరిజన శాఖకు రూ.13,000 కోట్లు కేటాయింపు

న్యూఢిల్లీ: దేశంలోని గిరిజనుల సామాజిక ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రధానమంత్రి జన్‌జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ పథకాన్ని ప్రకటించింది. అలాగే సంబంధిత శాఖకు బడ్జెట్‌లో గత ఏడాదికన్నా 70 శాతం నిధులను పెంచింది. ఈ పథకంతో దేశంలోని 63వేల గిరిజన గ్రామాల్లోని 5 కోట్ల జనాభాకు ప్రయోజనం చేకూరనుంది. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు గత ఆర్థిక సంవత్సరంలో రూ. 7,605 కోట్లు కేటాయించగా, ఈసారి బడ్జెట్‌లో రూ.13,000 కోట్లకు పెంచడం విశేషం. ఇందులో రూ. 6,399 కోట్లను మారుమూల గ్రామాల్లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో మెరుగైన వసతులను కల్పించేందుకు కేటాయించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గాలు, మైనారిటీలకు మాత్రం గత ఏడాది రూ. 2,959.43 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.6,611.69 కోట్లు కేటాయించడం విశేషం. అయితే, ఉన్నత విద్యలో ఎస్టీ విద్యార్థులకు ఇచ్చే జాతీయ ఫెలోషిప్, స్కాలర్‌షిప్‌ను మాత్రం గత ఏడాది (రూ.230 కోట్లు) కన్నా తగ్గించి రూ. 165 కోట్లు మాత్రమే ఇచ్చారు.



కేంద్ర మంత్రుల జీతాలు సహా తదితరాలకు రూ. 1,249 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రుల జీతాలతోపాటు కేంద్ర సచివాలయం, ప్రధాని కార్యాలయ నిర్వహణ వ్యయం, దేశానికి విచ్చేసే అతిథుల బస, వినోద ఖర్చుల కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 1,248.91 కోట్లు కేటాయించింది. 2023–24లో కేటాయించిన రూ. 1,803.01 కోట్లతో పోలిస్తే ఈసారి కేటాయింపుల్లో కాస్త కోత పెట్టింది. ఇందులో ప్రధానంగా కేంద్ర మంత్రుల ఖర్చుల కింద రూ. 828.36 కోట్ల మేర కేటాయింపులు చేసింది. ఈ మొత్తాన్ని మంత్రుల జీతాలు, అలవెన్సులు, ప్రయాణాలకు కేంద్రం ఖర్చు చేయనుంది. అలాగే నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్‌కు రూ. 202.10 కోట్లను కేంద్రం కేటాయించింది. ఇక కేబినెట్ సెక్రటేరియట్‌కు రూ. 75.24 కోట్లు, ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయానికి రూ. 72.11 కోట్లు, ప్రధాని కార్యాలయానికి రూ. 65.30 కోట్లు, అతిథుల బస, వినోద ఖర్చులకు రూ. 4 కోట్లు కేటాయించింది.

‘అనుసంధాన్’ ఫౌండేషన్ కార్యకలాపాలు షురూ..

ప్రకటించిన మంత్రి నిర్మల



న్యూఢిల్లీ: దేశంలో పరిశోధన, ప్రోటోటైప్‌ల అభివృద్ధిని ఉరకలెత్తించే లక్ష్యంతో కేంద్రం గతంలో ప్రకటించిన అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ కార్యకలాపాలు మొదలుకాబోతున్నాయని మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. విశ్వవిద్యాలయాలు, కళాశాలలను పరిశోధన బాటలో మరింతగా ముందుకుసాగేలా చేసి విద్యార్థుల విషయంలో బోధనకు, పరిశోధనకు మధ్య ఉన్న అగాధాలను పూడ్చి ప్రాథమిక స్థాయి పరిశోధన, నమూనాల రూపకల్పనను విస్తృతం చేసేందుకు మోదీ సర్కార్ ఈ ఏఎన్ఆర్ ఫండ్‌ను స్థాపించడం తెల్సిందే. మూలనిధి కింద రూ.1 లక్ష కోట్లు సమీకరిస్తామని మధ్యంతర బడ్జెట్‌లోనే నిర్మల ప్రకటించారు.

సముద్ర గర్భంలో పరిశోధనకు..


- సముద్ర గర్భంలో సహజవనరుల శోధన, పరిశోధన కోసం సముద్రంలో 6,000 మీటర్లలోతుకు చేపట్టే మానవసహిత ‘సముద్రయాన్’ ప్రయోగం కోసం బడ్జెట్ కేటాయించారు. డీప్ ఓషన్ మిషన్ కోసం రూ.600 కోట్లు కేటాయించారు. రూ.600 కోట్లతో కలుపుకుని భూ విజ్ఞానశాస్త్రాల మంత్రిత్వ శాఖకు రూ.3,064.80 కోట్లు కేటాయించారు. గత ఏడాదితో పోలిస్తే శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనా శాఖకు రూ.6,323.41 కోట్లు కేటాయించారు. ఇందులో సీఎస్ఐఆర్ కోసం రూ.6,265.80 కోట్లను కేటాయించారు. 2023–24 బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి సైన్స్, టెక్నాలజీ శాఖకు రూ.8,029.01 కోట్లు కేటాయించారు. బయోటెక్నాలజీ విభాగానికి రూ.2,275.70 కోట్లు కేటాయించారు.



ప్రిస్క్రిప్షన్ బాగు.. బాగు..

హెల్త్‌కు 90,958 కోట్లు	గత ఏడాది కన్నా 12.96 % పెరిగిన కేటాయింపులు	కేన్సర్ చికిత్సకు వాడే 3 మందులపై కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు

న్యూఢిల్లీ: కేంద్ర ఆరోగ్యశాఖకు 2024–25 బడ్జెట్‌లో రూ.90,958.63 కోట్లను కేటాయించారు. ఇది 2023–24 సవరించిన అంచనాల కంటే (రూ.80,517.62 కోట్లు) 12.96 శాతం ఎక్కువ కావడం గమనార్హం. అలాగే ఈ బడ్జెట్‌లో కేన్సర్ చికిత్సకు ఉపయోగించే మూడు కీలక మందుల (ట్రాస్టుజుమబ్ డెరక్స్‌టెకన్, ఒసిమెర్టినిబ్, దుర్వాలుమాబ్)పై కస్టమ్స్ డ్యూటీని పూర్తిగా మినహాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ‘కేన్సర్ రోగులకు ఉపశమనం ఇచ్చేందుకు మరో మూడు మందులపై కస్టమ్స్ డ్యూటీని మినహాయిస్తున్నాం. అలాగే ఎక్స్‌రే ట్యూబ్స్, మెడికల్ ఎక్స్‌రే మిషన్లలో వాడే ఫ్లాట్ ప్యానెల్ డిటెక్టర్లపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ (బీసీడీ)లో మార్పులు చేస్తున్నాం’ అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఆయుష్ మంత్రిత్వ శాఖకు గత ఏడాది రూ.3వేల కోట్లు ఇవ్వగా, ఈసారి 3,712.49కోట్లకు పెంచారు. ఆరోగ్య శాఖకు కేటాయించిన మొత్తం రూ.90,958.63 కోట్లలో రూ.87,656.90 కోట్లను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు, ఆరోగ్య పరిశోధన విభాగానికి రూ.3,301.73 కోట్లను కేటాయించారు. గత ఏడాది ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు రూ.77,624.79 కోట్లు ఇవ్వగా ఈసారి రూ.100కోట్ల మేర పెరగడం విశేషం. కేంద్ర ప్రాయోజిత పథకాలైన జాతీయ ఆరోగ్య మిషన్‌కు కేటాయింపులు గత ఏడాది రూ.31,550.87 కోట్లు ఉండగా, ఈసారి అది 36,000 కోట్లకు పెరిగింది. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై)కి కేటాయింపులు రూ. 6,800 కోట్ల నుంచి రూ.7,300 కోట్లకు పెరగడం గమనార్హం. జాతీయ టెలి మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్‌కు కేటాయింపులను రూ.65 కోట్ల నుంచి రూ.90 కోట్లకు పెంచారు. నేషనల్ డిజిటల్ హెల్త్ మిషన్‌కు గత ఏడాది మాదిరే రూ.200 కోట్లు కేటాయించారు. స్వయం ప్రతిపత్తి విభాగాలకు గత ఏడాది (రూ.17,250.90) కేటాయించిన దాని కంటే స్వల్పంగా పెంచుతూ రూ.18,013.62 కోట్లు కేటాయించారు. ఢిల్లీ ఎయిమ్స్‌కు గత ఏడాది రూ.4,278 కోట్లు కేటాయించగా ఈసారి బడ్జెట్‌లో రూ.4,523 కోట్లు ఇచ్చారు. భారత మెడికల్ కౌన్సిల్‌కు గత ఏడాది రూ.2295.12 కోట్ల ఇవ్వగా ఈసారి రూ.2,732.13 కోట్లు కేటాయించారు.



మూడు కేన్సర్ మందులు 20% మేర తగ్గుతాయి

కేన్సర్ చికిత్సలో వాడే మూడు రకాల మందులపై కస్టమ్స్ సుంకాన్ని మినహాయించడంపై ఆరోగ్యరంగ నిపుణులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సుంకం తగ్గింపు వల్ల మందుల ధరలు 10–20 శాతం మేర తగ్గుతాయని ఢిల్లీలోని సీకే బిర్లా ఆస్పత్రికి చెందిన సర్జికల్ ఆంకాలజీ డైరెక్టర్ డాక్టర్ మన్‌దీప్ సింగ్ మల్హోత్రా చెప్పారు. అయితే, ఆరోగ్య సంరక్షణ వ్యయాన్ని జీడీపీలో 2.5 శాతానికి పెంచాలన్న సుదీర్ఘ డిమాండ్‌ను ఈ బడ్జెట్ కూడా నెరవేర్చకపోవడంపై నిపుణులు పెదవి విరుస్తున్నారు.

గ్రామాలకు గృహయోగం

గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మౌలిక వసతులకు రూ.2.66 లక్షల కోట్లు

‘పీఎంఏవై - జీ’పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో రెండు కోట్ల ఇళ్ల నిర్మాణం

‘ఉపాధి’కి యథాతథం

గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మౌలిక వసతుల కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2.66 లక్షల కోట్లు కేటాయించింది. పీఎం ఆవాస్ యోజన పథకం కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మూడు కోట్ల గృహాలను అదనంగా నిర్మించనున్నట్లు ఆర్థిక మంత్రి సీతారామన్ తెలిపారు. అన్ని వాతావరణ పరిస్థితుల్లో 25,000 మారుమూల ఆవాసాలకు




రహదారి సదుపాయం కల్పించేందుకు ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) పథకం 4వ దశను చేపడుతున్నట్లు ప్రకటించారు. ఫ్లాగ్ షిప్ పథకం కింద దీనికి బడ్జెట్‌లో రూ.12,000 కోట్లు కేటాయించారు. గ్రామీణ రంగం వృద్ధి చెందేందుకు ఈ బడ్జెట్ దోహదం చేస్తుందని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ స్వాగతించారు. పేదలకు ఇళ్లను సమకూర్చే లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాల్లో రెండు కోట్ల గృహాలను నిర్మించనున్నట్లు చెప్పారు. ‘జాతీయ గ్రామీణ జీవనోపాధి కల్పన పథకం కింద మహిళా సాధికారతకు బాటలు వేస్తాం. మూడు కోట్ల మంది అక్కచెల్లెమ్మలు (లఖ్‌పతి దీదీ) ఏటా రూ.లక్ష చొప్పున ఆదాయాన్ని పొందేలా ఈ బడ్జెట్ దోహదం చేస్తుంది’అని చౌహాన్ పేర్కొన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ నైపుణ్యాభివృద్ధి పథకం కింద గ్రామీణ యువతకు నైపుణ్యాల పెంపుపై శిక్షణ అందిస్తామన్నారు. ‘పీఎం జన్‌జాతి ఉన్నత్ గ్రామ్ అభియాన్’పథకం ద్వారా 63,000 గ్రామాలలో ఐదు కోట్ల మంది గిరిజనులకు మేలు జరుగుతుందని తెలిపారు. గిరిజనుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేలా ఈ పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు.

- గ్రామీణాభివృద్ధికి తాజా బడ్జెట్‌లో రూ.1,77,566.19 కోట్లు కేటాయించారు. గతేడాది కేటాయింపులు రూ.1,57,545 కోట్లతో పోలిస్తే ఇది 12 శాతం అదనం. మధ్యలో సవరించిన అంచనాలు రూ.1,71,069.46 కోట్లతో పోలిస్తే ఇది 3.7 శాతం అదనం.
- ఉపాధిహామీ పథకానికి గతేడాదితో పోలిస్తే 43 శాతం అదనంగా నిధులిచ్చి బడ్జెట్‌లో రూ.86,000 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో ఉపాధిహామీకి రూ.60,000 కోట్లు కేటాయించారు. అయితే గత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాల్లో రూ.86,000 కోట్లు వ్యయం చేశారు. తాజా బడ్జెట్‌లోనూ అంతే మొత్తం ఉపాధికి కేటాయించడం గమనార్హం. 2022–23లో ఉపాధి హామీకి కేంద్రం రూ.73,000 కోట్లు కేటాయించగా బడ్జెట్ పత్రాల ప్రకారం వాస్తవ వ్యయం రూ.90,805 కోట్లకు చేరుకుంది.
- ప్రధానమంత్రి ఆవాస్ యోజన – గ్రామీణ (పీఎంఏవై – జీ) పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో రెండు కోట్ల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించగా తాజా బడ్జెట్‌లో రూ.54,500.14 కోట్లు కేటాయించారు. గతేడాది రూ.54,487 కోట్లు కేటాయించగా సవరించిన అంచనాలు మాత్రం రూ.32,000 కోట్లుగా ఉన్నాయి.
- జాతీయ జీవనోపాధి కార్యక్రమం ‘అజీవిక’కోసం బడ్జెట్‌లో రూ.15,047 కోట్లు కేటాయించారు. గతేడాదితో పోలిస్తే 6 శాతం అదనంగా నిధులు దక్కాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.14,129.17 కోట్లు కేటాయించగా సవరించిన అంచనాలు కూడా యథాతథంగా ఉన్నాయి.



పర్యాటకానికి.. 2,479 కోట్లు

పర్యాటక అభివృద్ధికి బడ్జెట్‌లో రూ. 2,479.62 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. గత బడ్జెట్‌లో ఈ కేటాయింపులు రూ. 1,692.10 కోట్లుగా ఉంది. బిహార్లోని విష్ణుపాద, మహాబోధి ఆలయాలను ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు. బడ్జెట్ ప్రవేశ పెట్టిన సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. గయలోని విష్ణుపాద ఆలయం, బోధ్ గయలోని మహాబోధి ఆలయాలకు ఆధ్యాత్మికంగా అత్యంత ప్రాముఖ్యత ఉందని, ఈ రెండు కారిడార్లను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేయడానికి సహకరిస్తామని చెప్పారు. అలాగే హిందువులు, బౌద్ధులు, జైన్లకు పవిత్రమైన రాజ్‌గిర్ అభివృద్ధితో పాటు నలంద యూనివర్సిటీ పునరుద్ధరణ, నలందను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి కూడా ఆమె నిధులు ప్రకటించారు. అత్యంత ప్రాచీనమైన హిందు ఆలయాల్లో ఒకటైన విష్ణుపాద ఆలయం గయలోని ఫల్గు నది ఒడ్డున ఉంది. ఇక బోధ్ గయలోని మహాబోధి ఆలయం యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు పొందింది.



దివ్యాంగుల సంక్షేమానికి 1,225 కోట్లు

దివ్యాంగుల సంక్షేమం కోసం కేంద్రం బడ్జెట్‌లో రూ.1,225.27 కోట్లు కేటాయించింది. గతేడాది ఈ రంగానికి రూ.1,225.01 కోట్ల కేటాయింపులు ఉండగా ఈ సారి దీనిని స్వల్పంగా 0.02 కోట్లమేర పెంచారు. దివ్యాంగుల సంక్షేమానికి కట్టు బడి ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. వీరి సంక్షేమానికి కేంద్రం అమలు చేస్తున్న వివిధ పథకాలకింద ఈ నిధులను వినియోగిస్తారు. దివ్యాంగులకు అవసరమయ్యే వివిధ పరికరాల కొను గోలుకు ఈ నిధుల నుంచి రూ.315కోట్లు ఖర్చు చేస్తారు. దీన్‌దయాళ్ దివ్యాంగుల పునరావాస పథకానికి గతంలో రూ.130 కోట్లు కేటాయించగా, ఈ సారి దానిని రూ.165 కోట్లకు పెంచారు. ఈ వర్గాల వారి విద్య కోసం ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ, కొంత మేర నిధులను తగ్గించారు. గతంలో ఉన్నత విద్య అభ్యసించే దివ్యాంగ విద్యార్థుల ఉపకార వేతనాల కోసం రూ.155 కోట్లు కేటాయించగా, ఈ సారి ఆ మొత్తాన్ని రూ.142.68 కోట్లకు తగ్గించారు. కాగా, దివ్యాంగుల క్రీడలకు ఇచ్చే మొత్తాన్ని బాగా తగ్గించారు. గతంలో రూ.76 కోట్లు ఉన్న కేటాయింపులను ఈ సారి రూ.25 కోట్లకు తగ్గించారు.

EXPERT COMMENT

డాక్టర్ సంగీతారెడ్డి
అపోలో జాయింట్ ఎండీ



ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను మెరుగుపరచాలన్న ప్రభుత్వ నిబద్ధతకు ఈ బడ్జెట్ నిదర్శనం. వైద్య ఎక్స్-రే యంత్రాల్లో ఉపయోగించే ఎక్స్-రే ట్యూబ్‌లు, ఫ్లాట్ ప్యానెల్ డిటెక్టర్లపై ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీ (బీసీడీ)లో మార్పులు చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. అలాగే మరో మూడు రకాల కేన్సర్ మందులపై కస్టమ్స్ డ్యూటీ మినహాయించడం కేన్సర్ చికిత్స వ్యయాలను తగ్గించడంలో గొప్ప ముందడుగు కానుంది. ఇది రోగులపై ఆర్థిక భారాన్ని తగ్గించడంలో దోహదపడుతుంది.



కొన్ని దేశాలు.. తొలి ట్రిలియన్ జీడీపీని సాధించిన సంవత్సరం

దేశం	సంవత్సరం
అమెరికా	1969
జపాన్	1978
జర్మనీ	1986
ఫ్రాన్స్	1988
యూకే	1990
ఇటలీ	1990
చైనా	1998
స్పెయిన్	2004
కెనడా	2004
బ్రెజిల్	2006
సౌత్ కొరియా	2006
ఇండియా	2007
రష్యా	2007
ఆస్ట్రేలియా	2008
ఇండోనేసియా	2017




నేషనల్ హైవేస్‌కు రూ.1.68 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: హైవేల బాధ్యతలు చూసుకునే జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కు ఈసారి కేంద్రం రూ.1.68 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించింది. ఎన్నికల ముందు నిర్మల ప్రకటించిన మధ్యంతర బడ్జెట్‌లోనూ ఇంతే మొత్తంలో కేటాయింపులు జరిగాయి. జాతీయరహదారుల రంగం కోసం 2024–25 బడ్జెట్‌లో రూ.2.78 లక్షల కోట్లు ఖర్చుచేయబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. 2023–24లో జాతీయరహదారులకు 2.70 లక్షల కోట్లు కేటాయించగా సవరించిన అంచనాలు రూ.2.76 లక్షల కోట్లకు పెరిగాయి.



న్యాయ శాఖకు రూ.1,000 కోట్లు

న్యూఢిల్లీ: న్యాయ శాఖకు రూ.1,000 కోట్లను బడ్జెట్‌లో ప్రత్యేకించారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్రాలు చేసిన ఖర్చును కేంద్రం రీయింబర్స్‌మెంట్ చేసేందుకు ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించారు. కొత్త ఓటర్ ఫొటో గుర్తింపు కార్డుల జారీకి రూ. 404 కోట్లు రీయింబర్స్ చేయనున్నారు. కొత్త ఈవీఎంల కొనుగోలు కోసం న్యాయశాఖకు రూ.34 కోట్లు కేటాయించారు. పాత ఈవీఎంలను ప్రోటోకాల్ ప్రకారం ధ్వంసం చేయడానికీ బడ్జెట్‌ను విడిగా కేటాయించారు. ఈవీఎంలను ఈసీఐఎల్, భారత్ ఎల్రక్టానిక్స్ సంస్థలు తయారుచేశాయి. ఎన్నికల కోసం 2023లో తయారుచేసిన ఒక్కో బ్యాలెట్ యూనిట్‌కు రూ.7,900, కంట్రోల్ యూనిట్‌కు రూ.9,800, వీవీప్యాట్ తయారీకి రూ.16,000 ఖర్చయింది.



జలవనరులకు రూ. 30 వేల కోట్లు

న్యూఢిల్లీ: జలవనరుల శాఖకు, నదుల అభివృద్ధికి, గంగా పునరుజ్జీవానికి ఈ బడ్జెట్‌లో రూ. 30,233.83 కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. గతేడాది బడ్జెట్‌లో ఈ కార్యక్రమాలకు రూ. 19,516.92 కోట్లు కేటాయించగా.. ప్రస్తుత బడ్జెట్‌లో దాని కంటే 55 శాతం అధికంగా నిధులిచ్చారు. జాతీయ గంగా ప్లాన్‌లో భాగంగా రూ. 3,345.70 కోట్లు కేటాయించి నది పునరుజ్జీవానికి తాము కట్టుబడ్డామని స్పష్టంగా పేర్కొన్నారు. అటల్ భూజల్ యోజన కార్యక్రమానికి రూ. 1,778 కోట్లు, ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన పథకానికి రూ. 9,339.37 కోట్లు, నేషనల్ రివర్ కన్జర్వేషన్ ప్లాన్‌కు రూ. 592.11 కోట్లు కేటాయించారు.



పురావస్తు శాఖకు రూ.1,274 కోట్లు

న్యూఢిల్లీ: ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్‌ఐ)కు కేటాయింపులు కాస్త పెరిగాయి. గత బడ్జెట్‌లో రూ.1,131.08 కోట్లు కేటాయించగా ఈసారి రూ.1,273.91 కోట్ల బడ్జెట్ ఇచ్చారు. పురావస్తు శాఖ దేశంలోని ప్రాచీన కట్టడాల పరిరక్షణ, సంరక్షణ బాధ్యతలను చూసుకుంటోంది. ప్రస్తుతం ఏఎస్‌ఐ పరిధిలో 3,697 ప్రాచీన, వారసత్వ కట్టడాలు, ప్రాంతాలు ఉన్నాయి. ఈనెల 21న మొదలై 31వ తేదీదాకా జరగనున్న 46వ ప్రపంచ వారసత్వ కమిటీ సదస్సుకు ప్రస్తుతం ఢిల్లీ ఆతిథ్యం వహిస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో వికాస్ (అభివృద్ధి) తోపాటు విరాసత్ (వారసత్వం)కు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి నిర్మల బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. బిహార్‌లోని గయలోని విష్ణుపాద ఆలయం కారిడార్, బుద్ధగయలోని మహాబోధి ఆలయాలను అత్యున్నత పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. పర్యాటక రంగం కోసం రూ.2,479.62 కోట్లు ఇచ్చారు.



- నిర్మల బడ్జెట్ ప్రసంగం 83 నిమిషాల పాటు సాగింది
- ఆమె బంగారు రంగు అంచుతో కూడిన తెల్లరంగు మైసూర్ సిల్క్ చీర ధరించారు
- సంప్రదాయ తరహాలో ఎర్ర రంగు బహీ ఖాతాలో తీసుకొచ్చిన ట్యాబ్లెట్ పీసీ సాయంతో బడ్జెట్‌ను సమర్పించారు
- వరుసగా ఏడోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టి మొరార్జీ దేశాయ్ రికార్డును అధిగమించారు
- ఆమె ప్రసంగం పొడవునా అధికార ఎన్డీఏ పక్ష సభ్యులు 71 సార్లు బల్లలు చరిచారు
- 'ఇది ఫక్తు ప్రభుత్వాన్ని కాపాడుకునే బడ్జెట్' అంటూ విపక్ష సభ్యులు పదేపదే నినాదాలు చేశారు
- '400 సీట్లకు మించి' అంటూ ప్రధాని మోదీ లోక్‌సభ ఎన్నికల నినాదాన్ని ప్రస్తావిస్తూ గేలి చేశారు
- బడ్జెట్‌లో అగ్నిపథ్ తదితర వివాదాస్పద పథకాల ప్రస్తావన లేదు..
- రైల్వే బడ్జెట్‌నూ ప్రస్తావించలేదు

నిరుద్యోగంపై చిరుద్యోగ బాణం

ఉపాధి కల్పనకు అగ్రతాంబూలం ● వ్యవసాయ రంగంపై భారం తగ్గింపు

2024-25 కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మల

2024-25 కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ఎన్డీఏ ప్రభుత్వంపై వరుసగా మూడోసారి నమ్మకముంచిన దేశ ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా బడ్జెట్ రూపుదిద్దుకుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలన్నీ నానా సవాళ్లతో సతమతం అవుతున్నా భారత్ మాత్రం తిరుగులేని వృద్ధిరేటుతో దూసుకుపోతోందని చెప్పుకొచ్చారు. ''ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్లో పేర్కొన్నట్టు మన దేశంలో ఉన్నది 'నాలుగే కులాలు'. అవి... పేదలు, మహిళలు, యువత, అన్నదాతలు. వారి అభ్యున్నతి కోసం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలు, మధ్యతరగతిపై బడ్జెట్లో ప్రధానంగా దృష్టి సారించాం'' అని వివరించారు. 4.1 కోట్ల పైచిలుకు యువతీయువకులకు వచ్చే ఐదేళ్లలో ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన నిమిత్తం 5 పథకాలతో కూడిన 'ప్రధానమంత్రి ప్యాకేజీ'ని ప్రకటించారు. 2047 నాటికి వికసిత భారత్ సాకారమే లక్ష్యంగా 'వ్యవసాయ రంగంలో మరింత ఉత్పాదకత, ఉపాధి–నైపుణ్యాభివృద్ధి, మానవ వనరుల అభివృద్ధి–సామాజిక న్యాయం, నిర్మాణ–సేవా రంగాలు, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక సదుపాయాలు, ఇన్నోవేషన్–రీసెర్చ్, సంస్కరణ'ల పేరిట ఎన్డీఏ ప్రభుత్వ 'తొమ్మిది ప్రాథమ్యాల'కు తెరతీశారు. దీన్ని రానున్న బడ్జెట్లలో మరింత ముందుకు తీసుకెళ్తామని ప్రకటించారు.

రైతు నుంచి యువత దాకా...

వ్యవసాయ రంగ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్లో పలు చర్యలు చేపట్టినట్టు నిర్మల వెల్లడించారు. ''సాగులో ఉత్పాదకతను పెంచేలా పరిశోధనలకు పెద్దపీట వేయనున్నాం. 32 పంట రకాల్లో అన్ని వాతావరణ పరిస్థితులను తట్టుకునే 100కు పైగా వంగడాలను అభివృద్ధి చేస్తాం. కోటిమందికి పైగా రైతులను సేంద్రియ సాగు వైపు మళ్లిస్తాం. అందుకు అన్నివిధాలా దన్నుగా నిలుస్తాం. తృణధాన్యాలు, నూనెగింజల అభివృద్ధిలో వీలైనంత త్వరగా స్వయంసమృద్ధి సాధిస్తాం'' అని వివరించారు. ''సంఘటిత రంగంలో ఉద్యోగ జీవితంలోకి అడుగుపెట్టే వారికి తొలి నెల వేతనం కేంద్రమే అందిస్తుంది. వచ్చే ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉపాధి నైపుణ్యాలు కల్పిస్తాం. కోటి మందికి టాప్-500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తాం. ఉన్నత విద్య కోసం రూ.10 లక్షల దాకా రుణాలకు వీలు కల్పిస్తాం. అన్ని రంగాల్లోనూ మహిళలు మరింతగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వీలు కల్పిస్తాం'' అని చెప్పారు. ఉద్యోగికీ, యజమానికీ ఇద్దరికీ లాభించేలా పీఎఫ్ ప్రోత్సాహకాల వంటి పలు చర్యలను ప్రకటించారు. అధికారికంగానే 6.7 శాతం దాటిన పట్టణ నిరుద్యోగాన్ని ఎంతో కొంత నేలకు దించే ప్రయత్నం బడ్జెట్ కేటాయింపుల్లో కనిపించింది.

భాగస్వాములకు ఇలా...

ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల కోణంలో చూస్తే నితీశ్‌కుమార్ పాలనలోని బిహార్‌పై నిర్మలమ్మ ఏకంగా రూ.60,000 కోట్ల మేరకు వరాల జల్లు కురిపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్స్‌ప్రెస్ వేలు, భారీ విద్యుత్కేంద్రం, రెండు హెరిటేజ్ కారిడార్లు, ఎయిర్‌పోర్టుల వంటివెన్నో వీటిలో ఉన్నాయి. ఇవేగాక అవసరమైన మేరకు ఆ రాష్ట్రానికి మరిన్ని అదనపు కేటాయింపులూ ఉంటాయని మంత్రి ప్రకటించారు! అక్కడ వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలున్న విషయం తెలిసిందే. రాజధాని అవసరాల నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌కు ప్రపంచ బ్యాంకు నుంచి రూ.15 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక రుణం అందేలా చూస్తామన్నారు. పోలవరం త్వరిత నిర్మాణం, రాష్ట్రంలో వెనకబడ్డ ప్రాంతాలకు గ్రాంటు తదితరాలను ప్రస్తావించారు.

రాష్ట్రాలతో కలిసి ముందుకు...

నగరాల సమగ్రాభివృద్ధికి రాష్ట్రాల సమన్వయంతో కృషి చేస్తామని నిర్మల పేర్కొన్నారు. శివారు ప్రాంతాల అభివృద్ధి ద్వారా వాటిని గ్రోత్ హబ్‌లుగా తీర్చిదిద్దుతామన్నారు. పీఎం ఆవాస్ యోజన కింద మరో 3 కోట్ల ఇళ్లు కట్టించనున్నారు. మహిళలు, బాలికల ప్రగతి, సంక్షేమానికి ఈసారి ఏకంగా రూ.3 లక్షల కోట్లు కేటాయించారు. దేశవ్యాప్తంగా 5 కోట్ల మంది గిరిజనులకు లబ్ధి కలిగేలా పథకాన్ని ప్రతిపాదించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను మరింతగా ప్రోత్సహించేందుకు ముద్రా రుణాల పరిమితిని రూ.20 లక్షలకు పెంచారు. ''పీఎం సూర్య ఘర్ పథకం కింద రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ద్వారా కోటి కుటుంబాలకు నెలకు 300 యూనిట్ల ఉచిత కరెంటు అందించే పథకానికి అద్భుతమైన స్పందన వచ్చింది. 14 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు'' అని మంత్రి చెప్పారు. ఈ పథకాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్తామన్నారు.

సామాన్యునిపై పన్నుల భారాన్ని వీలైంతగా తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నట్టు నిర్మల ప్రకటించారు. మహిళలకు చల్లని కబురు వినిపించారు. బంగారం, వెండి, ప్లాటినంతో పాటు మొబైల్స్‌పైనా దిగుమతి సుంకం తగ్గించారు. తద్వారా వాటి ధరలు దిగి రానున్నాయి. పీఎం విశ్వకర్మ, స్వానిధి, స్టాండప్ ఇండియా తదితరాలతో చేతి వృత్తుల వారు, స్వయంసహాయక బృందాలు మొదలుకుని ఎస్సీ, ఎస్టీల దాకా అన్ని వర్గాల సంక్షేమానికి భరోసా లభిస్తుందని మంత్రి అన్నారు. 'పూర్వోదయ' పథకం తూర్పు భారతదేశ ప్రగతిని పరుగులు పెట్టిస్తుందని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాలకూ పలు కేటాయింపులు చేశారు. పర్యాటకాభివృద్ధికి పలు చర్యలను ప్రతిపాదించారు. ఏంజెల్ ట్యాక్స్ రద్దు ద్వారా స్టార్టప్‌లకు మరింత ఊపునిచ్చేందుకు విత్త మంత్రి ప్రయత్నించారు. విదేశీ కంపెనీలపై ఆదాయ పన్ను భారాన్ని 40 నుంచి 35 శాతానికి తగ్గించారు. అన్ని రంగాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పరిశోధనల కోసం అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫండ్‌ను అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. పట్టణ భూ రికార్డులను పూర్తిగా డిజిటైజ్ చేయనున్నట్టు తెలిపారు. ఆదాయపన్ను చట్టం–1961ని సమూలంగా సమీక్షిస్తామని హామీ ఇచ్చారు.

మహిళలకు మంచి కబురు

బడ్జెట్లో ఆవిష్కరించిన నవ ప్రాథమ్యాలు

1. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత
- వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్ల కేటాయింపులు
- అన్ని వాతావరణ పరిస్థితులను తట్టుకునే 109 రకాల కొత్త వంగడాలు రైతులకు అందుబాటులోకి
- రెండేళ్లలో కోటి మంది రైతులు సేంద్రియ సాగు బాట పట్టేలా చర్యలు.
- అందుకు దన్నుగా నిలిచేలా 10 వేల బయో ఇన్‌పుట్ వనరుల కేంద్రాలు
- రైతులు, వారి భూముల కవరేజీ తదితరాల కోసం మూడేళ్లలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రా (డీపీఐ) అభివృద్ధి

2. ఉపాధి-నైపుణ్యాభివృద్ధి
- ఏ పథకాల్లోనూ లబ్ధిదారులు కాని యువతకు ఉన్నత విద్య కోసం రూ.10 లక్షల దాకా రుణాలు
- ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ
- ఉద్యోగికి, యజమానికి లాభించేలా పీఎఫ్ ప్రోత్సాహకాలు తదితరాలు
- ప్రత్యేకించి మహిళల కోసం పలు చర్యలు
- ఐదు పథకాలతో కూడిన సమగ్ర 'ప్రధానమంత్రి ప్యాకేజీ'

3. మానవ వనరుల అభివృద్ధి-సామాజిక న్యాయం
- పలు రాష్ట్రాల్లో పారిశ్రామిక, హెరిటేజ్ కారిడార్ల అభివృద్ధి
- 63 వేల గిరిజన గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక పథకం
- మహిళలు, బాలికల అభ్యున్నతి పథకాలకు రూ.3 లక్షల కోట్లు
- ఈశాన్య ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

4. నిర్మాణ-సేవా రంగాలు
- తయారీ రంగంలో ఎంఎస్ఎంఈల కోసం రుణ హామీ పథకాలు
- థర్డ్ పార్టీ గ్యారంటీ లేకుండా రూ.100 కోట్ల దాకా రుణాలు
- ముద్రా రుణాల పరిమితి రూ.20 లక్షలకు పెంపు
- ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ఈ కామర్స్ ఎగుమతి హబ్‌లు

5. పట్టణాభివృద్ధి
- 30 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న 14 నగరాల సమగ్రాభివృద్ధికి రవాణా ఆధారిత ప్రణాళికలు, వ్యూహాలు
- ప్రధాని పట్టణ ఆవాస్ యోజన 2.0 కింద కోటి మంది పట్టణ పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇళ్లు
- ఎంపిక చేసిన నగరాల్లో వచ్చే ఐదేళ్లలో ఏటా 100 చొప్పున వీధి మార్కెట్లు


6. ఇంధన భద్రత
- ఉపాధి, వృద్ధి తదితరాలతో పాటు పర్యావరణ హితాన్నీ దృష్టిలో పెట్టుకుంటూ సంప్రదాయేతర ఇంధన వనరులకు మరింత ప్రోత్సాహం
- కరెంటు నిల్వ కోసం పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులకు ప్రోత్సాహం
- ప్రైవేట్ రంగ భాగస్వామ్యంలో చిన్న, మాడ్యులార్ అణు రియాక్టర్ల అభివృద్ధి

7. మౌలిక సదుపాయాలు
- దీర్ఘకాలిక లక్ష్యంతో రూ.11.11 లక్షల కోట్ల కేటాయింపులు రాష్ట్రాలకు దీర్ఘకాలిక వడ్డీలేని రుణాలకు రూ.1.5 లక్షల కోట్ల కేటాయింపు
- పీఎంజీఎస్‌వై–4తో 25 వేల గ్రామీణ ఆవాసాలకు కనెక్టివిటీ
- వరద ప్రభావిత రాష్ట్రాల్లో సమస్య శాశ్వత నివారణే లక్ష్యంగా పలు ప్రాజెక్టులు
- పలు రాష్ట్రాల్లో పర్యాటక తదితర కారిడార్ల అభివృద్ధి

8. ఇన్నోవేషన్ - రీసెర్చ్
- పరిశోధన, నమూనా అభివృద్ధి కోసం అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫండ్
- ప్రైవేట్ రంగ సమన్వయంతో పరిశోధనలు, ఆవిష్కరణలకు ప్రోత్సాహమిచ్చేందుకు రూ.లక్ష కోట్ల ఫైనాన్సింగ్ పూల్
- అంతరిక్ష ఆర్థికాన్ని వచ్చే పదేళ్లలో కనీసం ఐదు రెట్లు విస్తరణ. అందుకు ఈ బడ్జెట్లో రూ.1,000 కోట్లు.

9. భావి తరం సంస్కరణలు
- భూములన్నింటికీ ప్రత్యేక ల్యాండ్ పార్సిల్ ఐడెంటిఫికేషన్ నంబర్, లేదా భూ ఆధార్
- భూ రిజిస్ట్రీ ఏర్పాటు, రైతుల రిజిస్ట్రీతో లింకేజీ
- జీఎస్ఐ మ్యాపింగ్‌తో పట్టణ ప్రాంత భూ రికార్డుల డిజిటైజేషన్
- అన్నిరకాల కార్మిక సేవలూ ఒక్కతాటిపైకి. సంబంధిత పోర్టళ్లతో ఇ–శ్రామ్ పోర్టల్ అనుసంధానం

భూటాన్‌కు అత్యధికం.. మాల్దీవులకు కోత



న్యూఢిల్లీ: భారత పొరుగుదేశమైన భూటాన్‌కు 'నైబర్‌హుడ్ ఫస్ట్' పాలసీలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అత్యధికంగా రూ.2068 కోట్లను అభివృద్ధి ఎయిడ్ కింద కేటాయించింది. అయితే, మాల్దీవులకు మాత్రం గత ఏడాదితో పోలిస్తే నిధుల్లో కోత విధించింది. మాల్దీవులకు గత ఏడాది రూ.770 కోట్లు కేటాయించగా, ఈసారి బడ్జెట్‌లో రూ.400 కోట్లు కేటాయించింది. గత ఏడాది నవంబర్‌లో మాల్దీవుల అధ్యక్షుడిగా చైనా అనుకూలురైన మొహమ్మద్ మొయిజ్జు వచ్చాక భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. విదేశాంగ శాఖకు గత ఏడాది సవరించిన అంచనాల మేరకు రూ.29,121 కోట్లు కేటాయించగా 2024–25 బడ్జెట్‌లో రూ.22,154 కోట్లు కేటాయించారు. భూటాన్ తర్వాత నేపాల్‌కు అధికంగా నిధులు (రూ.700 కోట్లు) కేటాయించారు. శ్రీలంకకు గత ఏడాది రూ.60 కోట్లు కేటాయించగా, ఈసారి మాత్రం ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం గమనార్హం. కేంద్ర బడ్జెట్‌లో సాయం కింద అఫ్గానిస్తాన్‌కు రూ.200 కోట్లు, బంగ్లాదేశ్‌కు రూ.120 కోట్లు, మయన్మార్‌కు రూ.250 కోట్లు, మారిషస్‌కు రూ.370 కోట్లు, ఆఫ్రికా దేశాలకు రూ.200 కోట్లు కేటాయించారు. లాటిన్ అమెరికా, యురేసియా దేశాలకు అభివృద్ధి సాయం కింద రూ. 4883 కోట్లు కేటాయించారు.

భద్రతపై ప్రత్యేక దృష్టి

రైల్వే శాఖకు రూ. 2,62,200 కోట్లు కేటాయింపు
భద్రతా చర్యలకు రూ. 1.08 లక్షల కోట్లు ఖర్చు
యూపీఏ హయాంతో పోలిస్తే ఇప్పుడు భారీగా నిధులు
బడ్జెట్ కేటాయింపులపై రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ వెల్లడి



న్యూఢిల్లీ: రైళ్ల ప్రమాదాలను ఆటోమేటిక్‌గా నిలువరించే 'కవచ్'తో పాటు ఇతర భద్రతా చర్యలకు రైల్వేకు కేటాయించిన బడ్జెట్‌లో అధిక మొత్తం వెచ్చించనున్నామని ఆ శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రైల్వేకు కేటాయింపులను ప్రస్తావించలేదు. అయితే మంగళవారం పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రవేశ పెట్టాక రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తమ శాఖకు కేటాయింపుల వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మూలధన పెట్టుబడి కింద భారీ ఎత్తున కేటాయింపులు జరిగాయని, రైల్వే శాఖకు రూ. 2,62,200 కోట్లు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించారని చెప్పారు. ఈ కేటాయింపుల్లో.. పాత ట్రాక్‌ల మార్పునకు, సిగ్నలింగ్ సిస్టమ్ మెరుగుపరచడానికి, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి, కవచ్ ఇన్‌స్టాలేషన్ వంటి భద్రతా చర్యలకు రూ. 1,08,795 కోట్లు వెచ్చించనున్నామని చెప్పారు. ఉన్నతీకరించిన కవచ్ 4.0కు ఇటీవలే రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ నుంచి అనుమతి లభించిందని, దీంతో కవచ్ ఇన్‌స్టాలేషన్‌ను ప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే 4,275 కి.మీ. ఆప్టికల్ ఫైబర్ కేబుల్, టెలికమ్ టవర్లు, ఆర్ఎఫ్ఐడీ డివైజ్‌లు, స్టేషన్ కవచ్, లోకో కవచ్ ఇన్‌స్టాలేషన్ కూడా వేగంగా పూర్తవుతుందన్నారు.

యూపీఏ హయాంలో అతి తక్కువ నిధులు

ఈ సందర్భంగా ఆయన యూపీఏ హయాంలో రైల్వే కేటాయింపులపై పలు విమర్శలు చేశారు. 2014 సమయంలో రైల్వే కేటాయింపు కేవలం రూ. 35 వేల కోట్లు మాత్రమే ఉండేదని, ప్రస్తుతం అది రూ. 2.62 లక్షల కోట్లు పైగా ఉందని చెప్పారు. గత పదేళ్లుగా ప్రధాని మోదీ ప్రత్యేక కృషి, పరిపాలన కారణంగా ఈ బడ్జెట్ కేటాయింపు సాధ్యమైందని చెప్పారు. 2014కు ముందు కేవలం 20 వేల కిలో మీటర్లు మాత్రమే రైల్వే లైన్ల విద్యుదీకరణ పూర్తయిందని, ఈ పదేళ్లలో 40 వేల కిలోమీటర్ల విద్యుదీకరణ పూర్తి చేశామని తెలిపారు. 2014కు ముందు రోజుకు సగటున కేవలం 4 కిలో మీటర్ల రైల్వే ట్రాక్‌ల నిర్మాణం మాత్రమే జరగగా, గత ఆర్థిక సంవత్సరంలోనే రోజుకు సగటున 14.5 కిలో మీటర్ల నిర్మాణం పూర్తి చేశామని, అంటే ఏడాది మొత్తంలో 5,300 కి.మీ. కొత్త ట్రాక్‌ల నిర్మాణం పూర్తి చేశామని వెల్లడించారు. సరుకు రవాణాలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1588 మెట్రిక్ టన్నులకు చేరామని, ఇది 2014–15లో 1095 మెట్రిక్ టన్నులుగా ఉందని చెప్పారు. ఇక ఉద్యోగ నియామకాల విషయానికి వస్తే 10 ఏళ్ల యూపీఏ పాలనలో 4.11 లక్షల ఉద్యోగాలు ఇస్తే.. మోదీ పదేళ్ల పరిపాలనలో 5 లక్షల ఉద్యోగ నియామకాలు జరిగాయని చెప్పారు.

భారీగా జనరల్ కోచ్‌ల తయారీ..

గత పదేళ్ల నుంచి కొనసాగుతున్న మౌలిక సదుపాయాల విస్తరణ పనులు, బాటిల్‌నెక్‌ల తొలగింపు, ఇంజిన్లు, కోచ్‌ల తయారీకి చేయూత, కొత్త సాంకేతిక పరిజ్ఞానం ప్రవేశపెట్టడం వంటి పనులు ఇకపైనా ఉంటాయని మంత్రి వెల్లడించారు. తక్కువ, మధ్యస్థ ఆదాయ వర్గాలను దృష్టిలో ఉంచుకుని నిష్పత్తి ప్రకారం మూడో వంతు ఎయిర్ కండిషన్డ్ కోచ్‌లు, మూడింట రెండు వంతుల జనరల్ కోచ్‌లను ట్రైన్ సెట్‌లో ఉంచుతామన్నారు. డిమాండ్ దృష్ట్యా ఈ ఆర్థిక సంవత్సరంలో 2,500 అదనపు జనరల్ కోచ్‌లను తయారు చేయాలని నిర్ణయించామని, అలాగే, పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా 10 వేల జనరల్ కోచ్‌లైనా తయారు చేయాలని మరో నిర్ణయం తీసుకున్నామని, ఈ బడ్జెట్ కేటాయింపులు కొత్త కోచ్‌ల తయారీకి సరిపోతుందని చెప్పారు.

పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక కేటాయింపు..

పారిశ్రామిక అభివృద్ధి కోసం ఈ బడ్జెట్‌లో అదనపు నిధుల కేటాయింపు జరిగిందని అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. ఈ నిధులతో వైజాగ్–చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని కొప్పర్తి, హైదరాబాద్–బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లోని ఓర్వకల్లు, అమృత్‌సర్–కోల్‌కతా కారిడార్‌లోని గయలో అవసరమైన మౌలిక వసతులు కలిస్తామని తెలిపారు. ఇక మౌలిక సదుపాయాల కల్పనలో రైల్వే కొత్త విధానాలు అవలంబిస్తోందని చెప్పారు. ఇందులో మూడు ఎకనామిక్ రైల్వే కారిడార్లు (ఎనర్జీ, మినరల్, సిమెంట్- 192 ప్రాజెక్టులు) పోర్టు కనెక్టివిటీ కారిడార్లు (42 ప్రాజెక్టులు), ట్రాఫిక్ అధికంగా ఉండే కారిడార్లు (200 ప్రాజెక్టులు) గుర్తించామని చెప్పారు.



12 ఇండస్ట్రియల్ పార్కులు

న్యూఢిల్లీ: మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమలకు చేయూత నిచ్చేందుకు రాష్ట్రాలు, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో 12 ప్లగ్ అండ్ ప్లే (అన్ని మౌలిక వసతులతో సిద్ధంగా ఉన్న) ఇండస్ట్రియల్ పార్క్‌లను అభివృద్ధి చేస్తామని కేంద్రం ప్రకటించింది. టౌన్ ప్లానింగ్ స్కీమ్‌లను వినియోగించుకుంటూ ఈ పార్క్‌లను అభివృద్ధి చేస్తామని నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. దీనిపై వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ మాట్లాడుతూ.. ఈ పార్క్‌లు బిహార్, ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితం అని కొంతమంది చెబుతున్నారని, అయితే ఈ 12 పార్కులు దేశ వ్యాప్తంగా ఉంటాయని తెలిపారు. ఉదాహరణకు కొన్ని పేర్కొంటారని కానీ పూర్తి వివరాలు కాలక్రమేణా తెలుస్తాయని చెప్పారు. కాగా, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మరింత మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రభుత్వం జన్ విశ్వాస్ బిల్ 2.0పైన కృషి చేస్తోందని ఆర్థిక మంత్రి నిర్మల తెలిపారు.

సాక్షి 2024 బడ్జెట్


EXPERT COMMENT

రాకేశ్ టికాయత్
రైతు నాయకుడు



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అన్నదాతలకు మొండిచేయి చూపింది. దీన్ని గొప్ప బడ్జెట్‌గా కేంద్రం కాగితాల్లో చెప్పకుంటున్నా దీనివల్ల రైతులకు క్షేత్రస్థాయిలో కలిగే ప్రయోజనం ఏమీ లేదు. పంటలకు గిట్టుబాటు ధరలు, ఉచిత విద్యుత్, ఎరువుల ధరల తగ్గింపు, వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు వంటి కీలక డిమాండ్లను కేంద్రం ఈ బడ్జెట్‌లో పట్టించుకోలేదు. రైతులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు నేర్పించే వ్యవసాయరంగ కంపెనీలకే ఈ బడ్జెట్ వల్ల లాభం కలగనుంది.





సాగుకు రూ. 1.52 లక్షల కోట్లు

అధిక ఉత్పాదకతనిచ్చే సరికొత్త వంగడాల దిశగా పరిశోధనలకు ప్రోత్సాహం

అధిక దిగుబడినిచ్చే 109 సరికొత్త వంగడాల విడుదల

- ప్రైవేటు రంగానికి సైతం భాగస్వామ్యం
- ప్రకృతి వ్యవసాయం వైపు కోటిమంది రైతులు
- శాస్త్రీయ సంస్థలు, గ్రామ పంచాయతీల ద్వారా అమలు
- భారీస్థాయిలో కూరగాయల ఉత్పత్తి క్లస్టర్లు
- పప్పు దినుసులు, నూనెగింజల ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్ బలోపేతం
- 400 జిల్లాల్లో డీపీఐ ద్వారా ఖరీఫ్ పంటల డిజిటల్ సర్వే
- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

న్యూఢిల్లీ: వ్యవసాయానికి బడ్జెట్‌లో కేంద్రం పెద్దపీట వేసింది. బడ్జెట్‌కు సంబంధించిన తొమ్మిది ప్రాధాన్య అంశాల్లో వ్యవసాయ ఉత్పాదకతను ఒకటిగా చేర్చింది. మధ్యంతర బడ్జెట్‌లో పేర్కొన్న పథకాలను కొనసాగిస్తూనే కొత్త విధానాలకు శ్రీకారం చుట్టింది. సాగు ఉత్పాదకతను పెంచడమే లక్ష్యంగా కేటాయింపులు జరిపింది. వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2024–25 బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు.

పరిశోధనలకు ప్రోత్సాహం

'వ్యవసాయ పరిశోధనలను సమగ్రంగా సమీక్షించడం ద్వారా ప్రతికూల వాతావరణాన్ని సైతం తట్టుకుని అధిక ఉత్పాదకతనిచ్చే సరికొత్త వంగడాల దిశగా ప్రోత్సహిస్తాం. ఈ మేరకు నిధులు కూడా అందజేస్తాం. ప్రైవేటు రంగానికి కూడా ఇందులో భాగస్వామ్యం కల్పిస్తాం. ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యవసాయ రంగ నిపుణులు ఈ పరిశోధనలను పర్యవేక్షిస్తారు. 32 వ్యవసాయ అలాగే ఉద్యాన పంటలకు సంబంధించి ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకోగలిగే, అధిక దిగుబడినిచ్చే 109 కొత్త వంగడాలను రైతులు సాగు చేసేందుకు వీలుగా విడుదల చేస్తాం.



10 వేల బయో ఇన్‌పుట్ రిసోర్స్ కేంద్రాలు

వచ్చే రెండేళ్లలో దేశవ్యాప్తంగా కోటి మంది రైతులను సర్టిఫికేషన్, బ్రాండింగ్‌తో కూడిన ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహిస్తాం. శాస్త్రీయ సంస్థలు, ఆసక్తి కలిగిన గ్రామ పంచాయతీల ద్వారా దీనిని అమలు చేస్తాం. 10 వేల అవసరాధారిత బయో ఇన్‌పుట్ రిసోర్స్ కేంద్రాలు (సేంద్రియ ఎరువుల కేంద్రాలు) ఏర్పాటు చేస్తాం.

సహకార సంఘాలు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం

అధిక వినియోగ కేంద్రాలకు సమీపంలో భారీ స్థాయిలో కూరగాయల ఉత్పత్తి క్లస్టర్లు అభివృద్ధి చేస్తాం. రైతు–ఉత్పత్తిదారు సంఘాలను ప్రోత్సహిస్తాం. అలాగే కూరగాయల సేకరణ, నిల్వ, మార్కెటింగ్‌తో సహా కూరగాయల సరఫరా వ్యవస్థల కోసం సహకార సంఘాలు, స్టార్టప్‌లను ప్రోత్సహిస్తాం.

పప్పు దినుసులు, నూనె గింజల్లో స్వయం సమృద్ధి

పప్పు దినుసులు, నూనెగింజల్లో స్వయం సమృద్ధి సాధన దిశగా వాటి ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్‌ను బలోపేతం చేస్తాం. మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా వేరుశనగ, నువ్వులు, సోయాబీన్, పొద్దుతిరుగుడు తదితర నూనెగింజలకు 'ఆత్మనిర్భరత' సాధన కోసం ఓ ప్రత్యేక వ్యూహానికి రూపకల్పన చేస్తాం.

డిజిటల్ క్రాప్ సర్వే

పైలట్ ప్రాజెక్టు విజయవంతమైన నేపథ్యంలో కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో..వచ్చే మూడేళ్లలో దేశవ్యాప్తంగా రైతులు, వారి భూముల కోసం వ్యవసాయంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) అమలు చేస్తాం. ఈ ఏడాది 400 జిల్లాల్లో డీపీఐ ద్వారా ఖరీఫ్ పంటల డిజిటల్ సర్వే నిర్వహిస్తాం. 6 కోట్ల మంది రైతులు, వారి భూముల వివరాలను రైతు, భూమి రిజిస్ట్రీల్లో పొందుపరుస్తాం. ఐదు రాష్ట్రాల్లో జన్ సమర్థ్ ఆధారిత కిసాన్ క్రెడిట్ కార్డులు జారీ చేస్తాం.

రొయ్యల ఉత్పత్తి ఎగుమతి

రొయ్యల సాగు కేంద్రాల నెట్‌వర్క్ ఏర్పాటుకు ఆర్థిక సాయం అందజేస్తాం. నాబార్డ్ ద్వారా రొయ్యల సాగు, శుద్ధి, ఎగుమతికి నిధులు అందజేస్తాం.

జాతీయ సహకార విధానం

సహకార రంగ సర్వతోముఖాభివృద్ధికి వీలుగా జాతీయ సహకార విధానాన్ని కేంద్రం తీసుకువస్తుంది. వేగవంతమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, పెద్దయెత్తున ఉపాధి కల్పన, అవకాశాలు లక్ష్యంగా ఈ విధానాన్ని రూపొందిస్తాం..' అని ఆర్థికమంత్రి వెల్లడించారు.

భూసారం పెంపు, జీవవైవిధ్యానికి దోహదం

సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, రసాయన ఎరువులు, క్రిమిసంహారాలపై ఆధారపడటాన్ని తగ్గించడం లక్ష్యంగా రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించాలని కేంద్రం భావిస్తోంది. ప్రకృతి వ్యవసాయం భూసారాన్ని పెంచడమే కాకుండా జీవవైవిధ్యానికి దోహదపడుతుంది. రైతుల సాగు ఖర్చులు తగ్గేలా చేయడం ద్వారా వారి లాభదాయకతను పెంపొదిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ప్రోత్సహిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రైతులు వాతావరణ సూచనలు, పంటలకు సంబంధించిన సలహా సేవలు, మార్కెట్ ధరల గురించిన సమాచారం తెలుసుకునేందుకు ఈ డిజిటల్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా వీలు కలుగుతుంది.



యూరియాకు బడ్జెట్లో సబ్సిడీ తగ్గింపు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో యూరియాకు సబ్సిడీ తగ్గింది. 2022–2023లో 1,65,217 కోట్లు సబ్సిడీపై ఖర్చు చేయగా, 2023–24లో రూ. 1,28,594 కోట్లకు తగ్గిపోయింది. 2024–25లో బడ్జెట్‌ను మరింత తగ్గించి 1,19,000 కోట్లు మాత్రమే కేటాయించారు. పోషకాధార ఎరువుల సబ్సిడీ కింద 2022–23లో రూ. 86,122 కోట్లు ఖర్చు చేయగా, 2024–25లో ఇంకా తగ్గించి రూ. 45,000 కోట్లు కేటాయించారు. అంటే కంపెనీలు పెంచే ఎరువుల ధరల భారాన్ని ఇకపై రైతులే భరించాల్సి ఉంటుందని రైతు నేతలు విమర్శిస్తున్నారు. అలాగే 2019 నుంచి కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు కేటాయింపులు తగ్గిపోతూ వస్తున్నాయి. 2019–20 సంవత్సర మొత్తం బడ్జెట్లో వ్యవసాయ రంగానికి 5.44 శాతం కేటాయించగా, ఇప్పుడు 2024–2025లో 3.15 శాతానికి పడిపోయింది. ఇక పంటల బీమా పథకానికి కూడా 2023–24లో రూ. 15,000 కోట్ల ఖర్చు అంచనా వేసిన ప్రభుత్వం ఈ ఏడాది దానిని రూ. 14,600 కోట్లకు తగ్గించింది. వ్యవసాయ రుణాలపై వడ్డీ రాయితీకి 2023–24 లో రూ. 23,000 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ సంవత్సరం రూ. 22,000 కోట్లు మాత్రమే కేటాయించింది.

మద్దతు ధరలకు చట్టబద్ధత ఏదీ?

కన్నెగంటి రవి, రైతు స్వరాజ్య వేదిక, తెలంగాణ రాష్ట్ర కమిటీ

కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ దేశ వ్యాప్తంగా రైతులు గత ఏడేళ్లుగా ఆందోళనలు చేస్తున్నారు. మోదీ ప్రభుత్వం ఈ బడ్జెట్ సందర్భంగా ఈ చట్టం ప్రస్తావన చేయలేదు. పైగా వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపు కూడా తగ్గించింది.



ఈ-కోర్టుల ప్రాజెక్టుకు రూ. 1,500 కోట్లు

న్యూఢిల్లీ: దేశంలోని దిగువ కోర్టుల్లో రికార్డుల డిజిటైజేషన్‌కు ఉద్దేశించిన ఈ–కోర్టు ప్రాజెక్టు మూడో దశ అమలుకు 2024–25 బడ్జెట్‌లో కేంద్రం రూ. 1,500 కోట్లు కేటాయించింది. నాలుగేళ్లలో ఈ ప్రక్రియను పూర్తి చేయనుంది. మూడో దశ కింద అన్ని రికార్డుల డిజిటైజేషన్‌కు రూ. 2,038.40 కోట్లు అవసరమని అంచనా వేశారు. మొత్తంగా 3,108 కోట్ల డాక్యుమెంట్లను డిజిటైజ్ చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ ప్రాజెక్టు మూడో దశ అమల్లో భాగంగా క్లౌడ్ టెక్నాలజీ ద్వారా 25 పెటాబైట్ల డేటా నిల్వ చేసేందుకు రూ. 1,205.20 కోట్లు అవసరమని అంచనా వేస్తున్నారు. అలాగే కోర్టుల వర్చువల్ హియరింగ్ కోసం అవసరమైన డిజిటల్ వ్యవస్థ కూడా ఈ పథకం ద్వారా ఏర్పాటు కానుంది. ఇందులో 1,150 వర్చువల్ కోర్టుల ఏర్పాటుకు రూ. 413.08 కోట్లు అవసరమని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ–కోర్టుల ప్రాజెక్టు మూడో దశను కేంద్ర పథకంగా అమలు చేయాలని కేంద్ర కేబినెట్ గతేడాది సెప్టెంబర్‌లో నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు కోసం మొత్తంగా రూ. 7,210 కోట్లు అవసరమని లెక్కగట్టింది.



వ్యవసాయానికి వరం: శివరాజ్ సింగ్ చౌహాన్

వ్యవసాయానికి, గ్రామీణ రంగాలకు ఈ బడ్జెట్ ఒక వరమని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అభివర్ణించారు. బలమైన, స్వావలంబనతో కూడిన భారత్‌కు ఇది బాటలు వేస్తుందని చెప్పారు. 2047 కల్లా అభివృద్ధి చెందిన దేశ స్థాయిని పొందేందుకు ప్రస్తుత బడ్జెట్ రోడ్‌మ్యాప్ అని పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు ప్రస్తుత ఆర్థిక ప్రణాళిక మరింత ఊతం ఇస్తుందని అన్నారు. రైతులు, మహిళలు, యువత, ఆర్థికంగా వెనుకబడినవర్గాల జీవితాల్లో ఈ బడ్జెట్ విప్లవాత్మకమైన మార్పులు తెస్తుందని చెప్పారు.



వరద నష్టం నియంత్రణకు భారీ కేటాయింపులు

న్యూఢిల్లీ: వివిధ రాష్ట్రాల్లో వరద నియంత్రణ చర్యలకు, నీటిపారుదల ప్రాజెక్టులకు సమగ్ర ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. వివిధ కార్యక్రమాల కింద వేగవంతమైన ఇరిగేషన్ బెనిఫిట్ ప్రోగ్రామ్, ఇతర కార్యక్రమాలకు రూ. 11,500 కోట్లు అందిస్తామని తెలిపారు. ఈ ప్రాజెక్టుల్లో కోసి–మెచి అంతరాష్ట్రీయ లింక్ ప్రాజెక్టుతో పాటు కొనసాగుతున్న మరో 20 ఇతర పథకాలు కూడా ఉన్నాయి. దేశం వెలుపల నుంచి వస్తున్న వరదలతో బిహార్ తరచూ నష్టపోతోందని, వరద నియంత్రణ నిర్మాణాలు నేపాల్‌లో నిర్మించేందుకు ప్రణాళికలు కొనసాగుతున్నాయని సీతారామన్ తెలిపారు. అలాగే బ్రహ్మపుత్ర దాని ఉపనదుల కారణంగా అస్సాంలో ఏటా వరదలు ముంచెత్తుతున్నాయి. ఇక్కడ కూడా వరద నియంత్రణకు సంబంధించిన ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందిస్తాం అని తెలిపారు. ఇక హిమాచల్ ప్రదేశ్‌లో పునర్నిర్మాణము, పునరావాసానికి సంబంధించి బహుముఖ అభివృద్ధికి ప్రభుత్వం సహాయం చేస్తుందని తెలిపారు. ఉత్తరాఖండ్, సిక్కింలకు కూడా ఇలాంటి సహకారాన్ని అందిస్తామని ఆర్థిక మంత్రి చెప్పారు.

ఆభరణ పరిశ్రమకు ప్రోత్సాహం

బంగారం, విలువైన లోహ ఆభరణాల పరిశ్రమకు దేశీయంగా విలువ సమకూర్చేందుకు వీలుగా బంగారం, వెండిపై కస్టమ్స్ డ్యూటీని 15 శాతం నుంచి 6 శాతానికి, ప్లాటినంపై 6.4 శాతానికి తగ్గిస్తున్నట్టు మంత్రి సీతారామన్ తెలిపారు.



రక్షణ కట్టుదిట్టం..

రక్షణ రంగానికి.. రూ.6.22 లక్షల కోట్లు

దేశీయ సైనిక ఉపకరణాల సేకరణకు	కేంద్ర బడ్జెట్‌లో రక్షణరంగవాటా..
రూ.1,72,000 కోట్లు	12.9 శాతానికి చేరిక

న్యూఢిల్లీ: చైనా కవ్వింపులు, పాక్ ముష్కరుల చొరబాట్లతో సరిహద్దుల వెంట అప్రమత్తంగా ఉండే సైన్యంతోపాటు భూతల, గగనతల రక్షణ వ్యవస్థల మరింత పటిష్టతే లక్ష్యంగా మోదీ సర్కార్ మరోమారు రక్షణ రంగానికి పెద్దపీట వేసింది. 2024–25 ఆర్థికసంవత్సరంలో రక్షణ రంగానికి రూ.6,21,940.85 కోట్లు కేటాయించింది. అత్యాధునిక డ్రోన్లు, యుద్ధవిమానాలు, నౌకలు, ఆయుధాలు, ఇతర సైనిక ఉపకరణాల కొనుగోలు కోసం ఏకంగా రూ.1,72,000 కోట్లను కేటాయించారు. తాజా కేంద్ర బడ్జెట్‌లో రక్షణరంగ వాటా 12.9 శాతానికి పెరగడం విశేషం. గత ఆర్థికసంవత్సరంతో పోలిస్తే ఈసారి రక్షణరంగానికి కేటాయింపులు 4.79 శాతం పెంచారు. రక్షణ రంగంలో స్వావలంబనే లక్ష్యంగా సైనిక ఉపకరణాల స్థానిక తయారీని మరింత ప్రోత్సహించేందుకు మోదీ సర్కార్ నడుం బిగించింది. అందుకే స్థానిక ఉపకరణాల సేకరణ కోసం రూ.1,05,518.43 కోట్లను కేటాయించింది. దీంతో బీజేపీ సర్కార్ లక్షిత రక్షణరంగంలో ఆత్మనిర్భరత మరింతగా సాకారంకానుంది. లక్షల కోట్ల బడ్జెట్‌ను రక్షణరంగానికి కేటాయించిన విత్తమంత్రి నిర్మలకు కృతజ్ఞతలు అంటూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. '' ఆధునిక ఆయుధ సంపత్తి సమీకరణతో త్రివిధ బలగాల శక్తిసామర్థ్యాలు మరింత ద్విగుణీకృతం కానున్నాయి. దేశీయ సంస్థలు తయారుచేసిన సైనిక ఉపకరణాలు, ఆయుధాలతో దేశం రక్షణరంగంలోనూ ఆత్మనిర్భరతను వేగంగా సాధించనుంది'' అని రాజ్‌నాథ్ అన్నారు.

అగ్నిపథ్ పథకం కోసం రూ.5,980 కోట్లు

గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి సరిహద్దుల వెంట రహదారుల నిర్మాణానికి కేటాయింపులు 30 శాతం పెరగడం విశేషం. బీఆర్‌వోకు కేటాయించిన రూ.6,500 కోట్ల నిధులతో సరిహద్దుల వెంట మౌలికవసతుల కల్పన మెరుగుపడనుంది. రక్షణరంగ పరిశ్రమల్లో అంకుర సంస్థలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఐడెక్స్ పథకానికి రూ.518 కోట్లు కేటాయించారు. అంకుర సంస్థలు, సూక్ష్మచిన్నమధ్యతరహా పరిశ్రమలు, ఆవిష్కర్తలు ఇచ్చే కొత్త ఐడియాలను ఆచరణలో పెట్టేందుకు ఈ నిధులను వినియోగించనున్నారు. కోస్ట్‌గార్డ్ ఆర్గనైజేషన్‌కు రూ.7,651 కోట్లు కేటాయించారు. తేజస్ వంటి తేలికపాటి యుద్ధవిమానాలను తయారుచేస్తూ నూతన విమానాల డిజైన్, రూపకల్పన, తయారీ కోసం కృషిచేసే హిందుస్తాన్ ఏరోనాటిక్స్‌కు రూ.1,600 కోట్లు కేటాయించారు. రాష్ట్రీయ రైఫిల్స్ విభాగం కోసం రూ.10,535 కోట్లు కేటాయించారు. ఎన్‌సీసీ కోసం రూ.2,726 కోట్లు, త్రివిధ దళాల్లో అగ్నిపథ్ పథకం నిర్వహణ కోసం రూ.5,980 కోట్లు కేటాయించారు.



హోం పదిలం..

హోం శాఖకు రూ.2.19 లక్షల కోట్లు

జమ్మూకశ్మీర్‌కు రూ.42వేల కోట్లు

నిర్మలా సీతారామన్ పద్దులో కేంద్ర హోం శాఖకు రూ.2,19,643.31 కోట్లు కేటాయించారు. ఇందులో సింహభాగం సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్, సీఐఎస్‌ఎఫ్ వంటి కేంద్రసాయుధ బలగాలకు కోసం ఖర్చుచేయనున్నారు. పారా మిలటరీ విభాగాలకు కేటాయించిన పద్దు ఏకంగా రూ.1,43,275.90 కోట్లు ఉండటం గమనార్హం. జమ్మూకశ్మీర్ కోసం ఆర్థిక మంత్రి నిర్మల రూ.42,277.74 కోట్ల బడ్జెట్‌ను ఇచ్చారు. కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవుల కోసం రూ.5,985.82 కోట్లు, చండీగఢ్ కోసం రూ.5,862.62 కోట్లు, లద్దాఖ్ కోసం రూ.5,958 కోట్లు, దాద్రానగర్ హవేలా, డయ్యూడామన్ కోసం రూ.2,648.97 కోట్లు, లక్షద్వీప్ కోసం రూ.1,490.10 కోట్లు కేటాయింపులు జరిగాయి. జనగణన కోసం 2023–24 బడ్జెట్‌లో రూ.కేవలం 578.29 కోట్లు కేటాయిస్తే ఈసారి రూ.1,309.46 కోట్లు కేటాయించారు. జాతీయ విపత్తు స్పందన దళం కోసం గతంలో కంటే కాస్తంత తక్కువగా నిధులు కేటాయించడం గమనార్హం. ఈసారి రూ.1,606.95 కోట్లు కేటాయించారు. సీఆర్‌పీఎఫ్‌కు మిగతావాటికంటే ఎక్కువగా రూ.31,543.20 కోట్లు కేటాయించారు. బీఎస్‌ఎఫ్‌కు రూ.25,472.44 కోట్లు కేటాయించారు.



ఐబీకి 3,823 కోట్లు

కేంద్ర బడ్జెట్‌లో ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ)కి రూ.3,823 కోట్లు కేటాయించారు. కేంద్రప్రభుత్వ ఆజ్ఞానుసారం పనిచేసే ఢిల్లీ పోలీస్ విభాగానికి కేటాయింపుల్లో కోత విధించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి తక్కువగా రూ.11,400.81 కోట్లు కేటాయించారు. ప్రధాని వంటి వీవీఐపీలను కంటికి రెప్పలా కాపాడే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్(ఎస్పీజీ)కి రూ.506.32 కోట్లు కేటాయించారు. మంత్రి మండలి, ప్రధాని కార్యాలయం, అతిథుల ఆతిథ్యానికి, జాతీయ భద్రతా మండలికి రూ. 1,248.91 కోట్లు కేటాయించారు. 2023–24 బడ్జెట్‌తో పోలిస్తే ఈ కేటాయింపుల్లో కాస్తంత కోతపెట్టారు. ఆనాడు రూ.1,803 కోట్లు కేటాయించడం గమనార్హం. మంత్రి మండలికి ఖర్చుల కోసం మొత్తం రూ.828.36 కోట్ల బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. వీటిని కేబినెట్ మంత్రులు, రాష్ట్ర మంత్రులు, మాజీ ప్రధానుల వేతనాలు, ఇతర అలవెన్సులు, వారి ప్రయాణాలకు ఉపయోగిస్తారు. విదేశీ నేతలు, విశిష్ట అతిథుల ప్రయాణాల విమాన సర్వీసులు, సదుపాయాలు, రాష్ట్రపతిభవన్ వద్ద ఆహ్వాన ఏర్పాట్ల కోసం ఈ నిధులను వినియోగిస్తారు. గత బడ్జెట్‌లో రూ.1,289 కోట్లు కేటాయించడం తెల్సిందే. జాతీయ భద్రతా మండలి సచివాలయం నిర్వహణ కోసం ఈసారి రూ.202.10కోట్లు కేటాయించారు. రక్షణ, పరిశోధనాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ)కు ఈసారి కేటాయింపులు ఏమంత ఆశాజనంగా లేవు. ఈసారి కాస్తంత ఎక్కువగా 23,855 కోట్లే కేటాయించారు.



టెలికం రంగానికి 1.28 లక్షల కోట్లు

దేశవ్యాప్తంగా టెలికం ప్రాజెక్టులు, ప్రభుత్వరంగ సంస్థల కోసం కేంద్రం రూ.1.28,915.43 కోట్లు కేటాయించింది. ఈ నిధుల్లో అత్యధికంగా బీఎస్‌ఎన్‌ఎల్‌కు దక్కాయి. బీఎస్ఎల్ఎన్, మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్‌లకు కలిపి రూ.1 లక్ష కోట్లకుపైగా కేటాయించగా అందులో బీఎస్‌ఎన్‌ఎల్ సాంకేతికత ఆధునీకరణ, సంస్థ పునర్ వ్యవస్థీకరణ కోసం రూ.82,916 కోట్లు కేటాయించారు. యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్‌లో అందుబాటులో ఉన్న రూ.17,000 కోట్లు ఇందులో కలిసే ఉన్నాయి. ఈ ఫండ్‌ను సందర్భానుసారం టెలికం సర్వీస్ ప్రొవైడర్లకు నష్టపరిహారంగా ఇవ్వడంతోపాటు భారత్‌నెట్, పరిశోధనాభివృద్ధి కార్యక్రమాల కోసం ఖర్చుచేయనున్నారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం కోసం రూ.1,806.34 కోట్లు కేటాయించారు. టెలికమ్యూనికేషన్స్‌లో వాడే మదర్‌బోర్డ్(ప్రింట్‌చేసిన సర్క్యూట్ బోర్డ్)లపై దిగుమతి సుంకాన్ని ఐదు శాతం పెంచాలని నిర్ణయించారు. దీంతో దిగుమతులు తగ్గి స్థానిక సంస్థల ఉత్పత్తి పెరిగి దేశీయ సంస్థలకు లబ్ధిచేకూరుతుందని ఆర్థిక మంత్రి నిర్మల చెప్పారు. తాజా పెంపుతో బేసిక్ కస్టమ్ డ్యూటీ 15 శాతానికి చేరుకోనుంది. లిథియం, కోబాల్ట్, కాపర్ వంటి అరుదైన, ఖరీదైన, కీలక ఖనిజ మిశ్రమాలతో తయారైన మదర్‌బోర్డ్‌లకు ఈ పెంపులో మినహాయింపు ఉంటుంది.



స్వల్ప కుదుపులతో విమానయానం

బడ్జెట్‌లో రూ. 2,357 కోట్లు కేటాయింపు

2023-24 సవరించిన అంచనాలతో పోలిస్తే 565 కోట్ల మేర తగ్గింపు

పౌర విమానయాన శాఖకు నిధుల్లో కేంద్రం కాస్త కోత పెట్టింది. ఈసారి బడ్జెట్‌లో గతేడాదికన్నా కేటాయింపులను తగ్గించింది. మొత్తంగా పౌరవిమానయాన శాఖకు రూ. 2,357.14 కోట్లు కేటాయించింది. ఇది 2023–24 సవరించిన బడ్జెట్ అంచనాలు రూ. 2,922.12 కోట్ల కంటే రూ. 565 కోట్లు తక్కువ కావడం గమనార్హం. అలాగే ప్రాంతీయ విమానయాన అనుసంధాన పథకానికి సైతం నిధులను తగ్గించింది. గతేడాది సవరించిన అంచనాల్లో రూ. 850 కోట్లు కేటాయించగా ఈసారి మాత్రం రూ. 502 కోట్లు మాత్రమే కేటాయించింది. అయితే డ్రోన్లు, డ్రోన్ల పరికరాలకు సంబంధించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్‌ఐ) పథకానికి మాత్రం కేటాయింపులు పెంచింది. ఈ పథకానికి 2023–24లో రూ. 33 కోట్లు కేటాయించగా ఈసారి బడ్జెట్‌లో రూ.57 కోట్ల మేర కేటాయింపులు చేసింది. ఇక డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)కు రూ. 302.64 కోట్లు, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్)కు రూ. 89 కోట్లు, ఎయిర్ ఇండియా రిటైర్డ్ ఉద్యోగుల వైద్య ఖర్చుల చెల్లింపులకు రూ. 85 కోట్లు, హోటల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు రూ. 57.14 కోట్ల మేర కేంద్రం కేటాయించింది.

EXPERT COMMENT

చక్రధర్ బుద్దా
లిబ్ టెక్ ఇండియా డైరెక్టర్



'ఉపాధి హామీ'కి పెరిగిన డిమాండ్‌ను, ద్రవ్యోల్బణం/సవరణ వేతన రేటుకు అనుగుణంగా ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులు ప్రతిబింబించాల్సి ఉండగా అలాంటిదేమీ జరగలేదు. గత ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో 5.74 కోట్ల పనిదినాలు ఎక్కువగా నమోదయ్యాయి. కానీ బడ్జెట్‌లో మాత్రం ఉపాధి హామీ పథకానికి గతేడాదిలాగానే రూ. 86 వేల కోట్లే కేటాయించారు.



తలసరి జీడీపీలో ఎవరెక్కడ?

ఒక దేశ జీడీపీ అంటే.. ఏడాదిలో ఆ దేశంలోని ఉత్పత్తి అయిన అంతిమ వస్తువులు, సేవల మొత్తం విలువ అని అర్థం. అంటే దేశమంతా కలసి ఉత్పత్తి చేసిన విలువ. అయితే ఎక్కువ జనాభా ఉన్న పెద్ద దేశాల జీడీపీ భారీగా ఉన్నా అవి అభివృద్ధి చెందుతున్న దేశాల కిందే లెక్క. తక్కువ జనాభా ఉన్న చిన్న దేశాల జీడీపీ తక్కువే ఉన్నా.. తలసరి జీడీపీ ఎక్కువగా ఉండటం వల్ల అవి సంపన్న దేశాల కింద లెక్క.



కేంద్రంలో మూడోసారి కొలువుదీరిన మోదీ 3.0 సర్కారు.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు నడుం బిగించింది. కీలకమైన కేంద్ర ప్రభుత్వ పథకాల (ఫ్లాగ్‌షిప్)కు ఈసారి బడ్జెట్లో దండిగానే నిధులు కేటాయించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో గ్రామీణాభివృద్ధికి (మౌలిక సదుపాయాలతో సహా) రూ. 2,38,204 కోట్లు కేటాయించగా (సవరించిన అంచనా రూ. 2,38,984 కోట్లు).. ఈ సారి బడ్జెట్లో (2024-25) దీన్ని రూ. 2,65,808 కోట్లకు పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ముఖ్యంగా ఉపాధి హామీకి మళ్లీ భారీగా నిధులతో పాటు గ్రామీణ రోడ్ల కోసం నాలుగో దశ, అదనంగా మరో 3 కోట్ల ఇళ్ల నిర్మాణం (పట్టణ, గ్రామీణ)పై ఫోకస్ చేయడం విశేషం!



పల్లెకు 3.0 ధమాకా!

ఉపాధికి మళ్లీ 'హామీ'..

అదనంగా 3 కోట్ల ఇళ్ల నిర్మాణం..
గ్రామీణ రోడ్లు రయ్ రయ్...

జోరుగా 'ఉపాధి'..

2024-25 కేటాయింపు:	2023-24 కేటాయింపు:
రూ.86,000 కోట్లు	రూ.60,000 కోట్లు

గతేడాది బడ్జెట్లో నిధుల కోతకు గురైన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి (ఎంజీఎన్ఆర్ ఈజీఏ) మళ్లీ కేటాయింపులు జోరందుకున్నాయి. ముఖ్యంగా మోదీ సర్కారు ఈ పథకాన్ని నీరుగారుస్తుందన్న విమర్శల నేపథ్యంలో 2024-25 బడ్జెట్లో కేటాయింపులు 40 శాతం మేర పెరగడం విశేషం. అయితే, 2023-24 సవరించిన అంచనాల (రూ. 86,000 కోట్లు)తో పోలిస్తే దాదాపు అదే స్థాయిలో ఉన్నాయి.

గ్రామీణ రోడ్లు.. నాలుగో దశ షురూ

2024-25 కేటాయింపు:	2023-24 కేటాయింపు:
రూ.19,000 కోట్లు	రూ.17,000 కోట్లు (సవరించిన అంచనా)

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కోసం అమలు చేస్తున్న ఈ ఫ్లాగ్‌షిప్ స్కీమ్ (ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పీఎంజీఎస్‌వై)కు ఈసారి బడ్జెట్లో ప్రాధాన్యం లభించింది. ఈ స్కీమ్ నాలుగో దశను సీతారామన్ ప్రకటించారు. 'పీఎంజీఎస్‌వై ఫేజ్-4లో భాగంగా 25,000 పల్లె ప్రాంతాలను పక్కా రోడ్లతో అనుసంధానం చేయనున్నాం. ఆయా ప్రాంతాల్లో జనాభా పెరుగుదలకు అనుగుణంగా రోడ్లను అభివృద్ధి చేస్తాం' అని మంత్రి పేర్కొన్నారు. 2023-24 సవరించిన అంచనాలు రూ. 17,000 కోట్లతో పోలిస్తే, 2024-25 పూర్తి స్థాయి బడ్జెట్లో కేటాయింపులు దాదాపు 12 శాతం పెరగడం గమనార్హం. స్కీమ్ మొదలైనప్పటి నుంచి ఈ ఏడాది జనవరి వరకు మొత్తం 8,15,072 కిలోమీటర్ల పొడవైన రోడ్లకు అనుమతులు మంజూరు కాగా, 7,51,163 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తయింది.




2024-25 కేటాయింపులు: రూ.80,671 కోట్లు
2023-24 కేటాయింపులు: రూ.54,103 కోట్లు (సవరించిన అంచనా)

పేదలు, మధ్య తరగతి వర్గాలకు సొంతింటి కల నెరవేర్చేలా బడ్జెట్లో ఈ పథకానికి నిధులు భారీగా పెంచారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద, బలహీన వర్గాలకు 2.95 కోట్ల ఇళ్లను నిర్మించాలనేది లక్ష్యం కాగా, 2023 మార్చి నాటికి 2.94 కోట్ల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. కాగా, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వచ్చే ఐదేళ్లలో అదనంగా మరో 3 కోట్ల ఇళ్ల నిర్మాణాన్ని ఈ స్కీమ్ కింద చేపట్టనున్నట్లు తాజా బడ్జెట్లో ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఇందులో రెండు కోట్ల ఇళ్లను గ్రామాల్లో, కోటి ఇళ్లను పట్టణ పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు అందించనున్నట్లు పేర్కొన్నారు. పీఎంఏవై (అర్బన్) 2.0 స్కీమ్ కోసం ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు సీతారామన్ వివరించారు. ఇందులో భాగంగా వడ్డీ రాయితీ, చౌక రుణాల రూపంలో రూ. 2.2 లక్షల కోట్ల సాయం అందిస్తామని చెప్పారు. రుణ ఆధారిత సబ్సిడీ స్కీమ్ (సీఎల్ఎస్ఎస్) కోసం ఈ బడ్జెట్లో రూ.4,000 కోట్లను కేంద్రం కేటాయించింది. మొత్తం మీద పీఎంఏవై (అర్బన్)కు ఈ బడ్జెట్లో రూ.30,170 కోట్లు దక్కాయి. 2023-24తో పోలిస్తే ఇది 20.19 శాతం ఎక్కువ.

స్వచ్ఛ భారత్ మిషన్..

2024-25 కేటాయింపు: రూ. 12,192 కోట్లు
2023-24 కేటాయింపు: రూ.9,550 కోట్లు (సవరించిన అంచనా)



దేశంలో బహిరంగ మలమూత్ర విసర్జనను పూర్తిగా తుడిచిపెట్టడానికి (ఓడీఎఫ్) 2014లో ఆరంభమైన ఈ స్వచ్ఛ భారత్ పథకం (ఎస్బీఎం) కిందికి ఘన వ్యర్థాల (చెత్త నిర్మూలన), జల వ్యర్థాల నిర్వహణను కూడా తీసుకొచ్చారు. ఈ మిషన్ కింద, గ్రామీణ ప్రాంతాల్లో ఓడీఎఫ్ స్టేటస్‌ను పూర్తిగా సాధించినట్లు కేంద్రం ప్రకటించింది. దీన్ని స్థిరంగా కొనసాగించడంతో పాటు అన్ని గ్రామాల్లోనూ ఘన వ్యర్థాల నిర్వహణ, మురుగు నీటి నిర్వహణను అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. స్వచ్ఛ భారత్ (అర్బన్) పథకానికి ఈ బడ్జెట్లో రూ.5,000 కోట్లు కేటాయించారు. 2023-24 బడ్జెట్ అంచనా (రూ.5,000 కోట్లు)తో పోలిస్తే అదే స్థాయిలో ఉన్నప్పటికీ, సవరించిన అంచనా (రూ.2,550 కోట్లు)తో పోలిస్తే నిధులు రెట్టింపయ్యాయి. ఇక స్వచ్ఛభారత్ (గ్రామీణ) స్కీమ్‌కు రూ.7,192 కోట్లు కేటాయించారు. సవరించిన అంచనా (రూ.7,000 కోట్లు)తో పోలిస్తే స్వల్పంగా పెరిగింది.



గ్రామీణ ప్రాంతాల భూములకు భూ-ఆధార్

పట్టణ ప్రాంత భూముల డిజిటైజేషన్
భూ సంస్కరణలు పూర్తి చేసే రాష్ట్రాలకు ఆర్థిక మద్దతు
కేంద్రం ప్రతిపాదన



న్యూఢిల్లీ: భూ సంబంధిత సంస్కరణల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని భూములకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య లేదా భూ-ఆధార్‌ను కేటాయించాలని కేంద్రం ప్రతిపాదించింది. పట్టణ భూ రికార్డులన్నిటినీ డిజిటైజేషన్ చేయాలని కూడా ప్రతిపాదించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భూ సంస్కరణలను ముందుకు తీసుకెళ్లడంపై రాష్ట్రాలతో కేంద్రం సంప్రదింపులు జరుపుతుందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. వచ్చే మూడేళ్లలో ఈ సంస్కరణలు పూర్తి చేసేందుకు రాష్ట్రాలను ప్రోత్సహించేలా కేంద్రం ఆర్థిక సాయం అందజేస్తుందని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భూ పరిపాలన, ప్రణాళిక, నిర్వహణ, పట్టణ ప్రణాళిక, వినియోగం భూ సంబంధిత సంస్కరణలు, చర్యల్లో భాగంగా ఉంటాయని ఆర్థికమంత్రి వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యల్లో యూనిక్ ల్యాండ్ పార్సిల్ ఐడెంటిఫికేషన్ నంబర్ (యూఎల్‌పీఐఎన్) లేదా భూ-ఆధార్ కేటాయింపు, ప్రస్తుత యాజమాన్యానికి అనుగుణంగా భూ మ్యాప్‌ల డిజిటైజేషన్, మ్యాప్ సబ్ డివిజన్ల సర్వే, భూముల రిజిస్ట్రీ తయారీ, దానికి రైతుల అనుసంధానం వంటివి ఉంటాయని తెలిపారు. రుణాలు, ఇతర వ్యవసాయ సేవలు పొందేందుకు కూడా ఈ చర్యలు దోహదపడతాయని కేంద్ర మంత్రి వివరించారు.

50 ఏళ్ల పాటు వడ్డీ రహిత రుణాలు

పట్టణ భూములను జీఐఎస్ మ్యాపింగ్‌తో డిజిటైజ్ చేయడం జరుగుతుందని ఆర్థికమంత్రి తెలిపారు. ఆస్తుల రికార్డు నిర్వహణ, అప్‌డేటింగ్, పన్నుల నిర్వహణ కోసం ఐటీ ఆధారిత వ్యవస్థను నెలకొల్పడం జరుగుతుందన్నారు. పట్టణ స్థానిక సంస్థల ఆర్థిక స్థితిని మెరుగు పరిచేందుకు ఈ చర్యలు దోహదపడతాయన్నారు. ఆర్థికాభివృద్ధికి, ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక విధానాల ఫ్రేమ్ వర్క్‌కు రూపకల్పన చేయనున్నట్లు చెప్పారు. వ్యవసాయ ఉత్పాదకతను మెరుగు పరచడానికి, ఆర్థిక అసమానతలు తొలగించడానికి సంస్కరణలు ఉపకరిస్తాయని అన్నారు. సంస్కరణలు సమర్థంగా అమలు కావాలంటే కేంద్ర, రాష్ట్రాల మధ్య సరైన సహకారం అవసరమని ఆర్థికమంత్రి పేర్కొన్నారు. పోటీ వాతావరణంతో కూడిన సమాఖ్య వాదాన్ని పెంపొందించేందుకు, రాష్ట్రాలు సంస్కరణలు వేగవంతంగా అమలు చేసేందుకు 50 సంవత్సరాల పాటు వడ్డీ రహిత రుణాలను ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు.

పట్టణ పేదల ఇళ్లకు.. 2.2 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ పథకం కింద వచ్చే ఐదేళ్లలో కోటి మంది పట్టణ పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు గృహ నిర్మాణాల నిమిత్తం రూ.2.2 లక్షల కోట్ల సాయం అందించాలని కేంద్రం నిర్ణయించింది. సరసమైన రేట్లతో రుణాలు అందించేందుకు వీలుగా వడ్డీ రాయితీని కూడా ప్రతిపాదించింది. మంగళవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ మేరకు ప్రకటన చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం (పీఎంఏవై) కింద 3 కోట్ల అదనపు గృహాలను ప్రకటించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఈ మేరకు నిధుల కేటాయింపు జరుపుతున్నామని చెప్పారు. కేంద్రసాయం రూ.2.2 లక్షల కోట్లతో కలిపి మొత్తం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడితో పీఎంఏవై అర్బన్ 2.0 పథకాన్ని చేపడతామని తెలిపారు. రెంటల్ హౌసింగ్ మార్కెట్లను ప్రోత్సహించేందుకు వీలుగా కేంద్రం విధానాలను రూపొందిస్తుందని చెప్పారు. అద్దె ఇళ్ల లభ్యతను పెంచడంతో పాటు నాణ్యత, పారదర్శకతకు అవసరమైన విధానాలు, నియమ నిబంధనలు రూపొందిస్తామని తెలిపారు. పారిశ్రామిక కార్మికుల కోసం డార్మెటరీ తరహా వసతులతో అద్దె గృహాలు నిర్మిస్తామని ఆర్థికమంత్రి వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో దీనిని చేపడతామన్నారు.



సరసమైన రేట్లకు రుణాలు.. వడ్డీ రాయితీ
మొత్తం రూ.10 లక్షల కోట్లతో పీఎంఏవై అర్బన్ 2.0

- రెంటల్ హౌసింగ్ మార్కెట్లకు ప్రోత్సాహం
- పారిశ్రామిక కార్మికుల కోసం అద్దె ఇళ్లు
- మహిళలు కొనే ఆస్తులపై సుంకం తగ్గింపు!

రాష్ట్రాలు స్టాంప్ డ్యూటీ తగ్గించాలి

మహిళలు కొనుగోలు చేసే ఆస్తులపై సుంకాన్ని మరింత తగ్గించే అంశంపై కేంద్రం దృష్టి సారిస్తున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. పట్టణాభివృద్ధి పథకాల్లో దీనినొక తప్పనిసరి అంశంగా చేయనున్నట్లు చెప్పారు. అధిక స్టాంప్ డ్యూటీ వసూలు చేసే రాష్ట్రాలు వాటిని తగ్గించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఆస్తుల కొనుగోలు లావాదేవీలపై రాష్ట్రాలు విధించే పన్నును స్టాంప్ డ్యూటీగా పేర్కొంటారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో దీనిని చెల్లించడం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలకు ఇదొక ప్రధాన ఆదాయ వనరు. ఇలావుండగా పన్ను ప్రయోజనాల విషయంలో ఆధార్ నంబర్‌కు బదులుగా ఆధార్ నమోదు ఐడీ వినియోగాన్ని నిలిపివేయాలని సీతారామన్ ప్రతిపాదించారు.

పెద్ద నగరాలకు రవాణా ఆధారిత అభివృద్ధి ప్రణాళిక

దేశంలో 30 లక్షలకు పైగా జనాభా కలిగిన 14 పెద్ద నగరాలకు రవాణా ఆధారిత అభివృద్ధి ప్రణాళికను కేంద్రం ప్రతిపాదించింది. నగరాల సృజనాత్మకతో కూడిన పునర్ అభివృద్ధి కోసం ఓ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందిస్తామని తెలిపింది. నగరాలను అభివృద్ధి కేంద్రాలు (గ్రోత్ హబ్‌లు)గా తీర్చిదిద్దేందుకు వీలుగా రాష్ట్రాలతో కలిసి పనిచేస్తామని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. టౌన్ ప్లానింగ్ పథకాల వినియోగంతో నగర చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధి, ఆర్థిక, రవాణా ప్రణాళిక ద్వారా దీనిని సాధిస్తామని చెప్పారు.




25 రకాల ఖనిజాలపై కస్టమ్స్ పన్ను రద్దు

అణు విద్యుత్ ఉత్పత్తి, పునరుత్పాదక ఇంధనాలతోపాటు అంతరిక్షం, రక్షణ, టెలికమ్యూనికేషన్లు, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాలకు అవసరమైన లిథియం, కాపర్, కోబాల్ట్ తదితర 25 ముఖ్య ఖనిజాలపై కస్టమ్స్ పన్ను రద్దు చేస్తున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఉక్కు, కాపర్ ఉత్పత్తిని పెంచడానికి ఫెర్రో నికెల్, బ్లిస్టర్ కాపర్‌పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ(బీసీడీ)ని తగ్గిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే గ్రాఫైట్, సిలికాన్ క్వార్ట్జ్/సిలికాన్ డయాక్సైడ్‌పై దిగుమతి పన్నును 2.5 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. సంప్రదాయ నుంచి సంప్రదాయేతర ఇంధనాల దిశగా మార్పునకు మరింత ఊతం ఇవ్వడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పన్ను రద్దు వల్ల ఆయా ఖనిజాల లభ్యత భారీగా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాలుష్యం, వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ఇంధన పరివర్తన అత్యవసరమని ఉద్ఘాటించారు.



క్రిటికల్ మినరల్ మిషన్

బెరీలియం, కాండియం, కోబాల్ట్, కాపర్, గ్రాఫైట్, ఇండియం, లిథియం, మాలిబ్డినం, నికెల్ వంటి 30 ఖనిజాల దేశీయ ఉత్పత్తి, రీసైక్లింగ్‌తోపాటు విదేశాల నుంచి సేకరించడానికి 'క్రిటికల్ మినరల్ మిషన్' ఏర్పాటు చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ వెల్లడించారు. టెక్నాలజీ డెవలప్‌మెంట్, స్కిల్డ్ వర్క్ ఫోర్స్‌ను సైతం ఈ మిషన్‌లో చేర్చనున్నట్లు వివరించారు. సముద్రాలల్లో ఉన్న ఖనిజాల బ్లాక్‌లను మైనింగ్ కోసం వేలం వేస్తామని అన్నారు. తొలి దశ వేలం ప్రక్రియ త్వరలో ప్రారంభమవుతుందని చెప్పారు.





అంతరిక్ష రంగానికి రూ. 13,042 కోట్లు

వెయ్యి కోట్లతో వెంచర్ క్యాపిటల్ ఫండ్
స్వాగతించిన పరిశ్రమ

న్యూఢిల్లీ: అంతరిక్ష సాంకేతికతను ప్రోత్సహిస్తూ రూ.1,000 కోట్లతో వెంచర్ క్యాపిటల్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. వచ్చే పదేళ్లలో అంతరిక్ష మార్కెట్‌ను ఐదు రెట్లు పెంచాలన్న తమ లక్ష్యంలో భాగంగా దీన్ని ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. అంతరిక్ష రంగానికి బడ్జెట్‌లో 18 శాతం అధికంగా ఈసారి రూ.13,042 కోట్లను కేటాయించడం గమనార్హం. ఇందులో సింహభాగం.. 10,087 కోట్లు ఇస్రో ఆధ్వర్యంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్, ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్, యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ తదితర సంస్థలకు వెళుతుంది. వెయ్యి కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్ నిర్ణయాన్ని పరిశ్రమ స్వాగతించింది. ఈ నిర్ణయం అంతరిక్ష విభాగంలో కొత్త వ్యాపారవేత్తలు, ప్రభుత్వేతర సంస్థలకు ప్రేరణనిస్తుందని ఇన్ స్పేస్ చైర్‌పర్సన్ పవన్ గోయెంకా అన్నారు. వినూత్న ఆవిష్కరణలు సాగించే స్టార్టప్‌లు, కంపెనీలకు వెంచర్ క్యాపిటల్ ఫండ్ రూపంలో కీలక ఆర్థిక సహకారం లభిస్తుందన్న అభిప్రాయాన్ని బెంగళూరుకు చెందిన స్టార్టప్ పిక్సెల్‌స్పేస్ సీఈవో అవాయిస్ అహ్మద్ అభిప్రాయపడ్డారు.



తాగునీటికి కటకట!

కేటాయింపులు అంతంతే..

తాగునీరు, పారిశుధ్య విభాగానికి 2024-25 బడ్జెట్‌లో రూ.77,390.68 కోట్లు కేటాయించారు. 2023-24 బడ్జెట్‌లో సవరించిన అంచనా(రూ.77,032.65) కంటే ఇది కేవలం 0.5 శాతం అధికం కావడం గమనార్హం. అత్యంత కీలకమైన తాగునీరు, పారిశుధ్యానికి నిధుల పెంపు స్వల్పమేనని స్పష్టమవుతోంది. ఈసారి కేటాయించిన నిధుల్లో జలజీవన్ మిషన్ అమలుకు రూ.69,926.65 కోట్లు ఖర్చు చేయనున్నారు. 2023-24 బడ్జెట్‌లో సవరించిన అంచనా కంటే రూ.80 కోట్లు అధికంగా కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయితో తాగునీరు సరఫరా చేసేందుకు ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్‌ను కేంద్రం ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. 2024 నాటికే ప్రతి ఇంటికీ కుళాయి నీరు సరఫరా చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. అయినప్పటికీ బడ్జెట్ కేటాయింపులు పెద్దగా పెంచకపోవడం చర్చనీయాంశంగా మారింది. డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వాటర్ అండ్ శానిటేషన్(ఎస్పీఎం-నివాస్)కు కేంద్ర బడ్జెట్‌లో రూ.95 కోట్లు కేటాయించారు. గత ఏడాది కంటే ఇది రూ.కోట్లు అధికం. స్వచ్ఛభారత్ మిషన్(గ్రామీణ)కు రూ.7,192 కోట్లు కేటాయించారు. ఈశాన్య రాష్ట్రాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య వసతులను మెరుగుపర్చడానికి రూ.7,632.19 కోట్ల కేటాయించారు. గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ కింద రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.5,169.86 కోట్లు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రూ.250 కోట్లు ఇవ్వనున్నారు.



విద్యుత్‌కు సోలార్ వెలుగులు

విద్యుత్, ఇంధన రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం

దేశ ప్రగతి రథానికి ఇరుసు లాంటి విద్యుత్, ఇంధన రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో స్పష్టంచేశారు. ఉద్యోగాల కల్పన, ఆర్థికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతూకం పాటించే విధానాలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్, ఇంధనం వంటివి ప్రజలందరికీ అందుబాటు ధరల్లో లభించాలన్నదే ప్రభుత్వ విధానమని వివరించారు. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్ల ద్వారా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు ఉద్దేశించిన పీఎం సూర్యఘర్ బిజిలీ యోజనను నిర్మలా సీతారామన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ పథకానికి అద్భుతమైన స్పందన లభిస్తోందని అన్నారు. ఇప్పటిదాకా 1.28 కోట్లకుపైగా రిజిస్ట్రేషన్లు జరిగాయని, 14 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలియజేశారు. విద్యుత్ రంగంలో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులకు మరింత ప్రోత్సాహం ఇస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పారు. విద్యుత్ నిల్వ, సరఫరాకు ఈ ప్రాజెక్టుల దోహదపడతాయన్నారు. అలాగే వికసిత్ భారత్ దిశగా విద్యుత్ రంగంలో అణు ఇంధనం పాత్ర కీలకమని మంత్రి వివరించారు. ప్రైవేట్ రంగం భాగస్వామ్యంతో భారత్ స్మాల్ రియాక్టర్లు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ భారత్ స్మాల్ రియాక్టర్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ న్యూయర్ టెక్నాలజీస్ ఫర్ న్యూక్లియర్ ఎనర్జీని నెలకొల్పనున్నట్లు ప్రకటించారు. అణు ఇంధన రంగంలో పరిశోధన, అభివృద్ధికి ఇతోధికంగా నిధులు ఇస్తామన్నారు.



మౌలికానికి.. 11.11 లక్షల కోట్లు

రాష్ట్రాలకు రూ.1.5 లక్షల కోట్ల వడ్డీ రహిత రుణం

దేశంలో రానున్న ఐదేళ్లలో మౌలిక రంగం పురోగతికి కేంద్రం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆర్థికమంత్రి ప్రకటించారు. 2024-25 సంవత్సరానికి మూలధన (క్యాపెక్స్) వ్యయం కోసం ప్రభుత్వం రూ. 11,11,111 కోట్లను అందజేస్తుందని తెలిపారు. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) అంచనాల్లో ఇది 3.4 శాతానికి సమానం. మౌలిక సదుపాయాలలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడానికి తగిన విధానాలు, నిబంధనలను అమల్లోకి తీసుకురావడం సహా వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ను (వీజీఎఫ్) ప్రవేశపెడుతుందని పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్రాలను సైతం ఇదే స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మంత్రి చెప్పారు. రాష్ట్రాలకు వనరుల కేటాయింపుల్లో మద్దతుగా నిలిచేందుకు ఈ ఏడాది కూడా దీర్ఘకాలిక వడ్డీ రహిత రుణాల కోసం రూ.1.5 లక్షల కోట్ల కేటాయింపు జరిగిందని పేర్కొన్నారు. కోవిడ్-19 నేపథ్యంలో మందగించిన ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడానికి అంతకుముందు రెండేళ్లలో కూడా ప్రభుత్వం మౌలిక సదుపాయాల అభివృద్ధికి 30 శాతానికి పైగా క్యాపెక్స్‌ను పెంచాల్సి వచ్చింది. 2020-21లో ప్రభుత్వం రూ. 4.39 లక్షల కోట్లను కేటాయించగా, ఆ తర్వాతి సంవత్సరంలో 35 శాతం పెరిగి రూ. 5.54 లక్షల కోట్లకు చేరుకుంది. 2022-23లో క్యాపెక్స్‌ను మరో 35 శాతం పెంచడంతో ఈ కేటాయింపులు 7.5 లక్షల కోట్లకు చేరాయి. గత 2023-24 బడ్జెట్‌లో ఈ కేటాయింపులు 37.4 శాతం వృద్ధితో రూ. 10 లక్షల కోట్లకు పెరగడం గమనార్హం.



సీఎల్ఎస్ఎస్‌కు 4,000 కోట్లు

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం 2.0లో వడ్డీ రాయితీని తిరిగి ప్రవేశపెట్టిన కేంద్రం.. క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయించింది. 2024-25 బడ్జెట్‌లో పీఎంఏవై అర్బన్ పథకానికి రూ.30,170 కోట్లను కేంద్రం కేటాయించింది. 2023-24 బడ్జెట్‌తో పోల్చుకుంటే ఇది 20.19 శాతం అదనం. ఈ వడ్డీ రాయితీ పథకం ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, అల్పాదాయ, మధ్య తరగతి వర్గాలకు త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

EXPERT COMMENT


వి.మురళీకృష్ణ
చైర్మన్, సీఐఐ ఏపీ చాప్టర్



రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల్లో ఏర్పాటు చేసే పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలతోపాటు పారిశ్రామిక కారిడార్లలో భాగంగా కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడం ద్వారా పారిశ్రామిక రంగం పరంగా రాష్ట్రం వేగంగా ముందుకు వెళుతుంది. రాష్ట్రాభివృద్ధికి సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి సారిస్తూ తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నాం.



20 24 బడ్జెట్





ముమ్మాటికీ కూటమి వైఫల్యమే

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి నేరుగా నిధులు తేలేకపోవడం కూటమి పార్టీల వైఫల్యమే. ఎన్డీయేలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ మరో భాగస్వామి జేడీయూ మాదిరిగా నిధులు తెచ్చుకోలేకపోయింది. అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయించామన్నారు. అదీ బ్యాంకుల నుంచి రుణాల ద్వారా అందిస్తామంటున్నారు. ఇప్పటికే అప్పుల భారంతో ఉన్న ఏపీపై మరింత భారం మోపే అవకాశం ఉంది. బిహార్‌లో జాతీయ రహదారుల అభివృద్ధికి రూ.26 వేల కోట్లు, పవర్‌ప్లాంట్ల నిమిత్తం రూ.21,400 కోట్లు, ఇతరత్రా ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. అదేవిధంగా పోలవరానికి కూడా రూ.20 వేల కోట్లు లేదా రూ.15వేల కోట్లు కేటాయించొచ్చుగా. ఇది రాష్ట్రానికి జరిగిన అన్యాయం.

– మద్దిల గురుమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎంపీ




కేంద్రం అన్నివిధాలుగా సహకరించింది

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్రం అన్నివిధాలుగా సహకరించింది. ఏపీ అభివృద్ధికి ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయం మరోసారి రుజువైంది. రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించడంపై సంతోషకరం. రాబోయే రోజుల్లో మరింత సహకారం అందుతుంది.

– బీహెచ్.శ్రీనివాసవర్మ, కేంద్ర మంత్రి, దగ్గుబాటి పురందేశ్వరి, ఎంపీ



ప్రజలకు ఊపిరినిచ్చేలా..

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రూ.15 వేల కోట్లు కేటాయించడం హర్షణీయం. 5 కోట్ల మంది ప్రజలకు ఊపిరినిచ్చేలా బడ్జెట్ రూపొందించారు. బడ్జెట్‌లో రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే అంశాలు చాలా ఉన్నాయి. పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని కేంద్రం చెప్పడం గర్వించదగిన విషయం. చంద్రబాబు కృషి వల్లే బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యత దక్కింది.

– కె.రామ్మోహన్‌నాయుడు, కేంద్ర పౌరవిమానయాన మంత్రి



ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా బడ్జెట్

దేశ, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా కేంద్ర బడ్జెట్ ఉంది. గ్రాంట్ రూపంలో అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయించడం అభినందనీయం. ఉత్తరాంధ్ర, రాయలసీమకు న్యాయం జరిగేలా కేటాయింపులు ఉన్నాయి. రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, పర్యాటకం తదితర ఆరు ప్రాజెక్టులకు బడ్జెట్‌లో కేటాయింపులపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీ

విద్యారంగానికి మొండిచేయి

బడ్జెట్లో విద్యారంగానికి కేంద్రం మొండిచేయి చూపించింది. విద్యాభివృద్ధి కోసం కనీసం కేటాయించాల్సిన నిధులను కేటాయించలేదు. గత బడ్జెట్‌లో ప్రతిపాదించిన డిజిటల్ గ్రంథాలయం, జాతీయ విద్యామిషన్ నిధులు, ఏకలవ్య పాఠశాలలో టీచర్ పోస్టులు భర్తీ, 157 నర్సింగ్ కళాశాలలు, ఐటీఐలకు నిధులు వంటి అంశాలను ప్రస్తావించకపోవడం దారుణం. యూజీసీ నిధులకు భారీగా కోతపెట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, పరిశోధనలకు ప్రత్యేక నిధుల కేటాయింపు లేదు.

– కె.ప్రసన్న కుమార్, ఎ.అశోక్, ఎస్ఎఫ్ఐ నేతలు



అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు


బడ్జెట్ ప్రసంగంలో స్పష్టం చేసిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

- వివిధ ఏజెన్సీల ద్వారా నిధులు సమకూరుస్తాం
- రానున్న రోజుల్లో మరిన్ని నిధులు అందజేస్తాం
- ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు
- తూర్పుతీర రాష్ట్రాలైన ఏపీ, ఒడిశా, పశ్చిమబెంగాల్‌లకు 'పూర్వోదయ'

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు ఆర్థిక సాయం చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఆ నిధులను బహుపాక్షిక అభివృద్ధి ఏజెన్సీల ద్వారా ఇస్తామని తెలిపారు. 'ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని హామీలను నెరవేర్చేందుకు మా ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసింది. రాష్ట్రానికి రాజధాని అవసరాన్ని గుర్తిస్తూ వివిధ అభివృద్ధి సంస్థల ద్వారా ప్రత్యేక ఆర్థిక సాయాన్ని సమకూరుస్తాం. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో రూ.15 వేల కోట్లు, రానున్న రోజుల్లో అదనపు మొత్తాలను అందచేస్తాం' అని ఆమె తన బడ్జెట్ ప్రసంగంలో స్పష్టం చేశారు. మంగళవారం 2024–25 వార్షిక బడ్జెట్‌లో భాగంగా ఆమె తన ప్రసంగంలో ఏపీ పునర్విభజన చట్టం, అందులో పేర్కొన్న అంశాలను ప్రస్తావించారు. రాష్ట్ర ప్రజల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడానికి కేంద్రం కట్టుబడి ఉందని, అందుకోసం ఆర్థిక సాయం చేస్తామని తెలిపారు. భారత ఆహార భద్రతకు పోలవరం ప్రాజెక్టు ఎంతో కీలకం అని చెప్పారు. రానున్న రోజుల్లో రాష్ట్ర అభివృద్ధికి అదనపు నిధులను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఏపీతో పాటు బీహార్‌కు కూడా రూ.11,500 కోట్ల నిధులు కేటాయించామన్నారు. వారణాసిలోని విశ్వనాథుని ఆలయం తరహాలో బీహార్‌లోని బుద్ధగయాలో ఒకటి ఏర్పాటు చేస్తామని తెలిపారు. బీహార్‌లో పారిశ్రామిక కారిడర్ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని అన్నారు.

వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ

ఏపీ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని నిర్మలా సీతారామన్ తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలోని వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు



ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. విభజన చట్టం ప్రకారం.. పారిశ్రామిక రంగం అభివృద్ధికి ప్రత్యేక సహకారం అందిస్తాం అన్నారు. హైదరాబాద్–బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వనున్నట్లు తెలిపారు. విశాఖపట్నం–చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని నోడ్‌లకు ప్రత్యేకంగా సాయం చేస్తామన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, రైల్వేలు, హైవేల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. చెన్నై కారిడార్‌లో కొప్పర్తికి, హైదరాబాద్–బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లుకు నిధులు ఇస్తామని చెప్పారు. తూర్పు తీర ప్రాంతాలైన ఏపీ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిర్ణయించుకున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. విద్య, మౌలిక వసతులు, ఆర్థిక అవకాశాలు కల్పించి వికసిత్ భారత్‌కు ఈ ప్రాంతాలు గ్రోత్ ఇంజన్ అయ్యేలా కృషి చేస్తామన్నారు. దీనికి పూర్వోదయ అనే ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు.

ఆ నిధులు ప్రపంచ బ్యాంకు నుంచి..

'బడ్జెట్ ప్రసంగంలో చెప్పినట్లుగా అమరావతి కోసం రూ.15 వేల కోట్లను వివిధ బ్యాంకుల ద్వారా అప్పుగా (రుణాలు) తీసుకుంటాం. ఏడీబీ లేక ఏఐబీ లేక ప్రపంచ బ్యాంకు నుంచి తీసుకుంటాం' అని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మరింత స్పష్టత ఇచ్చారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. తన ప్రసంగంలో చెప్పినట్లుగా భవిష్యత్‌లోనూ సాయాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అయితే ఆ మొత్తం ఎంత అన్నది చెప్పలేమని, పునర్విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణానికి కేంద్రమే సాయం చేయాలన్నారు. దానికి కేంద్రం కట్టుబడి ఉంది అని చెప్పారు. దేశంలోని జాతీయ ప్రాజెక్టులను కేంద్రం నిర్మిస్తుండగా.. పోలవరం మాత్రం అక్కడి రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు తాము గతంలోనే ఒప్పుకున్నామని గుర్తు చేశారు. పోలవరం, రాజధాని నిర్మాణంపై మీడియా అడిగిన పలు ప్రశ్నలకు నిర్మలా సీతారామన్ తెలుగులో జవాబు ఇచ్చారు. కేబినెట్ ద్వారా ఎంత అప్రూవల్ అయ్యిందో దానిమేరకు ఇప్పటి వరకు నిధులను ఇస్తూనే ఉన్నామని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణ విషయంలో ఒప్పందానికి లోబడి నిధులు ఇస్తామని స్పష్టం చేశారు. అయితే ఇటీవల కొన్ని కొత్త సమస్యలు వచ్చాయని, ప్రస్తుతం వాటి జోలికి వెళ్లడం లేదన్నారు.

బిహార్‌కు కేటాయింపులు ▶ ఏపీకి అప్పులు

ఈ ఆర్థిక సంవత్సరంలో ఏజెన్సీల ద్వారా రూ.15 వేలకోట్లు ఏర్పాటు
రాజధానికి వివిధ డెవలప్‌మెంట్ ఏజెన్సీల ద్వారా ప్రత్యేక మద్దతు

సాక్షి, అమరావతి: కేంద్రంలో అధికారంలో ఉన్న కూటమిలో భాగస్వామిగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర బడ్జెట్ ద్వారా రాష్ట్రానికి ప్రత్యేకంగా కేటాయింపులు చేయించడంలో విఫలమయ్యారు. బిహార్‌కు మాత్రం కేంద్ర బడ్జెట్‌లో భారీ కేటాయింపులు చేయగా ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం అప్పులు ఇప్పిస్తామని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. బిహార్‌కు ఒక న్యాయం ఆంధ్రప్రదేశ్‌కు మరో న్యాయం అనే రీతిలో కేంద్ర బడ్జెట్ ఉందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజధానికి వివిధ డెవలప్‌మెంట్ ఏజెన్సీల ద్వారా ప్రత్యేక మద్దతుగా ఈ ఆర్థిక సంవత్సరం రూ.15 వేలకోట్లు ఇప్పించే ఏర్పాటు చేస్తామని కేంద్ర ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. అయితే బడ్జెట్ డాక్యుమెంట్లలో ఎక్కడా రాజధాని కోసం కేటాయింపులు చేయలేదు. అంటే వివిధ ఏజెన్సీల ద్వారా ఇప్పించే రూ.15 వేలకోట్లు అప్పుగానే అని తేలిపోయింది. భవిష్యత్‌లో కూడా రాజధానికి అవసరమైన అప్పులు ఇప్పిస్తామని సీతారామన్ చెప్పారు. ప్రత్యేక ఆర్థిక మద్దతు అని పేర్కొన్నారు తప్ప ఎక్కడా గ్రాంటు, ఆర్థికసాయం అని చెప్పలేదు. ఈ నేపథ్యంలో ఏపీకి అప్పులు ఇప్పించడానికి మాత్రమే కేంద్రం ముందుకు వచ్చిందని, ఇదే విషయాన్ని బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించి చేతులు దులుపుకొన్నారని, దీనివల్ల రాష్ట్రానికి అప్పులు తప్ప పెద్దగా ప్రయోజనం లేదని అధికారవర్గాలు స్పష్టం చేస్తున్నాయి. బిహార్ రాష్ట్రానికి మాత్రం జాతీయ రహదారులకు ఏకంగా రూ.26 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ రాజధానికి మాత్రం ఏజెన్సీల ద్వారా రూ.15 వేలకోట్లు ఇప్పించే ఏర్పాటు చేస్తామని పేర్కొనడం అంటే ఏపీ పట్ల చిన్నచూపు చూడటమేనని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని అంశాలకు కట్టుబడి ఉన్నామంటూ ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలో ముక్తాయింపు ఇచ్చారు తప్ప ప్రత్యేకంగా కేటాయింపులేమీ చేయలేదు. మంత్రి ప్రసంగం నోటిమాటతో సంతృప్తి చెందాలనే చందంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లా అభివృద్ధికి సాయం కొనసాగుతుందని బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు తప్ప ఎక్కడా కేటాయింపులు చేయలేదు. ఇక గిరిజన యూనివర్సిటీకి, సెంట్రల్ యూనివర్సిటీకి బడ్జెట్‌లో ఏమీ ఇవ్వలేదు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న పెట్రోలియం యూనివర్సిటీకి మాత్రం రూ.168 కోట్లు కేటాయించారు. పునర్విభజన చట్టంలోని పలు వైద్య, విద్యాసంస్థలకు బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు చేయలేదు. చంద్రబాబు ప్రధానమంత్రి, కేంద్ర హోం, ఆర్థిక మంత్రులను కలిసి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా సాయం చేయాలని కోరారు. అయినా కేంద్ర ఆర్థికమంత్రి ఏపీకి ప్రత్యేకంగా అప్పులు ఇప్పిస్తామని ప్రకటించడం గమనార్హం. ద్రవ్య జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ చట్టం నిబంధనలకు లోబడే ఈ అప్పును ఇప్పిస్తారా లేదా ఆ నిబంధనల మినహాయింపులతో ఇప్పిస్తారా అనేది స్పష్టత రావాల్సి ఉంది.



అది అప్పే.. అయినా ఉపయోగమే

అమరావతికి రూ.15 వేల కోట్లపై సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం అమరావతి కోసం ప్రకటించిన రూ.15 వేల కోట్లు అప్పేనని, అయినా అది లాభదాయకమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. అసెంబ్లీ ఆవరణలో మంగళవారం ఆయన కేంద్ర బడ్జెట్‌పై కొందరు మీడియా ప్రతినిధులతో ముచ్చటించారు. వివిధ ఏజెన్సీల ద్వారా వచ్చే నిధులు కొన్ని అప్పు రూపేణా వస్తాయని చెప్పారు. అవి దాదాపు 30 ఏళ్ల తర్వాతే తీర్చేవి కాబట్టి అప్పటికి అంత భారమేమీ ఉండదన్నారు. ఈ ఏజెన్సీల నుంచి వచ్చే అప్పును కేంద్రం తన పూచీకత్తుతో ఇస్తుందని చెప్పారు. వచ్చే నిధుల్లో కొంత కేంద్ర గ్రాంట్ కూడా క్యాపిటల్ అసిస్టెన్స్ రూపేణా కలుస్తుందని, అది లాభమేనన్నారు. కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి అన్ని విధాలా తోడ్పాటు ఇచ్చేలా ఉందని చెప్పారు. తమ ప్రతిపాదనలు చాలా వరకు ఆమోదించారని, రాజధాని నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు ఇవ్వడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని తెలిపారు. దీని వల్ల రాష్ట్రానికి పన్నుల రూపేణా ఆదాయం పెరుగుతుందని వివరించారు. నిధులు ఏ రూపేణా వచ్చినా, అది రాష్ట్రానికి ఎంతో ఉపయోగమని స్పష్టం చేశారు. రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో కూరుకుపోయి ఉందని, అందుకు ఈ నిధులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రాజధాని నిర్మాణం బండి వేగం పుంజుకోవాలంటే ఈ నిధులు ఎంతో ఉపకరిస్తాయన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఇంత మేర నిధులు అని పెట్టకపోయినా, పూర్తి చేసే బాధ్యత తమదేనని కేంద్రం చెప్పిందని, తమకు అది చాలన్నారు. వెనుకబడిన జిల్లాలకు ఇచ్చే సాయం బుందేల్ ఖండ్ ప్యాకేజీ తరహాలో ఉంటుందనే సమాచారం ఉందని, అది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. పారిశ్రామిక రాయితీలు కూడా ఈ ప్యాకేజీలో భాగంగా వచ్చే అవకాశం ఉందని, ఇందులో నియమ నిబంధనలు పరిశీలించాక వాటిని అనుకూలంగా మలుచుకుంటామని తెలిపారు. వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశంను కూడా చేర్చటం ఆ జిల్లాకు ఎంతో ఉపయోగమన్నారు.

ప్రధాని, ఆర్థిక మంత్రికి అభినందనలు

అంతకుముందు ఎక్స్ వేదికగా కేంద్ర బడ్జెట్‌పై చంద్రబాబు స్పందించారు. రాష్ట్ర అవసరాలను గుర్తించి రాజధాని, పోలవరం, పారిశ్రామిక రంగాలతోపాటు ఏపీలోని వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించినందుకు ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి ఎన్ సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం అందించిన ఈ తోడ్పాటు ఏపీ భవిష్యత్తు పునర్నిర్మాణానికి దోహదం చేస్తుందన్నారు. ప్రగతిశీల, విశ్వాసాన్ని పెంచే బడ్జెట్ సమర్పించినందుకు తాను వారిని అభినందిస్తున్నానని చెప్పారు.

కేంద్ర పన్నుల్లో పెరిగిన ఏపీ వాటా



ఈ ఏడాది రూ.50,474.64కోట్లు కేటాయింపు
గత ఏడాదితో పోలిస్తే రూ.5,775.65 కోట్లు పెరిగిన పన్నులు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో పన్నుల్లో భాగంగా 2024–25లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.50,474.64 (4.047 శాతం) కోట్లు వాటా రానుంది. అందులో కార్పొరేషన్ పన్ను రూ.15,156.51 కోట్లు, ఆదాయపు పన్ను రూ.17,455.93 కోట్లు, సెంట్రల్ జీఎస్టీ రూ.15,079.39 కోట్లు, కస్టమ్స్ రూ.2,228.46 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ రూ.469.73 కోట్లు, సర్వీస్ టాక్స్ రూ.1.66 కోట్లు, ఇతర టాక్స్‌లు రూ.82.96 కోట్లు ఉన్నాయి. కాగా, గత బడ్జెట్‌లో కేంద్ర పన్నుల రూపంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.44,409.58 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. సవరించిన బడ్జెట్, పాత పద్దులతో కలిపి గతేడాదితో పోలిస్తే రాష్ట్రానికి వస్తున్న పన్నుల వాటా రూ.5,775.65 కోట్లు అధికం.

రాష్ట్ర సంస్థలకు కేటాయింపులు ఇవే

విశాఖ ఉక్కు సంస్థకు రూ.620 కోట్లు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ సంస్థకి రూ.168 కోట్లు కేటాయించారు. గిరిజన యూనివర్సిటీతో పాటు ఏపీ సెంట్రల్ వర్సిటీల కోసం ప్రత్యేకంగా ఎలాంటి కేటాయింపులు చేయలేదు. గతేడాది ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని గిరిజన విశ్వవిద్యాలయాలకు కలిపి రూ.37.67 కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. అదే సమయంలో ఏపీ సెంట్రల్ యూనివర్సిటీకి గతేడాది రూ.47.40 కోట్లు కేటాయించినప్పటికీ అనంతరం సవరించి రూ.112.08 కోట్లు కేటాయించినట్లు కేంద్రం వెల్లడించింది.

అంతా ప్రచార హడావిడి

కేంద్ర బడ్జెట్ ద్వారా రాష్ట్రానికి ఒనగూరే ప్రయోజనమేమీ లేదు ● వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విమర్శ

సాక్షి, అమరావతి : బడ్జెట్‌లో అంతా ప్రచార హడవిడి తప్ప రాష్ట్రానికి ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదని వైఎస్సార్‌సీపీ విమర్శించింది. గతంలో ఎన్డీయేలో టీడీపీ భాగస్వామిగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి ప్రచారాలే చేసుకుని డబ్బా కొట్టుకున్నారని ఎద్దేవా చేసింది. 2016 సెప్టెంబర్‌లో ప్రత్యేక హోదాకు బదులు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీకి అంగీకరించడం ద్వారా చంద్రబాబు ఏపీ ప్రజలను దారుణంగా మోసం చేశారని మండిపడింది. 'అర్ధరాత్రి అద్భుత ప్రకటన అంటూ నానా హడావిడి చేశారు. ప్రత్యేక హోదాతో రాష్ట్రం స్వర్గం అవుతుందా?' అంటూ రాష్ట్రం హక్కుపై సీఎం హోదాలో చంద్రబాబు తన చేతులతో తానే నీళ్లు చల్లారని మండిపడింది. ఈ మేరకు బడ్జెట్‌పై మంగళవారం ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

- 2014 –19 మధ్య రాజధాని కోసం ఖర్చు చేసింది రూ.5 వేల కోట్లే. ఇప్పుడు రూ.15 వేల కోట్లు వివిధ ఏజెన్సీల ద్వారా వచ్చే కొన్నేళ్లలో ఇస్తామంటూ కేంద్రం ప్రకటించింది. అంటే రూ.15 వేల కోట్లు అప్పుగా ఇస్తున్నారా? లేక గ్రాంటుగా ఇస్తున్నారా? అప్పుగా ఇస్తే అది రాష్ట్రానికి ఏ విధంగా లాభం అవుతుంది? చంద్రబాబు చెప్పింది ఏమిటి? జరుగుతున్నది ఏమిటి? ఇలాగైతే రాజధాని ఎప్పటికి పూర్తవుతుంది? ఇది ప్రజలను మోసం చేయడం కాదా?
- రాజధానిలో కేవలం రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ లాంటి కనీస మౌలిక సదుపాయాల కల్పనకే రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చవుతుందని గతంలో చంద్రబాబు ప్రభుత్వమే కేంద్రానికి డీపీఆర్ సమర్పించింది. ఈ పరిస్థితిలో రాజధాని కోసం కేంద్రం ఏం సహాయం చేసినట్లు?
- నాడు ప్రత్యేక ఆర్థిక సహాయంతో రాష్ట్రం రూపురేఖలు సమూలంగా మారిపోతాయని ఎల్లో మీడియాతో ఊదరగొట్టించారు. ఇవాళ కూడా అలాంటి ప్రచారాలే చేస్తున్నారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు, ప్రధాని పార్లమెంటులో ఇచ్చిన హామీలు.. ఇవన్నీ రాష్ట్రానికి ఒక హక్కు కింద రావాలి. ప్రత్యేక హోదా ఇస్తే వచ్చే ప్రయోజనాలు ఏ ప్యాకేజీతో తీరుతాయి? ఏ సర్దుబాట్లతో భర్తీ అవుతాయి?
- పోలవరం సవరించిన అంచనాలకు సంబంధించి రూ.55,656.87 కోట్ల ఆమోదం అంశం పెండింగ్‌లో ఉంది. దీనికి ఓకే చెప్పి ఆ నిధులను తెప్పించుకోకపోతే ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుంది? పోలవరంలో తక్షణ పనుల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పదేపదే ఒత్తిడి తెస్తే రూ.12 వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. ఆ నిధులు రాకుండా చంద్రబాబు అడ్డుకోవడం నిజం కాదా?
- వెనుకబడ్డ జిల్లాలకు ఏడాదికి రూ.50 కోట్లు చొప్పున ఏటా ఇస్తామని విభజన చట్టంలో హామీ ఇచ్చారు. నీతి ఆయోగ్ రూ.2,100 కోట్లు సిఫార్సు చేస్తే కేంద్రం 2014 –15 నుంచి మొదటి మూడేళ్లపాటు ఇచ్చింది రూ.1,050 కోట్లు. తర్వాత నిధుల విడుదల ఆపేసింది. మరి ఇప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటనతో అదనంగా వచ్చేది ఏముంది? ఇవ్వాల్సిన పెండింగ్ డబ్బులు ఇస్తారా? లేక అంతకంటే ఎక్కువ ఇస్తారా? తాను గతంలో డిమాండ్ చేసినట్టుగా బుందేల్‌ఖండ్ ప్యాకేజీ తరహాలో చంద్రబాబు రూ.22 వేల కోట్లు తెస్తారా?



ఏపీకి తీవ్ర అన్యాయం

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగింది. ఏపీకి ప్రత్యేక హోదా అంశాన్ని ప్రస్తావించకపోవడం చాలా అన్యాయం. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు ఇస్తున్నట్టు ప్రకటించినా.. ఈ నిధులను గ్రాంట్ కింద ఇస్తారా లేదా అప్పు రూపంలో ఇస్తారా అన్నది కేంద్రం స్పష్టం చేయలేదు. పోలవరం ప్రాజెక్టుకు కూడా బడ్జెట్‌లో సరైన ప్రాధాన్యత లభించలేదు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించకపోవడం కూడా రాష్ట్రానికి అన్యాయం చేసినట్టే. విభజన హామీలు, హక్కులు సాధించాల్సిన బాధ్యతపై టీడీపీ, జనసేనపైనే ఉంది.

– ఎన్.రఘువీరారెడ్డి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు



బడ్జెట్ నిరాశ కలిగించింది

కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశ కలిగించింది. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన దృష్ట్యా ఏపీకి ఇప్పుడైనా న్యాయం జరుగుతుందని భావించాం. భారీగా నిధులు వస్తాయని, విభజన చట్టంలోని అన్ని అంశాలు అమలుకు నిధులు కేటాయిస్తారని భావించాం. ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో ఏపీ పేరును పలుసార్లు ప్రస్తావించారు. కానీ.. నిధుల కేటాయింపులో మాత్రం నిరాశ మిగిల్చారు. రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లను ఆర్థిక సంస్థల ద్వారా అప్పు ఇప్పిస్తామని మంత్రి పేర్కొనటం వల్ల రాష్ట్రానికి, రాజధానికి మేలు జరగదు. రూ.15 వేల కోట్లను గ్రాంటుగా ప్రకటించాలి.

– వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి, సీపీఎం



ఆశాజనకంగా లేదు

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు కేంద్ర బడ్జెట్ ఆశాజనకంగా లేదు. ఏపీ రాజధాని నిర్మాణానికి చంద్రబాబు రూ.లక్ష కోట్లు అడిగితే.. కేవలం రూ.15 వేల కోట్లు మాత్రమే అప్పుగా ఇస్తామని కేంద్రం చెప్పడం హాస్యాస్పదం. మోదీ ప్రభుత్వానికి మద్దతు పలికిన టీడీపీ ఎంపీలు ప్రజలకు ఏం సమాధానం చెబుతారు. 2014లో నీళ్లు, మట్టి ఇచ్చిన ప్రధాని మోదీ ప్రతి బడ్జెట్‌లో ఏపీకి మొండిచేయి చూపడం బాధాకరం.

– పెరికె వరప్రసాదరావు, చైర్మన్, నేషనల్ దళిత జేఏసీ



దూరదృష్టితో బడ్జెట్ కేటాయింపులు

యువత, విద్య, నైపుణ్యం, పట్టణాభివృద్ధిపై దూర దృష్టితో బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. పేదలు, మహిళలు, రైతులపై బడ్జెట్‌లో ఎక్కువ ఫోకస్ చేశారు. రాష్ట్రానికి సంబంధించిన కేటాయింపులు అమలు అయ్యేలా కృషి చేస్తాం.

– ఎం.భరత్, ఎంపీ



బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దపీట

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దపీట వేయడం హర్షదాయకం. నవ్యాంధ్ర రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయించడం శుభసూచకం. ప్రత్యేకంగా పునర్విభజన చట్టం ప్రకారం ఏపీకి ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్టు ప్రకటించడంతోపాటు రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులిస్తామని వెల్లడించడం హర్షణీయం. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం చంద్రబాబు అభ్యర్థన మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిపిన ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌కు కృతజ్ఞతలు.

– కె.అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖమంత్రి



సహాయం సంతోషం

రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం 2024–25 బడ్జెట్‌లో అమరావతి, పోలవరం, ఇతర అభివృద్ధి పనుల కోసం సహాయం ప్రకటించడం రాష్ట్ర ప్రజలకు ఎంతో సంతోషాన్నిచ్చింది. రూ.15 వేల కోట్లు అమరావతికి సహాయం ప్రకటించడంతో పాటు అవసరమైనప్పుడు మరింత సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్రం ప్రకటించడం అత్యంత సంతృప్తిని కలిగించింది. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల ఆకాంక్షలు కార్యరూపం దాల్చడం ప్రారంభించాయి. ఇందుకు ధన్యవాదాలు చెబుతూ ప్రధాని మోదీకి మంగళవారం లేఖ రాశా.

– సత్యకుమార్ యాదవ్, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి



మోదీ జీ.. మీకు ప్రజల తరపున ధన్యవాదాలు

బడ్జెట్‌లో రాష్ట్రానికి అత్యధిక కేటాయింపులపై ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. గతంలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని దృష్టిలో పెట్టుకొని, సీఎం చంద్రబాబు అభ్యర్థనను ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని గౌరవించింది. ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్ కేటాయింపులపై ప్రధానికి రాష్ట్ర ప్రజల తరపున ధన్యవాదాలు.

– సోము వీర్రాజు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు

EXPERT COMMENT

ఆశిష్ చౌహాన్
ఎన్ఎస్ఈ సీఈవో




మార్కెట్లను ప్రభావితం చేయదు..

సెక్యూరిటీల లావాదేవీల పన్ను, స్వల్పకాలిక మూలధన లాభాల పన్నుపై బడ్జెట్ ప్రభావం చిన్న మార్పులుగా ఉంటాయి. ఇది మార్కెట్లను పెద్దగా ప్రభావితం చేయదు. ఒక వ్యక్తి యొక్క అన్ని ఆదాయాలపై పన్ను విధించబడే పాలనకు మారే దిశగా ఈ చర్యలు తొలి అడుగులు. పెట్టుబడిదారులు ఎత్తుగడల యొక్క చిక్కులను అర్థం చేసుకోకపోవడమే బడ్జెట్ ప్రకటన తదనంతర అమ్మకాల ఫలితం.



విమానయాన ఎంఆర్‌వోకు బూస్ట్

దేశీయంగా వైమానిక, నౌకా రంగాలకు ప్రోత్సాహాన్నిస్తూ నిర్వహణ, మరమ్మతులు, సమగ్ర తనిఖీలు (ఎంఆర్‌వో) కేంద్రాలకు ప్రోత్సాహక చర్యలను బడ్జెట్‌లో ప్రకటించారు. మరమ్మతుల కోసం దిగుమతి చేసుకునే యంత్రాలు, వస్తువుల తిరిగి ఎగుమతి గడువును 6 నెలల నుంచి ఏడాదికి పొడిగించారు. వారంటీలో భాగంగా మరమ్మతుల కోసం తిరిగి దిగుమతి చేసుకునే యంత్రాలు, వస్తువుల గడువును మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పెంచారు.



డెరివేటివ్స్ అంటే దడే!

- ఆప్షన్స్‌పై 0.062 శాతం నుంచి 0.1 శాతానికి పన్ను పెంపు
- ఫ్యూచర్స్‌పై 0.012 శాతం నుంచి 0.02 శాతానికి పెంపుదల
- 2024 అక్టోబర్ 1 నుంచి కొత్త ఎస్‌టీటీ రేట్లు అమలు


న్యూఢిల్లీ: బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్(డెరివేటివ్స్) లావాదేవీలపై పన్నును పెంచేందుకు ప్రతిపాదించారు. ఇందుకు అనుగుణంగా ఎఫ్అండ్‌వో సెక్యూరిటీస్‌లో ట్రాన్సాక్షన్ ట్యాక్స్(ఎస్‌టీటీ)ను పెంచారు. దీంతో సెక్యూరిటీల ఆప్షన్ విక్రయంపై ప్రస్తుతమున్న ఆప్షన్ ప్రీమియంలో 0.625 శాతం పన్ను 0.1 శాతానికి పెరగనుంది. ఇక సెక్యూరిటీల ఫ్యూచర్స్ విక్రయంపై సైతం 0.0125 శాతం నుంచి 0.02 శాతానికి పెంచారు. అక్టోబర్ 1 నుంచి పన్ను పెంపు అమల్లోకి రానుంది. నిజానికి ఎఫ్అండ్‌వో విభాగంలో ఇటీవల కొంతకాలంగా రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా ఆసక్తి చూపుతున్నారు. దీనిపై సెబీ, ఆర్థిక శాఖ, స్టాక్ ఎక్స్ఛేంజీలతోపాటు ఆర్థిక సర్వే సైతం ఆందోళన వ్యక్తం చేసింది. డెరివేటివ్స్ విభాగంలో రిటైలర్ల పార్టిసిపేషన్ భారీగా పెరిగిపోతుండటంతో జూదానికి దారితీస్తుందని ఆర్థిక సర్వే పేర్కొంది. ఈ నేపథ్యంలో సీతారామన్ ఎఫ్అండ్‌వో లావాదేవీలపై పన్నులను పెంచేందుకు నిర్ణయించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సెబీ చీఫ్ మాధవి పురి బచ్, ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ ఇటీవలే ఎఫ్అండ్‌వో లావాదేవీలు పెరుగుతుండటంపై రిటైలర్లకు హెచ్చరికలు జారీ చేశారు. రిటైలర్లను డెరివేటివ్స్ అత్యధికంగా ఆకట్టుకుంటున్న కారణంగా విశ్లేషకులు సైతం రిస్కులను అర్థం చేసుకోగలిగినవాళ్లు మాత్రమే లావాదేవీలను చేపట్టమంటూ అప్రమత్తం చేస్తున్నారు. సాధారణ ఇన్వెస్టర్లు వీటిని చేపట్టకపోవడమే మేలని సూచిస్తున్నారు.

టర్నోవర్ దూకుడు

డెరివేటివ్స్ విభాగంలో నెలవారీ టర్నోవర్ 2024 మార్చికల్లా కొన్ని రెట్లు ఎగసి రూ. 8,740 లక్షల కోట్లను తాకింది. 2019 మార్చిలో కేవలం రూ. 217 లక్షల కోట్లుగా నమోదుకావడం గమనార్హం! ఇదే కాలంలో నగదు విభాగంలోనూ రోజువారీ సగటు టర్నోవర్ రూ. లక్ష కోట్లను తాకగా.. ఎఫ్అండ్‌వోలో రూ. 330 లక్షల కోట్లకు చేరింది.

ఎఫ్అండ్‌వో అంటే?

ఒక షేరు లేదా కమోడిటీ విలువ ఆధారంగా కుదుర్చుకునే తాత్కాలిక కాంట్రాక్టుల లావాదేవీలను ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌గా పేర్కొనవచ్చు. అత్యధిక శాతం ట్రేడర్లు రిస్కుల రక్షణ(హెడ్జింగ్)కు, ధరల కదలికలపై అంచనాలు, షేర్లు లేదా కమోడిటీల ధర వ్యత్యాసాల లబ్ధికి సైతం వీటిలో లావాదేవీలను చేపడుతుంటారు. వెరసి వీటిని స్వల్పకాలిక లాభార్జనకు స్పెక్యులేటివ్ టూల్‌గా వినియోగిస్తుంటారు. అయితే మార్కెట్ ఆటుపోట్లు, లెవరేజ్.. తదితర రిస్కుల కారణంగా అత్యధికస్థాయిలో నష్టాలు సైతం వాటిల్లుతుంటాయి. సెబీ ఇటీవలి నివేదిక ప్రకారం రిటైల్ ఇన్వెస్టర్లలో 89 శాతంమంది డెరివేటివ్స్‌లో నష్టపోతున్నారు. 2021–22 ఏడాదిలో వీరికి సగటున రూ. 1.1 లక్ష చొప్పున నష్టాలు నమోదయ్యాయి. కరోనా కాలంలో ఎఫ్అండ్‌వో ఇన్వెస్టర్ల సంఖ్య 500 శాతం దూసుకెళ్లింది. 2019లో ఈ సంఖ్య 7.1 లక్షలుకాగా.. 2021కల్లా 45.24 లక్షలకు జంప్‌చేసింది.



ఎల్‌టీసీజీలో సవరణలు

కేంద్రానికి రూ. 15,000 కోట్ల అదనపు ఆదాయం

బడ్జెట్‌లో వివిధ ఆస్తుల(సెక్యూరిటీలు, స్థిరాస్తులు) హోల్డింగ్ కాలావధి ఆధారంగా క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్‌లను క్రమబద్ధీకరించారు. ఏడాదికి మించి లిస్టెడ్ ఫైనాన్షియల్ ఆస్తుల హోల్డింగ్‌తోపాటు.. రెండేళ్లకు మించి ఆర్థికేతర ఆస్తులు, అన్‌లిస్టెడ్ ఆస్తుల హోల్డింగ్స్ దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ (ఎల్‌టీసీజీ) జాబితాలో చేరనున్నాయి. అన్‌లిస్టెడ్ బాండ్లు, డిబెంచర్లను మినహాయించి(వీటికి సంబంధిత స్లాబ్‌లు వర్తిస్తాయి) వివిధ ఆస్తులపై దీర్ఘకాలిక లాభాల పన్ను సగటున 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచారు. ఇక స్వల్పకాలిక క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్‌ను 15 శాతం నుంచి 20 శాతానికి పెంచారు. ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్, బిజినెస్ ట్రస్ట్ యూనిట్లు వీటిలోకి వస్తాయి. అయితే ఆర్థికేతర ఆస్తులపై 20 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గించారు. అయితే ఇండెక్సేషన్ లబ్ధిని ఎత్తివేశారు. ఎల్‌టీసీజీ పన్ను మినహాయింపు పరిమితి రూ. లక్ష నుంచి రూ. 1.25 లక్షలకు పెంచారు. కాగా... మూలధన లాభాలపై పన్ను(క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్) రేట్ల సవరణ కారణంగా రూ. 15,000 కోట్లమేర అదనపు ఆదాయం సమకూరే వీలున్నట్లు రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా అంచనా వేశారు.



5 రెట్లు అధికమైనా..

డెరివేటివ్స్‌లో ఎస్‌టీటీ 5 రెట్లు పెరగనున్నట్లు సిట్రస్ అడ్వయిజర్స్ వ్యవస్థాపకుడు సంజయ్ సిన్హా పేర్కొన్నారు. ఇటీవల ఈ విభాగంలో లావాదేవీలు భారీగా పెరిగిన నేపథ్యంలో పన్ను పెంపు ఊహించిందేనని తెలియజేశారు. అయితే పన్ను పెంపు అమల్లోకిరానున్న 2024 అక్టోబర్ 1 నుంచి ఎక్స్ఛేంజీల టర్నోవర్ చార్జీలు తగ్గనున్నట్లు కొటక్ సెక్యూరిటీస్ డిజిటల్ బిజినెస్ హెడ్ ఆశిష్ నందా పేర్కొన్నారు. ఉదాహరణకు ఆప్షన్స్‌పై రూ. 10,000 రౌండ్ ట్రిప్ ప్రీమియంపై ఎస్‌టీటీ రూ. 3.75 పెరుగుతుందనుకుంటే.. టర్నోవర్ చార్జీలు రూ. 3.5–4 స్థాయిలో తగ్గనున్నట్లు వివరించారు. దీంతో నికరంగా ప్రభావం ఉండకపోవచ్చని అభిప్రాయపడ్డారు.



బైబ్యాక్ షేర్లపైనా పన్ను

డివిడెండ్ తరహాలో విధింపు

బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం డివిడెండ్ తరహాలో బైబ్యాక్ చేసే షేర్లపై వాటాదారులు పన్ను చెల్లించవలసి ఉంటుంది. అక్టోబర్ 1నుంచి అమల్లోకి రానున్న నిబంధనలతో ఇకపై బైబ్యాక్ షేర్లకు వాటాదారులపై పన్ను విధించనున్నారు. వెరసి కంపెనీలు చేపట్టే బైబ్యాక్‌లో భాగంగా షేర్లకు చెల్లించే సొమ్ముపై డివిడెండ్ తరహాలో వాటాదారులపైనే పన్ను భారం పడనుంది. ఇది ఇన్వెస్టర్లపై పన్ను భారాన్ని మరింత పెంచనుంది. మరోవైపు ఎస్‌టీటీతోపాటు.. స్వల్పకాలిక లాభాలపై పన్ను పెంపునకు తాజా బడ్జెట్ తెరతీసిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకూ బైబ్యాక్ షేర్లకు కంపెనీలే పన్ను చెల్లిస్తున్నాయి.



మ్యాచ్ విన్నింగ్ బడ్జెట్..

ప్రపంచ కప్ గెలిచిన తర్వాత.. టీమ్ ఇండియా కోసం ఆర్థిక మంత్రి సీతారామన్ ద్వారా ఒక మ్యాచ్ విన్నింగ్ బడ్జెట్ ఇది. సామాన్యుల ప్రయోజనాలపై బడ్జెట్ దృష్టి సారిస్తుంది. అనుభవజ్ఞుడైన కెప్టెన్ నాయకత్వంలో దేశం నాడిని పెంపొందించే కచ్చిత, వివరణాత్మక, పరిశోధించి రూపొందించిన బడ్జెట్.

– హర్ష్ గోయెంకా, చైర్మన్, ఆర్‌పీజీ ఎంటర్‌ప్రైజెస్.



పెట్టుబడులను ఆకర్షిస్తుంది..

ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించడానికి, స్థిర భవిష్యత్తును ప్రోత్సహించడానికి రూపొందించిన దార్శనికత, ఆచరణాత్మక బ్లూప్రింట్. ఇది వినియోగాన్ని ప్రేరేపిస్తుంది. గణనీయంగా పెట్టుబడులను ఆకర్షిస్తుంది. ద్రవ్యోల్బణాన్ని స్థిరీకరిస్తుంది. భారత్‌ను సాంకేతికతతో నడిచే, విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టింది.

– పవన్ ముంజాల్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హీరో మోటోకార్ప్.



సమగ్ర రోడ్‌మ్యాప్..

ప్రజల–కేంద్రీకృత బడ్జెట్. ఇది ఆర్థిక స్థిరత్వంతో సమానమైన వృద్ధిని సమతుల్యం చేస్తుంది. ఉద్యోగాల కల్పనపై దృష్టి సారిస్తూనే సుస్థిర, సమాన వృద్ధి కోసం ప్రభుత్వం సమగ్ర రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించింది.

– సంజీవ్ పురి, ప్రెసిడెంట్, సీఐఐ.

చిన్న సంస్థలకు ఊతం..

యంత్రాలు, పరికరాల కొనుగోలుకు రుణ హామీ పథకం

న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) తోడ్పాటు అందించే దిశగా బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చర్యలు ప్రతిపాదించారు. యంత్ర పరికరాల కొనుగోలు కోసం ఎటువంటి కొలేటరల్ లేదా థర్డ్ పార్టీ గ్యారంటీ లేకుండా టర్మ్ లోన్స్ తీసుకునే వెసులుబాటు లభించేలా రుణ హామీ పథకాన్ని ప్రకటించారు. దీనికోసం విడిగా సెల్ఫ్–ఫైనాన్సింగ్ గ్యారంటీ ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇది ఒక్కో దరఖాస్తుదారుకు రూ. 100 కోట్ల వరకు రుణాలకు (తీసుకున్న రుణ మొత్తం ఎంతైనా సరే) హామీ ఇస్తుందని పేర్కొన్నారు. దీన్ని పొందేందుకు రుణగ్రహీత ముందస్తుగా నిర్దిష్ట గ్యారంటీ ఫీజును, రుణ బ్యాలెన్స్ తగ్గే కొద్దీ వార్షిక ఫీజును కట్టాల్సి ఉంటుంది. ఎస్ఎంఈలకు గడ్డు కాలంలో కూడా రుణ సదుపాయం అందుబాటులో ఉండేలా చూసేందుకు కొత్త విధానాన్ని కేంద్రం ప్రతిపాదించింది. తమ పరిధిలో లేని కారణాల వల్ల స్పెషల్ మెన్షన్ అకౌంటు (ఎస్ఎంఏ) దశలోకి చేరిన ఎంఎస్ఎంఈలు ఆ తదుపరి మొండి బాకీల్లోకి జారిపోకుండా సహాయం పొందేందుకు ఇది ఉపయోగపడగలదని పేర్కొంది.



కొత్త అసెస్‌మెంట్ విధానం..: ఎంఎస్ఎంఈలకు రుణాల విషయంలో కొత్త మదింపు విధానాన్ని మంత్రి ప్రతిపాదించారు. అసెస్‌మెంట్ కోసం బైటి సంస్థలపై ఆధారపడకుండా ప్రభుత్వ రంగ బ్యాంకులు దానికి సంబంధించి అంతర్గతంగా సొంత విధానాన్ని రూపొందించుకోవాలని పేర్కొన్నారు. సంప్రదాయ అసెస్‌మెంట్ విధానంతో పోలిస్తే ఈ మోడల్ మెరుగ్గా ఉండగలదని నిర్మలా సీతారామన్ చెప్పారు. ఇక ఎంఎస్ఎంఈలు, సంప్రదాయ చేతి వృత్తుల వారు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయించుకునేందుకు తోడ్పాటు అందించేలా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో ఈ–కామర్స్ ఎక్స్‌పోర్ట్ హబ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.



స్టార్టప్స్‌కు జోష్

ఏంజెల్ ట్యాక్స్ తొలగింపు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అంకుర సంస్థలకు ఊరటనిచ్చే దిశగా అన్ని తరగతుల ఇన్వెస్టర్లకు ఏంజెల్ ట్యాక్స్‌ను తొలగిస్తున్నట్లు సీతారామన్ ప్రకటించారు. దేశీయంగా స్టార్టప్ వ్యవస్థకు, ఎంట్రప్రెన్యూర్‌షిప్‌నకు, నవకల్పనలకు ఊతమివ్వడానికి ఇది తోడ్పడగలదని ఆమె తెలిపారు. సముచిత మార్కెట్ విలువకు మించిన వేల్యుయేషన్లతో అన్‌లిస్టెడ్ కంపెనీలు లేదా స్టార్టప్‌లు సమీకరించే నిధులపై విధించే ఆదాయ పన్నును ఏంజెల్ ట్యాక్స్‌గా వ్యవహరిస్తారు. ఇది స్టార్టప్‌లతో పాటు ఇన్వెస్ట్ చేసే మదుపర్లకు సమస్యగా మారింది. గతంలో ఏంజెల్ ట్యాక్స్ స్థానిక ఇన్వెస్టర్లకే పరిమితం కాగా 2023–24లో కేంద్రం దీన్ని విదేశీ పెట్టుబడులకు కూడా వర్తింపచేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజా బడ్జెట్‌లో దీన్ని తొలగించాలంటూ పరిశ్రమలు, అంతర్గత వాణిజ్యం ప్రోత్సాహ విభాగం (డీపీఐఐటీ) సిఫార్సు చేసింది. నూతన ఆవిష్కరణలకు, భారత్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మారడానికి మార్గం సుగమం చేసే దిశగా ఇది కీలక అడుగని టీ హబ్ సీఈవో మహంకాళి శ్రీనివాస్ రావు తెలిపారు. ఇది అంకుర సంస్థలతో పాటు వాటికి మద్దతుగా నిల్చే ఇన్వెస్టర్లు, ప్రైవేట్ ఈక్విటీలు, వెంచర్ ఫండ్స్‌కూ సానుకూలమని న్యాయ సేవల సంస్థ ఇండస్‌లా పార్ట్‌నర్ లోకేష్ షా చెప్పారు.

పసిడి.. వెండి.. ఊరట!

- కస్టమ్స్ సుంకం భారీగా తగ్గింపు
- 15 నుంచి 6 శాతానికి కోత
- రూ. 3000 పైగా దిగొచ్చిన ధరలు

న్యూఢిల్లీ: ఇటు బులియన్ పరిశ్రమకు అటు ఆభరణాల ప్రియులకు ఊరటనిస్తూ ఆర్థికమంత్రి కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకాలు ప్రస్తుతం 15 శాతంకాగా, ఈ రేటును 6 శాతానికి తగ్గిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. ఇందులో ప్రాథమిక కస్టమ్స్ సుంకం (బీసీడీ) 10 నుంచి 5 శాతానికి తగ్గగా, అగ్రికల్చరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సెస్ (ఏఐడీసీ) 5 శాతం నుంచి 1 శాతానికి చేరింది. ఇక విలువైన లోహాల నాణేలు, హుక్, క్లాస్ప్, క్లాంప్, పిన్, క్యాచ్, స్క్రూ బ్యాక్ వంటి చిన్న భాగాలకు సంబంధించిన బంగారం–వెండి ఫైండింగ్స్, బంగారం, వెండి కడ్డీలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని కూడా 15 శాతం నుంచి 6 శాతానికి బడ్జెట్ తగ్గించింది. మరింత మెరుగుదల అవసరమైన బంగారం, వెండి డోర్‌లపై కస్టమ్స్ సుంకం 14.35 శాతం నుంచి 5.35 శాతానికి తగ్గించారు. ''దేశంలో బంగారం, విలువైన లోహ ఆభరణాల పరిశ్రమకు ఊతం ఇవ్వడానికి బంగారం– వెండిపై కస్టమ్స్ సుంకాలను 6 శాతానికి తగ్గించాలని నేను ప్రతిపాదిస్తున్నాను'' అని ఆర్థికమంత్రి తెలిపారు. ప్లాటినం, పల్లాడియం, ఓస్మియం, రుథేనియం, ఇరిడియంలపై లెవీని కూడా 15.4 శాతం నుంచి 6.4 శాతానికి బడ్జెట్‌లో తగ్గించారు.

రాజధానిలో రూ.3,350 తగ్గుదల

ఇక ఆర్థిక మంత్రి కీలక ప్రకటన నేపథ్యంలో స్పాట్ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలు భారీగా పడ్డాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలో 10 గ్రాములు పూర్తి స్వచ్ఛత (99.9 శాతం ప్యూరిటీ) పసిడి ధర క్రితం ముగింపుతో పోల్చితే రూ.3,350 తగ్గి, రూ.72,300కు దిగివచ్చింది. 99.5 స్వచ్ఛత ధర కూడా ఇదే స్థాయిలో దిగివచ్చి రూ.71,950 స్థాయికి చేరింది. వెండి కేజీ ధర సైతం రూ.3,500 (4 శాతం) తగ్గి రూ.87,500కు దిగివచ్చింది. ఇక దేశ ఆర్థిక రాజధాని ముంబై విషయానికి వస్తే, 99.9 స్వచ్ఛత, 99.5 స్వచ్ఛత 10 గ్రాముల ధరలు క్రితం ముగింపుతో పోల్చితే రూ.3,614 రూ.3,602 చొప్పున తగ్గి వరుసగా రూ.69,602, రూ.69,323కు దిగివచ్చాయి. ఇక వెండి కేజీ ధర రూ.3,275 తగ్గి రూ.84,919కి దిగింది.

ఫ్యూచర్స్‌లో రూ.4,000 డౌన్

ఆర్థికమంత్రి ప్రకటన వెంటనే ఫ్యూచర్ మార్కెట్ మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో చురుగ్గా ట్రేడవుతున్న బంగారం ఆగస్టు కాంట్రాక్ట్ 10 గ్రాముల ధర క్రితం ముగింపుతో పోల్చితే దాదాపు రూ.4,000 పడిపోయి (5 శాతంపైగా) రూ.68,500కు చేరింది. కేజీ వెండి ధర సైతం రూ.88,995 నుంచి రూ.84,275కు దిగివచ్చింది.

అంతర్జాతీయంగా ధర ఇలా...

అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్ న్యూయార్క్ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఈ నెల 16వ తేదీన ఔన్స్‌కు (31.1గ్రా) ఆల్‌టైమ్ హై 2,489 డాలర్లను తాకిన పసిడి ఆగస్టు కాంట్రాక్ట్ ధర మంగళవారం 2,400 డాలర్లపైన ట్రేడవుతోంది.



తీపికబురే కానీ...

కస్టమ్స్ సుంకాలు తగ్గించడం తక్షణ డిమాండ్‌కు సంబంధించి బులియన్ పరిశ్రమ, వినియోగదారుకు తీపి కబురే అయినప్పటికీ ఈ నిర్ణయంపై రానున్న కాలంలో భౌగోళిక ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా బంగారం ధరల పెరుగుదల, దేశీయంగా డాలర్ మారకంలో రూపాయి విలువల కదలికలు ప్రభావం చూపుతాయి.



డిజిటల్ పెట్టుబడికి అవకాశం

కస్టమ్స్ సుంకం తగ్గింపు బులియన్ మార్కెట్‌ను తక్షణం ప్రభావితం చేసే అంశమే. ఇది పెట్టుబడిదారులకు సానుకూల చర్య అయినప్ప టికీ, చైనాసహా ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇప్పటికీ బంగారం ధరలను ప్రభావితం చేయవచ్చు. 2.5% వార్షిక వడ్డీని అందించే సావరిన్ గోల్డ్ బాండ్స్ వంటి డిజిటల్ ఆప్షన్‌లలో పెట్టుబడి పెట్టడానికి ఇది తగిన సమయం.

– మహేంద్ర లూనియా, విఘ్నహర్తా గోల్డ్ లిమిటెడ్ చైర్మన్

షేర్ల మెరుపులు

సుంకం తగ్గింపుతో పసిడి ఆభరణాల సంస్థల షేర్లు పరుగులు పెట్టాయి.

షేరు	ముగింపు (ధర రూ.లలో)	పెరుగుదల (%)
టీబీజెడ్	155	14
టైటాన్ కంపెనీ	3,467	7
రాజేష్ ఎక్స్‌పోర్ట్స్	316	6
సెంకో గోల్డ్	990	5
పీసీ జ్యువెలర్	74	5
కల్యాణ్ జ్యువెల్లర్స్	553	4

మొబైల్స్ ఇక చౌక..!

దిగుమతి సుంకాలు తగ్గింపు ● 20 శాతం నుంచి 15 శాతానికి కట్

న్యూఢిల్లీ: దిగుమతి చేసుకున్న మొబైల్ ఫోన్లు, చార్జర్లు, హ్యాండ్‌సెట్ల తయారీలో ఉపయోగించే కొన్ని పరికరాల ధరలు తగ్గనున్నాయి. వీటిపై దిగుమతి సుంకాలను 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇది దేశీయంగా తయారీని ప్రోత్సహించేందుకు, ఎగుమతుల్లో మిగతా దేశాలతో పోటీపడేందుకు తోడ్పడగలదని మొబైల్ ఫోన్ సంస్థల సమాఖ్య ఐసీఈఏ చైర్మన్ పంకజ్ మహీంద్రూ చెప్పారు. 'దిగుమతి చేసుకునే కొన్ని మోడల్స్ ధర 5 – 5.5 శాతం వరకు ధర తగ్గవచ్చు. చార్జర్లపై సుంకాలను తగ్గించడమనేది ఫోన్ తుది ధరపై 0.15 – 0.20 శాతం వరకు ప్రభావం చూపవచ్చు' అని వివరించారు. ప్రస్తుతం భారత్‌లో అమ్ముడవుతున్న మొబైల్ ఫోన్లలో సింహ భాగం ఫోన్లు దేశీయంగా తయారైనవే ఉంటున్నాయి. మరోవైపు, మొబైల్ ఫోన్లలో ఉండే కనెక్టర్ల తయారీలో ఉపయోగించే నిర్దిష్ట ఉత్పత్తులకు సుంకాల నుంచి మినహాయింపునివ్వాలని కూడా కేంద్రం నిర్ణయించింది. తమ సంస్థ సుమారు 100 శాతం స్మార్ట్‌ఫోన్లను దేశీయంగానే తయారు చేస్తోందని, ఇందుకు అవసరమైన దాదాపు అన్ని విడిభాగాలను స్థానికంగానే కొనుగోలు చేస్తున్నామని షావోమీ ఇండియా ప్రెసిడెంట్ బి. మురళీకృష్ణన్ తెలిపారు. టారిఫ్ రేట్ల స్వరూపాన్ని సమగ్రంగా సమీక్షించాలన్న ప్రతిపాదన.. పరిశ్రమను మరింత బలోపేతం చేసే దిశగా సానుకూల చర్య అని పేర్కొన్నారు.



ధర తగ్గేది హైఎండ్ ఫోన్లే

మొబైల్ ఫోన్లపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని (బీసీడీ) ప్రస్తుతం ఉన్న 20 నుంచి 15 శాతానికి తగ్గిస్తూ తాజాగా బడ్జెట్‌లో కేంద్రం ప్రతిపాదించింది. అయితే తగ్గింపు ప్రభావం కేవలం హైఎండ్ స్మార్ట్‌ఫోన్లకు మాత్రమే ఉండనుంది. కారణం ఏమంటే భారత్‌లో అమ్ముడవుతున్న 95 శాతం ఫోన్లు దేశీయంగా తయారవుతున్నవే. అంటే దిగుమతి అవుతున్నవి కేవలం 5 శాతమే. బీసీడీ తగ్గింపుతో కొన్ని ఐఫోన్ మోడళ్లు, శామ్‌సంగ్, ఒప్పో, వివో, వన్‌ప్లస్ వంటి ఇతర సంస్థలు తయారు చేస్తున్న ఫోల్డబుల్ ఫోన్ల ఖరీదు 5 శాతం తగ్గనుంది. పూర్తిగా తయారైన మొబైల్ ఫోన్లపై సుంకాలు పెంచడం, స్థానిక ఉత్పత్తికి అవసరమైన విడి భాగాలపై సుంకాలు మినహాయించడం వంటి ప్రభుత్వ విధానాల కారణంగా దిగుమతులు గడిచిన దశాబ్దం నుంచి తగ్గుతూ వస్తున్నాయి.

చంద్రజిత్ బెనర్జీ
డైరెక్టర్ జనరల్, సీఐఐ



భావితరం సంస్కరణలు..

వృద్ధిని నడపడానికి భారత విజయవంతమైన సంపూర్ణ ఆర్థిక వ్యూహానికి కొనసాగింపును ఈ బడ్జెట్ అందిస్తుంది. గడిచిన రెండు పర్యాయాల్లో ప్రభుత్వం విజయవంతమైన ఆర్థిక వ్యూహాన్ని ముందుకు తీసుకువెళ్లింది. పెట్టుబడులు, సంస్కరణలు, సాధికారతపై బడ్జెట్ దృష్టి సారించింది. ఉపాధి కల్పన, వృద్ధి అనే జంట లక్ష్యాలతో, తదుపరి తరం సంస్కరణలను రాష్ట్రాలతో కలిసి ముందుకు తీసుకెళ్లడంపై ప్రభుత్వ ప్రతిపాదన స్వాగతించతగినది.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	69,602	▽ 3,614
బంగారం (99.5 స్వచ్ఛత)	69,323	▽ 3,602
వెండి (కిలో)	84,919	▽ 3,275

20
24
బడ్జెట్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	73	80,429
నిఫ్టీ ▽	30	24,479

విదేశీ సూచీలు (తొలి సెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	18,032	▽	24
డోజోన్స్	40,476	△	61
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,167	▽	31
డాక్స్	18,558	△	151
షాంఘై	2,915	▽	48
నికాయ్	39,594	▽	5

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.24	84.26
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.02	109.60
€	యూరో	ఎస్‌బీఐ	90.07	92.44
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.96	54.13
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.64	56.57
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.83	64.51
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.42	22.98
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.90	23.68
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.46


స్టాక్ మార్కెట్‌పై పన్నుల పిడుగు

న్యూఢిల్లీ: వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా సంకీర్ణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్ స్టాక్ మార్కెట్‌ను మెప్పించలేకపోయింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగ సమయంలో తీవ్ర ఒడిదుడుకులకు లోనైన సూచీలు చివరికి స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ సెక్యూరిటీలపై సెక్యూరిటీ లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ), స్వల్పకాలిక మూలధన రాబడి(ఎస్‌టీసీజీ), దీర్ఘ కాలిక మూలధన రాబడి(ఎల్‌టీసీజీ)లపై పన్నుల పెంపు ప్రతిపాదనలు ఇన్వెస్టర్లను తీవ్ర నిరాశపరిచాయి. అయితే పన్ను మినహాయింపులు, కస్టమ్స్ సుంకం తగ్గింపు, ద్రవ్యోలోటు కట్టడికి చర్యల ప్రకటనలతో సూచీలు మళ్లీ పుంజుకొని స్వల్ప నష్టాలతో ముగిశాయి. రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్, ఫైనాన్సియల్ సర్వీసెస్, మెటల్, కమోడిటీస్, టెలికం షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. కన్జూమర్ డ్యూరబుల్స్, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, సర్వీసెస్, ఫార్మా, టెక్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

ఇంట్రాడేలో తీవ్ర ఒడిదుడుకులు

బడ్జెట్ రోజు ఉదయం స్టాక్ మార్కెట్ లాభాలతో మొదలైంది. సెన్సెక్స్ 222 పాయింట్లు పెరిగి 80,725 వద్ద, నిఫ్టీ 60 పాయింట్ల లాభంతో 24,569 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. ఎఫ్అండ్ఓ సెక్యూరిటీలపై ఎస్‌టీటీ, ఎల్‌టీసీజీ, ఎస్‌టీసీజీ పన్నుల పెంపు ప్రకటనలతో ఒక్కసారిగా అమ్మకాలు వెల్లువెత్తాయి. సెన్సెక్స్ 1,278 పాయింట్లు క్షీణించి 79,224 పాయింట్ల వద్ద, నిఫ్టీ 235 పాయింట్లు కుప్పకూలి 24,074 పాయింట్ల వద్ద కనిష్టాలను తాకాయి. పన్ను మినహాయింపులు, కస్టమ్స్ సుంకం తగ్గింపు ప్రకటన తరువాత.., కన్జూమర్ డ్యూరబుల్స్, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో కొనుగోళ్లు జరిగాయి. దీంతో సూచీలు కనిష్టాల నుంచి రికవరీ అయ్యాయి. చివరికి సెన్సెక్స్ 73 పాయింట్లు నష్టపోయి 80,429 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 30 పాయింట్లు కోల్పోయి 24,479 వద్ద ముగిసింది.

''బడ్జెట్‌లో మూలధన వ్యయాలకు అధిక కేటాయింపులు ఉండొచ్చని ఆశించారు. స్వల్పకాలిక మూలధన లాభాలపై (ఎస్‌టీసీజీ) పన్ను 20 శాతానికి పెంచడం; దీర్ఘకాలిక మూలధన లాభాలపై (ఎల్‌టీసీజీ) పన్ను 12.5 శాతానికి పెంపు, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ సెక్యూరిటీలపై సెక్యూరిటీ లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ)0.1%, 0.02 శాతం పెంపు అంశాలు స్టాక్ మార్కెట్‌కు కచ్చితంగా ప్రతికూల అంశాలు. స్వల్ప కాలం పాటు ఎదురయ్యే ప్రతికూలతలను ఎదుర్కొనేందుకు ఇన్వెస్టర్లు సిద్ధంగా ఉండాలి. గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన అధిక కేటాయింపు ప్రకటనలు మార్కెట్ నష్టాలు తగ్గించాయి'' మెహ్తా ఈక్విటీస్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సే తెలిపారు.



➔ వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు, గ్రామీణాభివృద్ధి రూ.2.66 లక్షల కోట్లు కేటాయింపుతో పాటు ఉద్యోగ కల్పనలకు పెద్ద పీట వేయడంతో కన్జూమర్, ఎఫ్‌ఎంసీజీ షేర్లు రాణించాయి. ఐటీసీ షేరు 5%, టాటా కన్జూమర్స్ ప్రొడెక్ట్స్, డాబర్ షేర్లు 3% పెరిగాయి. గోద్రేజ్ కన్జూమర్ ప్రోడెక్ట్స్, హెచ్‌యూఎల్, మారికో, బ్రిటానియా, కోల్గేట్, యునైటెడ్ బేవరేజెస్, యునైటెడ్ స్పిరిట్స్, బలరామ్‌పూర్ చినీ షేర్లు 2% నుంచి ఒకశాతం లాభపడ్డాయి.



టెలికం పరికరాల దిగుమతులకు చెక్

10 శాతం నుంచి 15 శాతానికి సుంకాల పెంపు

దేశీయంగా టెలికం గేర్ తయారీకి దన్నుగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజా బడ్జెట్‌లో దిగుమతి సుంకాల పెంపునకు తెరతీశారు. ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు(పీసీబీఏ)లుగా వ్యవహరించే మదర్ బోర్డులపై 5 శాతం పెంపును ప్రతిపాదించారు. వెరసి టెలికం పీసీబీఏలపై బేసిక్ కస్టమ్ డ్యూటీ ప్రస్తుత 10 శాతం నుంచి 15 శాతానికి పెరగనుంది. అయితే కమ్యూనికేషన్ పరికరాల తయారీలో వినియోగించే కీలక 25 మినరల్స్‌పై డ్యూటీని పూర్తిస్థాయిలో మినహాయించింది. వీటిలో అణువిద్యుత్, పునరుత్పాదక ఇంధనం, రక్షణ, టెలికం రంగాలలో వినియోగించే లిథియం, కాపర్, కోబాల్ట్ తదితరాలున్నాయి.



రూ.50 లక్షలు మించితేనే రిటర్నుల పునః మదింపు

పన్ను చెల్లింపుదారులకు సంబంధించి కొన్ని సానుకూల చర్యలకు బడ్జెట్లో చోటు లభించింది. ఎగవేసిన పన్ను ఆదాయం రూ.50లక్షలకు మించి ఉన్నప్పుడే.. అసెస్‌మెంట్ సంవత్సరం ముగిసిన మూడు నుంచి ఐదేళ్లలోపు తిరిగి మదింపు చేయవచ్చని ప్రకటించారు. సోదాలకు సంబంధించి కూడా ప్రస్తుతం అసెస్‌మెంట్ సంవత్సరం ముగిసిన పదేళ్ల వరకు అవకాశం ఉండగా, దీన్ని ఆరేళ్లకు తగ్గించారు. పన్నుల విషయంలో అనిశ్చిత, వివాదాలను ఈ చర్యలు తగ్గిస్తాయని మంత్రి చెప్పారు. ఎలాంటి కేసుల్లోనూ ఐదేళ్ల తర్వాత సంబంధిత పన్ను రిటర్నులను తిరిగి మదించకుండా నిబంధనల్లో సవరణలు తీసుకొస్తామని ప్రకటించారు. పన్ను వివాదాల పరిష్కారానికి వీలుగా 'వివాద్ సే విశ్వాస్ పథకం 2.0'ను తీసుకొస్తామన్నారు.

ఆయిల్ కంపెనీలకు చేదువార్త

రూ.30,000 కోట్ల మూలధన మద్దతు రద్దు

న్యూఢిల్లీ: ఆయిల్ కంపెనీలను బడ్జెట్ నిరాశపరిచింది. ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియంలకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన రికార్డు లాభాల (దాదాపు రూ.81,000 కోట్లు) కారణంగా గత ఆర్థిక సంవత్సరం ప్రకటించిన రూ. 30,000 కోట్ల మూలధన మద్దతును ఆర్థికమంత్రి రద్దు చేశారు. నిజానికి ఈ మద్దతును రూ.15,000 కోట్లకు తగ్గించాలని 2024 ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ప్రతిపాదించిన నిర్మలా సీతారామన్, తాజా బడ్జెట్‌లో ఈ మద్దతును పూర్తిగా రద్దు చేయడం గమనార్హం.

వ్యూహాత్మక నిల్వలకు రూ.5,000 కోట్లు

ఇక సరఫరాల్లో అంతరాయాలను నిరోధించడానికి కర్ణాటకలోని మంగళూరు అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో నిర్మించిన వ్యూహాత్మక భూగర్భ నిల్వల క్షేత్రాలను నింపడానికి వీలుగా ముడి చమురును కొనుగోలు చేయడానికి రూ. 5,000 కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

షేర్లు డీలా...

తాజా నిర్ణయం నేపథ్యంలో ఎన్‌ఎస్‌ఈలో ఐఓసీ షేర్ ధర క్రితం ముగింపుతో పోల్చితే 2 శాతం నష్టపోయి రూ.166 వద్ద ముగిసింది. బీపీసీఎల్ షేర్ ధర 1 శాతం తగ్గి రూ.306 వద్ద ముగిసింది. హెచ్‌పీసీఎల్ షేరు ధర స్వల్ప నష్టంతో 347 వద్ద స్థిరపడింది.




క్రూజ్ పర్యాటకానికి ప్రోత్సాహం

విదేశీ షిప్పింగ్ కంపెనీలపై సులభతర పన్ను

దేశీ క్రూజ్ విభాగంలో కార్యకలాపాలు నిర్వహించే విదేశీ షిప్పింగ్ కంపెనీలకు సులభతర పన్నుల విధానాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. క్రూజ్ పర్యాటకంలో ఉపాధి అవకాశాలను పెంచేందుకు ఈ చర్య తీసుకున్నారు. సముద్ర జలాలపై నడిచే పర్యాటక ఓడలను క్రూజ్‌లుగా చెబుతారు. దేశంలో క్రూజ్ పర్యాటకానికి భారీ అవకాశాలున్నట్టు మంత్రి చెప్పారు. ఈ విభాగంలో భారత షిప్పింగ్ పరిశ్రమ వాటాను పెంచేందుకు, ఉపాధి అవకాశాలను పెంచేందుకు యాజమాన్యం, లీజింగ్ పరంగా సంస్కరణలు తీసుకొస్తామని ప్రకటించారు. క్రూజ్ పర్యాటకానికి భారత్‌ను ఆకర్షణీయ కేంద్రంగా మారుస్తామని, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షిస్తామని చెప్పారు. ''క్రూజ్ షిప్పింగ్‌ల నిర్వహణలో పాలు పంచుకునే ప్రవాసులకు ఊహాత్మకమైన పన్ను విధానం ప్రతిపాదిస్తున్నాం. విదేశీ కంపెనీ, నాన్ రెసిడెంట్ షిప్ ఆపరేటర్ రెండూ ఒకే హోల్డింగ్ కంపెనీ కింద ఉంటే లీజ్ రెంటల్ రూపంలో ఆర్జించే ఆదాయంపై పన్ను మినహాయింపును కల్పిస్తున్నాం''అని వివరించారు. ఈ దిశగా సెక్షన్ 44బీబీసీని ప్రతిపాదించారు. 2025 ఏప్రిల్ 1 నుంచి సవరణలు అమల్లోకి వస్తాయని చెప్పారు.

ఎన్‌పీఎస్‌పై మరింత పన్ను ప్రయోజనం



నూతన పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చే దిశగా కేంద్ర సర్కారు జాతీయ పింఛను పథకంలో (ఎన్‌పీఎస్) పెట్టుబడులకు ప్రోత్సాహకాన్ని పెంచింది. ఉద్యోగి తరఫున ప్రైవేటు సంస్థలు జమ చేసే ఎన్‌పీఎస్ వాటాపై పన్ను మినహాయింపు పరిమితిని 14 శాతం చేసింది. ఉద్యోగి మూల వేతనం, కరువు భత్యంలో (గరిష్ట పరిమితి రూ.లక్ష) 10 శాతం జమలపైనే ప్రస్తుతం పన్ను మినహాయింపు ఉంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం ఇది 14 శాతంగానే ఉండగా.. ప్రైవేటు రంగ ఉద్యోగులకు సైతం ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రయోజనాన్ని పెంచారు. ఆదాయపన్ను చట్టంలోని పాత పన్ను వ్యవస్థలో ఉద్యోగి తరఫున సంస్థలు చేసే ఎన్‌పీఎస్ జమలపై పన్ను మినహాయింపు 10 శాతంగానే కొనసాగుతుంది. ఉదాహరణకు పార్థసారథి మూలవేతనం, కరవు భత్యం రూ.1,00,000 ఉందనుకుంటే.. తాజా మార్పుతో ప్రతి నెలా రూ.4,000 చొప్పున ఏడాదికి రూ.48వేల మొత్తంపై పన్ను లేకుండా చూసుకోవచ్చు. మైనర్ల పేరిట తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఎన్‌పీఎస్ ఖాతా తెరిచేందుకు 'ఎన్‌పీఎస్ వాత్సల్య' ప్లాన్‌ను కూడా ప్రకటించారు.




డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం రూ. 50,000 కోట్లు

ప్రభుత్వ సంస్థలలో వాటాల విక్రయం(డిజిన్వెస్ట్‌మెంట్) ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) రూ. 50,000 కోట్లు సమీకరించవచ్చని తాజా బడ్జెట్ అంచనా వేసింది. మధ్యంతర బడ్జెట్‌లోనూ ఇదేస్థాయిలో ప్రభుత్వం అంచనాలు ప్రకటించింది. ఇక కేంద్ర ప్రభుత్వ కంపెనీల(సీపీఎస్‌ఈలు) నుంచి రూ. 56,260 కోట్ల డివిడెండ్ లభించవచ్చని భావిస్తోంది. మధ్యంతర బడ్జెట్‌లో వేసిన అంచనాలు రూ. 48,000 కోట్లకంటే అధికం కావడం గమనార్హం! మరోవైపు ఆర్‌బీఐ, పీఎస్‌యూ బ్యాంకుల నుంచి ఈ ఏడాది రూ. 2,32,874 కోట్ల డివిడెండ్ అందుకునే చాన్స్ ఉన్నట్లు బడ్జెట్ ఊహిస్తోంది. ఇందుకు ప్రధానంగా ఆర్‌బీఐ నుంచి రూ. 2.11 లక్షల కోట్ల అనూహ్య డివిడెండ్ లభించడం ప్రభావం చూపింది. మధ్యంతర బడ్జెట్ ఈ పద్దుకింద రూ. 1.02 లక్షల కోట్లు మాత్రమే అంచనా వేసింది.

ఈకామర్స్ ఎగుమతులకు దన్ను


హబ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు



ఈకామర్స్ రంగం ద్వారా ఎగుమతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో హబ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదించింది. ఇందుకు ప్రభుత్వ, ప్రయివేట్ విధానం(పీపీపీ)లో వీలు కల్పించనుంది. అవాంతరాలులేని నియంత్రణ, లాజిస్టిక్ మార్గదర్శకాల ద్వారా ఒకే గొడుగుకింద వాణిజ్యం, ఎగుమతి సంబంధ సర్వీసులకు ఇవి తెరతీయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. వెరసి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు(ఎంఎస్‌ఎంఈలు), సంప్రదాయ చేనేత, హస్తకళలు తదితర గ్రామీకులు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయించేందుకు వీలు చిక్కనున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం ఈకామర్స్ విభాగం ద్వారా దేశీ ఎగుమతులు కేవలం 5 బిలియన్ డాలర్లకు పరిమితంకాగా.. చైనా నుంచి వార్షికంగా 300 బిలియన్ డాలర్లు ఎగుమతులు నమోదవుతున్నాయి. రానున్న కాలంలో 50–100 బిలియన్ డాలర్లకు దేశీ ఎగుమతులను పెంచేందుకు అవకాశముంది. బడ్జెట్ ప్రతిపాదిత కేంద్రా(హబ్)ల ద్వారా తొలుత చిన్న తయారీదారులు ఈకామర్స్ సంస్థలు(అగ్రిగేటర్ల)కు ఉత్పత్తులను విక్రయిస్తారు. తదుపరి ఇతర మార్కెట్లలో అగ్రిగేటర్లు వీటిని విక్రయిస్తాయి. ప్రధానంగా ఆభరణాలు(జ్యువెలరీ), దుస్తులు, హస్తకళలు తదితరాలకు భారీ అవకాశాలున్నాయి. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకునే బాటలో ఆర్‌బీఐసహా సంబంధిత శాఖలతో వాణిజ్య శాఖ విభాగం డీజీఎఫ్‌టీ కలసి పని చేస్తోంది. ఫలితంగా ఈ హబ్‌లకు ఎగుమతులు క్లియరెన్స్‌లను కల్పిస్తారు. అంతేకాకుండా వేర్‌హౌసింగ్, కస్టమ్స్ క్లియరెన్స్, రిటర్నుల ప్రాసెసింగ్, లేబిలింగ్, టెస్టింగ్, ప్యాకేజింగ్‌లను వీటికి జత చేస్తారు.

దివాలా వ్యవహారాల్లో ఇక మరింత పారదర్శకత

ఇంటిగ్రేటెడ్ టెక్నాలజీ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు



దివాలా కోడ్ (ఐబీసీ) ప్రక్రియను మరింత మెరుగుపరచడంపై బడ్జెట్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి స్థిరత్వం, పారదర్శకత, సమయానుకూల ప్రాసెసింగ్, వాటాదారులకు సంబంధించి మెరుగైన పర్యవేక్షణ సాధన లక్ష్యంగా 'ఇంటిగ్రేటెడ్ టెక్నాలజీ ప్లాట్‌ఫామ్'ను ఆవిష్కరిస్తున్నట్లు ఆర్థికమంత్రి తెలిపారు. 2016 నుంచి అమల్లోకి వచ్చిన దివాలా కోడ్ పటిష్టత కోసం తగిన మార్పులను తీసుకురావడం జరుగుతుందని మంత్రి తెలిపారు. కోడ్‌ను ఇప్పటి వరకూ ఆరు సార్లు సవరించిన సంగతి తెలిసిందే. ఐబీసీ 1,000 కంటే ఎక్కువ కంపెనీల దివాల అంశాలను పరిష్కరించిందని, ఫలితంగా రుణదాతలకు నేరుగా రూ. 3.3 లక్షల కోట్ల రికవరీ జరిగిందని ఆమె చెప్పారు. ప్రస్తుతం దేశ రాజధానిలో ఉన్న ప్రధాన బెంచ్‌సహా 15 నగరాల్లో ఎన్‌సీఎల్‌టీ బెంచ్‌లు ఉన్నాయి. అంతేకాకుండా, నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) ఢిల్లీ, చెన్నైలలో బెంచ్‌లను కలిగి ఉంది. రికవరీని వేగవంతం చేసేందుకు మరిన్ని ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-7-2024	
విశాఖ	500–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	500–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	490–00
వరంగల్	492–00
రిటైల్ ధర	5.50

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TITAN	3,468.00	6.56
ITC	496.95	6.52
TATACONSUM	1,258.00	4.42
NTPC	383.9	2.78
ADANIPORTS	1,508.00	2.77

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
LT	3,542.00	-3
HINDALCO	652.35	-2.97
SHRIRAMFIN	2,734.00	-2.79
BAJFINANCE	6,728.00	-2.27
ONGC	314.9	-1.84

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	12,456
ఎన్ఎస్ఈ	1,69,337
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	6,01,890
ఎఫ్ఐఐ	- 2,975
డీఐఐ	+ 1,419

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	77.29	$ 78.40
బ్రెంట్	81.35	$ 82.04



ప్రజాదరణ, విధాన చర్యల మధ్య సమతుల్యతను సాధించడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. రైతులకు ద్రవ్య మద్దతు, వ్యక్తిగత ఆదాయపు పన్నులో అధిక మినహాయింపు పరిమితులు, పెరిగిన ప్రామాణిక తగ్గింపులు వంటి కార్యక్రమాలు ఖర్చు చేయదగ్గ అధిక ఆదాయాన్ని అందిస్తాయి. ఇది వ్యయాలను పెంచడానికి దారి తీస్తుంది.

– కుమార్ రాజగోపాలన్, సీఈవో, రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా.

సమతౌల్యత సాధన..



ఊహించినట్లుగా 2024 యూనియన్ బడ్జెట్ సౌర, పునరుత్పాదక ఇంధన రంగాలకు ప్రాధాన్యత ఇచ్చింది. ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద ఒక కోటి రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేయాలనే లక్ష్యం ఒక ముఖ్యమైన పురోగతిగా నిలుస్తుంది. కస్టమ్ డ్యూటీ మినహాయింపు జాబితా నుండి సోలార్ గ్లాస్, గ్లాస్, కాపర్ వైర్ కనెక్టర్లను తొలగించడం వివేకవంతమైన చర్య. అభివృద్ధి చెందుతున్న దేశీయ పరిశ్రమకు మద్దతుగా ఈ నిర్ణయం కీలకం.

– విశ్వేశ్వర రెడ్డి, సీఎండీ, షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్

కీలక పురోగతి..



ఆతిథ్య రంగానికి సంబంధించి ఎటువంటి నిర్దిష్ట చర్యలు లేకపోవడం నిరాశ కలిగించింది. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఈ రంగం వృద్ధిని వేగవంతం చేయడానికి బడ్జెట్‌లో అద్భుతమైనది ఏమీ లేదు.

– ప్రదీప్ శెట్టి, ప్రెసిడెంట్, ఫెడరేషన్ ఆఫ్ హోటల్ అసోసియేషన్స్

అద్భుతమైనది ఏమీ లేదు..



వ్యవసాయం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచినందున ఆహార భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, అలాగే వ్యవసాయంలో ఉత్పాదకతను పెంపొందించడంపై కేంద్ర బడ్జెట్ ప్రాధాన్యతను స్వాగతిస్తున్నాము. ఉత్పాదకతను మెరుగుపరచడం, వాతావరణాన్ని తట్టుకునే పంటలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించడానికి ప్రతిపాదిత సమగ్ర సమీక్ష భారతీయ వ్యవసాయం వాతావరణ ప్రభావాన్ని తట్టుకోగలదని నిర్ధారించడానికి ఒక ప్రేరణనిస్తుంది.

– అరుణ్ అలగప్పన్, కోరమాండల్ ఇంటర్నేషనల్.

వ్యవసాయానికి దన్ను



అభివృద్ధి ఆధారిత బడ్జెట్. ఇది స్వల్పకాలిక డిమాండ్ ఉద్దీపన, ఆర్థిక క్రమశిక్షణను కొనసాగిస్తూ మధ్యకాలిక వృద్ధి ఆవశ్యకతలపై దృష్టి సారించింది. ఉద్యోగాల కల్పన, నైపుణ్యానికి బలమైన ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్ అందరినీ కలుపుకొని ఉంది.

– అనీశ్ షా, ప్రెసిడెంట్, ఫిక్కీ.

వృద్ధి ఆధారితం



దీర్ఘకాలిక ఆర్థిక వివేకాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూపొందించిన సాహసోపేత బడ్జెట్ ఇది. దేశంలో తయారీ, ఎంఎస్‌ఎంఈల పటిష్ట పాత్ర ద్వారా ఉద్యోగ కల్పన యొక్క సుదీర్ఘ, మరింత స్థిర మార్గంపై దృష్టి పెడుతుంది.

– సంజయ్ నాయర్, ప్రెసిడెంట్, అసోచామ్.

సాహసోపేతం



వివిధ ముఖ్య ప్రాజెక్టులు, కేటాయింపుల ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం వల్ల నిస్సందేహంగా సిమెంట్, ఇతర నిర్మాణ సామగ్రికి డిమాండ్ పెరుగుతుంది. ఆర్థిక ఏకీకరణపై దృష్టి సారించి పరివర్తనాత్మకంగా, ముందుకు చూసేదిగా బడ్జెట్ ఉంది. ఇది మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉపాధి కల్పన, ఇంధన భద్రతపై బలమైన దృష్టిని కలిగి ఉంది.

– నీరజ్ అఖౌరీ, ప్రెసిడెంట్, సిమెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్.

మౌలిక రంగ పురోగతి లక్ష్యం



బడ్జెట్‌లో పురోగామి ప్రతిపాదనలు చేశారు. దీనితో ఉత్తరాంధ్రలో కనీసం 2,00,000 ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉంది. వివిధ రంగాల అభివృద్ధికి గణనీయంగా అవకాశాలు కల్పించడం ద్వారా దేశీయంగా ఉపాధి కల్పన ముఖచిత్రాన్ని మార్చే విధంగా బడ్జెట్ ఉంది.

– గేదెల శీనుబాబు, సీఈవో, పల్సస్ గ్రూప్

ఉపాధి కల్పనకు ఊతం

ఉద్యోగులకు నిరాశే

ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తోంది. ఉద్యోగులు తమ 12 నెలల కష్టానికి.. 11 నెలల జీతంతో సరిపెట్టుకునేలా ఆదాయ పన్ను విధానాలున్నాయి. ఈ బడ్జెట్‌లో కూడా ప్రభుత్వ ఉద్యోగులకు ఆదాయ పన్ను నుంచి వెసులుబాటు కల్పించలేదు. సీపీఎస్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారు.
– కె.హరికృష్ణ, ఎం.శ్రీనివాసరావు, నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ నాయకులు

విద్యారంగానికి మొండిచేయి

కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత, కేటాయింపులు నిరాశపరిచేలా ఉన్నాయి. ప్రాధాన్యతలలో విద్యా రంగం లేకపోవడం బాధాకరం. విద్యా రంగానికి కేటాయించిన నిధులు బడ్జెట్‌లో 3.07 శాతం మాత్రమే. వేతన జీవులను సైతం ఈ బడ్జెట్ నిరాశపరిచింది. ప్రామాణిక తగ్గింపును రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంచి, పాత పన్ను విధానంలో ఎలాంటి మార్పు చేయలేదు.
– జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి, ఏపీటీఎఫ్ నాయకులు

ఉద్యోగులను ఉసూరుమనిపించారు

పాత పన్ను విధానంలో కొనసాగుతున్న ఉద్యోగులను కేంద్ర బడ్జెట్ ఉసూరుమనిపించింది. ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజల నుంచి ముక్కు పిండి పన్నులు వసూలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ ఆదాయాన్ని కార్పొరేట్ సంస్థలకు, సన్నిహిత పెద్దలకు దోచిపెడుతోంది.
– ఎల్.సాయిశ్రీనివాస్, మల్లు రఘునాథ్‌రెడ్డి, ఎస్టీయూ నాయకులు

స్వాగతిస్తున్నాం

అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్లతో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చనున్నట్టు బడ్జెట్‌లో పేర్కొనడాన్ని స్వాగతిస్తున్నాం. ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించే విధంగా పలు పథకాలను ప్రకటించడంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ ముఖ్యంగా ఆక్వా రంగానికి పలు పథకాలను ప్రవేశపెట్టడం రాష్ట్ర ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుంది.
– పొట్లూరి భాస్కరరావు, అధ్యక్షుడు, ఏపీ చాంబర్స్

గ్రాంట్‌గా ఇవ్వకపోవడం నిరాశపరిచింది

రాజధాని అమరావతికి గ్రాంట్ రూపంలో కాకుండా అప్పు రూపంలో నిధులు ఇస్తామనడం చాలామందిని నిరుత్సాహపరిచింది. రాష్ట్ర ప్రజలు రాజధాని నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో గ్రాంట్ రూపంలో నిధులు వస్తాయని ఆశించారు. కానీ.. వారి ఆశలను నిరాశపరుస్తూ రూ.15 వేల కోట్లు రుణ రూపంలో కేటాయించారు.
– నీరజ్ శారద, డిప్యూటీ ఎండీ, శారదా మెటల్స్

ఆక్వాకల్చర్‌కు ఊపు

కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ప్రోత్సాహకాలు ఆక్వాకల్చర్ రంగం మరింత బలోపేతానికి దోహదం చేస్తాయి. రొయ్యలు, చేపల మేతపై దిగుమతి సుంకం 15 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం శుభపరిణామం. న్యూక్లియస్ బ్రీడింగ్ సెంటర్స్ కోసం నాబార్డు ఫైనాన్సింగ్ ద్వారా నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించడం వల్ల ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని సులభతరం చేస్తుంది.
– ఐపీఆర్ మోహనరాజు, అధ్యక్షుడు, రొయ్య రైతుల సమాఖ్య

బాబూ..బీజేపీకి మద్దతు ఉపసంహరించుకోండి

ఏపీసీసీ చీఫ్ షర్మిల

సాక్షి, అమరావతి: కేంద్ర బడ్జెట్ బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలా ఉందని, ఇప్పటికైనా కళ్లు తెరిచి ఆ పార్టీకి టీడీపీ, జనసేనలు మద్దతు ఉపసంహరించుకోవాలని ఏపీసీసీ చీఫ్ షర్మిల డిమాండ్ చేశారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఏపీకి దాదాపు రూ.12 లక్షల కోట్లు కావాల్సి ఉండగా, కానీ బాబు అడిగింది కేవలం రూ.1 లక్ష కోట్లు మాత్రమేనని, 5 ఏళ్లకు రూ.5 లక్షల కోట్లు ఎలా సరిపోతాయో తెలియదన్నారు. బిహార్ 12 మంది ఎంపీలు ఇస్తే ఆ రాష్ట్రానికి రూ.26 వేల కోట్లు ఇచ్చారని, ఏపీలో 25 మంది ఎంపీలను తీసుకొని ముష్టి వేస్తున్నారా? అని కేంద్రానిపై మండిపడ్డారు.

ప్రజలకు విశ్వాసం కల్పించలేకపోయారు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో చేయించిన ప్రసంగంతో ప్రజలకు విశ్వాసం కల్పించలేకపోయారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మంగళవారం కర్నూలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, ఎంపీ మిథున్‌రెడ్డిని పుంగనూరుకు వెళ్లకుండా అడ్డుకోవడం అన్యాయమన్నారు. మాజీ సీఎం జగన్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను నివారించాలని ఢిల్లీలో ధర్నా చేయడంలో తప్పులేదన్నారు.

జీవనాడికి జీరో

జల్ శక్తి శాఖకు రూ.21,323.10 కోట్లు.. పోలవరానికి పైసా లేదు

- విధ్వంసం.. నిధుల గండం చంద్రబాబు నిర్వాకాల ఫలితమే
- నాబార్డు రుణంతో రీయింబర్స్ షరతుకు బాబు తలొగ్గడమే ప్రాజెక్టుకు పెనుశాపం
- పోలవరం ప్రాజెక్టుకు సహకరిస్తామన్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టును గతంలో చంద్రబాబు చేసిన పాపాలు వెంటాడుతున్నాయనేందుకు తాజా బడ్జెట్‌లో కేంద్రం ఒక్క పైసా కూడా కేటాయించకపోవడమే నిదర్శనం. జల్ శక్తి శాఖకు కేంద్రం బడ్జెట్‌లో రూ.21,323.10 కోట్లు కేటాయించింది. గతేడాది కంటే రూ.1,806.18 కోట్లు జల్ శక్తి శాఖకు అదనంగా కేటాయించినా పోలవరానికి పైసా కూడా విదల్చలేదు. ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయడానికి సహకరిస్తామని బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నప్పటికీ నిధులు కేటాయించకపోవడానికి మాత్రం గతంలో చంద్రబాబు చేసిన పాపాలే కారణం. కమీషన్ల దాహంతో ప్రత్యేక హోదాను కేంద్రానికి తాకట్టుపెట్టి మరీ 2016 సెప్టెంబరు 7వతేదీ అర్ధరాత్రి పోలవరం నిర్మాణ బాధ్యతలను చంద్రబాబు దక్కించుకున్నారు. 2013–14 ధరలతోనే ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పారు. బడ్జెట్ ద్వారా కాకుండా నాబార్డు నుంచి రుణం తీసుకుని పెట్టిన ఖర్చును రీయింబర్స్ చేస్తామని కేంద్రం పెట్టిన షరతుకు తలూపారు. ఫలితంగా 2017–18 నుంచి బడ్జెట్‌లో పోలవరానికి కేంద్రం నిధులు కేటాయించడం లేదు.

నిధుల గండం

పోలవరం పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టిన నిధులకు సంబంధించి తొలుత పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)కు వివరాలు సమర్పిస్తే పరిశీలించి సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం)కి పంపుతుంది. సీడబ్ల్యూసీ వాటిని మదింపు చేసి కేంద్ర జల్ శక్తి శాఖకు పంపుతుంది. జల్ శక్తి శాఖ మరోసారి తనిఖీ చేసి కేంద్ర ఆర్థిక శాఖకు నివేదిస్తుంది. ఆర్థిక శాఖ సంతృప్తి చెందితే బహిరంగ మార్కెట్ నుంచి రుణాలు సేకరించి ఎన్‌డబ్ల్యూడీఏ(జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ) ద్వారా ఏపీ ప్రభుత్వానికి రీయింబర్స్ చేయాలని నాబార్డును ఆదేశిస్తుంది. ఈ ప్రక్రియలో తీవ్ర జాప్యం వల్ల పోలవరానికి నిధుల సమస్య ఉత్పన్నమైంది. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై వడ్డీల రూపంలో పెను భారం పడుతోంది. అదే బడ్జెట్ ద్వారా కేటాయింపులు చేసి ఉంటే ఎలాంటి నిధుల సమస్య ఉత్పన్నమయ్యేది కాదని అధికారవర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

చారిత్రక తప్పిదాలే శాపం

విభజన నేపథ్యంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం వంద శాతం వ్యయాన్ని భరించి తామే పూర్తి చేస్తామని విభజన చట్టం ద్వారా హామీ ఇచ్చింది. దాన్ని అమలు చేసేందుకు 2014 మే 28న కేంద్రం పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)ని ఏర్పాటు చేసింది. పీపీఏతో ఒప్పందం చేసుకుంటే ప్రాజెక్టు పనులు చేపడతామని నాడు చంద్రబాబు సర్కారుకు సూచించింది. కేంద్రమే కట్టాల్సిన పోలవరాన్ని తన బినామీలకు ఇప్పించుకునేందుకు నిర్మాణ బాధ్యతలు దక్కించుకున్న చంద్రబాబు చారిత్రక తప్పిదాలకు పాల్పడ్డారు. 2014 ఏప్రిల్ 1 నాటికి నీటిపారుదల విభాగం వ్యయంలో మిగిలిన మొత్తాన్ని మాత్రమే రీయింబర్స్ చేస్తామని, బడ్జెట్ ద్వారా కాకుండా నాబార్డు నుంచి రుణం తీసుకుని ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం చేసే ఖర్చును తిరిగి చెల్లిస్తామని కేంద్రం విధించిన షరతులకు తలొగ్గారు.

రూ.12,157.52 కోట్లకు మోకాలడ్డు

పోలవరం పనులను దక్కించుకున్నాక కమీషన్లు వచ్చే పనులనే చంద్రబాబు చేపట్టారు. గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్‌వే కట్టకుండా ప్రధాన డ్యామ్ గ్యాప్–2లో డయాఫ్రమ్‌వాల్ నిర్మించి మరో చారిత్రక తప్పిదం చేశారు. ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా 2019, 2020లో గోదావరి వరద అధిక ఉద్ధృతితో ప్రవహించడంతో డయాఫ్రమ్‌వాల్ కోతకు గురై దెబ్బతింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై విధ్వంసం చోటు చేసుకుంది. అనంతరం వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే ఆ తప్పిదాలను సరిదిద్ది కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ స్పిల్‌వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి 2021 జూన్ 11నే గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా 6.1 కి.మీ. పొడవున మళ్లించారు. దిగువ కాఫర్ డ్యామ్‌తోపాటు ప్రధాన డ్యామ్ గ్యాప్–1లో డయాఫ్రమ్‌వాల్, గ్యాప్–3లో కాంక్రీట్ డ్యామ్ నిర్మించారు. చంద్రబాబు చారిత్రక తప్పిదానికి పాల్పడకపోయి ఉంటే 2022 డిసెంబర్ నాటికే వైఎస్ జగన్ పోలవరాన్ని పూర్తి చేసి ఉండేవారని అధికార వర్గాలు పలు దఫాలు స్పష్టం చేశాయి. బడ్జెట్ ద్వారా పోలవరానికి నిధులు విడుదల చేయాలన్న వైఎస్ జగన్ విజ్ఞప్తి మేరకు 2021–22లో రూ.320 కోట్లు ఇచ్చిన కేంద్రం.. ఆ తర్వాత చంద్రబాబు ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం లేదు. దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్ వ్యయాన్ని భరించడంతోపాటు తాజా ధరల మేరకు పోలవరానికి నిధులు ఇచ్చేలా కేంద్రాన్ని వైఎస్ జగన్ ఒప్పించారు. ఈ క్రమంలోనే తొలి దశ పనుల పూర్తికి రూ.12,157.52 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర కేబినెట్‌కు గత మార్చి 6న జల్ శక్తి శాఖ ప్రతిపాదన పంపింది. అప్పటికే ఎన్‌డీఏ కూటమిలో చేరిన చంద్రబాబు ఆ నిధులు మంజూరు చేస్తే రాజకీయంగా తనకు ఇబ్బందులు వస్తాయంటూ కేంద్ర పెద్దలపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ఆ ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ పక్కన పెట్టింది. దీనికి కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేస్తేనే తొలి దశ పనులకు రూ.12,157.52 కోట్ల విడుదలకు మార్గం సుగమం అవుతుంది.

పోలవరం ప్రాజెక్టు పనుల వ్యయం (రూ.కోట్లలో)	2017–18 ధరల ప్రకారం అంచనా వ్యయం	జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించక ముందు చేసిన వ్యయం	జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టు వ్యయం	జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక నీటి పారుదల విభాగం కింద కేంద్రం ఇవ్వాల్సింది	జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినప్పటి నుంచి ఇప్పటి వరకూ కేంద్రం ఇచ్చింది	2017–18 ధరల ప్రకారం ప్రాజెక్టు పూర్తికి ఇంకా అవసరమైన నిధులు
	55,656.87	4,730.71	4,124.64	46,801.52	15,146.28	31,655.24

రైల్వేజోన్.. మళ్లీ మొండిచెయ్యే!

- ఆ ఊసేలేకుండా కేంద్రమంత్రి నిర్మల బడ్జెట్ ప్రసంగం
- 'జోన్' సాధనలో చంద్రబాబు విఫలం
- ఒడిశాలో రాజకీయ ప్రయోజనాల కోసం ఏపీకి రిక్తహస్తం



సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన చట్టంలోని హామీగా ఉన్న విశాఖపట్నం రైల్వేజోన్‌కు కేంద్ర ప్రభుత్వం మరోసారి మొండిచేయి చూపించింది. విశాఖ కేంద్రంగా ఏర్పాటుచేస్తామన్న దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటుపై లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టిన 2024–25 కేంద్ర బడ్జెట్‌లో కనీస ప్రస్తావన కూడా లేదు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి కూడా సీఎం చంద్రబాబు విశాఖపట్నం ప్రత్యేక రైల్వేజోన్ సాధనలో పూర్తిగా విఫలమయ్యారు. 2014–19 మధ్య వైఫల్యాలను పునరావృతం చేస్తూ మరోసారి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారు. ఒడిశాలో బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం విశాఖ రైల్వేజోన్ విషయంలో కేంద్రం చొరవచూపడం లేదన్నది స్పష్టమవుతోంది.

రైల్వేజోన్ ఊసేలేదు..

2024–25 వార్షిక బడ్జెట్‌లో అంతర్భాగంగా నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్ రాష్ట్రానికి తీవ్ర నిరాశ కలిగించింది. గత బడ్జెట్‌లలో జోన్ ఏర్పాటు ప్రక్రియను సూత్రప్రాయంగా ప్రారంభించామని చెప్పిన కేంద్రం ఆచరణలో వచ్చేసరికి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉంది. ఎందుకంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే విశాఖ కేంద్రంగా 'దక్షిణ కోస్తా రైల్వేజోన్' ఏర్పాటుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రైల్వేశాఖ రూపొందించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఒత్తిడితో విశాఖలో కార్యాలయాల నిర్మాణానికి ఇటీవల రూ.170 కోట్లు కూడా కేటాయించింది. అరిలోవలో రైల్వేకు భూముల కేటాయింపు కూడా గత ప్రభుత్వంలో జరిగింది. ఈ నేపథ్యంలో.. ప్రస్తుతం టీడీపీ ఎంపీల మద్దతుపై కేంద్ర ప్రభుత్వం ఆధారపడి ఉన్నందున ఈసారి రైల్వేజోన్‌పై స్పష్టత వస్తుందేమోనన్న రాష్ట్ర ప్రజల ఆశలపై కేంద్రం నీళ్లుజల్లింది. అసలు బడ్జెట్ ప్రసంగంలో రైల్వేజోన్ గురించి మాటమాత్రంగానైనా ప్రస్తావించకపోవడం విస్మయం కలిగిస్తోంది. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులైన రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ హస్తినలో డిమాండ్ చేయనేలేదు.

ఒడిశాలో బీజేపీ ప్రయోజనాల కోసమేనా?


ఒడిశాలో బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసమే ఏపీ విషయంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నది స్పష్టమవుతోంది. నిజానికి.. భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న తూర్పు కోస్తా జోన్‌లో అత్యధిక రాబడి వస్తున్న వాల్తేర్ డివిజన్‌ను ఏకంగా రద్దుచేయాలని కేంద్రం భావిస్తోంది. అందుకే వీలైనంత వరకు విశాఖ రైల్వేజోన్ అంశాన్ని సాగదీస్తోంది. చంద్రబాబు ప్రభుత్వం కూడా దీనిపై కేంద్రాన్ని నిలదీయకపోవడం రాష్ట్రానికి శాపంగా పరిణమిస్తోంది.

'బ్లూ బుక్' వస్తేనే..

ఇక కేంద్ర బడ్జెట్‌లో రైల్వేశాఖకు కేటాయింపులపై సమగ్ర వివరాలతో 'బ్లూ బుక్' రైల్వే కార్యాలయానికి చేరితేగానీ రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులపై కేంద్రం కేటాయింపులు ఏమిటన్న దానిపై స్పష్టత రాదు. ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రాష్ట్రానికి రూ.9 వేల కోట్లు కేటాయించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అలాగే, ఏయే ప్రాజెక్టులకు ఎంతమేర కేటాయింపులు చేశారన్నది మంగళవారం బడ్జెట్‌లో పేర్కొంది. కానీ, బ్లూ బుక్ వస్తేగానీ అందులోని వివరాలు తెలియవు. రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు, కొత్త లైన్ల కోసం సర్వేలు, కొత్త ఆర్వోబీల నిర్మాణం, ప్రత్యేక ఫ్రైట్ కారిడార్ ఏర్పాటు, కొత్త రైళ్ల కేటాయింపులు మొదలైన అంశాలపై అప్పుడే స్పష్టత వస్తుంది.

భూముల రీసర్వేకి కేంద్రం జై

- అదే సర్వేను జగన్ చేస్తే విష ప్రచారం చేసి నిలిపివేసిన చంద్రబాబు
- భూ సంస్కరణలు తప్పనిసరని కేంద్రం చెప్పిన రోజే అసెంబ్లీలో ల్యాండ్ టైట్లింగ్ ఉపసంహరణ బిల్లు
- రీసర్వే చేసిన రాష్ట్రాలకు వడ్డీలేని రుణాలిస్తామని కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదన



సాక్షి, అమరావతి: రాష్ట్రాల్లో భూ సంస్కరణలు, భూముల రీ సర్వే, భూ రికార్డుల డిజిటలీకరణ అత్యావశ్యకమని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించిన రోజే అందుకు విరుద్ధంగా రాష్ట్రంలోని టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ల్యాండ్ టైట్లింగ్ చట్టం ఉపసంహరణ బిల్లును ప్రవేశపెట్టింది. భూముల సంస్కరణలు అమలుచేసిన రాష్ట్రాలకే 50 ఏళ్లపాటు సున్నా వడ్డీకే రుణాలిచ్చే కార్యక్రమాన్ని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించగా సరిగ్గా అదే సమయంలో భూ సంస్కరణలకు తిలోదకాలిచ్చేలా చంద్రబాబు ప్రభుత్వం ఈ బిల్లు పెట్టడం విశేషం. రాజకీయ స్వార్థంతో ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని ఒక భూతంగా, భూముల రీ సర్వేను దారుణమైనదిగా ప్రచారం చేసి చంద్రబాబు కూటమి ఎన్నికల్లో లబ్ధి పొందింది. భూములు పోతాయని, లాగేసుకుంటారని భయపెట్టి ప్రజలకు ఎంతగానో మేలుచేసే కార్యక్రమంపై విషం కక్కారు. ఇప్పుడు ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుచేస్తుండడమే కాకుండా నాలుగున్నరేళ్ల అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, దేశంలో ఎక్కడా లేని విధంగా జరిగిన భూముల రీ సర్వేను నిలిపివేశారు. కానీ, ఇప్పుడు అవే కార్యక్రమాలు అన్ని రాష్ట్రాల్లో జరగాలని కేంద్రం కుండబద్దలు కొట్టింది.

వీటిని ఐదేళ్లలో చేసిన జగన్ ప్రభుత్వం

కేంద్ర ఆర్థికమంత్రి తప్పనిసరిగా చేయాలని చెప్పిన ప్రతిపాదనలన్నింటినీ వైఎస్ జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లలోనే అమలుచేసింది. భూముల రీ సర్వే విజయవంతంగా జరగడంతోపాటు 6 వేల గ్రామాల్లో కేంద్రం చెప్పినట్లే కొత్త డిజిటల్ రెవెన్యూ రికార్డులు అందుబాటులోకి వచ్చాయి. అత్యంత ఆధునిక సర్వే టెక్నాలజీతో సర్వే నిర్వహించారు. ప్రతి భూమికీ జియో కోఆర్డినేట్స్ హద్దులు ఏర్పరచడం, ఐడీ నంబర్, క్యూఆర్ కోడ్ జారీ ద్వారా దేశంలో కొత్త భూ వ్యవస్థను పరిచయం చేశారు. ప్రతి భూమికి ల్యాండ్ పార్సిల్ మ్యాప్, భూహక్కు పత్రం, ప్రాపర్టీ పార్సిల్ మ్యాప్, ప్రతి గ్రామానికి రెవెన్యూ విలేజ్ మ్యాప్ అందించారు. రీసర్వే పూర్తయిన తర్వాత కొత్త డిజిటల్ రికార్డులు రూపొందించే క్రమంలో 10 లక్షల పట్టాలకు సబ్ డివిజన్లు చేశారు. బడ్జెట్ ప్రసంగంలో సబ్ డివిజన్లు జరగాలని కేంద్ర ఆర్థికమంత్రి చెప్పారు. రీసర్వే చేసి 20 లక్షల మందికిపైగా రైతులకు భూ హక్కు పత్రాలు జారీచేశారు. గ్రామ కంఠాలు, మున్సిపాల్టీల్లోని భూములను కూడా తొలిసారి సర్వేచేసి ఇళ్ల యజమానులకు యాజమాన్య సర్టిఫికెట్లు జారీచేశారు. భూముల హద్దులను నిర్ధారించి భూరక్ష సర్వే రాళ్లను ప్రభుత్వ ఖర్చుతో పాతారు. రీ సర్వే కోసం ప్రత్యేకంగా 10,185 మంది గ్రామ సర్వేయర్లను నియమించారు. ఇందుకోసం మొత్తం రూ.వెయ్యి కోట్లకు పైగా గత ప్రభుత్వం ఖర్చుచేసింది. ఏపీలో జరిగిన రీ సర్వే దేశానికే ఒక రోల్ మోడల్‌గా నిలిచింది. అలాంటి కార్యక్రమాన్ని కేవలం రాజకీయ స్వార్థం కోసం విజనరీగా చెప్పుకునే చంద్రబాబు రద్దుచేయడం రాష్ట్రానికి శాపమే. నిజానికి.. రాష్ట్రానికి ఎంతగానో ఉపయోగపడే ఈ కార్యక్రమాన్ని అమలు చేసే ఉద్దేశం ఉంటే అనేక ప్రత్యామ్నాయాలు చూడొచ్చు. కానీ, జగన్ అమలుచేశారనే అక్కసుతో భూముల వ్యవస్థ స్వరూపాన్నే సమూలంగా మార్చివేసే రీసర్వేను నిలిపివేశారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దుచేస్తున్నారు. అయితే, ఇవన్నీ దేశమంతా జరగాలని కోరుకుంటూ కేంద్రం అందుకు తగ్గట్లుగా ఒక కార్యక్రమాన్ని ప్రకటించడం విశేషం.

బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి చెప్పిందిదే..

- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో భూ సంబంధిత సంస్కరణలు అమలుచేసిన రాష్ట్రాలకు 50 ఏళ్ల వడ్డీలేని రుణాలను ప్రతిపాదించారు.
- భూ పరిపాలన, ప్రణాళిక, నిర్వహణకు సంబంధించి కచ్చితమైన చర్యలుండాలని స్పష్టంచేశారు.
- గ్రామీణ ప్రాంతాల్లో యూనిక్ ల్యాండ్ పార్సిల్ ఐడెంటిఫికేషన్–యూఎల్ పిన్ ఉండాలని, అన్ని భూములకు భూ ఆధార్ ఉండాలని, సర్వే సబ్ డివిజన్లు జరగాలని, భూ యాజమాన్యాన్ని కచ్చితంగా నిర్ధారించేలా సర్వే జరగాలని, ల్యాండ్ రిజిస్టర్లు రూపొందించాలని, వాటిని రైతుల రిజిస్టర్లతో లింకుచేయాలని చెప్పారు.
- అర్బన్ ల్యాండ్ రికార్డులను జీపీఎస్ మ్యాపింగ్ ద్వారా డిజిటలైజేషన్ చేయాలని చెప్పారు.
- ఇవన్నీ చేసిన రాష్ట్రాలకే వడ్డీలేని రుణాలు ఇస్తామని ప్రకటించారు.

ప్రజలను మోసగించేందుకే

టీడీపీ హడావిడి

చంద్రబాబు ఏం చెప్పారు.. ఏం చేస్తున్నారు?

- కేంద్ర బడ్జెట్ కేటాయింపులపై మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్
- ప్యాకేజీ కోసం హోదాను నిర్వీర్యం చేశారు
- ఆ ప్యాకేజీలోనూ అదనంగా వచ్చిందేమీ లేదు



సాక్షి, అమరావతి: కేంద్ర బడ్జెట్ కేటాయింపులపై తెలుగుదేశం పార్టీ చేస్తున్న హడావిడి, చేస్తున్న ప్రకటనలు.. మరోసారి రాష్ట్ర ప్రజలను మోసగించేందుకేనని రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ధ్వజమెత్తారు. నిజానికి కేంద్రం నుంచి నిధులు తెచ్చే విషయంలో చంద్రబాబు చెప్పింది ఏమిటి? ఇప్పుడు జరుగుతున్నది ఏమిటి? అని ఆయన నిలదీశారు. అసలు రాజధాని ఎప్పటికి పూర్తవుతుంది.. దీనికి టీడీపీ కూటమి ప్రభుత్వం సమాధానం చెబుతుందా.. అని ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'రాష్ట్రానికి సంబంధించిన హక్కులను రాబట్టడంలో, కేంద్రం ఇచ్చిన హామీల మేరకు వాటిని అమలు చేయించుకోవడంలో ఈ సారైనా టీడీపీ కూటమి ప్రభుత్వం స్థిరత్వం చూపాలని ఆశిస్తున్నాం. ఎందుకంటే 2014 –19 మధ్య ఎన్డీయేలో టీడీపీ భాగస్వామిగా ఉన్నప్పుడు కూడా చాలా హడావిడి, ఆర్భాటాలు చేశారు. కాని వాస్తవంలో అవి ఎక్కడా కనిపించలేదు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని సాక్షాత్తు అప్పటి ప్రధానమంత్రే పార్లమెంటుగా సాక్షిగా వాగ్దానం చేసి, ఆంధ్రప్రదేశ్‌ను విభజించారు. ఆ తర్వాత దాన్ని నిర్వీర్యం చేసుకుంటూ వెళ్లారు. ప్రత్యేక హోదాకు బదులు ప్రత్యేక ఆర్థిక సహాయం (ప్యాకేజీ) ఇస్తామన్న ప్రకటనను ఇదే టీడీపీ సర్కారు ఆనాడు స్వాగతించింది. కానీ వాస్తవంగా జరిగింది ఏమిటి? దేశంలో అన్ని రాష్ట్రాలకు ఏవైతే వచ్చాయో, ప్రత్యేక ప్యాకేజీ కింద ఇక్కడ అవే ఇచ్చారు తప్ప, విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అదనంగా వచ్చింది ఏమీ లేదు. బడ్జెట్‌కు ముందు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలన్న అంశాన్ని టీడీపీ ప్రస్తావించలేదు. మరి దీన్ని రాష్ట్ర ప్రజలు ఎలా అర్థం చేసుకోవాలి? ప్రత్యేక హోదా వల్ల కలిగే ప్రయోజనాలపై మీకు అవగాహన లేదనుకోవాలా? లేక ఆలోచనే లేదనుకోవాలా? లేక ఆ అవసరం లేదని మీరు అనుకున్నారా?' అని బుగ్గన నిలదీశారు. బుగ్గన ఇంకా ఏమన్నారంటే..

పెండింగ్‌లో విభజన అంశాలు

- రాష్ట్ర విభజనకు సంబంధించి ఇంకా అనేక అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం నుంచి రావాల్సిన సుమారు రూ.7 వేల కోట్ల విద్యుత్ బకాయిలకు సంబంధించి మా ప్రభుత్వ హయాంలో ఆర్డర్ తీసుకొచ్చాం. ఇప్పుడు మీరు ఎన్డీఏలో భాగస్వాములుగా ఉన్నారు. మరోవైపు పక్క రాష్ట్ర సీఎం మీకు అత్యంత సన్నిహితుడని ప్రజలంతా భావిస్తున్నారు. కాబట్టి, దాదాపు రూ.7 వేల కోట్ల విద్యుత్ బకాయిలు త్వరగా తెచ్చుకోండి.
- పోలవరం ప్రాజెక్టు విషయానికొస్తే, ఎంతసేపూ మీకు దానిపై ప్రచార ఆర్భాటం తప్ప, పనులు పూర్తి చేయాలన్న తపన ఏనాడూ కనిపించలేదని ప్రజలు భావిస్తున్నారు. విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టును కేంద్రమే నిర్మించి ఇవ్వాలి. కానీ, ఆ ప్రాజెక్టును తామే కడతామంటూ, నాడు చంద్రబాబు ప్రభుత్వం చేతిలోకి తీసుకుంది. ఆ తర్వాత కీలక అంశాలన్నింటినీ విడిచి పెట్టింది.
- ప్రాజెక్టు పనులను 2013 –14 రేట్లకే చేస్తామని చెప్పడం వల్ల అప్పటి అంచనా వ్యయం రూ.20,398.61 కోట్లతోనే పూర్తి చేస్తామని అంగీకరించినట్లు అయింది. ప్రొటోకాల్‌కు విరుద్ధంగా ప్రాజెక్టు పనులు చేయడం వల్ల నిర్మాణ వ్యయం గణనీయంగా పెరిగింది. దీంతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత జగన్ ప్రభుత్వం చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పెరిగిన ప్రాజెక్టు వ్యయానికి అనుగుణంగా నిధులు రాబట్టడం కోసం మూడేళ్లపాటు గట్టి పోరాటం చేయాల్సి వచ్చింది.
- ఎట్టకేలకు ప్రాజెక్టు వ్యయం అంచనా రూ.55,656 కోట్లకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదం పొందింది. ప్రాజెక్టు నిర్మాణం విషయంలో, అతి కీలకమైన నిధుల విషయంలో మేము ఆమోదం సాధించాం. ఇప్పుడు ఆ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉంది. పోలవరం ప్రాజెక్టు తక్షణ పనుల కోసం నాడు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పదేపదే ఒత్తిడి తెస్తే రూ.12 వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. అది కేంద్ర కేబినెట్ వరకు వెళ్లినా, ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో ఆ నిధులు చేరలేదు. ఇప్పుడు బాబు ఎన్డీయేలో ఉన్నారు. వెంటనే ఆ నిధులు విడుదల చేయిస్తారని వైయస్సార్‌సీపీ ఆశిస్తోంది.

మూల ధన వ్యయం పెరగలేదెందుకు?

ఈ బడ్జెట్ ద్వారా ద్రవ్యలోటు తగ్గించడంలో కేంద్రం చొరవ చూపుతోందన్న విషయం స్పష్టం అవుతోంది. స్థూల ఉత్పత్తిలో ద్రవ్యలోటు తగ్గడం కూడా చూస్తున్నాం. అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓట్ ఆన్ ఎక్కౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు డివిడెండ్ల రూపంలో రూ.1,02,000 కోట్లు వస్తాయని అంచనా వేశారు. అయితే ఊహించని విధంగా ఈ ఏడాది మే 22న ఆర్బీఐ నుంచి కేంద్ర ప్రభుత్వం డివిడెండ్ల రూపంలో ఏకంగా రూ.2,10,874 కోట్లు పొందింది. ఇంత పెద్ద ఎత్తున డివిడెండ్ పొందడంతో, కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా మూల ధన వ్యయం పెంచుతుందని అందరూ అనుకున్నారు. కానీ, అందుకు భిన్నంగా వ్యవహరించింది. గత ఫిబ్రవరిలో ఓట్ ఆన్ ఎక్కౌంట్ బడ్జెట్ పెట్టినప్పుడు ఎంతైతే మూల ధన వ్యయం చూపారో, అదే మొత్తాన్ని ఇప్పుడు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ చర్య, ద్రవ్యలోటు తగ్గించడంలో దోహదం చేసినా, మూలధన వ్యయం పెంచకపోవడం నిరాశకు గురి చేసింది.

జగన్ హయాంలోనే కొప్పర్తి, ఓర్వకల్లు

- అన్ని అనుమతులతో పారిశ్రామిక పార్కుల అభివృద్ధి
- ఇప్పుడు కొత్తగా వాటికి శ్రీకారం చుడుతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటన.. అధికారుల విస్మయం



జగన్ హయాంలో అభివృద్ధి చేసిన కొప్పర్తి నోడ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పారిశ్రామిక మౌలిక వసతులను మెరుగుపరచాలన్న లక్ష్యంతో వైఎస్ జగన్ ప్రభుత్వం ఎన్నడూ లేనివిధంగా మూడు పారిశ్రామిక కారిడార్లలో భారీ పారిశ్రామిక పార్కుల నిర్మాణం చేపట్టింది. విశాఖ–చెన్నై కారిడార్‌లో భాగంగా కొప్పర్తి నోడ్, చెన్నై–బెంగళూరు కారిడార్‌లో భాగంగా కృష్ణపట్నం వద్ద క్రిస్‌సిటీ, హైదరాబాద్–బెంగళూరు కారిడార్‌లో భాగంగా ఓర్వకల్లు వద్ద భారీ పారిశ్రామిక పార్కులకు శ్రీకారం చుట్టింది. హైదరాబాద్–బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌కు అనుమతుల్ని సాధించడమే కాకుండా రూ.2,800 కోట్లతో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (నిక్‌డిట్) నిధులతో పారిశ్రామిక పార్కు నిర్మాణం చేపట్టింది. మొత్తం 9,724కు పైగా ఎకరాలు కాగా.. తొలి దశ కింద 4,194.32 ఎకరాల్లో ఓర్వకల్లు పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయడానికి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు ఇప్పటికే ఆమోదం కూడా లభించింది. అలాగే.. విశాఖ–చెన్నై కారిడార్‌లో భాగంగా కొప్పర్తి వద్ద 6,739 ఎకరాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టింది. 801 ఎకరాల్లో వైఎస్సార్ ఈఎంసీని అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చింది. దానిపక్కనే 3,053 ఎకరాల్లో వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్ అభివృద్ధి పనులు మొదలుపెట్టింది. సుమారు రూ.2,200 కోట్ల నిక్‌డిట్ నిధులతో కొప్పర్తి నోడ్‌ను అభివృద్ధి చేయడానికి రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌కు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ ఆమోదం కూడా లభించింది. కానీ, గత ప్రభుత్వం ప్రారంభించిన ఈ రెండు పారిశ్రామిక పార్కులను కొత్తగా రాష్ట్రానికి ప్రకటిస్తున్నట్టు బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొనడంతో అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపక్ష నేత హోదానిచ్చేలా ఆదేశాలివ్వండి

ఈ విషయంలో స్పీకర్ మౌనంగా ఉన్నారు

- ఆయనది మొదటి నుంచీ నాపై వ్యతిరేక వైఖరే
- ఆ హోదా ఇవ్వబోమని మంత్రి పయ్యావుల ముందే చెప్పారు
- ప్రజల తరపున గొంతుక వినిపించేందుకు ప్రతిపక్షం ఉండాల్సిందే
- కనీస సీట్లు రాకపోయినా గతంలో ప్రతిపక్ష హోదానిచ్చారు
- మరో మార్గంలేక న్యాయస్థానాన్ని ఆశ్రయించా
- హైకోర్టులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిటిషన్



సాక్షి, అమరావతి: చట్ట ప్రకారం శాసనసభలో తనకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేలా శాసనసభ కార్యదర్శి, స్పీకర్ కార్యదర్శిని ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనసభ పక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసన సభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత హోదానిచ్చే విషయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మౌనం పాటిస్తున్నారని జగన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే, మంత్రి పయ్యావుల కూడా ఈ విషయంలో ముందుగానే స్పందించారని.. దీనిని బట్టి ప్రతిపక్ష నేత హోదా విషయంలో వారు ముందుగానే ఓ నిర్ణయానికి వచ్చినట్లు అర్థమవుతోందన్నారు. శాసనసభలో ప్రతిపక్షం, ప్రతిపక్ష నేత ఉండటం ఎంతో అవసరమన్నారు. ప్రజలందరి సమస్యలను లేవనెత్తేందుకు, రాష్ట్రంలో న్యాయ పాలన సక్రమంగా సాగేలా చూసేందుకు తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాల్సిన అవసరముందని జగన్ తన వ్యాజ్యంలో వివరించారు. విస్తృతాధికారంతో అధికారాన్ని చెలాయిస్తామంటే కుదరదని, రాజ్యాంగ సిద్ధాంతాల ప్రకారం దానిని నియంత్రించే పరిస్థితి తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.

చట్ట విరుద్ధంగా వెళ్లడానికి వీల్లేదు..

'ప్రస్తుతం శాసనసభలో మాది మాత్రమే ఏకైక ప్రతిపక్ష గొంతుక అన్నది కాదనలేని సత్యం. ప్రజా సమస్యలను లేవనెత్తి వాటిపై మాట్లాడే హక్కు నాకుంది. అయితే, ఈ హక్కును మా పార్టీకొచ్చిన సీట్ల గణాంకాల ఆధారంగా కాలరాయడానికి వీల్లేదు. సంప్రదాయాలతో పేరుతో చట్ట విరుద్ధంగా వెళ్లడానికి ఎంతమాత్రం వీల్లేదు' అని జగన్ తన వ్యాజ్యంలో తెలిపారు.

కనీస సీట్లు రాకపోయినా..

'అసెంబ్లీలోని మొత్తం సీట్లలో 10 శాతం సీట్లను సాధించకపోయినా కూడా పార్టీలు ప్రధాన ప్రతిపక్ష హోదా పొందిన ఉదంతాలెన్నో ఉన్నాయి. అలాగే, ఆయా పార్టీ నేత ప్రధాన ప్రతిపక్ష నేతగా నియమితులైన సందర్భాలున్నాయి. 1994లో మొత్తం 294 సీట్లలో కాంగ్రెస్ పార్టీ 26 సీట్లే గెలుచుకున్నప్పటికీ, ఆ పార్టీ నేత పి.జనార్ధన్‌రెడ్డికి ప్రతిపక్ష నేత హోదా దక్కింది. అలాగే, 2015లో ఢిల్లీలో బీజేపీకి 3 సీట్లే వచ్చినప్పటికీ ఆ పార్టీకి ప్రతిపక్ష పార్టీ హోదానిచ్చారు. రాజ్యాంగంలో ఎక్కడా కూడా ప్రతిపక్ష హోదా రావాలంటే నిర్దిష్టంగా ఇంత శాతం మేర సీట్లు గెలుపొంది ఉండాలని లేదు. అలాగే, కనీస సీట్ల ఆధారంగా ప్రతిపక్ష పార్టీ హోదానివ్వడమన్నది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంప్రదాయంగా లేదు'.. అని జగన్ తన పిటిషన్‌లో వివరించారు.

పేదల తరఫున గొంతెత్త కూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశం..

'శాసనసభలో నాకు ప్రతిపక్ష నేత హోదాని వ్వాల్సిన అవసరం గురించి నేను గతనెల 24న స్పీకర్‌కు అన్ని వివరాలతో లేఖ రాశాను. నిజానికి.. ఆయన మొదటినుంచీ నాపట్ల వ్యతిరేక వైఖరితో ఉన్నారు. నేను ఎన్నికల్లో ఓడిపోయానే తప్ప చనిపోలేదని ఒకసారి.. నేను చచ్చేవరకు కొట్టాలని మరోసారి ఆయనన్నారు. పయ్యావుల కేశవ్ కూడా.. నాకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వరాదని నిర్ణయించినట్లు మీడియాకు చెప్పారు. శాసనసభలో పేదల తరఫున ఎవరూ మాట్లాడకూడదన్నదే అధికార పార్టీ ప్రధాన ఉద్దేశం. వీరి వైఖరే నేను ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేయడానికి కారణమైంది. అలాగే, అసెంబ్లీలో సభ్యుల ప్రమాణ స్వీకారం అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నాకు అర్థమైంది. నిజానికి.. ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్‌క్వాలిఫికేషన్స్ చట్టం ప్రకారం నన్ను ప్రతిపక్ష నేతగా నియమించాల్సి ఉంది. అయితే, రాజకీయ కారణాలతో ఆ పనిచేయడంలేదు. అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని నాకు ప్రతిపక్ష నేత హోదానిచ్చేలా ఆదేశాలివ్వండి.. లేని పక్షంలో మీరే ఆ హోదాను ఇస్తూ ఆదేశాలు జారీచేయండి'.. అని జగన్ తన పిటిషన్‌లో కోరారు.

ఈ ఏడాది డీఎస్సీ పోస్టుల భర్తీ లేనట్లే!?

- అసెంబ్లీలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలతో తేటతెల్లం
- వచ్చే ఏడాది పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి భర్తీ చేస్తామని వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డీఎస్సీ అభ్యర్థుల భవిష్యత్తుతో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం ఆడుకుంటోంది. ఈ ఏడాది డిసెంబర్‌లోగా 16 వేల టీచర్ పోస్టులు భర్తీచేస్తామని గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే చంద్రబాబు ఈ ఫైల్‌పైనే తొలి సంతకం చేసి అభ్యర్థుల్లో ఆశలు కల్పించారు. దీంతో వీలైనంత త్వరగా పోస్టుల భర్తీ జరుగుతుందని వారంతా ఆశించారు. అదంతా హంబక్కేనని.. ప్రకటించిన గడువులోగా పోస్టుల భర్తీ చేపట్టే యోచనలో ప్రభుత్వం లేదని తెలుస్తోంది. మంగళవారం అసెంబ్లీలో మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనే చూస్తే ప్రభుత్వం ఉద్దేశం స్పష్టమవుతోంది. వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేనాటికి టీచర్ పోస్టులు భర్తీ చేసేలా ప్రణాళికలున్నాయని ఆయన అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా వెల్లడించారు. లోకేశ్ ఏమన్నారంటే..

'నాడు–నేడు'పై విచారణ జరుగుతోంది..

జగన్ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కింద రెండు దశల్లో 38 వేల పాఠశాలల్లో రూ.15 వేల కోట్ల పనులకు శ్రీకారం చుట్టారని.. అందులో రూ.9,425 కోట్ల పనులు పూర్తయ్యాయన్నారు. నాడు–నేడు పనులపై విచారణ జరుగుతోందని నివేదిక అందాక, తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి కృషిచేస్తామన్నారు. పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను దత్తత తీసుకుంటామని ముందుకొస్తున్నారని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ.. 2018 గ్రూప్–1 రిక్రూట్‌మెంట్‌పై సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. నియామక ప్రక్రియలో రూ.300 కోట్లు చేతులు మారాయని ఆరోపించారు.

781 కి.మీ.ల యూజీడీ పనులు పూర్తి..

గ్రేటర్ విశాఖ పరిధిలో 781 కి.మీ యూజీడీ పనులు పూర్తయినట్లు పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. విశాఖలో 19 ఎస్టీపీలు ఉన్నాయని, వీటిద్వారా 179 ఎంఎల్‌డీ శుద్ధిచేసిన నీటిని పరిశ్రమలకు సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే, అన్ని జిల్లాల్లో ఎస్టీపీల కోసం రూ.300 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

కేంద్ర నిధులు దుర్వినియోగం కాలేదు..

రాష్ట్రంలో కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు దుర్వినియోగం కాలేదని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు మళ్లింపు జరగలేదని సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీల సంక్షేమ కోసం ఐదేళ్లలో రూ.58,249 కోట్లు ఖర్చుచేశారన్నారు.

మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి ఊరట

ముందస్తు బెయిల్ మంజూరు

సాక్షి, అమరావతి: మైదుకూరు వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డికి హైకోర్టు ఊరటనిచ్చింది. ఎన్నికల సమయంలో వైఎస్సార్ జిల్లా చాపాడు పోలీసులు ఆయనపై నమోదు చేసిన హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఒకవేళ రఘురామిరెడ్డిని అరెస్ట్ చేస్తే ఆయనను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేయాలని ఆదేశించింది. ఈ మేరకు రూ.30 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆయనకు ఆదేశాలు జారీ చేసింది. రఘురామిరెడ్డి వయసు 78 ఏళ్లని, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా చేశారని హైకోర్టు తెలిపింది. అందువల్ల ఆయన విదేశాలకు పారిపోయే అవకాశం లేదని అభిప్రాయపడింది. ఇప్పటికే పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ కూడా దాఖలు చేశారని గుర్తు చేసింది. అన్ని ఆధారాలను సంబంధిత కోర్టు ముందుంచారంది. రఘురామిరెడ్డికి కస్టోడియల్ విచారణ ఏమాత్రం అవసరం లేదని తేల్చిచెప్పింది. అందువల్ల ఆయన అభ్యర్థన మేరకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. బాధితుడి ఫిర్యాదు ప్రకారమే.. రఘురామిరెడ్డి ఎలాంటి ఆయుధాన్ని చేత పట్టలేదని, ఎవరిపై దాడి చేయలేదని గుర్తు చేసింది. ఆయన బాధితుడిని, ఇతర బాధితులను కులం పేరుతో దూషించలేదని పేర్కొంది. ఆయన సమక్షంలో ఇతర నిందితులు నేరానికి పాల్పడ్డారని తెలిపింది. ఆరోపిస్తున్న నేరాలేవీ కూడా ఆయనపై కనిపించడం లేదని పేర్కొంది. రఘురామిరెడ్డి కులం పేరుతో దూషించి నేరానికి పాల్పడ్డారని చెప్పలేమని వెల్లడించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ మంగళవారం తీర్పు వెలువరించారు.

ఆ కేసులో ఆళ్ల, సజ్జల నిందితులు కారు

- వారిని అరెస్ట్ చేయదలిస్తే న్యాయ సహాయం కోసం 3 రోజులు గడువిస్తాం
- హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదన

సాక్షి, అమరావతి: టీడీపీ కేంద్ర కార్యాలయంపై 2021లో జరిగిన దాడికి సంబంధించి పోలీసులు నమోదు చేసిన కేసులో మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఇప్పటివరకు నిందితులు కారని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. అరెస్ట్ విషయంలో వారిది కేవలం ఆందోళన మాత్రమేనని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ లూథ్రా, పోసాని వెంకటేశ్వర్లు హైకోర్టుకు వివరించారు. ముందస్తు బెయిల్ కోసం ఆళ్ల, సజ్జల దాఖలు చేసిన వ్యాజ్యాలు అపరిపక్వ మైనవని, ఒకవేళ వారిని అరెస్ట్ చేయ దలిస్తే తగిన న్యాయ సాయం పొందేందుకు కొంత సమయం కూడా ఇస్తామని చెప్పారు. ఈ వాదనలను సజ్జల, ఆళ్ల తరఫున సీని యర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వ్యతి రేకించారు. తమ ఆందోళనకు సహేతుక కారణాలు, నిర్దిష్ట ఆధారాలున్నాయని కోర్టుకు తెలిపారు. ఇప్పుడు తమ వ్యాజ్యాలను పరిష్కరిస్తే, రేపే వారిని అరెస్ట్ చేసే అవకాశం ఉందన్నారు. దీనిపై లూథ్రా, పోసాని స్పందిస్తూ.. ఒకవేళ వారిని అరెస్ట్ చేస్తే సంబంధిత కోర్టుకు సమాచారం ఇస్తామన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, న్యాయ సాయం పొందేందుకు ఆళ్ల, సజ్జలకు 5 రోజుల సమయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ముందస్తు బెయిల్ కోసం ఆళ్ల, సజ్జల దాఖలు చేసిన వ్యాజ్యాల్లో తదుపరి విచారణ అవసరం లేదంటూ వాటిని పరిష్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఇదే కేసులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్లు దాఖలు చేసిన వైఎస్సార్‌సీపీ నేతలకు గతంలో ఇచ్చిన రక్షణను న్యాయమూర్తి పొడిగించారు. తదుపరి విచారణను ఆగస్ట్ 2కి వాయిదా వేశారు. అలాగే, చంద్రబాబు ఇంటి వద్ద జరిగిన గొడవకు సంబంధించి నమోదైన కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్‌పై తదుపరి విచారణ వరకు ఎలాంటి కఠిన చర్యలొద్దంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులనూ న్యాయమూర్తి పొడిగించారు.



అంబటికి ప్రాణహాని లేదు

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎలాంటి ప్రాణహాని లేదని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం హైకోర్టుకు నివేదించింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ నివేదిక ఇచ్చారని ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి కోర్టుకు తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, ఎస్పీ నివేదికపై అభ్యంతరం ఉంటే, ప్రస్తుత వ్యాజ్యాన్ని ఉపసంహరించుకుని తిరిగి పిటిషన్ దాఖలు చేసుకోవడమో లేక ఎస్పీ నివేదికపై ఉన్నతాధికారులను ఆశ్రయించడమో చేయాలని తెలిపింది. ఏ విషయమో తమకు తదుపరి విచారణ నాటికి స్పష్టంగా చెప్పాలని రాంబాబును ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేస్తూ జస్టిస్ బొప్పన వరహా లక్ష్మీనర సింహ చక్రవర్తి ఉత్తర్వులిచ్చారు.

అవాస్తవాలను వల్లె వేయించారు

- గవర్నర్ ప్రసంగంపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు మాధవరావు, రవీంద్ర
- విద్య, వైద్యం, పెట్టుబడులు.. ఇలా అన్ని రంగాల్లోనూ వైఎస్సార్‌సీపీ పాలన భేష్



మాధవరావు


రవీంద్ర

సాక్షి, అమరావతి: ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, వంకా రవీంద్ర తప్పుబట్టారు. ఆయనతో అవాస్తవాలను వల్లె వేయించారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని పొగిడిన నోటితోనే నిందలు వేయించారని దుయ్యబట్టారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం శాసనమండలిలో జరిగిన చర్చలో ఎమ్మెల్సీ మాధవరావు మాట్లాడుతూ.. 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరు అద్భుతమంటూ గవర్నర్ గత రెండు సమావేశాల్లోనూ ప్రశంసించారు. వాటిని ఓర్చుకోలేకపోయిన కొత్త ప్రభుత్వం.. వైఎస్సార్‌సీపీ పాలనపై నిందలు వేయించింది. ఇప్పటివరకు రాష్ట్రంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా.. విద్య, వైద్యం, సంక్షేమం, ఉద్యోగం, ఉపాధి, సామాజిక న్యాయం, పెట్టుబడులు.. ఇలా అన్నింటిలోనూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అద్భుతమైన ఫలితాలను సాధించింది. శ్వేతపత్రాలను విడుదల చేస్తున్న చంద్రబాబు.. 2014 నుంచి 2024 వరకు ఎవరి ప్రభుత్వంలో ఏం జరిగిందో శాఖల వారీగా అప్పులు, ఫలితాలను కూడా వెల్లడించండి' అని సవాల్ విసిరారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వంకా రవీంద్ర మాట్లాడుతూ.. 'గవర్నర్ ప్రసంగం నేతి బీరచందంగా ఉంది. 2019–24 మధ్య రూ.లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయనే విషయాన్ని మరుగున పరచడం సరికాదు. ఎవరి ప్రభుత్వంలో జీఎస్‌డీపీ పెరిగిందో వెల్లడించాలి. గత వైఎస్సార్‌సీపీ సర్కార్ ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను జాతీయ సంస్థలు కూడా ప్రశంసించాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక దాడులు, దౌర్జన్యాలు పెరిగాయి. వృథా ఖర్చులు వద్దంటూ హెచ్చరిస్తున్న చంద్రబాబు.. మరి ఈనాడు, ఆంధ్రజ్యోతికి కోట్లాది రూపాయల యాడ్స్ ఎందుకు ఇస్తున్నారు?' అని ప్రశ్నించారు. ఇంకా ఈ తీర్మానంపై ఇంకా కేఎస్ లక్ష్మణరావు, సి.రామచంద్రయ్య తదితరులు మాట్లాడారు.

పేదరికంలేని సమాజాన్ని సృష్టిస్తాం

- గవర్నర్ ధన్యవాద తీర్మాన ప్రసంగంలో సీఎం చంద్రబాబునాయుడు
- రాష్ట్రాభివృద్ధికి డబ్బుల్లేవు.. అయినా సూపర్ సిక్స్ అమలుచేస్తాం
- ఆత్మస్తుతి.. పరనింద అన్నట్లుగా సాగిన రెండోరోజు సభ



సాక్షి, అమరావతి: ఏపీని పేదరికంలేని రాష్ట్రంగా మారుస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎమ్మెల్యేల సహకారంతో నియోజకవర్గాల నుంచి మొదలు జిల్లా, రాష్ట్రస్థాయి వరకు దీన్ని సుసాధ్యం చేస్తామని చెప్పారు. 2047కి దేశంలో అత్యధిక ఆదాయం గల రాష్ట్రాల్లో మొదటి, రెండో స్థానంలో ఏపీని నిలుపుతామన్నారు. ప్రస్తుతం రాష్ట్రాభివృద్ధికి డబ్బుల్లేవని, అందుకే బడ్జెట్ ప్రవేశపెట్టలేకపోయామన్నారు. ఒకటి రెండునెలల్లో బడ్జెట్‌ను సైతం ప్రవేశపెట్టే దిశగా ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. అయినప్పటికీ మేనిఫెస్టోలో పేర్కొన్న సూపర్–6 హామీలు అమలుచేస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో మంగళవారం సీఎం ప్రసంగించారు. ఆయన ఏమన్నారంటే..

దేవతల రాజధాని నిర్వీర్యం..

గత పాలకులు రాష్ట్రాన్ని నరకప్రాయంగా మార్చేశారు. వ్యవస్థలన్నీ నిర్వీర్యమైపోయాయి. దేవతల రాజధాని అయిన అమరావతిని నిర్వీర్యం చేసేశారు. అమరావతి పూర్తయితే రూ.2–3 లక్షల కోట్ల ఆదాయం వచ్చేది. గత ప్రభుత్వ టెర్రరిజంతో పారిశ్రామికవేత్తలు సైతం పారిపోయారు. ఆడబిడ్డలకూ రక్షణలేదు. పవన్ కళ్యాణ్‌ను కూడా వ్యక్తిగతంగా అవమానించారు. చివరికి బాబాయ్ (వివేకానందరెడ్డి) హత్య కేసును తప్పుదారి పట్టించారు. ఏపీలో 2019 నుంచి వృద్ధి రేటు దారుణంగా పడిపోయింది. ఇసుక, మద్యం, మైనింగ్,సెటిల్‌మెంట్లు చేసి దోచుకున్నారు. అభివృద్ధిలేక ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్న మైపోయింది. ఒక్క శాతం వృద్ధి పెరిగినా ప్రభుత్వానికి రూ.15 వేల కోట్ల ఆదాయం వస్తుంది. ఇక రిషికొండ ప్యాలెస్ ఏం చేయాలో తెలీడంలేదు. నా రాజకీయ జీవితంలో హత్యా రాజకీయాలను ప్రోత్సహించలేదు. కక్షకు పోతే రాష్ట్రం రావణకాష్టంగా మారుతుంది.. కానీ తప్పు చేసిన వారిని ఎప్పుడూ వదిలిపెట్టం. రాష్ట్రంలో హింసకు తావులేదు. నిరసన తెలపడం అందరి హక్కు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఏం చేసిన అడ్డుచెప్పబోం. పేర్లు చెప్పకుండా 36 మందిని చంపేశారని ఆరోపిస్తున్నారు కానీ వారి పేర్లు ఇవ్వమంటే ఇవ్వడంలేదు.

పోటాపోటీగా పొగడ్తల వర్షం..

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే చర్చ కాస్తా కూటమి సభ్యుల మధ్య ఆత్మస్తుతి, పరనింద అన్నట్లుగా సాగింది. చంద్రబాబు, పవన్ కళ్యాణ్.. మరోపక్క విష్ణుకుమార్ రాజు ఒకరికొకరు పోటీపడి పొగడ్తల వర్షం కురిపించారు. పవన్ మాట్లాడుతూ.. ఏపీ అంటే చంద్రబాబు గుర్తుకొచ్చేలా చేశారని, ఆయన కింద పనిచేయడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని తన స్వామిభక్తిని చాటుకున్నారు. కార్యకర్తలు తప్పు చేసినా క్షమించేదిలేదన్నారు. ఐఏఎస్‌లు, మీడియా తప్పుచేసినా చర్యలు తీసు కోవాలని సీఎంకు సూచించారు. ప్రజాప్రతి నిధులు ప్రయాణించే మార్గాల్లో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్న పవన్ విజ్ఞప్తికి చంద్రబాబు స్పందిస్తూ.. ఆ మేరకు ఆదేశాలిస్తానని మాటిచ్చారు. చంద్రబాబు ప్రసంగంలో ఎక్కడా తామిచ్చిన హామీల అమలు పైగాని, రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేస్తామనిగాని చెప్పలేదు.

అన్నం తినే వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారా?


- ప్రజలపై శాసనసభలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అనుచిత వ్యాఖ్యలు
- వివేకా హత్యపైనా అవగాహన లేని మాటలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలపై బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు శాసనసభలో అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'వైఎస్సార్‌సీపీకి కూడా 40శాతం మంది ఓట్లు వేశారంటే వాళ్లు అన్నం తినే వేశారా? మనసుతో ఆలోచించి ఓటు వేశారా? ఏవిధంగా ఓటు వేశారో అర్థం కావట్లేదు. వారి ఐదేళ్ల పరిపాలనను చూసిన తర్వాత కూడా ఈ విధంగా ఓట్లు వేయడంపై ఆలోచించాలి' అని అన్నారు. శాసనసభలో మంగళవారం గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం మీద చర్చలో సభ్యులు ప్రసంగించారు. చివరలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అరాచక పాలన, దోపిడీపాలన అనే ముద్ర వేసే ప్రయత్నం చేశారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన వివేకానందరెడ్డి హత్య ఉదంతాన్ని పథకం ప్రకారమే తన ప్రసంగంలో తెరపైకి తెచ్చారు. దానిని వైఎస్సార్‌సీపీకి అంటగట్టే ప్రయత్నంలో 'హూ ఈజ్ కిల్డ్ బాబాయ్.. అసలు బాబాయ్‌ని ఎవరు చంపారో ఎప్పటికి తెలుస్తుందో ఎవరైనా చెప్పాలి.. విష్ణుకుమార్‌రాజు మీరు చెప్పండి..' అంటూ బీజేపీ ఎమ్మెల్యేను చంద్రబాబు తెరపైకి తెచ్చారు. దీంతో చంద్రబాబు ఏదో తనకు సువర్ణ అవకాశం ఇచ్చినట్టు ఆనందపడిన విష్ణుకుమార్‌రాజు ఇష్టానుసారం రెచ్చిపోయి వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసిన ప్రజలపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. అదేవిధంగా వివేకానందరెడ్డి హత్య కేసుపై కనీస అవగాహన లేకుండా మాట్లాడారు. 'ఈ కేసును సీబీఐ విచారణకు అప్పగించాలి. శాస్త్రీయ పద్ధతిలో విచారణ చేయించాలి..' అని అనడంతో సభ్యులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. పక్కన కూర్చున్న శాసనసభ్యులు 'ఇప్పటికే సీబీఐ విచారణ జరుగుతోంది..' అని చెప్పగా.. నాలుక్కరుచున్న విష్ణుకుమార్‌రాజు... 'సీబీఐ విచారణను వేగంగా చేయించాలి..' అని తన తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. ఈ దశలో సీఎం చంద్రబాబు కల్పించుకుని దీనిపై సీబీఐ దర్యాప్తు చేసిందని, త్వరలో తీర్పు వచ్చేలా చేసి అసలైన హంతకులను శిక్షిస్తామన్నారు. అయినా విష్ణుకుమార్‌రాజు ఆగకుండా చంద్రబాబును స్తుతిస్తూ 'హూ కిల్డ్ బాబాయ్ అనేది అందరికీ తెలుసు. ఎవరు వెనకాల ఉండి చేయించారో తెలుసు' అంటూ మాట్లాడటం గమనార్హం.

దారి తప్పిన 'ధన్యవాద తీర్మానం'

- గవర్నర్ ప్రసంగంపై చర్చ అంతా సభ్యుల కోర్కెలు, డిమాండ్లతో సరి



సాక్షి, అమరావతి: శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం మీద చర్చ దారితప్పింది. ఈ తీర్మానంపై చర్చ ఆసాంతం కూటమి ఎమ్మెల్యేల వ్యక్తిగత విజ్ఞప్తులు, డిమాండ్లు, పొగడ్తలతోనే సాగింది. సాధారణంగా గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానం మీద చర్చ పెట్టినప్పుడు ప్రసంగంలో చెప్పిన అంశాలపైన, ప్రభుత్వం తీసుకునే చర్యలపైనా సభ్యులు ప్రసంగించాలి. కానీ, మంగళవారం శాసనసభ అందుకు విరుద్ధంగా సాగింది. సభలో ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టిన టీడీపీ ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు చేసిన ప్రసంగం సాఫీగానే కొనసాగింది. అనంతరం మాట్లాడిన సభ్యులు అసలు గవర్నర్ ప్రసంగం గురించి ప్రస్తావించలేదు. తమ వ్యక్తిగత కోర్కెలను వివరించడంతోపాటు ముఖ్యమంత్రిని పొగుడుతూ సభను పక్కదారి పట్టించారు. ఈ చర్చలో కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి మాట్లాడుతూ మహిళా సాధికారత టీడీపీ పేటెంట్ హక్కుగా పేర్కొన్నారు. 60ఏళ్ల చరిత్రలో ఏ పార్టీ కూడా కడప అభ్యర్థిగా మహిళను ప్రకటించలేదని, టీడీపీ మాత్రం తనను ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీలోకి తీసుకొచ్చిందని తెలిపారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ గత సీఎం వైఎస్ జగన్ తనపై కోడికత్తితో దాడి కేసు పెట్టారని, వైఎస్ వివేకా హత్య కేసు పెట్టారని, ఇలాంటి వారిని ఫోన్ చేసి మరీ సభకు పిలిచి దండించాలని డిమాండ్ చేశారు. ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నమోదైన కేసుల నుంచి అందరికీ సాంత్వన చేకూర్చాలని కోరారు.

మీరు గొప్ప.. కాదు.. కాదు మీరే గొప్ప!

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పాలన ప్రారంభిస్తే తాము ఏపీకి వచ్చి పనిచేయాలని ఢిల్లీలో ఉన్న బ్యూరోక్రాట్లు తపన పడుతున్నారని తెలిపారు. సవాళ్లను అధిగమించి ఏపీని ముందుకు తీసుకువెళ్లే గొప్ప నాయకుడు చంద్రబాబు అని చెప్పారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ తాను జైల్లో ఉన్నప్పుడు పవన్ కల్యాణ్ స్వచ్ఛందంగా ముందుకొచ్చి రాష్ట్రంలో ఓట్లు చీలనీయబోనని ప్రకటించడంతోపాటు టీడీపీతో కలిసి ఉమ్మడిగా పోటీ చేస్తామని సామాజిక బాధ్యతగా తీసుకున్నారన్నారు. సీఎం చంద్రబాబు ప్రసంగం అనంతరం గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని ఏకగ్రీవంగా సభ ఆమోదించినట్లు స్పీకర్ ప్రకటించారు.

అంతా బాబు జపం.. విపక్షంపై విషం

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో సభ్యుల తీరిది


సాక్షి, అమరావతి: శాసనసభ,మండలి సభ్యులను ఉద్దేశించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అసెంబ్లీలో చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభ్యులు మంగళవారం చర్చించారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా రెండో రోజున రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టగా.. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష బలపరిచారు. ఈ సందర్భంగా కూటమి సభ్యులంతా వైఎస్సార్‌సీపీని నిందిస్తూ.. అడుగడుగునా సీఎం చంద్రబాబు జపం చేశారు.

బాబును చూసి ఎన్నో నేర్చుకోవాలి

సీఎం చంద్రబాబు ఎన్నోసార్లు సవాళ్లను అధిగమించి ఏపీని అభివృద్ధి దిశగా నడిపించారు. ప్రత్యర్థులను కూడా గౌరవించే గొప్ప గుణం ఆయనది. నాలాంటి వాళ్లు చంద్రబాబును చూసి ఎన్నో నేర్చుకోవాలి. ఇసుక, మైనింగ్.. ఇలా అన్నిట్లోనూ గత ప్రభుత్వం తప్పు చేసింది కదా.. మేము చేస్తామంటే జనసేనలో ఉండే నాయకులను నియంత్రించే బాధ్యత మేం తీసుకుంటాం. గత ప్రభుత్వం పోలవరాన్ని పూర్తి చేయలేదు. ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వలేపోయింది. ఎంతో విధ్వంసం చేసింది. ఇలాంటి తరుణంలో సుదీర్ఘ అనుభవం ఉన్న చంద్రబాబు కింద పని చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నాం. కేంద్రం బడ్జెట్‌లో ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించినందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు.

– పవన్‌కళ్యాణ్, ఉప ముఖ్యమంత్రి


రాష్ట్రాన్ని 25 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారు



పరిపాలన అనుభవం లేకపోవడం, నియంతృత్వ ధోరణి, సైకో భావజాలంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన విధ్వంసం రాష్ట్రాన్ని 25 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లింది. చంద్రబాబు బీసీ కార్పొరేషన్లు పెట్టి స్వయం ఉపాధి కల్పిస్తే.. జగన్ వాటిని నిర్వీర్యం చేశారు. జే ట్యాక్స్ కట్టలేక పారిశ్రామికవేత్తలు ఏపీవైపు కన్నెత్తి చూడలేని పరిస్థితులను తీసుకొచ్చారు.

– కాల్వ శ్రీనివాసులు, రాయదుర్గం ఎమ్మెల్యే


జగన్‌కు 40 శాతం ఓట్లు వచ్చాయి



ఏపీలో చీకటి రోజులు తొలగి మంచి రోజులొచ్చాయి. ఏపీని ఆదుకోవాల్సిన అవసరం కేంద్రంపై ఉంది. అందుకే రూ.15 వేల కోట్లు అమరావతికి ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టుకు పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. గడచిన ఐదేళ్లు ఏపీలో అరాచక, ఆటవిక పాలన జరిగింది. ఓట్లు చీలనివ్వకుండా ఎన్డీయే కూటమి గెలుపులో జనసేన వ్యూహం పనిచేసింది. జగన్‌కు 40 శాతం ఓట్లు వచ్చిన విషయం గమనించాలి.దీనిని మర్చిపోకూడదు.

– యలమంచిలి సుజనా చౌదరి, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే

వైఎస్సార్‌సీపీ సభ్యులను సభకు రప్పించాలి



గవర్నర్ ప్రసంగ సమయంలో విధ్వంసంపై పాయింట్లు చదివే సమయానికి వైఎస్సార్‌సీపీ సభ్యులు పారిపోయారు. ఐదేళ్లలో ఎన్నో అరాచకాలు చేశారు. వివేకానందరెడ్డి హత్యకు సంబంధించి నాపై కేసు పెట్టారు. వైఎస్సార్‌సీపీ సభ్యులకు స్పీకర్ ఫోన్ చేసి మరీ సభకు రప్పించాలి. రాకపోతే వారిని దండించాలి.

– ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే

కార్యకర్తలకు సాంత్వన చేకూర్చాలి



2019–24 మధ్య దోపిడీలపై విచారణ చేయాలి. ప్రతీకార రాజకీయంలో భాగంగా వేలాది మంది కార్యకర్తలపై అన్యాయంగా కేసులు పెట్టారు. ఈ కేసుల్లో ఇరుక్కున్న వారికి ప్రభుత్వం సాంత్వన చేకూర్చాలి.

– కె.రఘురామకృష్ణరాజు, ఉండి ఎమ్మెల్యే



డెలావెర్‌లోని డెమొక్రాటిక్ పార్టీ కార్యాలయానికి వచ్చిన కమలా హారిస్

హారిస్‌కే డెమొక్రాట్ల ఓటు

- 1,976కి పైగా ప్రతినిధుల నుంచి ఆమోదం
- అధికారిక ప్రకటనే తరువాయి
- ప్రచార బృందంతో భేటీ అయిన హారిస్

వాషింగ్టన్: డెమొక్రాట్ల అధ్యక్ష అభ్యర్థిగా అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ పేరు దాదాపు ఖరారైంది. అధ్యక్ష అభ్యర్థికి కావాల్సిన 1,976 కంటే ఎక్కువ మంది ప్రతినిధులు ఆమెకు మద్దతు తెలిపారు. అధ్యక్ష అభ్యర్థిగా కమలా హారిస్ పేరు అనధికారికంగా ఖరారు కావడంతో ఇప్పుడు ఉపాధ్యక్షుడిగా ఆమె ఎవరిని ఎన్నుకుంటారనేది ప్రశ్నార్థకంగా మారింది. డెలావెర్‌లోని ప్రచార ప్రధాన కార్యాలయాన్ని హారిస్ సోమవారం సందర్శించారు. అధ్యక్షుడు జో బైడెన్ ప్రతిపాదించిన అనంతరం హారిస్ మొదటిసారి రోజంతా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బైడెన్ ప్రచారం బృందంతో ఆమె సమావేశమయ్యారు. అదే బృందంతో కలిసి పనిచేయనున్నట్లు స్పష్టం చేశారు. ఎన్నికలకు ఇంకా 106 రోజులే ఉన్నాయని, గెలుపు కోసం నిర్విరామంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా.. తన రిపబ్లికన్ ప్రత్యర్థి డోనాల్డ్ ట్రంప్‌పై హారిస్ విరుచుకుపడ్డారు. ఆయన కుంభకోణాలను గుర్తు చేశారు. నేరాలను ఎత్తి చూపారు. మహిళలను వేధించిన మృగం, మోసగాడు, తన స్వార్థ ప్రయోజనాలకోసం నియమాలను ఉల్లంఘించిన వ్యక్తని విమర్శించారు. 'ట్రంప్ ఏ రకమో నాకు తెలుసు' అంటూ ఎద్దేవా హారిస్ చేశారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో కలిసి పనిచేయడం తనకు దక్కిన ఒక గొప్ప గౌరవమన్నారు. ఆయన అమెరికా ప్రజలకోసం నిరంతరం శ్రమించారని కొనియాడారు. ఇక కరోనా బారినపడి ఐసోలేషన్‌లో ఉన్న అధ్యక్షుడు జో బైడెన్ ఫోన్‌లైన్‌లో సమావేశంలో పాల్గొన్నారు. కమలా హారిస్‌ను గెలిపించడానికి పనిచేయాలని డెమొక్రాట్లకు విజ్ఞప్తి చేశారు. తాను కోలుకోగానే ప్రచారంలో పాల్గొంటానని హామీ ఇచ్చారు.

ట్రంప్‌పై విరుచుకుపడిన హారిస్..

ఇక హారిస్‌కు 40 మందికి పైగా డెమొక్రటిక్ సెనేటర్లు, దాదాపు 100 మంది హౌస్ సభ్యుల మద్దతు ఉంది. అత్యంత కీలకమైన మలుపు మాజీ హౌస్ స్పీకర్ నాన్సీ పెలోసీ సైతం హారిస్‌కు మద్దతు పలకడం. అంతేకాదు కాంగ్రెషనల్ బ్లాక్ కాకస్, కాంగ్రెషనల్ హిస్పానిక్ కాకస్, కాంగ్రెషనల్ ప్రోగ్రెసివ్ కాకస్‌తోపాటు సర్వీస్ ఎంప్లాయీస్ ఇంటర్నేషనల్ యూనియన్, అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ అనే రెండు కీలక కార్మిక సంఘాలు సైతం ఆమెకు మద్దతు తెలుపుతున్నాయి. ఉపాధ్యక్ష రేసులో కెంటకీ గవర్నర్ ఆండీ బెషీర్, యుఎస్ ట్రాన్స్‌పోర్టేషన్ సెక్రటరీ పీట్ బుట్టిగీగ్, నార్త్ కరోలినా గవర్నర్ రాయ్ కూపర్, అరిజోనా సెనేటర్ మార్క్ కెల్లీ, పెన్సిల్వేనియా గవర్నర్ జోష్ షాపిరో, ఇల్లినాయిస్ గవర్నర్ జె.బి. ప్రిట్జ్‌కర్, మిచిగాన్ గవర్నర్ గ్రెట్చెన్ విట్మర్ ఉండొచ్చని భావిస్తున్నారు.

రికార్డు స్థాయిలో విరాళాలు..

ఇదిలా ఉండగా.. అభ్యర్థిగా కమలా హారిస్ ప్రచారం మొదలుపెట్టిన మొదటి రోజే పార్టీకి విరాళాలు వెల్లువెత్తాయి. 24 గంటల్లోనే 81 మిలియన్ డాలర్లు వచ్చాయి. అందులో 60శాతం మొదటి సారి విరాళం ఇచ్చారు. అధ్యక్ష అభ్యర్థికి ఒకేరోజు ఇంత మొత్తంలో విరాళాలు రావడం డెమొక్రాట్ల చరిత్రలోనే తొలిసారి.

'నీట్' రీ టెస్టుకు సుప్రీం నో

- పరీక్ష సమగ్రత దెబ్బతినలేదన్న అత్యున్నత న్యాయస్థానం
- వ్యవస్థాగత లీక్‌కు ఎలాంటి ఆధారాలు లేవు
- పరీక్ష రద్దు చేయడం సాధ్యం కాదని స్పష్టీకరణ
- సహేతుక తీర్పు వెలువరిస్తామన్న సీజేఐ

> కోర్టు నిర్ణయాల ద్వారా లేదా మెటీరియల్ ఆన్ రికార్డ్ ఆధారంగా నీట్ రద్దు చేయాలని ఆదేశించడం సమర్థనీయం కాదని భావిస్తున్నాం. ప్రస్తుత దశలో పరీక్ష సమగ్రతకు వ్యవస్థాగత ఉల్లంఘన ఉందని నిర్ధారణకు రావడానికి ఎలాంటి మెటీరియల్ రికార్డులో లేదు. పరీక్ష మళ్లీ నిర్వహించడం సాధ్యం కాదు.
> - సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్

సాక్షి, న్యూఢిల్లీ: నీట్-యూజీ 2024 రద్దు చేయడం కుదరదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. రద్దు చేస్తే లక్షలాది మంది అభ్యర్థులపై ప్రభావం పడుతుందని పేర్కొంది. పేపర్ లీక్ వాస్తవమని, అయితే.. వ్యవస్థాగత పేపర్ లీక్ జరిగిందనడానికి తగిన ఆధారాలు లేనందున పరీక్ష సమగ్రత దెబ్బతిన్నదనడానికి అవకాశాల్లేవని స్పష్టం చేసింది. రద్దుతో వైద్య కళాశాలల్లో ప్రవేశాల షెడ్యూల్‌కు అంతరాయం, వైద్యవిద్యపై ఊహించలేని ప్రభావం పడుతుందని, భవిష్యత్‌లో అర్హత కలిగిన వైద్య నిపుణుల లభ్యతపైనా ప్రభావం చూపుతుందని వెల్లడించింది. ఇది కొందరు అభ్యర్థులకు ప్రతికూలత అవుతుందని తెలిపింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఎన్టీఏ తరపున సీనియర్ న్యాయవాది కౌశిక్, పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు నరేందర్ హుడా, సంజయ్ హెగ్డే, మాథ్యూస్ నెడుంపర, ఇతర న్యాయవాదుల సుదీర్ఘ వాదనలు వినిపించారు. నీట్-యూజీ, 2024పై దాఖలైన వేర్వేరు పిటిషన్లను సుదీర్ఘంగా విచారించిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఆదేశాలు వెలువరించింది. సహేతుకమైన తీర్పు తర్వాత వెలువరిస్తామని తెలిపింది. పేపర్ లీక్ వ్యవస్థాగతంగా జరిగిందని, నిర్వహణ లోపాలు ఉన్నాయని పరీక్ష మళ్లీ నిర్వహించాలన్న వాదనలను కోర్టు తోసిపుచ్చింది. సీబీఐకి దర్యాప్తు బదిలీ తర్వాత జూలై 10, జూలై 17, జూలై 21 తేదీల్లో ఆరు నివేదికలు దాఖలు చేసిందని, విచారణ కొనసాగుతోందని వెల్లడిస్తున్నప్పటికీ హజారీబాగ్, పట్నాలోని కేంద్రాల నుంచి సేకరించిన 155 మంది విద్యార్థులు లీక్ లబ్ధిదారులుగా గుర్తించిందని తెలిపింది. సీబీఐ విచారణలో ఎక్కువ మంది కళంకిత అభ్యర్థులు, అవకతవకలకు పాల్పడినట్లు తేలితే సదరు విద్యార్థి కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేసినప్పటికీ, ఏ దశలోనైనా చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. సదరు విద్యార్థులు ఎలాంటి క్లెయిమ్‌లు చేసుకోవడానికి అర్హులు కారని స్పష్టం చేసింది. అయితే, హజారీబాగ్, పట్నాల్లో లీక్ వాస్తవమని పేర్కొంది. సీబీఐ నివేదిక ప్రకారం ఆ ప్రాంతాల్లో లీక్ లబ్ధిదారులైన అభ్యర్థులు 155 మంది మాత్రమే కాబట్టి, కళంకిత, కల్మషం లేని విద్యార్థులను గుర్తించొచ్చని స్పష్టం చేసింది. భౌతిక శాస్త్రానికి సంబంధించి ఓ అస్పష్ట ప్రశ్నకు ఐఐటీ, ఢిల్లీ నిపుణుల బృందం నివేదికను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపింది. నిపుణుల సూచన మేరకు సదరు ప్రశ్నకు నాలుగు ఆప్షన్‌ను సమాధానంగా గుర్తించి తదనుగుణంగా ఫలితాలు లెక్కించాలని ఎన్టీఏను ఆదేశించింది. సమయం కోల్పోయిన, ప్రశ్నాపత్రం మార్పు, భాషా సమస్యల కారణంగా 1,563 మందికి పరీక్ష తిరిగి నిర్వహించాలన్న డివిజన్ బెంచ్ నిర్ణయాన్ని సమర్థించింది. సుప్రీంకోర్టులో పిటిషన్లను ఉపసంహరించుకొన్న తర్వాత వ్యక్తిగత ఫిర్యాదుల విషయంలో సంబంధిత హైకోర్టుకు వెళ్లడానికి అభ్యర్థులకు అనుమతించింది. నీట్ రద్దు చేయాలన్న పిటిషన్లు తోసిపుచ్చుతూ విచారణ ముగించింది. నీట్-యూజీ నిర్వహణ పటిష్టం చేసేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీపై తదుపరి ఆదేశాలుంటాయని తెలిపింది.

సెక్యూరిటీని పిలవండి.. అతడిని బయటికి పంపిస్తారు

- విచారణకు అడ్డుపడుతున్నారని న్యాయవాదిపై సీజేఐ ఆగ్రహం
- నీట్ విచారణ సందర్భంగా మంగళవారం కోర్టులో ఘటన

న్యూఢిల్లీ: 'నీట్'లో అవకతవకలపై మంగళవారంనాడు సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా అడ్డుపడిన న్యాయవాది మాథ్యూస్ నెడుంపరపై సీజేఐ డీవై చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయవాది నరేంద్ర హుడా వాదన వినిపిస్తుండగా నెడుంపర అడ్డుపడ్డారు. తాను 'అమికస్'నని, బెంచ్ అడిగిన ప్రశ్నకు జవాబిస్తానని చెప్పారు. దానిపై సీజేఐ తాను ఏ ఎమికస్‌ను నియమించలేదన్నారు. దాంతో నెడుంపర ''మీరు నాకు గౌరవం ఇవ్వకుంటే... నేను వెళ్లిపోతా' అన్నారు. అందుకు సీజేఐ ఆగ్రహంతో 'మిస్టర్ నెడుంపర... మీరు కోర్టు హాల్లో ఉన్నారు. సెక్యూరిటీని పిలవండి... ఆయనను బయటకు పంపిస్తారు' అని అన్నారు. దాంతో నెడుంపర తానే వెళ్లిపోతా నన్నారు. వెంటనే సీజేఐ 'వెళ్లిపోతానని మీరు చెప్పకూడదు. 24 ఏళ్లుగా జ్యుడీషియరీని చూస్తున్నా. కోర్టులో ప్రొసీడింగ్స్‌ను లాయర్లు డిక్టేట్ చేయరు' అని పేర్కొన్నారు. నెడుంపర కూడా.. '1979 నుంచి నేనూ జ్యుడీషియరీని చూస్తున్నా' అనడంతో సీజేఐ తీవ్రంగా హెచ్చరించారు. దీంతో బయటకు వెళ్లిన నెడుంపర కాసేపటికే తిరిగొచ్చి 'సారీ.. నేనెలాంటి తప్పూ చేయలేదు, అనుచితంగా ట్రీట్ చేశారు. ఈ విషయాన్ని ఇంతటితో వదిలేస్తున్నా'' అని చెప్పారు. నెడుంపర కోర్టు విచారణకు అంతరాయం కలిగించిన ఘటనలు గతంలోనూ ఉన్నాయి.

'ప్రత్యేక హోదా'పై దద్దరిల్లిన బిహార్ అసెంబ్లీ

ప్రతిపక్షాల నిరసనలతో రెండుసార్లు వాయిదా

పట్నా: బిహార్‌కు కేంద్ర ప్రభుత్వం 'ప్రత్యేక హోదా' ప్రకటించేందుకు నిరాకరించడంపై మంగళవారం రాష్ట్ర అసెంబ్లీ దద్దరిల్లింది. ప్రతిపక్షాల సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి, నినాదాలు చేశారు. కుర్చీలు, బెంచీలను ఎత్తిపడేశారు. పిల్లలు ఆడుకునే గిలక్కాయలతో శబ్దాలు చేశారు. ఈ పరిస్థితుల నడుమ సభ రెండుసార్లు వాయిదా పడింది. బిహార్‌కు ప్రత్యేక హోదా దక్కకపోవడంపై సీఎం నితీశ్ తనదైన శైలిలో స్పందించారు. విలేకరుల ప్రశ్నలకు ఆయన.. 'అన్నీ నెమ్మదిగా మీకే తెలుస్తాయి'అంటూ నవ్వారు. ప్రత్యేక హోదా ఇవ్వలేకున్నా కనీసం ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్న తన డిమాండ్‌ను కేంద్రం అంగీకరించిందని ఆయన చెప్పుకున్నారు. రాష్ట్రం అవసరాలను గుర్తించిందని అన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ మనుగడలో నితీశ్ సారథ్యంలోని జేడీయూ కీలకమని తెల్సిందే.

అమెరికా సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ రాజీనామా



వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హత్యాయత్నం నేపథ్యంలో సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ కింబర్లీ చియాటిల్ మంగళవారం రాజీనామా చేశారు. ప్రస్తుత, మాజీ అధ్యక్షుల భద్రత కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీక్రెట్ సర్వీస్ విభాగం తన కీలక బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైందంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ట్రంప్‌పై హత్యాయత్నం తమ అతిపెద్ద వైఫల్యమని కాంగ్రెషనల్ కమిటీ విచారణలో ఈమె ఒప్పుకున్నారు కూడా. ఈ నేపథ్యంలో కింబర్లీ బాధ్యతల నుంచి వైదొలిగారు. ఈమె 2022 నుంచి సీక్రెట్ సర్వీస్ అధిపతిగా పనిచేస్తున్నారు. ఈ నెల 13వ తేదీన పెన్సిల్వేనియాలో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి అయిన ట్రంప్ చేపట్టిన ప్రచార ర్యాలీ సందర్భంగా ఒక దుండగుడు దగ్గర్లోని భవనంపై నుంచి కాల్పులు జరపడం, ఆయన త్రుటిలో తప్పించుకోవడం తెల్సిందే.

చొరబాటుయత్నం భగ్నం.. జవాను వీరమరణం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంబడి పాక్ నుంచి మన భూభాగంలోకి చొరబడేందుకు ఉగ్రవాదులు చేసిన యత్నాన్ని భద్రతా బలగాలు తిప్పికొట్టాయి. ఈ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక జవాను ప్రాణాలు కోల్పోయారు. పూంచ్ జిల్లాలోని బట్టాల్ సెక్టార్‌లో మంగళవారం వేకువజామున 3 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుందని వైట్‌నైట్ కార్ప్స్ 'ఎక్స్'లో తెలిపింది. కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన లాన్స్ నాయక్ సుభాష్ కుమార్ తుదిశ్వాస విడిచారు. కాల్పులతో దీటుగా బదులివ్వడంతో ఉగ్రవాదులకు కూడా నష్టం జరిగిందని, అనంతరం వారు పాక్ భూభాగంలోకి తోకముడిచారని వెల్లడించింది. ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొంది.

ఇథియోపియాలో 157 మంది సజీవ సమాధి



అడిస్ అబాబా: ఇథియోపియాలో భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడి వందలాది మందిని బలి తీసుకున్నాయి. మారుమూల గోఫా జోన్‌లోని కెంచో షాచా గోజ్డి జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటనలో 55 మంది చనిపోయినట్లు సోమవారం ఉదయం అధికారులు తెలిపారు. మంగళవారం మరికొన్ని మృతదేహాలు బయటపడటంతో మరణాల సంఖ్య 157కు చేరింది. మృతుల్లో పలువురు చిన్నారులు, మహిళలు ఉన్నారు. బురదలో చిక్కుకుపోయిన ఐదుగురిని సజీవంగా వెలికి తీశామన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. సోమవారం కొండచరియలు విరిగిపడిన చోట సహాయక చర్యలు సాగిస్తుండగానే మరోసారి రాళ్లు, బురదమట్టి భారీగా వచ్చి నివాసాలను ముంచెత్తాయన్నారు.

ఉగ్రవాద కాల్పుల్లో 26 మంది మృతి

బమాకో: ఆఫ్రికా దేశం మాలిలో అల్ ఖైదా అనుబంధ జమాత్- నాసర్ అల్-ఇస్లాం వల్ ముస్లిమీన్ (జేఎన్ఐఎం) సంస్థ ఉగ్రవాదులు రెచ్చిపోయారు. బుర్కినాఫాసో సరిహద్దులకు సమీపంలో ఉన్న డెంబో గ్రామంపై ఆదివారం సాయంత్రం సాయుధ దుండగులు విరుచుకుపడ్డారు. ఇళ్లలోని వారితోపాటు పొలాల్లో పనులు చేసుకుంటూ కనిపించిన 26 మందిని చంపేశారు. ఇటీవలి కాలంలో పెచ్చుమీరిన ఇటువంటి దాడులను సైనిక ప్రభుత్వం నిలువరించలేకపోతోంది. దేశంలోని మధ్య, ఉత్తర భాగంలో ప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెట్టిన ఉగ్రమూకలను ఫ్రాన్సు బలగాలు తరిమేశాయి. ఇటీవల ఏర్పడిన సైనిక ప్రభుత్వం ఫ్రాన్సు బలగాలను వెనక్కి పంపించేసింది. దీంతో, ఉగ్ర బెడద మళ్లీ పెరిగింది. ఈ నెల మొదట్లో ఓ వివాహ వేడుకపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 21 మంది ప్రాణాలు కోల్పోయారు.

పరువు నష్టం కేసులో అతిశీకి బెయిల్

న్యూఢిల్లీ: పరువునష్టం కేసులో ఢిల్లీ మంత్రి అతిశీకి కోర్టులో ఊరట లభించింది. ఆప్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం ద్వారా కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు బీజేపీ కుట్ర పన్నిందంటూ అతిశీ చేసిన ఆరోపణలపై బీజేపీ నేత ప్రవీణ్ శంకర్ కపూర్ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై కోర్టు మంత్రికి సమన్లు జారీ చేసింది. దీంతో మంగళవారం కోర్టు విచారణకు మంత్రి హాజరయ్యారు. మంత్రి అభ్యర్థన మేరకు జడ్జి బెయిల్ మంజూరు చేస్తూ తదుపరి విచారణను ఆగస్టు 8వ తేదీకి వాయిదా వేశారు.

బిట్రగుంటలో పట్టాలు తప్పిన గూడ్సు రైలు

బిట్రగుంట: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వేస్టేషన్ వద్ద మంగళవారం తెల్లవారుజామున 4.25గంటలకు గూడ్సు రైలు పట్టాలు తప్పింది. ఈ గూడ్సు రైలు కృష్ణపట్నం పోర్టు నుంచి ఎరువుల లోడుతో బిట్రగుంట రైల్వే యార్డులోకి వస్తుండగా, దక్షిణ క్యాబిన్ సమీపంలో క్రాస్ ఓవర్ పాయింట్ దాటిన తర్వాత ప్రమాదం జరిగింది. మూడు బోగీలు అదుపు తప్పాయి. ఒక బోగీ పూర్తిగా పట్టాలు తప్పి అవతలి లైన్‌లోని ట్రాక్‌ను ఢీకొట్టడంతో లూప్‌లైన్‌లోని ట్రాక్, కాంక్రీట్ స్లీపర్లు దెబ్బతిన్నాయి. లోకో పైలట్ వెంటనే అప్రమత్తమై చాకచక్యంగా రైలును అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు.

కాకినాడ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేయండి

కాలేజీల అటానమస్ హోదా వ్యవహారంలో సీఐడీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: కోర్టు జారీ చేసిన నోటీసులను అందుకుని కూడా న్యాయవాదిని నియమించుకోవడం గానీ, స్వయంగా హాజరై వివరణ ఇవ్వకపోవడం గానీ చేయకపోవడం పట్ల కాకినాడ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్దేశపూర్వకంగా కోర్టు ముందు హాజరు కాలేదని తేల్చింది. అర్హత లేని 48 కాలేజీలు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి అటానమస్ హోదా పొందే విషయంలో ఆ కాలేజీలతో కుమ్మక్కై నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇచ్చారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని సీఐడీని ఆదేశించింది. చట్ట ప్రకారం దర్యాప్తు పూర్తి చేసి సంబంధిత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని సీఐడీకి తేల్చి చెప్పింది. ఎఫ్ఐఆర్ నంబర్‌ను ఈ శుక్రవారం కల్లా కోర్టుకు తెలియజేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు మంగళవారం తీర్పు వెలువరించారు. అర్హత లేని 48 కాలేజీలు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి అటానమస్ హోదా పొందే విషయంలో ఆ కాలేజీలతో కుమ్మక్కై కాకినాడ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇచ్చారని, దీనిపై సీబీఐ, ఈడీ లేదా ఏదైనా దర్యాప్తు సంస్థతో దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ జోసెఫ్ శ్రీహర్ష, ఇంద్రజా ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కేవీకే రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు ప్రతివాదులుగా ఉన్న కాలేజీలతో పాటు కాకినాడ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌కు నోటీసులు జారీ చేసింది. మంగళవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా.. నోటీసులు అందుకుని కూడా రిజిస్ట్రార్ న్యాయవాదిని నియమించుకోకపోవడం గానీ, స్వయంగా హాజరు కాకపోవడం గానీ చేయకపోవడం పట్ల న్యాయమూర్తి తీవ్రంగా మండిపడ్డారు.

వరద ముంపులోనే లంకలు

- ఏలూరు జిల్లా వేలేరుపాడులో 33 గ్రామాలు జలదిగ్బంధంలోనే
- గోదావరికి పెరుగుతున్న వరద ఉధృతి
- పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 33.61 మీటర్లకు నీటిమట్టం
- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- 14.19 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల



తూర్పు గోదావరి జిల్లా తాళ్లపాలెం వద్ద ఎర్రకాలువ ముంపులో పంట పొలాలు

సాక్షి నెట్‌వర్క్/సాక్షి అమరావతి: ఎగువ నుంచి సుడులు తిరుగుతూ వస్తున్న జలాలతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో గోదావరి వరద ఉధృతి పెరుగుతోంది. గోదావరి లంకలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ఏలూరు జిల్లా వేలేరుపాడులో 33 గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో నాలుగు పునరావాస కేంద్రాల్లో 308 కుటుంబాలు తలదాచుకున్నాయి. పంట పొలాలను వరద నీరు ముంచెత్తింది. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోనికి గోదావరి వరద ప్రవాహం వచ్చి చేరింది. మద్దూరులంక ముంపునకు గురైంది. పెరవలి మండలంలో వరద ప్రభావం ఎక్కువగా ఉంది. కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఉమ్మిడివారిపాలెం, ఓదూరివారిపాలెం, ముత్యాలవారిపాలెం, లంకమాలపల్లి, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల పరిధిలో కోకో, అరటి, కంద, పసుపు, పామాయిల్, చెరకు, జామ, బొప్పాయి, కొబ్బరి, తమలపాకు, కూరగాయల పంటలు, పూలతోటలు, మొక్కజొన్న తోటలు నీట మునిగాయి. జిల్లా వ్యాప్తంగా 18 మండలాల పరిధిలోని 207 గ్రామాల్లో వరద ప్రభావం కొనసాగుతోంది. 53,550 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగవగా.. 17,674 మంది రైతులకు చెందిన 16,057 హెక్టార్ల విస్తీర్ణంలో వరి, చెరకు, మినుము పంటలు నీట మునిగాయని వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 48 హెక్టార్లలో నారుమళ్లు నీట మునిగినట్లు నిర్ధారించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా గోదావరి నదీపాయలైన గౌతమి, వృద్ధ గౌతమి, వైనతేయ, వశిష్టలలో వరద తాకిడి అంతకంతకూ పెరిగిపోతోంది. దీంతో పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి, ఐ.పోలవరం, కె.గంగవరం మండలాల్లో ఏటిగట్టును ఆనుకుని ఉన్న మత్స్యకార ఇళ్లలోకి వరద నీరు చేరింది. రహదారులపైకి వరద నీరు చేరడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పడవలపైనే ప్రజలు ప్రయాణిస్తున్నారు. అప్పనపల్లి బాలాజీ దేవస్థానంలో దర్శనాలను నిలిపేశారు. కొమరగిరి, పశువులంక, ఎదుర్లంక, కేశనకుర్రు, గుత్తెనదీవిలలో గోదావరిని ఆనుకుని ఉన్న రొయ్యల చెరువులు నీట మునిగాయి. కాట్రేనికోన మండలం వృద్ధ గౌతమి కుడి ఏటిగట్టు కుండలేశ్వరం వద్ద సుమారు 50 మీటర్ల మేరకు దిగబడి పోవడంతో ఆయా ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సఖినేటిపల్లి మండలంలో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.

'పశ్చిమ'లో తోటలను ముంచెత్తిన వరద

పశ్చిమ గోదావరిజిల్లాలోని ఆచంట, పెనుగొండ మండలాల్లోని లంక భూముల్లో అరటి తోటలను వరద నీరు ముంచెత్తింది. జిల్లాలో మొత్తం 43 గ్రామాలు అధిక వర్షాలు, వరద తాకిడికి గురయ్యాయి. యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వేపై సుమారు నాలుగు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహిస్తోంది. పెదలంక, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలి లంక, ఏనుగువాని లంక, బాడవ తదితర లంక గ్రామాల్లో ఒడ్డును తాకుతూ గోదావరి ప్రవహిస్తోంది. తీవ్రత పెరిగితే నీరు గ్రామాల్లోకి చొచ్చుకొస్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. వరద ఉధృతి దృష్ట్యా ముందు జాగ్రత్తగా దొడ్డిపట్ల-అబ్బిరాజుపాలెం వద్ద పడవ, పంటు ప్రయాణాన్ని అధికారులు నిలిపేశారు. నరసాపురం మండలం కొత్త నవరసపురం ఎస్సీ కాలనీలోకి వరద నీరు చొచ్చుకొస్తోంది. నరసాపురం పట్టణంలోని లాకుపేట ప్రాంతం, రెండో వార్డు పొన్నపల్లి వద్ద గోదావరి అవుట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి నీరు పల్లపు ప్రాంతాలకు చేరుతోంది. భీమవరం పట్టణంలోని ముంపు ప్రాంతంలోకి వరద నీరు చేరింది. పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రాథమికంగా 37,182 హెక్టార్లల్లో వరినాట్లు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఏలూరు జిల్లాలోని పట్టిసం శివక్షేత్రం వద్ద గోదావరి వరద పరవళ్లు తొక్కుతోంది. ఈ ఏడాది మొదటిసారిగా శివక్షేత్రం చుట్టూ వరద ఉధృతంగా ప్రవహిస్తోంది.

ఒడిశా, తెలంగాణకు నిలిచిన రాకపోకలు

అల్లూరి సీతారామరాజు జిల్లాలో చింతూరు వంతెన వద్ద శబరి నది నీటిమట్టం 41 అడుగులకు చేరుకుంది. దీంతో 35 గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. జాతీయ రహదారి-326, జాతీయ రహదారి-30పై వరదనీరు చేరడంతో ఆంధ్రా నుంచి ఒడిశా, తెలంగాణ వెళ్లడానికి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతోపాటు సోకిలేరు, చంద్రవంక వాగుల ఉధృతితో చింతూరు నుంచి కూనవరం, వీఆర్‌పురం మండలాలకు కూడా రాకపోకలు ఆగిపోయాయి. నెల్లిపాక నుంచి భద్రాచలం వెళ్లే జాతీయరహదారి ముంపులోనే ఉంది. మరోవైపు భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి తగ్గుతోంది. మంగళవారం రాత్రి 10 గంటలకు 49.5 అడుగులకు చేరుకుంది. అయితే భద్రాచలం నుంచి దిగువకు వస్తున్న జలాలతో పోలవరం ప్రాజెక్టు వద్ద వరద పెరుగుతూనే ఉంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 33.61 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు 12,13,257 క్యూసెక్కుల నీరు చేరుతోంది. దీంతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం పెరుగుతోంది. బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువకు 3,300 క్యూసెక్కులను విడుదల చేసి మిగులుగా ఉన్న 14,19,972 క్యూసెక్కులను బ్యారేజ్ 175 గేట్లు ఎత్తి సముద్రంలోకి వదిలేస్తున్నారు. సోమవారం రాత్రి నుంచి ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బుధవారం కూడా కాళేశ్వరం నుంచి ధవళేశ్వరం, అంతర్వేది వరకూ గోదావరి ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుందని కేంద్ర జలసంఘం బేసిన్ పరిధిలోని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది.

కృష్ణమ్మ జలకళ

- శ్రీశైలంలోకి 1,55,323 క్యూసెక్కులు
- తుంగభద్రలో 93.46 టీఎంసీలు

సాక్షి, అమరావతి: శ్రీశైలం ప్రాజెక్టులోకి కృష్ణమ్మ బిరబిరా చేరుతోంది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు 1,55,323 క్యూసెక్కులు చేరుతుండటంతో 842.4 అడుగుల్లో 65.59 టీఎంసీలకు నీటి నిల్వ చేరుకుంది. పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాలకు కృష్ణా ప్రధాన పాయలో ఎగువన వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల్లోకి చేరుతున్న వరదను వచ్చినదాన్ని వచ్చినట్టు దిగువకు వదిలేస్తున్నారు. ఆ జలాలు జూరాల మీదుగా శ్రీశైలానికి చేరుకోనున్నాయి. ఇక తుంగభద్ర వరద ఉధృతి కాస్త తగ్గింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 85,148 క్యూసెక్కులు చేరుతుండగా.. విద్యుదుత్పత్తి చేస్తూ, మూడు గేట్లు ఒక అడుగు మేర ఎత్తి 9,149 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు.

సంగమేశ్వరుడిని చుట్టుముట్టిన కృష్ణాజలాలు



కొత్తపల్లి: ఎగువ నుంచి భారీగా వరద జలాలు శ్రీశైలం జలాశయాన్ని చేరుతున్నాయి. దీంతో శ్రీశైలం వెనుక జలాలు నంద్యాల జిల్లాలో సంగమేశ్వరాలయాన్ని చుట్టుముట్టాయి. దీంతో ప్రాచీన సంగమేశ్వరాలయం కృష్ణమ్మలో జలాధివాసం కానుంది.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

బుధవారం | 24 | జులై | 2024



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడ మాచవరానికి చెందిన ఎం.శ్రీయన్ కుటుంబం రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది.



నాట్యంలో ప్రాక్టికల్ పరీక్షలు

మొవ్వ: శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో యక్షగానం, సాత్విక అభినయం డిప్లొమా కోర్సుల ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారం నిర్వహించారు.



నీటి విడుదల నిలిపివేత

కృష్ణమ్మ ఉధృతి తగ్గింది. ఉపనదుల్లో వరద పోటు తగ్గడంతో ప్రకాశం బ్యారేజీకి ఇన్‌ఫ్లో కూడా తగ్గింది. దీంతో మంగళవారం సాయంత్రం నుంచి బ్యారేజీ అన్ని గేట్లు మూసివేశారు.

న్యూస్‌రీల్

ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కీర్తికి శుభాకాంక్షలు



ఇబ్రహీంపట్నం: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరిని ఎన్టీటీపీఎస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవీ కిరణ్ ఆధ్వర్యంలో విజయవాడ విద్యుత్ సౌధలో కలిసి ఆమెను శాలువతో సత్కరించి అభినందించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్, అడిషనల్ ప్రధాన కార్యదర్శి సర్వేశ్వరరావు, జెన్‌కో రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌కుమార్, ట్రాన్స్‌కో రాష్ట్ర అధ్యక్షుడు జయకర్ రాయ్, కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

విజయవాడస్పోర్ట్స్: ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం(ఐజీఎంసీ)లో కొనసాగుతున్న క్రీడా శిక్షణ శిబిరాలను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి(డీఎస్‌డీవో) ఎస్.ఎ. అజీజ్ కోరారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధీనంలో ఫుట్‌బాల్, కబడ్డీ, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, జూడో, యోగ, వాటర్ స్పోర్ట్స్, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, టెన్నిస్ క్రీడాంశాలకు కోచ్‌లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయా క్రీడాంశాలకు సంబంధించి ప్రతి రోజూ ఉదయం ఆరు నుంచి తొమ్మిది, సాయంత్రం నాలుగు నుంచి ఏడు గంటల వరకు స్టేడియంలో శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులకు శిక్షణ పూర్తిగా ఉచితమన్నారు. మరిన్ని వివరాలకు 91211 06836ను సంప్రదించాలని సూచించారు.

ఐటీఐల్లో మూడో విడత అడ్మిషన్లు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లోని సీట్లను భర్తీ చేసేందుకు మూడో విడత అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టామని ఐటీఐ కౌన్సెలింగ్ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ ఎం.కనకరావు ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత అయిన విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో బుధవారం (ఈ నెల 24వ తేదీ) దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం (25వ తేదీ) 5 గంటలలోగా దరఖాస్తు చేసుకున్న కళాశాలకు విద్యార్థి ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకువెళ్లి ప్రిన్సిపాల్‌తో వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చేరాలనుకునే వారికి ఈ నెల 27, 28 తేదీల్లో, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో చేరాలనుకునే వారికి ఈ నెల 29, 30 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆయన వివరించారు. ఇతర వివరాలకు 94906 39639, 77804 29468లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

రేపు జాబ్‌మేళా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు చూపించేందుకు గురువారం (ఈ నెల 25వ తేదీ) ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రమేష్ ఆస్పత్రి రోడ్డు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి విక్టర్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని యువతీ యువకులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. మెడ్‌ప్లస్, టైమ్స్ ప్రో, జీనియస్, ధృవంత సొల్యూషన్స్, ఓజోన్ సెక్యూరిటీ మొదలైన కంపెనీల్లోని ఖాళీలను భర్తీ చేసేందుకు, ఆయా కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారు బయోడేటా, విద్యార్హతా పత్రాలు, ఆధార్ కార్డుతో హాజరు కావాల్సిందిగా తెలిపారు. ఇతర వివరాలకు 8142416211 (వాట్సాప్ కాల్స్ మాత్రమే) సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికైంది. మంగళవారం ఎగ్జిబిషన్ సొసైటీ హాలులో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఫెడరేషన్ చైర్మన్‌గా ఏ సాంబశివరావు, సెక్రటరీ జనరల్ డి. చంద్రశేఖర్, కో చైర్మన్ ఓ. భాస్కరరావు, వైస్ చైర్మన్లుగా కె. శంకరరావు, ఎస్ఎస్ఎస్ శ్రీనివాసరావు, జి. ఇందిర, బీవీఎస్ సాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్వీఎస్ కుమారస్వామి, జాయింట్ సెక్రటరీ ఎన్. మల్లిఖార్జునరావు, కోశాధికారి జయదేవ్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా ఏ విద్యాసాగర్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో ఏపీ ఎన్జీవో నేతలు ప్రమాణ స్వీకారం చేయించారు.

విద్వేషం.. విధ్వంసం

విజయవాడ సెంట్రల్‌లో పేట్రేగుతున్న 'పచ్చ' గ్యాంగ్

రెండు నెలల కిందటి వరకూ స్టేట్‌కే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా ఉన్న విజయవాడలోని సెంట్రల్ నియోజకవర్గం.. ఇప్పుడు దారుణాలకు, దాష్టీకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అధికారంలోకి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అరాచకాలకు తెరతీసింది. పేద, ధనిక తేడా లేదు.. ఆడ మగ భేదం లేదు.. కేవలం వారు వైఎస్సార్ సీపీనా కాదా అన్న విషయాన్ని మాత్రమే చూస్తూ.. వారిపై విచక్షణ రహితంగా దాడులకు తెగపడుతోంది. వారి ఆస్తులను ధ్వంసం చేస్తోంది. అండగా నిలబడి ఆదుకోవాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

- వైఎస్సార్ సీపీ, సామాన్యులే లక్ష్యంగా దాడులు
- బుడమేరు వంతెన వద్ద చిరు వ్యాపారులపై దాష్టీకం
- రాత్రికి రాత్రే షాపులు ధ్వంసం
- టౌన్ ప్లానింగ్ సిబ్బందిని పావుగా వాడుతున్న వైనం
- దుకాణాలపై టీడీపీ జెండా కట్టాల్సిందే!
- నోరు తెరిస్తే భౌతిక దాడులు



బుడమేరు వంతెన వద్ద మంగళవారం తెల్లవారుజామున కూల్చివేసిన దుకాణాలు

సాక్షిప్రతినిధి, విజయవాడ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు, దౌర్జన్యాలు నిత్యకృత్యమయ్యాయి. ఎన్నికల్లో టీడీపీ తరఫున గెలిచిన నాయకుడి అండదండలతో ఆయన అనుచరులు పేట్రేగిపోతున్నారు. మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులను పావుగా చేసుకుని చిరువ్యాపారుల పొట్టకొడుతున్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు, కార్యకర్తలు, నాయకుల దుకాణాలను ఆక్రమణల పేరుతో కూల్చివేస్తున్నారు. 45 రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో 50 మందికి పైగా చిరు వ్యాపారుల దుకాణాలు ధ్వంసం చేశారు. ఎన్నో ఏళ్లుగా దుకాణాలు నడుపుతూ ఉన్న వారిని ఖాళీ చేయించి వాటిని తమ అనుయాయులకు అప్పగించే ఏర్పాట్లు చేస్తున్నారు. అధికార పార్టీ గ్యాంగ్ ఆగడాలు తెలిసినా పోలీసులు, అధికారులు తమకు తెలియనట్టే నటిస్తున్నారు.

వణుకుతున్న జనం..

విజయవాడలోని అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, బీసెంట్ రోడ్డు, లెనిన్ సెంటర్, ప్రధానమైన మూడు కాలువగట్లు, రోడ్ల పక్కన వేలాది మంది చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు ఉన్నారు. వారిలో అన్ని పార్టీల సానుభూతిపరులు ఉన్నారు. ఎన్నో ఆక్రమణలు ఉన్నా కేవలం వైఎస్సార్ సీపీకి చెందిన వారే లక్ష్యంగా టౌన్ ప్లానింగ్ అధికారులు దుకాణాలు కూల్చివేస్తున్నారు. అదేమిటని అధికారులను ప్రశ్నిస్తే.. 'ఇటీవల గెలిచిన నాయకుడితో మాట్లాడుకోండి' అంటున్నారే తప్ప సహేతుకమైన కారణం చెప్పడం లేదని బాధితులు వాపోతున్నారు. మొత్తం ఆక్రమణలు తొలగిస్తున్నారా అంటే అదీ లేదు. పక్కనే ఇతరుల షాపులు ఉన్నా వాటి జోలికి వెళ్లడం లేదు. కొందరు టీడీపీ నాయకులు తమ పార్టీ జెండాలు కడతారా దుకాణాలు కూల్చమంటారా అంటూ బాహాటంగానే హెచ్చరిస్తున్నారు. ఇంకా పలువురిపై దాడులు జరిగినా.. వారు బయటికి చెప్పుకొనేందుకు భయపడిపోతున్నారు.



63వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ వీర్ల వరలక్ష్మికి చెందిన హోటల్ కూల్చివేసిన అధికారులు(ఫైల్)

ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని బుడమేరు వంతెన సెంటర్‌లో ఎస్టీ తెగకు చెందిన పేదలు 40 ఏళ్లుగా షాపులు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. చేపల విక్రయంతో పాటు సైకిల్ రిపేరు వంటి చిన్న చిన్న పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నారు. ఇప్పుడు ఉన్న పాటున వీరి షాపులు కూల్చివేశారు. కనీసం వారికి షాపులు పగుల గొడుతున్నట్లు సమాచారం కూడా ఇవ్వలేదు. పది రోజుల క్రితమే కరెంటు తీసేసినా ఎలాగోలా వ్యాపారం చేసుకొంటున్నారు. మంగళవారం తెల్లవారుజాము రెండు గంటల సమయంలో తాళాలు వేసిన షాపులను పగులగొట్టేశారు. అందులో ఉన్న చేపలతో పాటు సామగ్రి ధ్వంసమైంది. ఇంతకీ వారు చేసిన తప్పేంటయ్యా అంటే వారిలో కొంత మంది వైఎస్సార్ సీపీ సానుభూతి పరులుగా ఉండటమే!

కుట్రతో కూల్చివేతలు..

- 59వ డివిజన్ అజిత్‌సింగ్‌నగర్‌లో ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తి టైలరింగ్ షాపుపై దాడి చేసి ఫర్నీచర్ పూర్తిగా ధ్వంసం చేశారు.
- 63వ డివిజన్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ వరలక్ష్మి తన ఇంటి ముందు దుకాణం ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. ఆ దుకాణాన్ని కూల్చి వేయించారు.
- 64వ డివిజన్‌కు చెందిన శేఖర్ (యాదవ), జిల్లేళ్ల శివ (కాపు)కు చెందిన బడ్డీ కొట్లు, వాటర్ ప్లాంట్ల దుకాణాలను నిర్దాక్షిణ్యంగా బుల్డోజర్లతో కూల్చివేశారు. అక్కడే ఉన్న ఇతర దుకాణాల జోలికి వెళ్లలేదు.
- 63వ డివిజన్‌లో జగదీష్ (కాపు)కు చెందిన రైతు బజార్ షాపును తొలగించారు.
- 23వ డివిజన్‌లో వెన్నం రత్నారావు (కాపు)కు చెందిన రైతు బజార్ షాపులను తొలగించారు.
- 27వ డివిజన్‌కు చెందిన అంజి (కాపు)తో పాటు అతని బంధువులకు సంబంధించి బావాజీపేట డీ మార్ట్, విజయాటాకీస్ వంతెన ప్రాంతాల్లో ఉన్న షాపులను బుల్డోజర్లతో కూల్చివేశారు.
- బుడమేరు అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఎస్టీ సామాజికవర్గానికి చెందిన పలువురు పేదలు బండ్లపై చిరువ్యాపారాలు చేసుకుంటున్నారు. బండ్లు తొలగిస్తామని వారిపై బెదిరింపులకు పాల్పడ్డారు. చివరకు తెలుగుదేశం జెండాలు కట్టే వరకు వారిపై వేధింపులు కొనసాగాయి.
- అల్లూరి సీతారామరాజు వంతెన వద్ద ఓ పేద మహిళ దుకాణాన్ని తొలగించారు.
- లెనిన్ సెంటర్‌లో అడుగడుగునా ఆక్రమణలే ఉన్నాయి. ఎప్పటి నుంచి అక్కడ దుకాణాలు ఏర్పాటు చేసుకుని అన్ని వర్గాల వారు చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. వాటన్నింటిని వదిలేసి వైఎస్సార్ సీపీ సానుభూతి పరుల షాపులకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.
- పుష్ప హోటల్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తి రెండు దుకాణాలను ధ్వంసం చేశారు.
- చుట్టగుంట ప్రాంతంలో ఎమ్మెల్యే ఒత్తిడి ఉందని ఒక షాపును అధికారులు ధ్వంసం చేశారు.
- పాయకాపురం చేపల మార్కెట్ వద్ద మేడా రమేష్‌కు చెందిన షాపును ఖాళీ చేయించారు.
- అయోధ్య నగర్ రాఘవేంద్ర థియేటర్ వద్ద బేకరీ షాపును కూల్చివేశారు.
- వైఎస్సార్ సీపీ నాయకుడు ఒగ్గ విక్కీ ఫుడ్ జంక్షన్‌లో జనరేటర్లతో విద్యుత్ సరఫరా చేస్తుంటాడు. అతడిని బెదిరించి బలవంతంగా వ్యాపారం మాని పించేశారు.
- కండ్రికలో వైఎస్సార్ సీపీ కార్యకర్త శివకు చెందిన సైకిల్ షాపు ఇతర దుకాణాలు ధ్వంసం చేశారు.
- తోపుడు బండిపై ఫుడ్ బిజినెస్ చేస్తున్న శివను బెదిరించి అతని బండిని లాక్కొన్నారు.
- 28వ డివిజన్‌లో కనపర్తి కొండలరావు ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ డివిజన్ కార్యాలయాన్ని కూల్చివేశారు.



టీడీపీ నేతల దాడిలో ధ్వంసమైన శివారెడ్డి కారు(ఫైల్)

దాష్టీకానికి నిదర్శనాలు..



టీడీపీ నేతల దాడిలో గాయపడిన కొండపల్లి బుజ్జి(ఫైల్)



టీడీపీ నేతల దాడిలో గాయపడిన బగ్గా దినేష్(ఫైల్)

- వైఎస్సార్ సీపీ నాయకుడు, ఆర్యవైశ్య ప్రముఖుడు కొండపల్లి బుజ్జి వాకింగ్‌కు వెళ్తుండగా టీడీపీ గుండాలు కాపుకాసి అతనిపై పాశవికంగా దాడి చేసి గాయపరిచారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.
- రాజీవ్‌నగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పెద్దిరెడ్డి శివారెడ్డి ఇంటిపై టీడీపీ గుండాలు అర్ధరాత్రి సమయంలో రాళ్లు విసిరారు. కారు అద్దాలను ధ్వంసం చేశారు. ఇంటి అద్దాలను పగులగొట్టి, బూతులతో రెచ్చిపోయారు.
- నగర మాజీ డెప్యూటీ మేయర్ గోగుల వెంకట రమణకు చెందిన కారుపై దాడి చేసి ధ్వంసం చేశారు.
- అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతానికి ఓ యువకుడిని టీడీపీ కార్యకర్తలు ఆటోలో నున్న సమీపంలోని పోలవరం కాలువ కట్టపైకి తీసుకెళ్లి భౌతికంగా దాడి చేశారు. దాడి దృశ్యాలను ఎమ్మెల్యే తనయుడికి వీడియో కాల్ చేసి మరీ చూపించారు. ఎమ్మెల్యే తనయుడికి క్షమాపణ చెప్పాలని ఇష్టానుసారంగా కొట్టారు.
- వాంబేకాలనీకి చెందిన ఎస్సీ మహిళపై టీడీపీకి చెందిన కార్పొరేటర్ అనుచరులు దాడి చేశారు.
- అయోధ్యనగర్‌లో బగ్గా దినేష్ అనే వైఎస్సార్ సీపీ కార్యకర్తపై టీడీపీ గుండాలు దాడి చేశారు.

జీవనోపాధిని కోల్పోయాం..




బుడమేరు వంతెన సెంటర్లో ఉన్న చిన్న షాపులో నలభై ఏళ్లుగా చేపలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నా. ఈ దుకాణం పైనే మా కుటుంబం ఆధారపడి ఉంది. ఇప్పుడు అర్ధాంతరంగా దుకాణం తొలగించటంతో ఏం చేయాలో పాలుపోవటం లేదు. మాకు అధికారులు జీవనోపాధి కల్పించాలి.

–వెంకటేశ్వరరావు, చేపల వ్యాపారి

ప్రభుత్వమే ఆదుకోవాలి..

నేను 40 సంవత్సరాలుగా బుడమేరు వంతెన సెంటర్లో సైకిల్ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నా. వచ్చే అరకొర సంపాదనతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. ఇప్పుడు దుకాణం కోల్పోవటంతో దిక్కుతోచటం లేదు. ప్రభుత్వం మా సమస్యలను గుర్తించి మానవతా దృక్పథంతో ఆదుకోవాలి.

– కోటేశ్వరరావు, సైకిల్ మెకానిక్ దుకాణం



పదేళ్లుగా ఉన్న హోటల్ కూల్చేశారు..

టీడీపీ అధికారం చేపట్టిన తర్వాత వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. వీఎంసీ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి టీడీపీ నాయకులు పాయకాపురంలోని మా వాటర్ ప్లాంటు, మినీ హోటల్‌ను కూల్చివేశారు. మా ఇంటి వద్ద రేకులు వేసుకొని పదేళ్ల నుంచి చేస్తున్న చిరు వ్యాపారాన్ని చెదరగొట్టి, మా కుటుంబానికి అన్యాయం చేశారు. – వీర్ల వరలక్ష్మి, మాజీ కార్పొరేటర్, 63వ డివిజన్



జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

- ఎన్టీఆర్ జిల్లా కొత్త జేసీ నిధి మీనా
- క్యాంపు కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా డాక్టర్ నిధి మీనా బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఉదయం విజయవాడ బందర్ రోడ్డులోని జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్ నేతృత్వంలో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నూతన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నిధి మీనాకు డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీఓ బీహెచ్ భవానీ శంకర్, జిల్లా పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ జి.మోహన్‌బాబు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి, డీఐపీఆర్‌వో యు. సరేంద్రనాథ్, డీపీఆర్‌వో ఎస్‌వీ మోహనరావు, అడిషనల్ పీఆర్‌వో కె.రవి, ఏపీ సూపర్ వైజర్ వీవీ ప్రసాద్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జేసీ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజనను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు.



జేసీ నిధి మీనాకు మొక్క అందజేస్తున్న డీఆర్వో శ్రీనివాసరావు తదితరులు

నిరుద్యోగులకు సువర్ణావకాశం

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఫెడరల్ స్కిల్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్‌లో ఉచిత శిక్షణ, కచ్చితమైన ఉద్యోగావకాశాల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ట్యాలీ కోర్సుపై సర్టిఫికెట్‌తో కూడిన ఉచిత శిక్షణతో పాటు కచ్చితమైన ఉద్యోగావకాశం కల్పిస్తారన్నారు. బీకాం, బీఏ, బీబీఏ, ఎం.కామ్ పూర్తి చేసిన 18 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో కౌన్సెలింగ్, తదుపరి శిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ ప్రైవేటు రంగ సంస్థలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా కానూరు తులసీనగర్‌లోని ఫెడరల్ స్కిల్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్‌కు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు, ఆధార్‌కాపీ, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 8714692747లో సంప్రదించాలన్నారు.

బందరులో పర్యటించిన ఢిల్లీ బృందం



మచిలీపట్నం టౌన్: మచిలీపట్నంలోని డ్రెయిన్ల పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఢిల్లీకి చెందిన సిఫో బృందం మంగళవారం నగరంలో పర్యటించింది. నగర శివార్లలో ఉన్న డ్రెయిన్లను, సుందరయ్యనగర్‌లో అసంపూర్తిగా ఉన్న మురుగునీటి శుద్ధి ప్రాజెక్టును పరిశీలించింది. వీరికి నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, ఎంఈ శ్రీకాంత్, పబ్లిక్ హెల్త్ డీఈ రాంప్రసాద్ నగరంలో డ్రెయిన్లను చూపించి పరిస్థితులను వివరించారు. సముద్రమట్టానికి నగరం పల్లంగా ఉండటంతో వర్షాలు కురిసిన సమయంలో నీరు రోడ్లపై, లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉండి డ్రెయిన్ల ద్వారా పారకపోవటంతో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. నగరంలో ఏయే ప్రాంతాల్లో ముంపు సమస్య ఉన్నదీ వివరిస్తూ లెవల్స్ తమకు పంపాలని స్థానిక అధికారులకు ఢిల్లీ బృందం సూచించింది. ఆ ప్రకారం ముంపు సమస్య లేకుండా డ్రెయిన్లు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. సిఫో నుంచి డాక్టర్ రమాకాంత్, మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ ఆరుద్రదాస్, డ్రెయినేజ్ చీఫ్ ఇంజినీర్ ఆంజనేయులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్త బృందాల కోలాహలం



సారె సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసిన భక్త బృందంలోని సభ్యులు

కొనసాగుతున్న ఆషాఢ సారె సమర్పణలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు మంగళవారం పలు భక్త బృందాలు సారెను సమర్పించాయి. విజయవాడ పరిసర ప్రాంతాలతో పాటు గుంటూరు, ప్రకాశం, కృష్ణా, ఎన్టీఆర్, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన భక్తులు బృందాలుగా ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకున్న భక్త బృందాలను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారికి సారె సమర్పించిన వారిలో విజయవాడ పటమటకు చెందిన కోదండ రామాలయం భక్త బృందానికి చెందిన వంద మంది, గుడివాడ పాలడుగు శ్రీనివాసరావు బృందానికి చెందిన 150 మంది, వి. కృష్ణకుమారి బృందానికి చెందిన 60 మంది, శ్రీ నవదుర్గా దీక్షా పీఠానికి చెందిన 80 మందితో పాటు మరో 20 బృందాలు ఉన్నాయి. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు. ఆయా భక్త బృందాలను ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్త బృందాలతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది.

క్లుప్తంగా

రేపు కృష్ణా జిల్లా అండర్-7 బాలబాలికల చెస్ పోటీలు

విజయవాడస్పోర్ట్స్:కృష్ణా జిల్లా స్థాయి అండర్-7 బాలబాలికల చదరంగం పోటీలను విజయవాడ శివారు కానూరులోని ది ఐ ప్లే స్కూల్లో ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఎం.ఫణికుమార్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ జట్లు ఆగస్టు 3, 4 తేదీల్లో విజయనగరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయని చెప్పారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం ఆరు గంటల లోగా వారి పేర్లను ఏపీ చెస్ వెబ్సైట్లో నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9700775220, 9391279088 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

26న ఉమ్మడి కృష్ణా జిల్లా బీచ్ కబడ్డీ జట్లు ఎంపిక

విజయవాడస్పోర్ట్స్:రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణా జిల్లా స్త్రీ, పురుషుల జట్లను ఈ నెల 26వ తేదీన ఎంపిక చేస్తున్నట్లు కృష్ణా జిల్లా కబడ్డీ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రవి తెలిపారు. గూడూరు మండలంలోని మల్లవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఈ ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 75 కేజీల లోపు బరువు ఉన్న మహిళలు, 85 కేజీల లోపు బరువు ఉన్న పురుషులు ఈ ఎంపిక పోటీలకు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న క్రీడాకారులు వారి ఆధార్కార్డుతో ఎంపిక ప్రాంగణానికి చేరుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9704063555, 7981813244 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు.

'పవర్' పోస్టింగ్లకు పైరవీలు

- మంత్రులు, ఎమ్మెల్యేల ఆశీస్సుల కోసం తిరుగుతున్న విద్యుత్ శాఖ అధికారులు
- సీటు కాపాడుకునేందుకు రూ.లక్షలు ఇవ్వడానికి సిద్ధమైన ఓ ఉన్నతాధికారి
- అదే బాటలో ఈఈలు, డీఈఈలు, ఏఈలు
- ఆపరేషన్స్ డివిజన్లు, సబ్ డివిజన్లు కోరుతూ ప్రదక్షిణలు
- పెనమలూరు, గన్నవరం, మచిలీపట్నం, గుడివాడలో పోస్టింగ్స్ చాలా ఖరీదు



సాక్షి, మచిలీపట్నం: నచ్చినచోటుకు పోస్టింగ్ల కోసం విద్యుత్ శాఖ అధికారులు పైరవీలకు తెరలేపారనే ఆరోపణలు వస్తున్నాయి. ఏపీ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో కీలకమైన కుర్చీలకు రూ. లక్షలు ఇవ్వడానికి వెనుకాడడం లేదని గుసగుసలు వినపడుతున్నాయి. వాటిని దక్కించుకునేందుకు మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ అధికారులు ప్రదక్షిణలు చేస్తున్నారని తెలుస్తోంది. ఉన్నతాధికారులు ఒకలా ప్రయత్నిస్తుంటే మరోవైపు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏఈలు సైతం కోరుకున్న చోట పోస్టింగ్స్ కోసం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. పోస్టింగ్లు దక్కించుకునేందుకు పోటీపడి ప్రజాప్రతినిధులను కలవడం ఆ శాఖ సర్కిల్లో చర్చనీయాంశంగా మారింది.

సర్కిల్ పోస్టు కోసం ఇలా..

సర్కిల్లో ఓ ఉన్నత స్థాయి పోస్టు కోసం బాగా పోటీ ఉంది. కార్పొరేట్(సీఎండీ ఆఫీస్) కార్యాలయంలో లూప్లైన్లో పని చేస్తున్న ఇద్దరు అధికారులతో పాటు గతంలో ఇక్కడ పనిచేసిన వెళ్లిన మరో ఇద్దరు అధికారులు సైతం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వీళ్లు ఎవరికి వారు తమ తమ మార్గాల ద్వారా అధికార పార్టీ ప్రజాప్రతినిధులను కలిసి విన్నపాలు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. మరోవైపు ఇక్కడే పని చేస్తున్న ఓ అధికారి తన సీటును కాపాడుకునేందుకు మంత్రులను మచ్చిక చేసుకుంటున్నారని ఆ సర్కిల్స్లో వినిపిస్తోంది. గత ఎన్నికల్లో కూటమి నేతల గెలుపు కోసం పని చేశానని, తనను కదిలించరాదని, మరో ఆరు నెలల్లో పదోన్నతి వచ్చాక వెళ్లిపోతానని, అంత వరకు ఉంచాలని కోరుతున్నట్లు సమాచారం. దానికి ప్రతిఫలంగా రూ.20 లక్షల వరకు ముట్టజెప్పడంతో పాటు.. ప్రతి పనిని చేసి పెడతామని చెప్పినట్లు తెలుస్తోంది.

ఆ ప్రాంతంలో పోస్టింగ్కు భలే డిమాండ్

సర్కిల్ కార్యాలయం, ఆపరేషన్ డివిజన్లు, విజయవాడ, గుణదల, ఉయ్యూరు, గన్నవరం, మచిలీపట్నం, గుడివాడ డివిజన్లతో పాటు ఆయా పరిధిలోని సబ్ డివిజన్లలో పోస్టింగ్కు భలే డిమాండ్ ఉంది. ఇక్కడ లూప్ లైన్ కంటే ఆపరేషన్స్, డిస్ట్రిబ్యూషన్స్ ఫోకల్ సీట్ల కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కోరుకున్న స్థానం కోసం అడిగినంత ఇవ్వడానికి సిద్ధపడుతున్నారని తెలుస్తోంది. ఎస్ఈల మొదలు ఈఈలు, డీఈఈలు, ఏఈలు తమ మార్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసి విన్నవిస్తున్నారు.

మరికొంతమంది యత్నాలు

మచిలీపట్నం డివిజన్ కేంద్రంలోని ఓ ఉన్నతాధికారి విజయవాడ లేదా పెనమలూరుకు రావడానికి యత్నిస్తున్నారని తెలుస్తోంది. ఇక్కడ పనిచేస్తున్న ఓ అధికారి తన సీటును కాపాడుకునేందుకు ఇప్పటికే నాయకులను కలిసి ఆశీస్సులు పొందినట్లు చర్చ జరుగుతోంది. ఉయ్యూరులో చేస్తున్న ఓ ఏడీఈ గన్నవరానికి యత్నిస్తుండగా, సర్కిల్ కార్యాలయంలో లూప్లైన్లో పని చేస్తున్న ఓ అధికారి కూడా గన్నవరం ఆపరేషన్స్ కావాలని నేతల చుట్టూ విజ్ఞప్తి చేశారని సమాచారం. మరోవైపు గుడివాడలో పని చేస్తున్న ఓ ఏడీఈ, ఇద్దరు ఏఈలు స్థాన చలనం కోసం యత్నిస్తుండగా వారిలో ఒకరు విజయవాడలోని ఆపరేషన్స్సెక్షన్కు, పెడన పరిధిలోని ఏఈలు కూడా విజయవాడ సమీపంలోని పోస్టింగ్స్ కోసం యత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

సొంత ప్రాంతాలకు రావడానికి..

ఇతర చోట్ల పనిచేస్తున్న కొందరు అధికారులు తమ సొంత ప్రాంతాలకు రావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే తమ ప్రాంత ఎమ్మెల్యేలను కలిసి అభినందించి పోస్టింగ్ కోసం గట్టిగా యత్నిస్తున్నారు. కోరుకున్న చోటు వస్తే డబ్బు ఇవ్వడంతో పాటు చెప్పిన పనులు చేస్తామని చెబుతున్నట్లు సమాచారం.

కాంట్రాక్టర్ల ద్వారా మరికొందరు

పోస్టింగ్స్ కోసం మరికొందరు కాంట్రాక్టర్ల ద్వారా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. పనులు సబ్స్టేషన్ల నిర్వహణ, నిర్మాణం, సివిల్, టర్న్ కీ, ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే పనులు ఇస్తామని, తమకు పోస్టింగ్ కోసం ప్రజాప్రతినిధుల వద్ద సిఫార్సు చేయాలని కోరుతున్నట్లు సమాచారం. కొందరు అధికారులు కాంట్రాక్టర్లకే డబ్బు సిద్ధం చేయాలని విన్నవిస్తున్నట్లు ఆ శాఖలో చర్చ జరుగుతోంది.

కేంద్ర బడ్జెట్పై మిశ్రమ స్పందన

సాక్షి, మచిలీపట్నం: పార్లమెంట్లో మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్పై సమాజంలోని వివిధ వర్గాల నుంచి మిశ్రమ స్పందన లభించింది.

అభివృద్ధికి సూచిక ఈ బడ్జెట్



కేంద్ర బడ్జెట్ అభివృద్ధికి సూచికగా ఉంది. బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్కు పెద్దపీట వేయడం హర్షించదగ్గ విషయం. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి కట్టుబడి, రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయించారు. విశాఖపట్నం – చెన్నై పారిశ్రామిక కారిడార్లోని నోడ్లకు ప్రత్యేక సాయం, విద్యుత్, రోడ్లు, రైల్వే ప్రాజెక్టులకు దశలవారీగా నిధులు కేటాయిస్తామని చెప్పడం తృప్తినిచ్చింది.

– వల్లభనేని బాలశౌరి, ఎంపీ, మచిలీపట్నం

వాస్తవ జీవనానికి దూరంగా ఉంది



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల వాస్తవ జీవనానికి ఏమాత్రం ఉపశమనం కలిగించేదిగా లేదు. ఊహాజనితమైన వృద్ధిరేటు అంచనాలతో, పొంతనలేని గణాంకాలతో కూర్పు చేశారు. బీమా రంగ వృద్ధికి ఏ విధమైన పన్ను రాయితీ, ప్రోత్సాహకాలు ఇవ్వలేదు. నూతన పన్ను విధానంలో పొదుపుపై రాయితీని పెంచకపోవడం ఉద్యోగ వర్గాన్ని నిరుత్సాహపరుస్తోంది.

జి.కిశోర్ కుమార్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ, మచిలీపట్నం

ఆభరణాల ధరలు తగ్గింపు అభినందనీయం



కేంద్ర బడ్జెట్లో బంగారం, వెండి ఆభరణాల ధరలు తగ్గించేలా ప్రకటించడం అభినందనీయం. ఆరు శాతం కస్టమ్స్ పన్ను తగ్గించడంతో సామాన్య కుటుంబాలకు మేలు చేకూరడంతో పాటు బంగారం, వెండి వ్యాపారులు, వృత్తిదారులకు ఊరట కలిగించింది.

గడ్డం రాజు, స్వర్ణకార సంఘం రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం

ఏపీకి మరోసారి మొండిచేయే



కేంద్ర బడ్జెట్ పూర్తిగా నిరాశ మిగిల్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ బడ్జెట్ లేదు. ఏపీకి మరోసారి మొండిచేయే మిగిలింది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్రానికి కేవలం రూ.15 వేల కోట్లు మాత్రమే ప్రకటించడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అది కూడా సాయంగా కాకుండా అప్పుగా ఇప్పిస్తామంటూ చెప్పడం విడ్డూరం. ఎన్డీయేలో భాగస్వామ్యులై ఉంటూ రాష్ట్రానికి నిధులు రప్పించడంలో అటు చంద్రబాబు, ఇటు పవన్ కళ్యాణ్ వైఫల్యం చెందారు.

– మల్లాది విష్ణు, మాజీ ఎమ్మెల్యే

రాజకీయ కోణంలో కేటాయింపులు



రాష్ట్రంలో ఉత్పత్తి రంగం మరింత విస్తృతం కావటానికి మరిన్ని నిధులు ఈ బడ్జెట్లో కనపడలేదు. ఆ కేటాయింపులు చేసినట్లయితే ఉత్పత్తి రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలు పెరిగే అవకాశం ఉండేది. విభజన జరిగిన రాష్ట్రాలకు సరైన నిధులు కేటాయింపులు చేయలేదు. అయితే రాజకీయ కోణంలో మాత్రమే కొన్ని అంశాల్లో నిధులు కేటాయింపు చేసినట్లుగా కనిపించింది.

– బాయన బాబూజీ (బాబ్జీ), డైరెక్టర్, విజయవాడ ఆటో క్లస్టర్ డెవలప్మెంట్ కంపెనీ లిమిటెడ్

నిరాశజనకంగా ఉంది



కేంద్ర బడ్జెట్ నిరాశజనకంగా ఉంది. ముఖ్యంగా వైద్య విద్యను విస్మరించారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మాణంలో ఉన్న కళాశాలలకు కేటాయింపులు లేవు. రాజధానికి కేటాయించిన రూ.15 వేల కోట్లు కూడా అప్పు అని చెబుతున్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలో ఉన్నా గ్రాంటు రూపంలో నిధులు రాబట్టడంలో వైఫల్యం చెందారు.

డాక్టర్ మెహబూబ్ షేక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం

ఆరోగ్యశాఖకు అరకొర నిధులు



ఆరోగ్య శాఖకు అరకొరగా నిధులు కేటాయించారు. దాదాపు 150 కోట్ల జనాభా గల భారతావనిలో ఈ విధమైన కేటాయింపుల వల్ల కోరుకున్న లక్ష్యాలను చేరుకోవడం సాధ్యం కాదు. ఇతర దేశాలతో పోలిస్తే నేటికీ మాతా శిశు మరణాల రేటు మనదేశంలో అధికంగా ఉంది. అయినప్పటికీ ప్రజా ఆరోగ్య విషయంలో తగు విధంగా కేటాయింపులు జరగకపోవడం విచారకరం.

– డాక్టర్ అంబటి నాగరాధాకృష్ణ యాదవ్, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ శ్రీనివాస టిప్టిన్స్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940

REAL ESTATE
PLOT FOR SALE
■ VJA, మంగళగిరి, బెంజిసర్కిల్కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంటిపర్ల శ్రీగంధం, ఎర్రచందనం మొక్కలతో చ.గ॥ 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్, ఫామ్హౌస్ ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర: ✆ 63028 55524

SERVICES
GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర॥ ✆ 99516 88858
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299
■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999

CHANGE OF NAME
■ I, Jasti Sai Prabhatypri R/o. H.No.59A-21-4-4/2, R.R. Gardens, Dasari Vari Street, Patamata, Vijayawada, PIN-520007, have changed my name as "JASTI SAI PRABHA" For Future Purpose.

WANTED
■ పెస్ట్ కంట్రోల్ కంపెనీ నందు ఈవినింగ్ షిఫ్ట్ పనిచేయుటకు సర్వీస్ బాయ్స్ కావలెను. వెహికల్ తప్పనిసరి, అర్హత:10th, జీతం: రూ. 17,000/-. ✆ 78425 41979, 94945 69895
■ స్వీట్మ్యాజిక్. Opp: డి.వి.మేనర్, M.G రోడ్ విజయవాడ. "సూపర్ వైజర్స్ కావలెను. పూర్తి బయోడేటాతో పై అడ్రస్సు నందు వెంటనే సంప్రదించండి.
■ విజయవాడలో NRI ల / సంపన్నుల ఇళ్ళ వద్దే వుండి పెద్దవారిని / బెడ్ పేషంట్లని చూసుకొనుటకు కేర్టేకర్స్ M/F ఆయాలు, నర్సులు కావలెను. వ+భో+జీతం ✆ 91608 35559, 98850 25559
■ విజయవాడ గవర్నరుపేట, రామమందిరం వీధిలో గల ఆటో స్పేర్స్ షాపు నందు పని చేయుటకు పురుషులు (హెల్పింగ్ బాయ్స్) కావలెను. Q: 10th min., వ: 18-30 లోపు, టైమ్: ఉ. 9-30 రా. 9 గం. వరకు. ఆదివారం శెలవు. ✆ 94403 42369, 80081 23141
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206, 9573633520
■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15-28 వేలు. కాల్ / వాట్సాప్ చేయగలరు. సంప్ర. సెల్: 95026 15217
■ కేర్టేకర్ కావలెను. గుంటూరులో ఇంట్లోనే ఉండి పెద్ద వయస్సు గల మగవారిని చూసుకోవలెను. ఏ బాదరబందీ లేకుండా ఉన్న మగవారు మాత్రమే కావలెను. 10వ తరగతి చదివి ఉండవలెను. జీతం: నెలకు 12000/- రూ॥లు, సంవత్సరమునకు బోనస్: 40000/- రూ॥లు మరియు భోజనం, వసతి కల్పించబడును. వివరములకు 90102 99252 ఫోన్ నెంబర్ను సంప్రదించగలరు.
■ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్నందు వృద్ధులను, పేషెంట్స్ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి+ భోజనం. జీతం:17K.ఫోన్: 8520980099, 8520874499
■ కస్టమర్ కేర్ VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట వారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ : 15000-40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD. Ph : 9014885406
■ Wanted Male Marketing Incharges, Vice Principals and Executives Qualification Any Degree/ P.G. Age Limit: 25 to 45 years. Salary: 13000/- to 25000/- Location: Vijayawada. Contact: 92487 33360

గమనిక

సాక్షి క్లాసిఫైడ్స్
భవానీపురం 7995092112
9010131135
9505507329
ఉయ్యూరు, కంకిపాడు 9010577706
గన్నవరం 9010210382
ఎన్టీఆర్ జిల్లా + కృష్ణాజిల్లా రూ.600/- రూ.150/- + 5% GST

నదీ జలాల పంపిణీపై సమావేశం నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘాల ప్రతినిధులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నదీ జలాల పంపిణీ విషయంపై సమగ్ర అవగాహన కోసం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అన్ని వర్గాలతో ఒక సమావేశం నిర్వహించాలని రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్లో రైతు నాయకుడు అక్కినేని భవానీప్రసాద్ అధ్యక్షతన మంగళవారం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి నదీ జలాల పునఃపంపిణీపై రైతు సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇంజినీర్ కె.పాపారావు మాట్లాడుతూ గత సంవత్సరం అక్టోబర్ 7న కేంద్ర ప్రభుత్వంలోని జలశక్తి శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. దీని ప్రకారం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యూనల్కు కృష్ణా గోదావరి నదీ జలాలను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాల్సిన బాధ్యతను అప్పగించిందని గుర్తు చేశారు. ఏపీ ప్రభుత్వం నదీ జలాలను పునఃపంపిణీ చేయడానికి తగిన ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉందన్నారు. సమగ్ర ప్రతిపాదనలు ట్రిబ్యునల్ ముందు ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలతో సమావేశం నిర్వహించి సూచనలు తీసుకోవాలని కోరారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘాల ప్రతినిధులు వై.కేశవరావు, కృష్ణయ్య, కె.వి.వి ప్రసాద్, బొజ్జా దశరథరామిరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని తగు సూచనలు చేశారు.

నగరంలో కాలుష్య నిరోధానికి చర్యలు

వీఎంసీ అడిషనల్ కమిషనర్ కేవీ సత్యవతి



మాట్లాడుతున్న వీఎంసీ అడిషనల్ కమిషనర్ కేవీ సత్యవతి

పటమట(విజయవాడతూర్పు):నగరంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నిరోధించేందుకు కృషి చేస్తున్నామని వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి అన్నారు. ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్లో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ముంబైకి చెందిన అర్థ గ్లోబల్, న్యూఢిల్లీకి చెందిన ది ఎనర్జీ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్ (టెరీ) సభ్యులతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ బుధవారం నుంచి ఈ బృందాలు నగరంలో వాయు కాలుష్యానికి లోనయ్యే రెండు ప్రాంతాలను గుర్తించి పైలెట్ స్టడీ నిర్వహిస్తాయని చెప్పారు. దీని ద్వారా కాలుష్యానికి ముఖ్య కారకాలు.. వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు సూచిస్తారని తెలిపారు. ఆయా సూచనలు పాటించడం ద్వారా నగరంలో వాయు కాలుష్యాన్ని తగ్గించి ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆయా సంస్థల నిపుణులు వివేక్, సునంద, డాక్టర్ అంజు గోయల్, శివానీశర్మ, జస్టిన్ జాకోబ్, శశి తివారీ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలు సీజ్



సీజ్ చేసిన లారీలతో ఎస్ఈబీ అధికారులు



అనుమంచిపల్లి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద తెలంగాణ లారీలు

అవనిగడ్డ/మొవ్వ: స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో ఇసుక అక్రమంగా రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఈబీ సీఐ వి.శివరామరాజు తెలిపారు. కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చల్లపల్లి మండలంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని సమాచారం రావటంతో బైపాస్లో రూట్ వాచ్ నిర్వహించినట్లు చెప్పారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు 10 టైర్స్ లారీలను గుర్తించి ఇసుకతో సహా సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. రెండు లారీలకు రూ.50 వేల జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఎస్ఈబీ ఎస్ఐ పి.హేమసుస్మిత పాల్గొన్నారన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్ వద్దకు తెలంగాణ లారీలు

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామంలోని ఇసుక స్టాక్ పాయింట్ వద్దకు తెలంగాణ రిజిస్ట్రేషన్తో ఉన్న ఆరు లారీలు మంగళవారం సాయంత్రం రావడంతో స్టాక్ పాయింట్ వద్ద ఉన్న రెవెన్యూ అధికారులు అవాక్కయ్యారు. స్టాక్ పాయింట్ వద్ద సమీపంలోని వాహనాలను డ్రైవర్లు నిలిపి వేసి ఇసుక కూపన్లు కావాలంటూ విధుల్లో ఉన్న అధికారులను సంప్రదించే ప్రయత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి సిబ్బందితో స్టాక్ పాయింట్ వద్దకు సిబ్బందితో హుటాహుటిన వచ్చారు. అయితే నిలిపి ఉంచిన లారీలు ఖాళీగా ఉండటంతో డ్రైవర్లను సీఐ ప్రశ్నించారు. ఈ ప్రాంతంలోని లబ్ధిదారులు ఇసుక కావాలని తెలంగాణ ట్రాన్స్పోర్ట్ను సంప్రదించారని అందుకే వచ్చామని చెప్పారు. దీంతో సీఐ అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఇది ఇలా ఉండగా అర్ధరాత్రి వేళల్లో స్టాక్ పాయింట్ నుంచి తెలంగాణకు అక్రమ ఇసుక రవాణా అవుతోందన్న విమర్శలు ఉన్నాయి.

చెక్బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

బంటుమిల్లి:చెక్బౌన్స్ కేసులో నిందితుడికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మండల పరిధిలోని నాగేశ్వరరావుపేటకు చెందిన ఈడే విజయకృష్ణకు చెక్కు బౌన్స్ కేసులో జైలు, జరిమానా విధిస్తూ బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు తీర్పు ఇచ్చారు. కోర్టు ప్రతినిధులు సమాచారం మేరకు బంటుమిల్లికి చెందిన కాగిత శ్రీనివాసరావు 2021 అక్టోబరు 30న విజయకృష్ణకు అప్పు ఇచ్చారు. ఇందుకు గాను విజయకృష్ణ శ్రీనివాసరావుకు చెక్కు ఇచ్చారు. ఆ చెక్కును చెల్లుబాటు చేసుకునేందుకు యత్నించగా బ్యాంకులో బౌన్స్ అయింది. దీంతో న్యాయం కోసం శ్రీనివాసరావు కోర్టును ఆశ్రయించగా న్యాయమూర్తి రూ.2.84 లక్షలు పరిహారం చెల్లించాలని, ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చారు. పరిహారం చెల్లించని పక్షంలో రెండు నెలలు అదనంగా శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు.

వాహనాల నకిలీ విడిభాగాలు పట్టివేత

లబ్బీపేట(విజయవాడతూర్పు):విజయవాడలో పోలీసులతో కలిసి నిర్వహించిన దాడుల్లో తమ కంపెనీకి చెందిన నకిలీ విడిభాగాలను స్వాధీనం చేసుకున్నట్లు పియోజియో వెహికల్స్ స్పేర్పార్ట్స్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మలింద్ కపూర్ తెలిపారు. ఈ దాడుల్లో 350 కి పైగా నకిలీ విడిభాగాలు, ఉపకరణాలతో పాటు, నకిలీ ప్యాకేజింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వినియోగదారుల భద్రత, ఉత్పత్తి విశ్వసనీయత ప్రధాన ప్రాధాన్యతలుగా, నకిలీ విడిభాగాల సమస్యపై కఠినమైన చట్ట చర్యల ద్వారా పియోజియో పోరాడుతుందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ మార్గదర్శకత్వంలో పోలీసుల సహకారంతో ఈ దాడులు నిర్వహించినట్లు మలింద్ కపూర్ తెలిపారు. పియోజియో ఒరిజినల్ స్పేర్స్ను అధీకృత పంపిణీదారు, డీలర్షిప్, రిటైలర్ నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు.

అనుమానాస్పదస్థితిలో ఇంటర్ విద్యార్థి మృతి



గురువర్మ మృతదేహం

పెనమలూరు:కానూరు ఎస్ఆర్ఐ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థి అనుమానాస్పదస్థితిలో మృతి చెందటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా హెచ్ఎంపాడు మండలం తిప్పల గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వరరాజుకు ఇద్దరు కుమారులు. ఆయన రెండో కుమారుడు గురువర్మ (17)కానూరు ఉమాశంకర్నగర్లోని ఎస్ఆర్ఐ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కొద్దిరోజుల క్రితం హోం సిక్ సెలవులు ఇవ్వటంతో గురువర్మ ఇంటికి వెళ్లాడు. సెలవులు ముగియటంతో తండ్రి సోమవారం కాలేజీలో వదిలి వెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం కళాశాల యాజమాన్యంకు చెందిన వ్యక్తులు తండ్రికి ఫోన్ చేసి గురువర్మ ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం తెలిపారు. గురువర్మ మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకున్నారు. మరణించే సమయంలో గురువర్మ రాసిన సూసైడ్ లెటర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ సభ్యులు లెటర్ చూసి అది గురువర్మ చేతిరాత కాదని అనుమానం వ్యక్తం చేస్తూ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

పంట కాలువలో పడి బాలుడు మృతి



బాలుడిని చూసి విలపిస్తున్న తల్లి లక్ష్మి

ఇబ్రహీంపట్నం:ఎన్టీటీపీఎస్ బూడిద నీరు ప్రవహించే పంట కాలువలో ప్రమాదవశాత్తూ పడి మూడేళ్ల బాలుడు మృత్యువాతకు గురయ్యాడు. ముక్కుపచ్చలారని బాలుడి మృతికి ఎన్టీటీపీఎస్ అధికారులే కారణమని స్థానికులు, తల్లిదండ్రులు ఆరోపించారు. మాబిడ్డ మృతికి అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖిల్లా రోడ్డులో బూడిదనీటి పంట కాలువలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. కాలనీలో ఉంటున్న భుక్యా కుమార్, లక్ష్మీ దంపతుల కుమారుడు సిద్ధార్థ నాయక్ (3) ఆడుకుంటుండగా తల్లిదండ్రులు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలం వద్ద పనుల్లో నిమగ్నమయ్యారు. కొద్దిసేపటికి కుమారుడు కనిపించక పోవడంతో ఆందోళన చెంది పరిసరాల్లో వెతికినా కనిపించక పోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు స్థానికుల సహకారంతో నివాసాల పక్కన ప్రవహిస్తున్న బూడిద నీటి కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. కాలువలో కొద్ది దూరం కొట్టుకుపోయిన బాలుడు విగతజీవుడై కనిపించాడు. అప్పటి వరకు కళ్ల ముందు ఆడుకున్న బాలుడు గంట వ్యవధిలో మృతి చెందడంతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

ద్విచక్రవాహనంపై నుంచి పడి మహిళ దుర్మరణం

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట):ద్విచక్రవాహనంపై నుంచి పడి మహిళ దుర్మరణం చెందిన ఘటన గ్రామంలోని 65వ నెంబరు జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని దర్మవరప్పాడు తండాకు చెందిన భూక్యా సక్రి (45) కోదాడ ఆస్పత్రికి వెళ్లేందుకు తన బంధువుతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరింది. ఈ క్రమంలో గ్రామంలోని జాతీయ రహదారి వద్దకు వచ్చే సరికి వెనుక కూర్చున్న ఆమె ఒక్కసారిగా కిందపడింది. ఈ ఘటనలో ముఖానికి తీవ్ర గాయాలు కావటంతో 108 ద్వారా జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

బుడమేరులో మునిగి ఏడు గేదెలు మృతి

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో సోమవారం రాత్రి బుడమేరు కాలువలోకి దిగిన 7 గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మున్నంగి రమాదేవికి చెందిన 10 గేదెలు బుడమేరు కాలువలోకి దిగాయి. వాటిలో 7 గేదెలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోగా 3 గేదెలు ఒడ్డుకు చేరుకున్నాయి. గేదెలు కనిపించక పోవడంతో యజమానురాలు కాలువలో పరిశీలించగా మూడు మృతదేహాలు లభ్యమయ్యాయి. విషయం తెలుసుకున్న మాజీ ఉపసర్పంచ్ కొల్లా ఆనంద్కుమార్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సఖిగాని కొండ, నాయకులు అద్దేపల్లి సాంబశివనాగరాజు, కొంగన రవికుమార్, కళ్లెపల్లి సాయి రామరాజు , నిడమానూరు పశువుల వైద్యులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వపరంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

నేడు గణిత ఉపాధ్యాయులకు శిక్షణ

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం (ఏపీఎమ్ఎఫ్), ఎన్టీఆర్ జిల్లా విద్యా శాఖ సంయుక్తంగా బుధవారం ఉదయం 9 గంటలకు గొల్లపూడి బైపాస్ రోడ్ (భవానీపురం చర్చి సెంటర్)లోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్లో గణిత ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా డీఎస్ఇఓ యువీ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సాయంత్రం ఎస్ఎస్సీ – 2023–24 ఫలితాల్లో గణితంలో నూరు శాతం మార్కులు సాధించేందుకు కృషి చేసిన గణిత ఉపాధ్యాయులను సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

ఏపీఎమ్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులిపాటి దుర్గారావు అధ్యక్షత వహించనున్న ఈ కార్యక్రమానికి విద్యా శాఖ ఏడీ కేవీఎస్ కుమార్, ఎంఈఓలు పి.సాంబశివరావు, విజయ రామారావు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే

ఆటోనగర్(విజయవాడతూర్పు): నగరంలోని స్క్యూబ్రిడ్జి, రామలింగేశ్వరనగర్, పుట్టరోడ్డు ఫీడర్‌లోని ఉపకేంద్రాల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కార్య నిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనాడు కాలనీ, ఎస్‌టీపీహెచ్‌టీ పాయింట్, శ్మశానం వీధి, నిమ్మలవారి వీధి, ఠాగూర్ వీధి, శివగంగ భవాని వీధి, కొమ్మా పూర్ణచంద్రారావు వీధి, రాయపాటి రమణమ్మ వీధి, రాయపాటి సత్యయ్య రోడ్డుతో పాటు సాయిబాబావీధి, పుట్ట రోడ్డులో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన మహిళపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): మున్సి పల్ కార్పొరేషన్లో కాంట్రాక్టు పద్ధతిపై స్వీపర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన మహిళపై వచ్చిన ఫిర్యాదుతో మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాయకాపురం రాధానగర్‌కు చెందిన వడ్డిపల్లి సామ్రాజ్యం అనే మహిళ పాతరాజీవ్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన ఉప్పల ధనమ్మ, 12 మందికి ఔట్ సోర్సింగ్ శానిటరీ స్వీపర్స్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పింది. ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.40 వేలు తీసుకున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ 13 మందితో ఒక నెల స్వీపర్ పనులు చేయించి తొలగించారు. వారి ఉద్యోగంపై గట్టిగా అడగ్గా సామ్రాజ్యం రూ.1.40 లక్షలు తిరిగి ఇచ్చింది. ఇంకా రూ.3.80 లక్షలు తిరిగి ఇవ్వకుండా, స్వీపర్ ఉద్యోగాలు ఏర్పాటు చేయకుండా మోసం చేసినట్టు వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

చెట్టును ఢీ కొట్టిన టైర్ల లోడు లారీ



ఆటోనగర్(విజయవాడతూర్పు): టైర్ల లోడుతో వెళుతున్న లారీ చెట్టును ఢీకొన్న సంఘటన మంగళవారం రెండో క్రాస్ 5వ రోడ్డు వద్ద జరిగింది. చెట్టును ఢీకొట్టడంతో లారీ పైకప్పు దెబ్బ తింది. చెట్టు తొలగించేటప్పుడు ట్రాఫిక్ నిలిచి పోయింది. రోడ్డుకు ఇరువైపులా ఇనుప రేకులు పెట్టడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

ఆదర్శప్రాయులు తిలక్, ఆజాద్

మైలవరం: స్వాతంత్ర్య సమరయోధులు బాల గంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌లను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాతంత్ర్య సమర యోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో వీరిరువురూ ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు. చరిత్ర విభాగం అధ్యాపకులు దారావతు శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలగంగాధర్ తిలక్ నిర్వహించిన హోమ్ రూల్ ఉద్యమం ప్రముఖమైందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పురంశెట్టి రంగారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అటకెక్కిన పారిశుద్ధ్యం



రామవరప్పాడు: నగరానికి అతి సమీపంలో ఉన్న మేజర్ పంచాయతీ రామవరప్పాడులో పారిశుద్ధ్య సమస్య పట్టి పీడిస్తోంది. గ్రామంలో సుమారు 50 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఈ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించడానికి సుమారు 90 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు. వీరిని గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించే కంటే పంచాయతీ పెద్దలు వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారుల్లో నిత్యం చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా రాజుల బజారు, బల్లెం వారి వీధి, కొట్టివారి వీధి, అంకిత అపార్టుమెంట్ ఏరియా, కాల్వగట్టు ప్రాంతాల్లో రహదారుల వెంబడే చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లోని వాసులకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. పారిశుద్ధ్య నిర్వహణ కూడా అభివృద్ధి చెందిన ప్రాంతాల వరకే పరిమితం చేస్తున్నారే తప్ప లోపలి ప్రాంతాల్లో పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. గ్రామంలోని చెత్తనంతటినీ తీసుకొచ్చి బల్లెంవారి వీధిలోని ఎస్సీ శ్మశానంలో డంప్ చేస్తుండటంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతవాసులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కళాశాల ప్రాంగణంలో వాన నీరు



నగరంలోని రమేష్ ఆస్పత్రి రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణం మొత్తం వర్షం నీటితో నిండింది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు కళాశాల ఆవరణలోని మైదానం, వివిధ బ్లాకుల్లోకి వెళ్లే రహదారులపై సైతం వర్షం నీరు నిలిచింది. ఆవరణలోని రోడ్లు మొత్తం బురదమయంగా మారి రాకపోకలు సాగించడానికి వీల్లేకుండా ఉంది. కళాశాల మైదానం నుంచి అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వైపునకు చేరేందుకు ఉన్న రోడ్డుపై సైతం వర్షం నీరు ఉండటంతో కళాశాలలోని బోధన, బోధనేతర సిబ్బంది ఈ నీటిలో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. లేదంటే కళాశాల కారిడార్‌లో నుంచి చుట్టూ తిరిగి కళాశాలలోని పలు విభాగాలకు వెళ్లాల్సిన పరిస్థితి. నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో వాన నీరు ఇక్కడే రోజుల తరబడి నిల్వ ఉంటోంది. పాలిటెక్నిక్ కళాశాల భవనం నిర్మాణం చేసి చాలా సంవత్సరాలు కావడంతో కళాశాల భవనం శ్లాబు నుంచి కూడా నీరు లీకవుతోంది. తరగతులకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉండటంతో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాల్సిందిగా విద్యార్థులు కోరుతున్నారు.

–మొగల్రాజపురం(విజయవాడ తూర్పు)







ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని పలు విభాగాల వద్ద నిలిచిన వర్షం నీరు

ఆత్మీయ కలయిక



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనపై నిరసన తెలియజేసేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ మంగళవారం ఢిల్లీకి చేరుకున్నారు. ఆయన్ను ఆ పార్టీ 'తూర్పు' సమన్వయకర్త దేవినేని అవినాష్ మర్యాదపూర్వకంగా కలిశారు.

వాహన్ పోర్టల్ ఇబ్బందులు పరిష్కరించండి



వైవీ ఈశ్వరరావు, లారీ ఓనర్స్ సంఘ రాష్ట్ర కార్యదర్శి

లబ్బీపేట(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ సేవల కోసం తీసుకొచ్చిన వాహన్ పోర్టల్ వల్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించాలని కేంద్ర రవాణాశాఖా మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ పంపినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ ఈ- ప్రగతి స్థానంలో వాహన్ పోర్టల్ ఈ నెల 8 నుంచి ప్రయోగాత్మకంగా ఎన్టీఆర్ జిల్లాలో అమలు చేసే క్రమంలో వాహనదారుల డేటా కేంద్ర పోర్టల్ వాహన్ లోకి బదలాయింపు కావడం లేదన్నారు. వాహన్ పోర్టల్‌లో అన్ని రాష్ట్రాల వాహనాల డేటా ఇంకా అప్‌లోడ్ కాలేదని, కొన్ని రాష్ట్రాలు పొరుగు రాష్ట్ర వాహనాల నంబరు ప్లేట్లపై డిజిటల్ చలాన్‌లు జారీ చేస్తున్నాయని తెలిపారు. ఆ వివరాలు ఆయా రాష్ట్రాల వెబ్‌సైట్‌లలో మాత్రమే అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు. దీంతో వాహన యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల వాహనాల డేటా వాహన్ పోర్టల్ నూరుశాతం అప్‌లోడ్ చేసే వరకూ డిజిటల్ చలానాలు విధించకుండా కేంద్రం అన్ని రాష్ట్రాలకు వెంటనే సర్క్యులర్ జారీ చేయాలని ఆ లేఖలో కేంద్ర మంత్రిని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఇబ్రహీంపట్నం: సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. ఎంపీపీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం అవగాహన కల్పించారు. విపత్తుల నిర్వహణపై పట్టు సాధించాలని ఆమె సూచించారు. దోమల నివారణ చర్యలతో వ్యాధులను నియంత్రించవచ్చన్నారు.

పాతబస్తీలో పార్కింగ్ దందా!

- టెండర్లు లేవు, అనుమతి లేదు
- అధికార పార్టీల నేతల అడ్డగోలు దోపిడీ
- స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ అండతో దందా!

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో అధికార పార్టీకి చెందిన నేతలు పార్కింగ్ దందాలకు పాల్పడుతున్నారు. అధికారం చేపట్టి ఎక్కువ రోజులు గడవక ముందే అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారు. పార్టీలు వేరైనా ఎన్నికల్లో కలిసి కట్టుగా పని చేసిన నేతలు దోపిడీలోనూ కలిసే వాటాలు పంచుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యేకు చెందిన పార్టీ నేతలతో పాటుగా స్థానిక టీడీపీ నేతలు పాతబస్తీలోని పార్కింగ్‌లపై కన్నేశారు. వారికి వీఎంసీ అధికారుల చేయూత తోడవ్వటంతో వారి దోపిడీ మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది.



పార్కింగ్ వసూళ్లు చేస్తున్న దృశ్యం



రథం సెంటర్ వద్ద పార్కింగ్ ప్రాంతం

రెండు పార్కింగ్‌ల ఆక్రమణ

పాతబస్తీలోని రెండు ప్రధానమైన పార్కింగ్ ప్రాంతాలను టీడీపీ, బీజేపీ నేతలు ఆక్రమించారు. తాము ఎమ్మెల్యే తాలుకా, మాజీ ఎమ్మెల్సీ కుటుంబ సభ్యుల తాలుకా అని పార్కింగ్‌లను ఆక్రమించారని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. పాతబస్తీ కెనాల్‌రోడ్డులో వినాయకునిగుడి నుంచి రథం సెంటర్ బొడ్డు బొమ్మ వరకూ వీఎంసీ పార్కింగ్‌కు టెండర్లు పిలిచింది. అది జూన్ 26వ తేదీన ముగిసింది. మరుసటి రోజు నుంచి నగరపాలక సంస్థ సిబ్బంది పార్కింగ్ నిర్వహణ చేశారు. దానిపై కన్నేసిన అధికార పార్టీ నేతలు వీఎంసీ సిబ్బందిని అక్కడి నుంచి తరిమేసి వారే వసూళ్లకు దిగారు. అక్కడ దుర్గగుడికి చెందిన కాంట్రాక్టర్ వసూళ్లకు పాల్పడుతున్నారు. అధికార పార్టీకి చెందిన నేతల వత్తాసుతో వసూళ్లను కొనసాగిస్తున్నారని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. గడువు ముగిసినా వీఎంసీ ఎటువంటి టెండర్లు పిలవలేదు. కనీసం ఎవరికీ అనుమతి సైతం ఇవ్వలేదు.

ఇరిగేషన్ స్థలంలోనూ అదే దోపిడీ

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం సమీపంలో సీతమ్మవారి పాదాల వద్ద ఇరిగేషన్ విభాగానికి చెందిన స్థలం ఉంది. దానిలో దసరా, భవానీ దీక్షల విరమణ ఉత్సవాల్లో దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తుల కోసం సదుపాయాలను ఏర్పాటు చేస్తుంటారు. దీని నిర్వహణ వీఎంసీ సిబ్బంది చూస్తుంటారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక టీడీపీ, బీజేపీ నేతల ప్రోత్సాహంతో కొన్ని రోజుల నుంచి ఇక్కడ కూడా అక్రమంగా పార్కింగ్ రుసుం వసూళ్లకు దిగారు. దీనికి సైతం టెండర్లు పిలవలేదు. ఎటువంటి అనుమతులు లేవని స్థానికులు చెబుతున్నారు.

కోర్టులో ఉన్నా తగ్గని నేతలు

వినాయకుని గుడి నుంచి రథం సెంటర్ వరకూ ఉన్న పార్కింగ్‌కు సంబంధించి ఒకరు కోర్టుకు ఎక్కారు. జూన్ వరకూ ఉన్న కాంట్రాక్టర్ చెల్లించిన దానికన్నా తాను అధికంగా ఇస్తానని కోర్టులో కేసు వేశారు. దానిపై విచారణ కొనసాగుతోంది. అంతలోనే కూటమికి చెందిన నేతలు ఇలాంటి దోపిడీకి పాల్పడుతున్నారు.

టీడీపీ నేతల కుట్రలు

వీఎంసీ, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో ఉన్న పార్కింగ్‌లను దుర్గగుడి కిందకు తీసుకొచ్చి వాటిని తమ పరిధిలోకి తీసుకోవాలని స్థానిక కూటమి నేతలు కుట్రలు చేస్తున్నారని నగరపాలక సంస్థకు చెందిన ఒక అధికారి వ్యాఖ్యానించారు. అంతేకాకుండా వీఎంసీ సిబ్బందిని సైతం బెదిరించి పార్కింగ్ ప్రదేశాన్ని తీసుకున్నారని వారు చెబుతున్నారు.

అందులో భాగంగానే ఎటువంటి టెండర్లు లేకుండా ఇలాంటి దందాకు పాల్పడుతున్నారని తెలిసింది. దీనిపై కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ దృష్టి సారించి నగరపాలకసంస్థకు వచ్చే ఆదాయాన్ని కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విగ్రహాలు పెట్టకుండా అడ్డగింత



ఏపీఐఐసీ కాలనీలో విగ్రహం దిమ్మె వద్ద పోలీసులు



రైతుబజారు పక్కన ఉన్న విద్యుత్ స్తంభం వద్ద పడేసిన దేవినేని నెహ్రూ విగ్రహం

అనుమతి లేదన్న పోలీసులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఏపీఐఐసీ కాలనీ రైతుబజారు వద్ద వైఎస్సార్, దేవినేని నెహ్రూ విగ్రహాలను మళ్లీ ఏర్పాటుచేయడానికి వెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులను పటమట పోలీసులు అడ్డుకున్నారు. గతంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్, నెహ్రూ (రాజశేఖర్)ల విగ్రహాలను కొద్ది రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మళ్లీ వీటిని ఏర్పాటు చేయడానికి మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో విగ్రహ దిమ్మె ద్దకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఇక్కడకు చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పటమట ఎస్ఐ వి.పద్మ ఆధ్వర్యంలో పోలీసులు వచ్చారు. వారు వైఎస్సార్ సీపీ నాయకులను హెచ్చరించారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని, ఇప్పుడు ఈ కార్యక్రమం చేయడానికి వీల్లేదని అనుమతి లేదంటూ నాయకులను పంపేశారు. ఇదిలా ఉండగా దేవినేని నెహ్రూ విగ్రహాన్ని పక్కనే విద్యుత్ స్తంభం వద్ద పడవేశారు. విగ్రహాలను మళ్లీ నిర్మించుకోవడాన్ని పోలీసులు అడ్డుకోవడం ఏంటని నాయకులు పోలీసులపై మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు భీమిశెట్టి బాబు, గద్దె కల్యాణ్, ధనేకుల కాశేశ్వరావు, దామోదర్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులను వాడాలి

నున్న(విజయవాడరూరల్): సేంద్రియ ఎరువులతో నాణ్యమైన విత్తనాలను తయారుచేసుకుంటే జన్యుపరమైన లోపాలుండవని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి బి.సత్యవతి అన్నారు.

నున్న గ్రామంలో గ్రామీణ విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జన్యుస్వచ్ఛతను బట్టి విత్తనములోని తరాలు శ్రేష్ఠంగా ఉంటాయన్నారు. నాణ్యమైన విత్తనాలతో పంటలను సాగు చేస్తే నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను పొందవచ్చని తెలిపారు. బయటకొన్న విత్తనాలు కల్తీతో ఉంటాయి కాబట్టి రైతులే స్వయంగా విత్తనోత్పత్తి తయారు చేసుకోవాల్సి ఉందన్నారు. మండల వ్యవసాయ అధికారి బి.రంగనాథ్‌బాబు, ఏఈఓ సురేష్, వ్యవసాయ సహాయకులు మౌనిక, హిమబిందు, రైతులు యర్కారెడ్డి వెంకటరెడ్డి, గుంటక సుబ్బారెడ్డి, దేవులపల్లి మాధవరావు, కలకోటి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థులు



అసెంబ్లీ వద్ద కళాశాల విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి మంగళవారం వందమంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అమరావతిలో అసెంబ్లీ సమావేశాలను వీక్షించడానికి వెళ్లారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఆమె మంగళవారం వివరాలు వెల్లడించారు. తమ కళాశాల విద్యార్థులకు అసెంబ్లీ సమావేశాలను వీక్షించడానికి అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు, విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. పుస్తకాల్లో థియరీ చదవడం వరకే కాకుండా ప్రాక్టికల్‌గా సమావేశాలు ఎలా జరుగుతాయో ప్రత్యక్షంగా విద్యార్థులు వీక్షించారన్నారు. ఇలాంటి అవకాశాన్ని కల్పించిన కళాశాల కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ యుగంధర్, మహిళా సాధికారిత సెల్ కన్వీనర్ డాక్టర్ కె.అరుణ, సిబ్బంది ప్రశాంతి, ఉమామహేశ్వరి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నగరంలో 'అలనాటి రామచంద్రుడు' సందడి



అలనాటి రామచంద్రుడు చిత్ర యూనిట్

లబ్బీపేట(విజయవాడతూర్పు): అద్భుతమైన ప్రేమ కావ్యం అలనాటి రామచంద్రుడు చిత్రాన్ని ఆగస్టు 2న ప్రేక్షకుల ముందుకు తీసుకురాన్నామని, ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు వీక్షించి ఆదరించాలని చిత్ర కథానాయకుడు కృష్ణవంశీ కోరారు. ఎంజీరోడ్డులోని ఒక హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగులో తాను అలనాటి రామచంద్రుడు చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నట్లు తెలిపారు. దర్శకుడు ఆకాష్ చిత్రాన్ని ఒక అద్భుతమైన ప్రేమ కావ్యంగా మలిచారని తెలిపారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజ్ తమ చిత్రాన్ని రిలీజ్ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. హీరోయిన్ మోక్ష మాట్లాడుతూ సీత ప్రేమను దక్కించుకునేందుకు రాముడు పడిన కష్టాలను అలనాటి రామచంద్రుడు చిత్రంలో దర్శకుడు ప్రేక్షకులకు సరికొత్త రీతిలో చూపించనున్నారని పేర్కొన్నారు.

దర్శకుడు ఆకాష్ మాట్లాడుతూ అందమైన లొకేషన్లలో గ్రామీణ వాతావరణంలో తీసిన సన్నివేశాలు ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతాయని చెప్పారు. సమావేశంలో నటులు దివ్యశ్రీ, స్నేహ పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగానికి కేంద్రం పెద్ద పీట



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ గౌరవ అధ్యక్షుడు బాయన వెంకట్రావు

ఆటోనగర్(విజయవాడతూర్పు): కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేసిందని, పరిశ్రమల బలోపేతానికి అనుకూలంగా ఉందని ఏపీ ఎంఎస్ఎంఈ గౌరవ అధ్యక్షుడు బాయన వెంకట్రావు అన్నారు. ఆటోనగర్‌లోని ఎంఎస్ఎంఈ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రొజెక్టర్ ద్వారా కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎంఎస్ఈ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు మాట్లాడుతూ ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం కృషి చేయనున్నట్టు చెప్పారు. ముద్ర రుణాలు రూ.10 నుంచి 20 లక్షలకు పెంచుతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి పేర్కొనడం హర్షనీయమన్నారు.

కొత్తగా 12 పారిశ్రామిక కారిడార్లు, కార్మికులకు డార్మెటరీ తరహా అద్దె ఇళ్ల నిర్మాణాలు చేస్తామని చెప్పడం మంచి పరిణామమన్నారు. మౌలిక వసతులకు రూ.11.11 లక్షల కోట్లు ఇవ్వడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రామచంద్రారావు, కార్యదర్శి జమ్ముల ప్రసాద్ పాల్గొన్నారు.

27న మెగా జాబ్ మేళా

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27న మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో కళాశాల పూర్వ విద్యార్థులతో కలిసి నిర్వహించనున్న ఈ జాబ్ మేళాలో 17 ప్రముఖ కంపెనీలు పాల్గొని సుమారు రెండు వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని చెప్పారు. కళాశాల ట్రెనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. వెంకటాద్రి, ఏపీఎస్ఎస్‌డీసీ ఎన్టీఆర్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఇతర వివరాలకు 63050 04318 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

ఆర్ట్స్, క్రాఫ్ట్స్ విద్యకు ప్రోత్సాహంపై హర్షం

ఇబ్రహీంపట్నం: నూతన విద్యా విధానంలో భాగంగా ఆర్ట్స్, క్రాఫ్ట్స్ విద్యను ప్రభుత్వం ప్రోత్సహించడంపై ఏపీ ఆర్ట్స్ క్రాఫ్ట్స్, పీఈటీ ఇన్‌స్ట్రక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు నిశ్శంకర గాయత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ యూనిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సైకం శివకుమారి కృషి ఫలితంగా ఆర్ట్స్, క్రాఫ్ట్స్ విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. హస్తకళల విద్యతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, నైపుణ్యం పెరుగుతుందన్నారు. విద్యా శాఖ మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సాయినాథుడికి పావుకిలో వెండి వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో మంగళవారం బాబావారి వెండి సింహాసనానికి దాత జంపన శరాబందిరాజు, సీతారావమ్మ దంపతులు పావు కిలో వెండి అందజేశారు. ఈ సందర్భంగా దాత సీతారావమ్మ మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన దత్తసాయి బాబావారికి వెండి సింహాసనం నిమిత్తం పావుకిలో వెండిని అందజేస్తున్నట్లు తెలిపారు. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు మాట్లాడుతూ భక్తులు, దాతల సహకారంతో తాము ఇక్కడ షిర్డీలో మాదిరిగా అన్ని పూజలు చేస్తున్నామన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ ఈస్ట్ :
99122 20539, 90101 31135
Office mail : sakshiads@gmail.com

సాక్షి స్పోర్ట్స్
బుధవారం
24-7-2024

బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442.32 కోట్లు... 'ఖేలో ఇండియా'కే రూ. 900 కోట్లు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం క్రీడలకు ఇచ్చే వార్షిక బడ్జెట్‌ను స్వల్పంగా పెంచింది. మంగళవారం ప్రకటించిన 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442.32 కోట్లు కేటాయించింది. గత ఏడాది ఇచ్చిన రూ.3,396.96 కోట్లతో పోలిస్తే ఇది రూ.45.36 కోట్లు ఎక్కువ. ఎప్పటిలాగే ఇందులో ఎక్కువ మొత్తం దిగువ స్థాయిలో క్రీడాకారులను గుర్తించి తీర్చిదిద్దే 'ఖేలో ఇండియా' పథకానికే కేటాయించింది. గత ఏడాదికంటే రూ.20 కోట్లు ఎక్కువగా 'ఖేలో ఇండియా'కు ఈసారి రూ.900 అందిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా యూత్ గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్‌ల నిర్వహణతో పాటు అత్యుత్తమ స్థాయి శిక్షణ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు, అక్కడ సౌకర్యాల కల్పన కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తారు. మరోవైపు దేశవ్యాప్తంగా స్టేడియాల నిర్వహణ, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్) కోసం ఖర్చు చేసేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు ప్రభుత్వం రూ.822.60 కోట్లు కేటాయించింది. దేశంలోని వివిధ క్రీడా సమాఖ్యలకు ఈ సారి రూ.340 కోట్లు అందజేస్తున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా), జాతీయ డోపింగ్ టెస్టింగ్ లేబొరేటరీ (ఎన్‌డీటీఎల్)ల కోసం వరుసగా 21.73 కోట్లు, రూ. 22 కోట్లు చొప్పున కేటాయించారు.

అజేయంగా సెమీస్‌లోకి

- భారత మహిళల జట్టుకు 'హ్యాట్రిక్' విజయం
- రాణించిన షఫాలీ వర్మ, హేమలత, అరుంధతి


షఫాలీ

దంబుల్లా: అటు బ్యాటింగ్‌లో... ఇటు బౌలింగ్‌లో అదరగొట్టిన భారత మహిళల క్రికెట్ జట్టు ఆసియా కప్ టి20 టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. నేపాల్ జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 82 పరుగుల తేడాతో గెలిచింది. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత జట్టు ఆరు పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచింది. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి తీసుకోవడంతో వైస్ కెప్టెన్ స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 178 పరుగులు చేసింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (48 బంతుల్లో 81; 12 ఫోర్లు, 1 సిక్స్), హేమలత (42 బంతుల్లో 47; 5 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 122 పరుగులు జోడించారు. 179 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లు పడగొట్టగా... హైదరాబాద్ అమ్మాయి అరుంధతి రెడ్డి, రాధా యాదవ్ 2 వికెట్ల చొప్పున తీశారు. గ్రూప్ 'ఎ'లోని మరో మ్యాచ్‌లో పాకిస్తాన్ 10 వికెట్ల తేడాతో యూఏఈ జట్టును ఓడించింది. 4 పాయింట్లతో గ్రూప్ 'ఎ'లో రెండో స్థానంతో పాకిస్తాన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. నేడు జరిగే గ్రూప్ 'బి' చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో మలేసియాతో బంగ్లాదేశ్; థాయ్‌లాండ్‌తో శ్రీలంక తలపడతాయి.

స్కోరు వివరాలు

భారత ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (స్టంప్డ్) కాజల్ శ్రేష్ఠ (బి) సీతా రాణా మగర్ 81; హేమలత (సి) రుబీనా ఛెత్రి (బి) సీతా రాణా మగర్ 47; సజన (ఎల్బీడబ్ల్యూ) (బి) కబితా జోషి 10; జెమీమా రోడ్రిగ్స్ (నాటౌట్) 28; రిచా ఘోష్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 178. వికెట్ల పతనం:** 1-122, 2-133, 3-156. **బౌలింగ్:** కబితా కున్వర్ 2-0-20-0, షబ్నమ్ రాయ్ 4-0-41-0, పూజా మహతో 1-0-13-0, కబితా జోషి 4-0-36-1, రుబీనా ఛెత్రి 1-0-14-0, ఇందూ బర్మ 4-0-29-0, సీతా రాణా మగర్ 4-0-25-2. **నేపాల్ ఇన్నింగ్స్:** సంజానా ఖాడ్కా (బి) అరుంధతి రెడ్డి 7; సీతా రాణా మగర్ (బి) అరుంధతి రెడ్డి 18; కబితా కున్వర్ (సి) స్మృతి మంధాన (బి) రేణుక 6; ఇందూ బర్మ (సి) షఫాలీ (బి) రాధా యాదవ్ 14; రుబీనా ఛెత్రి (బి) దీప్తి శర్మ 15; పూజా మహతో (రనౌట్) 2; కబితా జోషి (ఎల్బీడబ్ల్యూ) (బి) దీప్తి శర్మ 0; బిందూ రావల్ (నాటౌట్) 17; డాలీ భట్టా (సి) రిచా ఘోష్ (బి) రాధా యాదవ్ 5; కాజల్ శ్రేష్ఠ (సి అండ్ బి) దీప్తి శర్మ 3; షబ్నమ్ రాయ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 96. వికెట్ల పతనం:** 1-8, 2-21, 3-43, 4-52, 5-64, 6-64, 7-70, 8-82, 9-93. **బౌలింగ్:** రేణుక సింగ్ 4-1-15-1, అరుంధతి రెడ్డి 4-0-28-2, తనూజా కన్వర్ 4-1-12-0, దీప్తి శర్మ 4-0-13-3, రాధా యాదవ్ 3-0-12-2, సజన 1-0-11-0.



ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనేందుకు భారత క్రీడాకారులు పారిస్‌కు చేరుకున్నారు. భారత మహిళా బాక్సర్లు నిఖత్ జరీన్, లవ్లీనా, ప్రీతి, జైస్మిన్... బ్యాడ్మింటన్ స్టార్ సాత్విక్ సాయిరాజ్ అక్కడి ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. క్రీడా గ్రామంలో టెన్నిస్ దిగ్గజం రాఫెల్ నాదల్‌ను సాత్విక్ సాయిరాజ్, భారత టీటీ ప్లేయర్ సత్యన్ జ్ఞానశేఖరన్ కలిసి అతనితో ఫొటోలు దిగారు.



వీళ్ల ఆటను చూడాల్సిందే!

పారిస్ ఒలింపిక్స్‌లో పలువురు దిగ్గజాలు ● చరిత్ర సృష్టించేందుకు సిద్ధం

జీవితంలో ఒక్కసారి ఒలింపిక్స్‌లో పోటీపడితేనే తమ జీవితాశయం నెరవేరినట్లు చాలా మంది క్రీడాకారులు భావిస్తారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని కొందరు జాతీయ హీరోలుగా ఎదుగుతారు. ఒలింపిక్స్ పేరును ఎప్పుడు ప్రస్తావించినా తమ పేరును కూడా స్మరించుకునే విధంగా చరిత్రకెక్కుతారు. తమ అద్వితీయమైన ప్రదర్శనతో తమకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖిస్తారు. ఒలింపిక్స్‌లో పోటీపడటాన్ని... పతకాలను సాధించడాన్ని... ప్రపంచ రికార్డులు సృష్టించడాన్ని అలవాటుగా మార్చుకొని ఎవరికీ అందనంత ఎత్తులో నిలుస్తారు. మరో రెండు రోజుల్లో మొదలయ్యే పారిస్ ఒలింపిక్స్‌లోనూ పలు క్రీడాంశాల్లో దిగ్గజాలు మరోసారి తమ విన్యాసాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. అందులో కొందరి గురించి క్లుప్తంగా...

-సాక్షి క్రీడా విభాగం



మరో 2 రోజుల్లో...

సిమోన్ బైల్స్ (జిమ్నాస్టిక్స్)

మెరుపు తీగలా కదులుతూ... అలవోకగా పతకాలు గెలుస్తూ... ప్రపంచ జిమ్నాస్టిక్స్‌లో తనదైన ముద్ర వేసింది అమెరికాకు చెందిన సిమోన్ బైల్స్. 27 ఏళ్ల బైల్స్ వరుసగా మూడో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగనుంది. 4 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న బైల్స్ ఇప్పటి వరకు ఒలింపిక్స్‌లో 4 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు గెలిచింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 23 స్వర్ణాలు, 4 రజతాలు, 3 కాంస్యాలు కైవసం చేసుకుంది. 'పారిస్'లో బైల్స్ మరో పతకం నెగ్గితే ఒలింపిక్స్ చరిత్రలో అత్యధిక పతకాలు నెగ్గిన అమెరికన్ జిమ్నాస్ట్‌గా రికార్డు నెలకొల్పుతుంది. బైల్స్ ఐదు పతకాలు గెలిస్తే... ఒలింపిక్స్ చరిత్రలోనే 12 పతకాలతో అత్యధిక పతకాలు నెగ్గిన జిమ్నాస్ట్‌లలో లారిసా లాతినినా (రష్యా; 18 పతకాలు) తర్వాత రెండో స్థానానికి చేరుకుంటుంది.

ఎలూడ్ కిప్‌చోగి (అథ్లెటిక్స్)



లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్‌లో ఆఫ్రికా అథ్లెట్లకు తిరుగులేదు. పారిస్ ఒలింపిక్స్‌లో కెన్యాకు చెందిన 39 ఏళ్ల ఎలూడ్ కిప్‌చోగి గతంలో మారథాన్‌లో ఎవరికీ సాధ్యంకాని రికార్డును సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నాడు. ఐదోసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్న కిప్‌చోగి 2004 ఏథెన్స్ గేమ్స్‌లో 5000 మీటర్లలో కాంస్యం, 2008 బీజింగ్ గేమ్స్‌లో 5000 మీటర్లలో రజతం సాధించాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌కు అర్హత పొందలేకపోయిన కిప్‌చోగి ఆ తర్వాత మారథాన్ (42.195 కిలోమీటర్లు) వైపు మళ్లాడు. 2016 రియో ఒలింపిక్స్‌లో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కిప్‌చోగి విజేతగా నిలిచి రెండు స్వర్ణాలు సాధించాడు. ఈ క్రమంలో అబెబె బికిలా (ఇథియోపియా), వాల్డెమర్ (జర్మనీ) తర్వాత ఒలింపిక్స్ మారథాన్ చరిత్రలో రెండు స్వర్ణాలు నెగ్గిన మూడో అథ్లెట్‌గా నిలిచాడు. పారిస్‌లోనూ కిప్‌చోగి పతకం లేదా స్వర్ణం నెగ్గితే ఒలింపిక్స్ మారథాన్ చరిత్రలో అత్యధికంగా మూడు పతకాలు నెగ్గిన ఏకైక అథ్లెట్‌గా చరిత్ర సృష్టిస్తాడు.

లెబ్రాన్ జేమ్స్ (బాస్కెట్‌బాల్)



ఒలింపిక్స్‌లో బాస్కెట్‌బాల్‌ను 1936 బెర్లిన్ ఒలింపిక్స్‌లో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ క్రీడాంశంలో అమెరికాయే తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. 1980 మాస్కో ఒలింపిక్స్‌ను బహిష్కరించిన అమెరికా జట్టు ఇప్పటి వరకు బాస్కెట్‌బాల్‌లో 16 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు గెలిచింది. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన అమెరికా ఆ తర్వాత వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లలో స్వర్ణాలు సాధించింది. మరో స్వర్ణమే లక్ష్యంగా అమెరికా పారిస్ గేమ్స్‌లో అడుగు పెడుతుంది. నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ) లీగ్ చరిత్రలో టాప్ స్కోరర్‌గా ఉన్న లెబ్రాన్ జేమ్స్ నాలుగోసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్నాడు. 2012 లండన్ ఒలింపిక్స్ తర్వాత మళ్లీ విశ్వ క్రీడల్లో ఆడుతున్న లెబ్రాన్ జేమ్స్ తన సహజశైలిలో ఆడితే ఈసారీ అమెరికాకు ఎదురుండదు.

మిజైన్ లోపెజ్ నునెజ్ (రెజ్లింగ్)



గ్రీకో రోమన్ స్టయిల్‌లో ఎదురులేని దిగ్గజ రెజ్లర్. క్యూబాకు చెందిన 41 ఏళ్ల నునెజ్ వరుసగా ఆరో ఒలింపిక్స్‌లో పోటీపడుతున్నాడు. ఇప్పటికే వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లలో స్వర్ణ పతకాలను సాధించాడు. 6 అడుగుల 5 అంగుళాల ఎత్తున్న నునెజ్ పురుషుల గ్రీకో రోమన్ 130 కేజీల విభాగంలో మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా ఉన్నాడు. 2004 ఏథెన్స్‌లో 120 కేజీల విభాగంలో ఐదో స్థానంలో నిలిచిన నునెజ్ ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. 2008 బీజింగ్, 2012 లండన్ ఒలింపిక్స్‌లలో 120 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలు సాధించాడు. 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లలో 130 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలను గెల్చుకున్నాడు. పారిస్ గేమ్స్‌లోనూ నునెజ్ పతకం సాధిస్తే... ఒలింపిక్స్ రెజ్లింగ్ చరిత్రలో ఐదు స్వర్ణాలు లేదా ఐదు పతకాలు నెగ్గిన ఏకైక రెజ్లర్‌గా ఘనత వహిస్తాడు.

టెడ్డీ రైనర్ (జూడో)



పురుషుల జూడో క్రీడాంశంలో 12 సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఫ్రాన్స్ దిగ్గజం టెడ్డీ రైనర్ సొంతగడ్డపై రికార్డుపై గురి పెట్టాడు. వరుసగా ఐదోసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న 35 ఏళ్ల టెడ్డీ రైనర్ ఒలింపిక్స్‌లో 3 స్వర్ణాలు, 2 కాంస్యాలు సాధించాడు. 6 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న టెడ్డీ పారిస్ ఒలింపిక్స్‌లో మిక్స్‌డ్ టీమ్‌తోపాటు హెవీ వెయిట్ విభాగంలో బరిలోకి దిగుతాడు. ఈ రెండు విభాగాల్లోనూ టెడ్డీ స్వర్ణాలు సాధిస్తే ఫ్రాన్స్ తరఫున ఒలింపిక్స్ క్రీడల్లో అత్యధికంగా ఐదు స్వర్ణాలు గెలిచిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. ఫ్రాన్స్ ఫెన్సర్లు లూసియన్ గాడిన్, క్రిస్టియన్ డోరియోలా గతంలో ఒలింపిక్స్‌లో నాలుగు స్వర్ణాల చొప్పున సాధించారు.

బైల్స్, లెబ్రాన్ జేమ్స్, కెప్‌చోగి, టెడ్డీ రైనర్, నునెజ్‌లే కాకుండా పోల్‌వాల్టర్ డుప్లాంటిస్ (స్వీడన్), టేబుల్ టెన్నిస్‌లో మా లాంగ్ (చైనా), స్విమ్మింగ్‌లో సెలెబ్ డ్రెసెల్ (అమెరికా), కేటీ లెడెకీ (అమెరికా) కూడా పారిస్ ఒలింపిక్స్‌లో కొత్త చరిత్రను లిఖించే దారిలో ఉన్నారు. వారందరికీ ఆల్ ద బెస్ట్!

సినిమా

రెప్పల్ డప్పల్


● రవితేజ

హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రధారులు. పనోరమా స్టూడియోస్ అండ్ టి–సిరీస్‌ల సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'రెప్పల్ డప్పల్...' అంటూ సాగే రెండో పాట లిరికల్ వీడియోను ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.

మళ్లీ ఎటో వెళ్లిపోయింది మనసు...

ప్రేమకథలను ఇష్టపడే వారి జాబితాలో 'ఎటో వెళ్లిపోయింది మనసు' (2012) సినిమా కూడా ఉంటుంది. నాని, సమంత లీడ్ రోల్స్‌లో నటించగా, గౌతమ్ వాసుదేవ్ మీనన్ దర్శకత్వం వహించిన చిత్రం ఇది. రేష్మా, ఎస్. వెంకట్, సి. కల్యాణ్, సీవీ రావు నిర్మించిన ఈ సినిమాకు ఇళయరాజా అందించిన బాణీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా 'ఎటో వెళ్లిపోయింది మనసు' సినిమా రీ రిలీజ్ కానుంది. లక్ష్మీ నరసింహా మూవీస్ బ్యానర్ మీద సుప్రియ, శ్రీనివాస్ ఆగస్టు 2న ఈ సినిమాను మళ్లీ విడుదల చేయనున్నారు. ''ప్రస్తుతం తెలుగులో రీ–రిలీజ్‌ల ట్రెండ్ నడుస్తోంది. ఈ ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ సినిమా మళ్లీ ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు నిర్మాతలు.


● సమంత నాని

మరో ప్రేమకథ ఆరంభం


● నయనతార

ఇప్పటివరకూ పలు ప్రేమకథా చిత్రాల్లో నటించారు నయనతార. తాజాగా సిల్వర్ స్క్రీన్‌పై మరో రొమాంటిక్ లవ్ స్టోరీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారీ బ్యూటీ. తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ దగ్గర అసిస్టెంట్‌గా చేసిన విష్ణు ఎడవన్ ఈ న్యూ ఏజ్ రొమాంటిక్ లవ్‌స్టోరీ మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మధ్య వయస్కురాలైన ఓ మహిళ, ఓ కుర్రాడి మధ్య ఉన్న ప్రేమ బంధాన్ని నేటి సమాజం ఎలా చూస్తుంది? అనేది ఈ చిత్రం ప్రధానాంశమని కోలీవుడ్ సమాచారం. మధ్యవయస్కురాలి పాత్రలో నయనతార, కుర్రాడి పాత్రలో కెవిన్ కనిపిస్తారు. ప్రస్తుతం నయనతార, కెవిన్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు దర్శకుడు విష్ణు. లలిత్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.

మేమే... మేమే...


● సూర్య

'ఆది జ్వాల... అనంత జ్వాల... వైర జ్వాల... వీర జ్వాల.. దైవ జ్వాల... దావాగ్ని జ్వాల...' అంటూ మొదలవుతుంది 'కంగువా' సినిమాలోని ఫైర్ సాంగ్. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రూపొందిన పీరియాడికల్ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, యోగిబాబు కీలక పాత్రలు పోషించారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 10న విడుదల కానుంది. మంగళవారం సూర్య బర్త్ డే సందర్భంగా 'కంగువా' సినిమాలోని 'ఫైర్ సాంగ్' లిరికల్ వీడియోను విడుదల చేశారు. ''ఈ మట్టి ముట్టే ముందే ఇక్కడ పుట్టింది మేమే మేమే... అంకెలు పుట్టక ముందే లెక్కలు కనిపెట్టింది మేమే మేమే...' అనే లిరిక్స్‌తో సాగే ఈ పాట తెలుగు వెర్షన్‌కు శ్రీమణి సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, దీప్తీ సురేష్ ఆలపించారు. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.

ది వన్... హీరో సూర్య, దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్య బర్త్ డే సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ వీడియోలో 'ది వన్' అని ఉంది. దాంతో ఈ సినిమా టైటిల్ 'ది వన్' అనే ప్రచారం జరుగుతోంది. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రాన్ని జ్యోతిక, సూర్య, కార్తీక్ సుబ్బరాజు నిర్మిస్తున్నారు.

అశ్విన్ కెరీర్‌లో శివం భజే నిలిచిపోతుంది - విశ్వక్ సేన్


● అనిల్ రావిపూడి, విశ్వక్ సేన్, అశ్విన్‌బాబు, తమన్

''శివం భజే' ట్రైలర్ బాగుంది. నేపథ్య సంగీతం అదిరిపో యింది. ఆగస్టు 1న అశ్విన్‌కు బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులు సక్సెస్ ఇస్తారని ఆశిస్తున్నాను. తన కెరీర్‌లో 'శివం భజే' నిలిచిపోతుంది'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవన్షీ జోడీగా అప్సర్ దర్శకత్వం వహించిన చిత్రం 'శివం భజే'. మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 1న విడుదలవుతోంది. మంగళవారం జరిగిన 'శివం భజే' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి విశ్వక్ సేన్, డైరెక్టర్ అనిల్ రావిపూడి, సంగీత దర్శకుడు తమన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''శివం భజే' ట్రైలర్ బాగుంది. యూనిట్‌కి ఈ చిత్రం మంచి విజయాన్ని అందించాలి'' అన్నారు అనిల్ రావిపూడి. ''అశ్విన్ క్రికెట్‌లో బాల్‌ను ఎలా బాదుతాడో బాక్సాఫీస్‌ను కూడా అలానే బాదాలి'' అన్నారు తమన్. ''పరమేశ్వరుడి కథతో రూపొందిన ఈ సినిమా అందరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది'' అన్నారు అప్సర్. ''ముస్లిం అయిన అప్సర్‌గారు 'శివం భజే' లాంటి కథను ఎలా రాశారో అనుకున్నాను. ఇదంతా శివ లీల అనిపించింది'' అని అన్నారు అశ్విన్‌బాబు.

ఆ ఫైర్‌తో డైరెక్టర్ అయ్యా! - బండి సరోజ్ కుమార్



''నేను గతంలో 'నిర్బంధం, నిర్బంధం 2 , మాంగల్యం' వంటి సినిమాలు తీశాను. వాటిని కొన్ని వర్గాల ప్రేక్షకులు మాత్రమే చూశారు. కానీ 'పరాక్రమం' చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకులు చూడొచ్చు'' అని బండి సరోజ్ కుమార్ అన్నారు. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన సినిమా 'పరాక్రమం'. శ్రుతీ సమన్వి, నాగ లక్ష్మి, మోహన్ సేనాపతి, నిఖిల్ గోపు, అనిల్ కుమార్ ఇతర పాత్రల్లో నటించారు. బీఎస్‌కే మెయిన్ స్ట్రీమ్ పతాకంపై రూపొందిన ఈ మూవీ ఆగస్టు 22న విడుదల కానుంది. బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ– ''సంఘర్షణతో కూడుకున్న కథే 'పరాక్రమం'. నేను ఇండస్ట్రీకి రాక ముందు ఓ హాస్టల్‌లో ఉండేవాణ్ని. ఓ రోజు క్రికెట్ ప్రాక్టీస్ చేస్తుంటే.. 'క్రికెటర్ అవుతావా? మీ ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ఏంటి? వెనక చూసి ముందుకు వెళ్లాలి బ్రదర్' అని ఓ వ్యక్తి అన్న మాటలు నాలో కసిని నింపాయి. ఏదో ఒకరోజు అతను నన్ను తలెత్తుకుని చూడాలనుకున్నాను.. ఆ ఫైర్‌తోనే డైరెక్టర్ అయ్యాను'' అన్నారు.

నాలుగువందల ఏళ్ల నాటి గుడి కథతో...


● బెల్లంకొండ సాయిశ్రీనివాస్

ఓ పురాతన గుడి ముందు తుపాకీ పట్టుకుని నిల్చున్నారు హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్. ఆ గుడి నాలుగు వందల ఏళ్ల క్రితం నాటిది. ఆ గుడికి హీరో ఎందుకు వెళ్లాలనుకుంటాడు? అనేది తెలుసుకోవడానికి కాస్త సమయం ఉంది. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో మహేశ్ చందు ఓ సినిమాను నిర్మిస్తున్నారు. దివంగత ప్రముఖ దర్శకులు కోడి రామకృష్ణ 75వ జయంతి, హీరో శ్రీనివాస్ ఇండస్ట్రీలోకి నటుడిగా వచ్చి పదేళ్లు పూర్తి కావడం... ఈ రెండు సందర్భాలను పురస్కరించుకుని ఈ సినిమాను మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ''ఈ సినిమా చిత్రీకరణ ఇప్పటికే మొదలైంది. జూలై 24న రెండో షెడ్యూల్‌ను మొదలు పెట్టనున్నాం. కమర్షియల్ అంశాలతో కూడిన శక్తివంతమైన, ఆసక్తికరమైన కథను సిద్ధం చేశారు లుధీర్'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

సరికొత్తగా కనిపిస్తాను - రక్షిత్ అట్లూరి



''పలాస 1978, నరకాసుర' చిత్రాల తర్వాత అన్నీ సీరియస్ రోల్స్ చేస్తున్నానని చాలామంది అన్నారు. కానీ 'ఆపరేషన్ రావణ్, శశివదనే' సినిమాల్లో నా పాత్రలు సీరియస్‌గా ఉండవు. ఈ సినిమాల్లో సరికొత్తగా కనిపిస్తాను. 'ఆపరేషన్ రావణ్' నన్ను ప్రేక్షకులకు మరింత దగ్గర చేసే సినిమా అవుతుంది'' అని రక్షిత్ అట్లూరి అన్నారు. వెంకట సత్య దర్శకత్వంలో రక్షిత్ అట్లూరి, సంగీర్తనా విపిన్ జంటగా నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 26న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ– ''యువ ప్రేక్షకులకు చేరువ అయ్యేలా థ్రిల్లర్ మూవీ నిర్మిస్తే బాగుంటుందని 'ఆపరేషన్ రావణ్'ని తీశాం. ఈ మూవీ షూటింగ్ టైమ్‌లో మా నాన్న వెంకట సత్యంగారి డైరెక్షన్ పట్ల నాతో పాటు రాధిక, చరణ్ రాజ్‌గార్లు కూడా సంతోషంగా ఫీలయ్యారు. ఈ సినిమాలో మనలోని ఆలోచనల అంతర్యుద్ధాన్ని చూపించే ప్రయత్నం చేశాం. ఇలాంటి థ్రిల్లర్ సినిమాను థియేటర్‌లో చూస్తేనే ఆ అనుభూతి కలుగుతుంది. ప్రస్తుతం 'పలాస 2' స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది'' అన్నారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

రాజ్ తరుణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'పురుషోత్తముడు'. హాసినీ సుధీర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో ప్రకాశ్‌రాజ్, మురళీ శర్మ, రమ్యకృష్ణ, బ్రహ్మానందం, ముఖేష్ ఖన్నా ఇతర కీలక పాత్రల్లో నటించారు. రామ్ భీమన దర్శకత్వంలో డా. రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రామ్ భీమన మాట్లాడుతూ– ''దర్శకుడిగా నేను 'ఆకతాయి, హమ్ తుమ్' అనే రెండు సినిమాలు చేశాను. ఆ తర్వాత ఆరేళ్లకు నాకు 'పురుషోత్తముడు' చాన్స్ వచ్చింది. విజయం సాధించాలనే పట్టుదలతో ఈ సినిమా చేశాను'' అన్నారు. ''మంచి క్లీన్ ఎంటర్‌టైనర్ మూవీ తీశామని గర్వంగా చెప్పగలం'' అన్నారు రమేశ్ తేజావత్. ''పురుషోత్తముడు'లో మంచి పోలీసాఫీసర్ రోల్ చేశాను. ఈ సినిమా సక్సెస్ కావాలి'' అన్నారు బ్రహ్మానందం. ''ఈ సినిమాలో నటించడాన్ని ఆస్వాదించా. రాజ్ తరుణ్ ఈ ప్రెస్‌మీట్‌కు రాలేదు. త్వరలోనే ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడతారు'' అన్నారు రాజా రవీంద్ర. ''నాది మహారాష్ట్ర. నన్ను తెలుగు అమ్మాయిలా ఆదరించాలని కోరుకుంటున్నాను. ఫ్యామిలీతో కలిసి ఈ సినిమాని అందరూ థియేటర్స్‌లో చూస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు హాసినీ సుధీర్.


● హాసినీ సుధీర్